సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00 సంపుటి: 16 సంచిక: 218

SUNDAY Special ఆదివారం 29-10-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజా ప్రతినిధులు చేయాల్సింది రెండే, ప్రజా సేవలో సమర్థతను చాటుకోవడమా! లేక తప్పుకోవడమా!'



ఆస్ట్రేలియా విజయం

ధర్మశాలలో జరిగిన వరల్డ్ కప్ మ్యాచ్‌లో ఆసీస్ 5 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించింది. ఆస్ట్రేలియా 388 పరుగులు చేయగా, కివీస్ 383 పరుగులు చేసింది.

- వివరాలు 14లో



భారత్‌కు ఐదో స్థానం

చైనాలోని హాంగ్జౌలో శనివారం పారా ఆసియా క్రీడలు ముగిశాయి. భారత్ 29 స్వర్ణాలు, 31 రజతాలు, 51 కాంస్యాలు (మొత్తం 111) సాధించింది.

- వివరాలు 14లో



నవంబర్ 2న హాజరుకండి

డబ్బులు తీసుకుని పార్లమెంట్‌లో ప్రశ్నలు అడిగినట్లు వచ్చిన ఆరోపణలపై మౌఖిక సాక్ష్యమిచ్చేందుకు 2న రావాలని టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాను ఎథిక్స్ కమిటీ కోరింది.

- వివరాలు 6లో



దాడులు తీవ్రతరం

హమాస్ ఉగ్రవాద సంస్థ నిర్మూలనే లక్ష్యంగా గాజాపై దాడులను ఇజ్రాయెల్ తీవ్రతరం చేస్తోంది. భూతల దాడుల తీవ్రతను శనివారం మరింత పెంచింది.

- వివరాలు 6లో

'చేయి'స్తారా!

కాంగ్రెస్ రెండో 'సారీ'పై భగ్గుమన్న అసంతృప్తి

- టికెట్ల కేటాయింపులో అన్యాయం జరిగిందంటూ నేతల నిరసనలు
- దొంగ సర్వేలతో సీట్లు అమ్ముకున్నారంటూ ఆరోపణలు
- పారాచూట్లకు పెద్దపీట వేశారంటూ మండిపాటు
- మోసం చేసినవారికి తగిన బుద్ధి చెబుతామంటూ శపథాలు
- రెబల్స్‌గా పోటీ చేస్తామంటున్న నేతలు.. రాజీనామా బాటలో మరికొందరు
- పలుచోట్ల నిరసన కార్యక్రమాలు
- గాంధీభవన్‌పై విష్ణు అనుచరుల రాళ్ల దాడి.. పార్టీ జెండాలు దహనం
- పీసీసీ ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి, మైనార్టీ సెల్ చైర్మన్ సోహైల్, ఎన్‌ఆర్‌ఐ విజయ్‌కుమార్‌రెడ్డి రాజీనామాలు



గాంధీభవన్ వద్ద విష్ణువర్ధన్‌రెడ్డి అనుచరుల నిరసన

సాక్షి, హైదరాబాద్/సాక్షి నెట్‌వర్క్: కాంగ్రెస్ అభ్యర్థుల రెండో జాబితాపై రాష్ట్ర వ్యాప్తంగా ఆ పార్టీ నేతల్లో తీవ్ర నిరసన, అసంతృప్తి వ్యక్తమవుతోంది. టికెట్లు ఆశించి భంగపడిన పలువురు నేతలు టీపీసీసీ అధ్యక్షుడిపై, అధిష్టానంపై మండిపడుతున్నారు. దొంగ సర్వేలు నిర్వహించి, వాటి పేరిట తమ వారికి టికెట్లు అమ్ముకున్నారని, పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న వారిని కాదని పారాచూట్ నేతలకు టికెట్లు కేటాయించారని తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పిస్తున్నారు. తమను మోసం చేసిన వారిని ఎన్నికల్లో ఓడిస్తామంటూ కొందరు బహిరంగంగానే శపథం చేస్తున్నారు. పార్టీ తమకు న్యాయం చేస్తుందనే ఆశతో, ఎంతో ఉత్కంఠతో రెండో జాబితా కోసం ఎదురుచూసిన మరికొందరు భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. కొందరు ఏదేమైనా బరిలోకి దిగుతామంటుంటే (రెబల్స్), మరికొందరు ఏకంగా రాజీనామాల బాట పట్టారు. మరోవైపు పలువురు నేతల అనుచరులు నిరసన కార్యక్రమాలకు దిగారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయం గాంధీభవన్‌పై మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి

మిగతా 3వ పేజీలో ▶

కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటు ఖాయం: డీకే

- డిసెంబర్ 9న రేవంత్ సీఎంగా ప్రమాణం చేస్తారని అనువదించిన స్థానిక నేత
- కర్ణాటకలో రైతులకు 5 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నామన్న డిప్యూటీ సీఎం శివకుమార్

-5లో

వచ్చేనెలలో మోదీ 'బీసీ గర్జన సభ'!



- హైదరాబాద్‌లో భారీ స్థాయిలో నిర్వహించేందుకు బీజేపీ కసరత్తు
- నామినేషన్ల మొదలు ప్రచారం ముగిసేదాకా ఆరు సభల్లో పాల్గొననున్న ప్రధాని మోదీ
- బీసీ, ఎంబీసీల మద్దతు సాధనకు జాతీయ నాయకత్వం ప్రణాళిక
- పార్టీ అగ్రనేతలు అమిత్ షా, జేపీ నడ్డా, ఇతర ముఖ్యనేతల పర్యటనలు
- రోజూ ఒకట్రెండు సభలు, రోడ్‌షోలు ఉండేలా ప్రణాళిక

2లో

పదవితో మారేదేమీ ఉండదు

మీట్ ది ప్రెస్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



- బీసీ వ్యక్తి సీఎం అయినంత మాత్రాన బీసీలకు న్యాయం జరగదు
- ప్రధాని మోదీ ఓబీసీ కేటగిరీకి చెందిన వాడైనా బీసీ జనగణన చేపట్టడం లేదు
- కులం కంటే గుణం ముఖ్యం.. పథకాలు, జాతి ఉద్ధరణ ముఖ్యం
- కేంద్రంలో ఓబీసీలకు ప్రత్యేక శాఖ ఏర్పాటు చేయాలని 2014లోనే కేసీఆర్ కోరారు
- బీసీని పార్టీ అధ్యక్ష పదవి నుంచి బీజేపీ తొలగించింది
- ఓటమి నెపాన్ని బీసీలపై నెట్టేందుకే బీసీ సీఎం నినాదం!

- వివరాలు 2లో

క్లుప్తంగా...

బీసీ సీఎం అయితే అన్ని రంగాల్లో అభివృద్ధి: బండి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో బీసీ నేత సీఎం అయితే జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందే అవకాశం ఏర్పడుతుందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ పేర్కొన్నారు. నేటికీ చట్టసభల్లో అడుగుపెట్టని బీసీల్లోని కులాలకు తగిన ప్రాధాన్యత లభించే అవకాశముందని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ అధికారంలోకి వస్తే బీసీని సీఎం చేస్తామంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామన్నారు. ఈ నిర్ణయంపై బడుగు, బలహీనవర్గాల ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రజల పక్షాన ప్రధాని మోదీ, అమిత్ షా, జేపీ నడ్డాలకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. 'బీజేపీ బీసీల పక్షపాతి. బీసీని ప్రధాని చేసిన ఘనత బీజేపీదే. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలను రాష్ట్రపతి చేసిన చరిత్ర బీజేపీదే. అగ్ర కులాల పేదలకు రిజర్వేషన్లు అందిస్తున్న ఏకైక పార్టీ బీజేపీ' అని సంజయ్ పేర్కొన్నారు. 'గడీలకే పరిమితమై ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కేసీఆర్‌ను ధర్నా చౌక్‌కు లాక్కొచ్చిన ఘనత బీజేపీదే' అని ఆయన వ్యాఖ్యానించారు.

బీసీ సీఎం సరే.. కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వశాఖ ఏదీ?

బీజేపీని ప్రశ్నించిన బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో తాము గెలిస్తే బీసీ నేతను సీఎంగా చేస్తామన్న బీజేపీ కేంద్రంలో ఓబీసీ మంత్రిత్వశాఖను ఎందుకు ఏర్పాటు చేయలేదని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ ప్రశ్నించారు. తెలంగాణలో బీజేపీ భూస్థాపితం అయినప్పటికీ బీసీ సీఎం అంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా బూటకపు హామీ ఇచ్చారని శనివారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. ఓబీసీల పట్ల అంత సానుభూతి ఉంటే, బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి ఆ వర్గాల నాయకుడిని ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం బీసీ కులగణనను ఎందుకు నిర్వహించడం లేదో, ఓబీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంటులో ఎందుకు ప్రవేశపెట్టడంలేదో చెప్పాలని నిలదీశారు. జాతీయ ఓబీసీ కమిషన్‌కు న్యాయపరమైన అధికారం ఎందుకు ఇవ్వలేదని, తగిన నిధులు, అధికారం కేటాయించకుండా జాతీయ ఓబీసీ కార్పొరేషన్‌ను ఎందుకు నిర్లక్ష్యం చేశారని ప్రశ్నించారు. వివిధ ప్రభుత్వ రంగాల్లోని వేలాది బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్‌లు, యూనివర్సిటీలలోని రిక్రూట్‌మెంట్లలో ఓబీసీ రిజర్వేషన్లు ఎందుకు అమలు చేయడంలేదని దాసోజు ప్రశ్నించారు.

బీసీని సీఎంగా ప్రకటించిన పార్టీకే మద్దతు: జాజుల



హిమాయత్‌నగర్ (హైదరాబాద్): బీసీలకే సీఎం పీఠం ఇస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ మేరకు ప్రధాని మోదీ, అమిత్‌షాలకు ధన్యవాదాలు తెలిపారు. బీసీ అభ్యర్థిని సీఎంగా ప్రకటించిన పార్టీకే బీసీల సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో జాజుల మీడియాతో మాట్లాడారు. బీసీలను కేవలం జెండాలు మోయడానికే ఉపయోగించుకుంటున్నారని, బీఆర్ఎస్ బీసీలకు 23 టికెట్లు మాత్రమే ఇచ్చిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ 34 టికెట్లు ఇస్తామని చెప్పి ఇప్పుడు డొంకతిరుగుడు మాటలు చెబుతోందని విమర్శించారు. బీసీల తలరాతలు మారాలంటే బీసీ నేత సీఎం కావాలన్నారు. బీఆర్ఎస్ బీసీ వ్యతిరేక పార్టీ అని, బీజేపీని బీసీలమంతా విశ్వసిస్తున్నామని అన్నారు. సమావేశంలో సంఘం నేతలు కుందారం గణేష్‌చారి, సింగం నగేష్‌గౌడ్, దుర్గయ్యగౌడ్, విక్రమ్ గౌడ్, మహేశ్ యాదవ్, శ్యామల, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇదండీ సంగతి



పెద్ద జాబితానే! కాని జాబితా నిండా ఒక్కరి పేరే రాశారు!

బీఆర్ఎస్ గెలుపు ఖాయం!

- కాంగ్రెస్ రెండో లిస్ట్ తర్వాత ప్రజలకు స్పష్టత వచ్చింది
- ఆదిలాబాద్, ఉట్నూర్ ప్రజా ఆశీర్వాద సభల్లో మంత్రి హరీశ్‌రావు
- కాంగ్రెస్, బీజేపీలో సీఎం పోస్టు కోసం కుర్చీల కొట్లాట
- ఆగం కావద్దు.. ఢిల్లీ చెప్పుచేతుల్లో ఉండే సర్కారు వద్దు..
- నీళ్లు, నూనె కలవనట్టే.. బీఆర్ఎస్, బీజేపీ కలవవని వ్యాఖ్య





ఆదిలాబాద్ సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, హాజరైన జనం

సాక్షి, ఆదిలాబాద్: రాష్ట్రంలో బీఆర్ఎస్ గాలి వీస్తోందని, మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని బీఆర్ఎస్ సీనియర్ నేత, మంత్రి టి.హరీశ్‌రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ రెండో జాబితా విడుదల తర్వాత ప్రజలకు దీనిపై స్పష్టత వచ్చిందని పేర్కొన్నారు. పోటీచేసే సత్తాలేని పార్టీ కాంగ్రెస్ అని తేలిపోయిందని.. ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకు పార్టీ టికెట్లు అమ్ముకున్నారని కాంగ్రెస్‌వాళ్లే అంటున్నారని చెప్పారు. శనివారం ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, ఉట్నూర్‌లలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''బీఆర్ఎస్ నుంచి సీఎం ఎవరంటే కేసీఆరే అని ఎవరైనా చెప్తారు. కానీ కాంగ్రెస్, బీజేపీలలో ఎవరు సీఎం అంటే వంద మంది నేనంటే నేనంటారు. పాలన తక్కువ.. కుర్చీల కొట్లాట ఎక్కువ. గత పదేళ్లలో రాష్ట్రంలో కరువు లేదు. కర్ఫ్యూ లేదు. అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా నిలుస్తూ దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణ ఎదిగింది. ప్రజలు ఆగం కావద్దు. గుండెల మీద చేయి వేసుకుని ఆలోచించండి. పదేళ్ల కింద ఎలా ఉన్నాం. ఇప్పుడెలా ఉన్నాం. కార్యకర్తలు 'కేసీఆర్ భరోసా' మేనిఫెస్టోను గడపగడపకూ, ప్రతీ గుండెకు తీసుకెళ్లాలి.

హరీశ్ వెంట స్వామిగౌడ్

మంత్రి హరీశ్‌రావు వెంట శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొన్నారు. బీజేపీ బీసీ సీఎం ప్రకటన నేపథ్యంలోనే.. బీఆర్ఎస్ సభలకు బీసీ నేతలను ప్రత్యేక ఆకర్షణగా తీసుకొస్తున్నారనే చర్చ కనిపించింది.

కాంగ్రెస్ అంటేనే నాటకం

కేసీఆర్ అంటే ఒక నమ్మకం. కాంగ్రెస్ అంటే నాటకం. ఆ పార్టీ మోసానికి, దగాకు మారుపేరు. ఒక్క చాన్స్ అని ఇప్పుడు అంటోంది. ఇంతకుముందు పదకొండు సార్లు గెలిచి ఏం చేసింది? కనీసం మంచినీళ్ల గోస కూడా తీర్చలేకపోయింది. కేసీఆర్ ఇంటింటికీ నీళ్లు ఇచ్చారు. రాష్ట్రంలో విష జ్వరాలు లేవు, అంటురోగాలు లేవు. కాంగ్రెస్ పాలనలో కరెంటు ఉంటే వార్త.. ఇప్పుడు పోతే వార్త. బీజేపీ పాలిత మహారాష్ట్ర, కాంగ్రెస్ పాలిత కర్ణాటకలలో కరెంటు కోతలు తీవ్రంగా ఉన్నాయి. అదే తెలంగాణలో 24 గంటల కరెంటు వస్తుంది. కాంగ్రెస్, బీజేపీ వాళ్లను కర్ణాటక, మహారాష్ట్రలకు తీసుకెళ్లి అక్కడి పరిస్థితులను చూపిస్తే వాస్తవం తేటతెల్లం అవుతుంది. బీఆర్ఎస్ మేనిఫెస్టోను కాంగ్రెస్ కాపీ కొట్టింది. రైతుబంధు సృష్టికర్త కేసీఆర్. ఈ సొమ్మును ఎకరాకు రూ.16 వేలకు పెంచబోతున్నాం.

అసైన్డ్ ల్యాండ్‌లకు పట్టాలిస్తాం..

మళ్లీ అధికారంలోకి వచ్చాక అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వడం ద్వారా పూర్తి హక్కులను కల్పిస్తాం. నాలుగు లక్షల ఎకరాలకు పోడు పట్టాలు ఇచ్చాం. ఆ భూములకు కూడా రైతుబంధు, రైతు బీమా ఇచ్చాం. రైతు బీమాలాగానే కోటి పేద కుటుంబాలకు రూ.5 లక్షల బీమా అందించబోతున్నాం. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.15 లక్షల వరకు ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా చికిత్స అందిస్తాం. రైతు రుణమాఫీ ఒక్క పైసా బకాయి లేకుండా పూర్తి చేస్తాం.

తెలంగాణలో మేమే ఏ టీమ్

నీళ్లు, నూనె కలవనట్టే బీఆర్ఎస్ బీజేపీలు కలవవు. కాంగ్రెస్ వాళ్లు బీజేపీకి బీ టీమ్ అని, బీజేపీ వాళ్లు కాంగ్రెస్‌కు బీ టీమ్ అని బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేస్తున్నారు. మేం ఎవరికీ బీ టీమ్ కాదు. తెలంగాణలో మేమే ఏ టీమ్. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పదికి పది స్థానాలు బీఆర్ఎస్ గెలుస్తుంది..'' అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

మూడో జాబితాపై ముమ్మర కసరత్తు

బీజేపీ రాష్ట్ర చీఫ్ కిషన్‌రెడ్డి నివాసంలో ముఖ్యనేతల భేటీ

- గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని సీట్లపై చర్చ
- నేడు లేదా రేపు ఢిల్లీ వెళ్లి అధిష్టానానికి జాబితా ఇవ్వాలని నిర్ణయం
- పార్టీ సీఈసీ ఆమోదం తర్వాత 1న లేదా 2న విడుదల చేసే అవకాశం



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ అభ్యర్థుల మూడో జాబితాపై రాష్ట్ర బీజేపీ కసరత్తు ముమ్మరం చేసింది. శనివారం కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి నివాసంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్, సహ ఇన్‌చార్జి సునీల్ బన్సల్, జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ ఛుగ్, పార్టీ నేతలు కె.లక్ష్మణ్, బండి సంజయ్, ఈటల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఎవరిని బరిలోకి దింపాలనే చర్చ జరిగినట్టు తెలిసింది. గ్రేటర్ హైదరాబాద్‌లోని సీట్లపై చర్చలో భాగంగా.. సనత్‌నగర్ నుంచి మర్రి శశిధర్‌రెడ్డి, జూబ్లీహిల్స్ విక్రమ్‌గౌడ్, ముషీరాబాద్ నుంచి గోపాల్‌రెడ్డి/ బండారు విజయలక్ష్మి, అంబర్‌పేట నుంచి బండారు విజయలక్ష్మి / ఎస్.గౌతమ్‌రావు, సికింద్రాబాద్ నుంచి బండ కార్తీకరెడ్డి, మల్కాజ్‌గిరి నుంచి ఆకుల రాజేందర్, రాజేంద్రనగర్ నుంచి తోకల శ్రీనివాస్‌రెడ్డి అభ్యర్థిత్వాలను పరిశీలించినట్టు సమాచారం. ఎల్బీనగర్ సీటు కోసం సామ రంగారెడ్డి, వంగ మధుసూదన్‌రెడ్డి, గంగిడి మనోహర్‌రెడ్డి ఆశలు పెట్టుకోగా.. ఉప్పల్ నుంచి ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌తో పాటు వీరేందర్‌గౌడ్, మేడ్చల్ నుంచి విక్రమ్‌రెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ రెండో జాబితా కూడా వెలువడిన నేపథ్యంలో.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల్లోని అసంతృప్తులను చేర్చుకుని, టికెట్ ఇచ్చే అంశం కూడా ప్రస్తావనకు వచ్చినట్టు సమాచారం.

త్వరలోనే జాబితా విడుదల

ఆదివారంగానీ, సోమవారంగానీ బీజేపీ రాష్ట్ర నేతలు ఢిల్లీ వెళ్లి మూడో జాబితా ముసాయిదాను పార్టీ పెద్దలకు అందజేయనున్నట్టు తెలిసింది. వచ్చే నెల 1న పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో ఈ జాబితాపై చర్చించి.. సుమారు 40- 45 మంది పేర్లతో విడుదల చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఆ రోజున ఆలస్యమైతే రెండో తేదీన విడుదల చేయవచ్చని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. మిగిలిన సీట్లలో పదిచోట్ల అభ్యర్థుల మధ్య పోటీ తీవ్రంగా ఉందని, వాటి విషయాన్ని చివర్లో తేల్చాలని భావిస్తున్నట్టు సమాచారం. జనసేనకు కేటాయించే సీట్లపైనా చర్చించారని, ఈ విషయంలో పార్టీ నేతల్లో అసంతృప్తి వ్యక్తమైందని తెలిసింది.

దళిత ముఖ్యమంత్రి హామీ ఏమైంది?

బీసీల విషయంలో మాకు కేటీఆర్ సలహాలు అక్కర్లేదు: బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్



సాక్షి, న్యూఢిల్లీ: బీసీలను రాజకీయంగా ఏ విధంగా అభివృద్ధి చేయాలన్నది బీజేపీకి తెలుసునని.. ఈ విషయంలో మంత్రి కేటీఆర్ తమకు సలహాలు ఇవ్వాల్సిన అవసరం ఏమాత్రం లేదని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంలో ఓబీసీలు, ఎస్సీ, ఎస్టీలు కలిపి 50 శాతానికిపైగా మంత్రులు ఉన్నారని తెలిపారు. శనివారం ఆయన ఢిల్లీలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణలో దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామన్న హామీ ఏమైందో తన తండ్రి కేసీఆర్‌ను అడగాలని కేటీఆర్‌ను డిమాండ్ చేశారు. వచ్చే రోజుల్లో అయినా దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తారా? లేక కేసీఆర్.. తర్వాత కేటీఆర్, ఆ తర్వాత ఆయన కొడుకుని ముఖ్యమంత్రి చేయడమే తమ రాజకీయమా అనే విషయంపై స్పష్టత ఇవ్వాలన్నారు. ఇలాంటి వ్యక్తులు బీజేపీ గురించి మాట్లాడటం అంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉంటుందని అర్వింద్ ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ కవితను ఒక రాజకీయ నాయకురాలిగా తాను ఏమాత్రం భావించటంలేదని అన్నారు. కవిత ఒక కాలం చెల్లిన, ప్రజలు తిరస్కరించిన నాయకురాలని విమర్శించారు. కాగా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాల్సిందిగా పార్టీ సీనియర్లను హైకమాండ్ కోరినప్పటికీ కొందరు వివిధ కారణాలతో పోటీ వద్దనుకున్నారని చెప్పారు. అయితే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలంటే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ ఒక అర్హత అన్నది తన అభిప్రాయమన్నారు.

వచ్చే నెలలో మోదీ 'బీసీ గర్జన సభ'!

హైదరాబాద్‌లో భారీ స్థాయిలో నిర్వహించేందుకు బీజేపీ కసరత్తు

- నామినేషన్లు మొదలు ప్రచారం ముగిసేదాకా ఆరు సభల్లో పాల్గొననున్న ప్రధాని మోదీ
- పార్టీ అగ్రనేతలు అమిత్ షా, జేపీ నడ్డా, ఇతర ముఖ్యనేతల పర్యటనలు



సాక్షి, హైదరాబాద్: బీసీ ఎజెండాతో రాష్ట్ర ఎన్నికల పోరులోకి దూకిన బీజేపీ.. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో 'బీసీ గర్జన' సభ చేపట్టేందుకు కసరత్తు చేస్తోంది. వచ్చే నెలలో మోదీకి అందుబాటులో ఉండే తేదీని బట్టి హైదరాబాద్‌లో భారీ స్థాయిలో ఈ సభ నిర్వహించాలని నిర్ణయించింది. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీని సీఎం చేస్తామని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించిన విషయం తెలిసిందే. తెలంగాణలో 52 శాతానికిపైగా ఉన్న బీసీలు, ఎంబీసీల మద్దతు సాధించేందుకు బీజేపీ జాతీయ నాయకత్వం ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఈ క్రమంలో మోదీ సభ ద్వారా సందేశం ఇవ్వాలనే భావిస్తున్నట్టు వివరిస్తున్నాయి. ఒకవేళ మోదీ హాజరయ్యే పరిస్థితి లేకుంటే.. బదులుగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా 'బీసీ గర్జన' సభలో పాల్గొంటారని అంటున్నాయి. శనివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఈ అంశంపై ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె.లక్ష్మణ్, మోర్చా రాష్ట్ర నేతలు పాల్గొని చర్చించినట్టు తెలిసింది.

ఆరు సభలకు మోదీ..

వచ్చేనెల 3న నామినేషన్ల దాఖలు ప్రారంభమై 28న ప్రచారపర్వం ముగిసేలోగా మొత్తం ఆరు సభల్లో ప్రధాని మోదీ పాల్గొననున్నారు. ఇప్పటికే ఉమ్మడి వరంగల్, మహబూబ్‌నగర్, నిజామాబాద్‌ల పరిధిలో జరిగిన సభల్లో ఆయన పాల్గొన్నారు. మిగతా జిల్లాలనూ కవర్ చేస్తూ చివరగా హైదరాబాద్‌లో భారీ సభతో తన కార్యక్రమాలను ముగించనున్నారు. మరోవైపు ఇదే సమయంలో పార్టీ అగ్రనేతలు అమిత్ షా, జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాలు సీఎంలు, ఇతర ముఖ్యనేతలు విస్తృతంగా పర్యటించేలా షెడ్యూల్‌ను సిద్ధం చేస్తున్నారు. వచ్చేనెల 3 నుంచి పార్టీ అభ్యర్థుల నామినేషన్ల దాఖలు కార్యక్రమాల్లోనూ కేంద్ర మంత్రులు, ముఖ్యనేతలు పాల్గొనేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మొత్తంగా రోజూ కనీసం ఒకటి, రెండు సభలు, రోడ్ షోలు ఉండేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు.

బీసీ సీఎం ప్రకటనపై బీజేపీ కార్యాలయంలో సంబురాలు

అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపిన రాష్ట్ర నేతలు



రాష్ట్ర కార్యాలయంలో సంబురాల్లో పాల్గొన్న లక్ష్మణ్, ఈటల, బూర నర్సయ్య గౌడ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో పార్టీ అధికారంలోకి వస్తే బీసీ నేతను సీఎంను చేస్తామని బీజేపీ అధిష్టానం చేసిన ప్రకటనకు కృతజ్ఞతలు తెలుపుతూ శనివారం బీజేపీ కార్యాలయంలో పార్టీ నేతలు సంబురాలు జరిపారు. పార్టీ ఆఫీస్ బయట పటాసులు కాల్చి, డప్పులు వాయిస్తూ, స్వీట్లు పంచుకున్నారు. ప్రధాని మోదీ చిత్రపటానికి పార్టీ నేతలు క్షీరాభిషేకం చేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలె భాస్కర్‌రాజ్, పార్టీ నేతలు ఆకుల విజయ, టి.వీరేందర్‌గౌడ్ ఇతర నేతలు పాల్గొన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కె.లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ.. అమిత్ షా ప్రకటన చరిత్రాత్మకమని అన్నారు. రాష్ట్రంలో 52 శాతం బీసీ జనాభా ఉన్నా రాజకీయ పార్టీలు బీసీ సామాజిక వర్గాలను పూర్తిగా విస్మరించాయని చెప్పారు. దళితుడిని సీఎం చేస్తానన్న కేసీఆర్ మాట తప్పారని, దీనిపై బీసీ సమాజం ఆలోచించాలని అన్నారు. బీజేపీకి ఒక్కసారి అవకాశం కల్పిస్తే బీసీలు అభివృద్ధి చెందుతారని చెప్పారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ, కేసీఆర్‌కు బీసీలంటే చిన్నచూపని ఆరోపించారు. బీజేపీ 40 స్థానాలకు పైగా బీసీలకు అవకాశాలు కల్పించబోతోందని, తెలంగాణ సమాజం నిండు మనస్సుతో పార్టీని ఆశీర్వదించాలని కోరారు. బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ... తెలంగాణలో గడీల పాలన నడుస్తోందని, ఏ ఆశయాల కోసం తెలంగాణ సాధించుకున్నామో అవి నెరవేరలేదని అన్నారు. సీఎం స్థానం బీజేపీ బీసీలకు ఇవ్వడం బీసీ సమాజానికి గర్వకారణమని పేర్కొన్నారు.

నేడు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మూడుచోట్ల సీఎం సభలు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం సీఎం కె.చంద్రశేఖర్‌రావు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పర్యటించనున్నారు. కోదాడ, తుంగతుర్తి, ఆలేరు నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచార సభల్లో ఆయన ప్రసంగించనున్నారు. సీఎం మధ్యాహ్నం ఒంటి గంటకు హైదరాబాద్ నుంచి బయలుదేరి 1.40 గంటలకు కోదాడ చేరుకుంటారు. 1.50 గంటలకు అక్కడ ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగిస్తారు. 2.30 గంటలకు కోదాడ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 3.10 గంటలకు తుంగతుర్తి నియోజకవర్గంలోని తిరుమలగిరిలో జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. 3.50 గంటలకు అక్కడ నుంచి బయలుదేరి సాయంత్రం 4.10 గంటలకు ఆలేరుకు చేరుకుంటారు. అక్కడ ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగించిన అనంతరం తిరిగి హైదరాబాద్ బయలుదేరి వెళతారు. కాగా, ఈ నెల 31వ తేదీన సీఎం మరో మూడు నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండ నియోజకవర్గాల్లో నిర్వహించే బహిరంగ సభల్లో ఆయన పాల్గొంటారని బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.

పదవితో మారేదేం ఉండదు

మీట్ ది ప్రెస్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- బీసీ వ్యక్తి సీఎం అయినంత మాత్రాన బీసీలకు న్యాయం జరగదు
- ప్రధాని మోదీ ఓబీసీ కేటగిరీకి చెందిన వాడైనా బీసీ జనగణన చేపట్టడం లేదు
- కులం కంటే గుణం ముఖ్యం.. పథకాలు, జాతి ఉద్ధరణ ముఖ్యం
- బీసీ నేతను పార్టీ అధ్యక్ష పదవి నుంచి బీజేపీ తొలగించింది
- ఓటమి నెపాన్ని బీసీలపై నెట్టేందుకే బీసీ సీఎం నినాదమని ఆరోపణ



సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి వెనుకబడిన వర్గానికి చెందిన నేతను తొలగించిన బీజేపీ తెలంగాణలో తాము అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రిగా చేస్తామని అంటోందని భారత్ రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు ఎద్దేవా చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా ఓబీసీ కేటగిరీకి చెందిన వాడైనా బీసీ జనగణన చేపట్టడం లేదని, ఒక వ్యక్తికి పదవి వచ్చినంత మాత్రాన పెద్దగా మారేదేమీ ఉండదని అన్నారు. బీసీ సీఎం అయినంత మాత్రాన బీసీలకు న్యాయం జరగదని, కులం కంటే గుణం చాలా ముఖ్యమని వ్యాఖ్యానించారు. కేంద్రంలో ఓబీసీలకు ప్రత్యేక శాఖ ఏర్పాటు చేయాలని 2014 డిసెంబర్‌లోనే సీఎం కేసీఆర్ బీసీ ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లారని గుర్తుచేశారు. ముదిరాజ్‌లకు రూ.1,000 కోట్ల విలువైన చేప పిల్లలు ఉచితంగా ఇవ్వడం ద్వారా రూ.30 వేల కోట్ల విలువైన మత్స్య సంపద సృష్టించామని తెలిపారు. పదవుల కంటే పథకాలు, జాతి ఉద్ధరణ ముఖ్యమని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి నెపాన్ని బీసీలపై నెట్టేందుకే బీసీ సీఎం నినాదాన్ని బీజేపీ ఎత్తుకుందనే అనుమానం వ్యక్తం చేశారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో శనివారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్'లో కేటీఆర్ పలు అంశాలపై స్పందించారు.

బీజేపీకి 110 స్థానాల్లో డిపాజిట్లు దక్కవు

'బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేళ్లుగా మార్పు కోసం రాజకీయాలు చేస్తోంది. కానీ విపక్ష పార్టీలు మాత్రం ప్రభుత్వాలను మార్చేందుకు పనిచేస్తున్నాయి. పదేళ్లలో బీజేపీ తెలంగాణకు ఇచ్చిందేమీ లేదు. అయితే దాడులు లేదంటే అబద్ధాలతో మోసం చేస్తోంది. సోషల్ మీడియా అబద్ధపు వార్తలకు బీజేపీ ఫ్యాక్టరీలా మారింది. వాట్సాప్ యూనివర్సిటీ ద్వారా విష ప్రచారం చేస్తోంది. ఆ పార్టీకి అసెంబ్లీ ఎన్నికల్లో 110 స్థానాల్లో డిపాజిట్లు దక్కవు..' అని కేటీఆర్ చెప్పారు.

మేడిగడ్డపై ప్రతిపక్షాలది పైశాచికానందం

'మేడిగడ్డ బ్యారేజీ గత ఏడాది 28 లక్షల క్యూసెక్కుల రికార్డు స్థాయి వరదను కూడా తట్టుకుని నిలిచింది. ప్రాజెక్టులో లోపాలు ఏవైనా ఉంటే సంబంధిత ఏజెన్సీ ద్వారానే మరమ్మతు పనులు జరుగుతాయి. ప్రజలపై ఎంత మాత్రం భారం పడదు. ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీలు బట్ట కాల్చి మామీదేయడం సరికాదు. గతంలో అన్నారం పంప్‌హౌస్ మునిగిన సమయంలోనూ ప్రతిపక్షాలు పైశాచిక ఆనందం పొందాయి..' అని కేటీఆర్ విమర్శించారు.

కేసీఆర్‌కు దీటైన నేతలు లేరు

'సీఎం కేసీఆర్‌కు దీటైన నాయకుడు తెలంగాణలో ఎవరూ లేరు. పాలనలో అనేక విప్లవాత్మక మార్పులు తెచ్చిన కేసీఆర్‌కు మంచి ట్రాక్ రికార్డు ఉంది. ప్రజలు ఆయన నాయకత్వాన్నే కోరుకుంటున్నారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ కొత్త నమూనా ఆవిష్కరించడం ద్వారా ఎన్నో అద్భుతాలు ఆవిష్కృతం అయ్యాయి. రాష్ట్రంలో స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని ఆచరిస్తున్నాం. లింగ, కుల, మత వివక్ష లేకుండా పాలన సాగుతోంది. అభివృద్ధి, సంక్షేమానికి నడుమ సమతూకం పాటిస్తున్నాం. అప్పులను రాష్ట్రంలో ఉత్పాదక రంగం, మౌలిక వసతులపై వెచ్చించాం. అన్ని రంగాల అభివృద్ధితో రాష్ట్రం, ప్రజల సంపద పెరిగింది. మా కంటే గొప్పగా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసిన ప్రభుత్వాలు ఏవీ లేవు..' అని కేటీఆర్ పేర్కొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడు జైలుకు వెళ్లొచ్చు..

'కాంగ్రెస్‌కు ఇప్పటికే 11 మార్లు అధికారం ఇచ్చిన ప్రజలు మరోమారు అప్పగించేందుకు సిద్ధంగా లేరు. గతంలో ఆరు సూత్రాలు అంటూ మోసగించిన కాంగ్రెస్ ఇప్పుడు ఆరు గ్యారంటీలతో మరోమారు అదే తీరును ప్రదర్శిస్తోంది. కర్ణాటకలో ఐదు గంటల పాటు కరెంటు ఇవ్వలేక లెంపలు వేసుకుంటోంది. దేశానికి ఆ పార్టీ తెల్ల ఏనుగులా తయారైంది. రాష్ట్రంలో పగ, కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడితే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఈపాటికి జైల్లో ఉండేవాడు. ఇప్పటికీ ఆయన జైలుకు వెళ్లొచ్చు..' అని అన్నారు.

తొలుత మహారాష్ట్రలో జెండా ఎగరేస్తాం


'ఇతర పార్టీలను బలహీన పరచడం, మేము బలపడటం లక్ష్యంగా బీఆర్ఎస్‌లోకి చేరికలను ప్రోత్సహిస్తున్నాం. జాతీయ పార్టీగా తొలుత మహారాష్ట్రలో జెండా ఎగురవేసిన తర్వాత ఇతర రాష్ట్రాలకు విస్తరిస్తాం. బీజేపీ జాతీయ స్థాయిలో అధికారంలోకి వచ్చేందుకు సుమారు 30 ఏళ్లు పట్టింది..' అని గుర్తు చేశారు.

బీఆర్ఎస్ గెలుపు కోసం కలసిరండి

- కేసీఆర్ నాయకత్వం మళ్లీ అవసరమని గ్రామాల్లో ప్రచారం చేయండి
- ప్రవాస భారతీయులకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వినతి
- వివిధ దేశాల్లోని బీఆర్ఎస్ ఎన్నారై శాఖల ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణను అన్ని రంగాల్లో ప్రగతిపథంలో తీసుకెళుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వం రాష్ట్రానికి మరోసారి అవసరమనే విషయాన్ని గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని, దీనికోసం ప్రవాస భారతీయులంతా కలసి రావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు కోరారు. బీఆర్ఎస్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎన్నారై శాఖల ప్రతినిధులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేటీఆర్ మాట్లాడారు. ఉద్యమకాలం నుంచి కేసీఆర్‌తో కలసి కదంతొక్కిన ఎన్నారైలు ఈ కీలక సందర్భంలోనూ మరింత చురుగ్గా పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ గత పదేళ్లలో కేసీఆర్ ఆధ్వర్యంలో సాధించిన ప్రగతిని దృష్టిలో పెట్టుకొని ప్రజల మద్దతు కోరాలని ఎన్నారైలకు సూచించారు. ఇందుకోసం సామాజిక మాధ్యమాల్లో తెలంగాణ సాధించిన అభివృద్ధిని వీడియోలు, పోస్టుల రూపంలో వివరిస్తూ ప్రజలను చైతన్యపరచాలని కేటీఆర్ కోరారు. జీవితంలో ఉన్నత చదువులు చదివి, వ్యాపార వాణిజ్య రంగాల్లో రాణించి విదేశాల్లో స్థిరపడిన ప్రవాస భారతీయులు అంటే గ్రామాల్లో గొప్ప గౌరవం ఉందని, ఇలాంటి ప్రవాస భారతీయులు తెలంగాణ ప్రయోజనాలను కాపాడగలిగే నాయకత్వానికి ఎన్నికలలో ఓటు వేయాలని కోరితే ఇక్కడి ఓటర్లు వింటారని కేటీఆర్ అన్నారు. మరోసారి దారితప్పి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 50 ఏళ్లపాటు తెలంగాణ అభివృద్ధి వెనక్కి పోతుందని కేటీఆర్ అన్నారు. సమావేశంలో ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కుర్మాచలం, బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ మహేష్ బిగాల, తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి మున్సిపల్ మాస్టర్‌ప్లాన్ రద్దు



కేటీఆర్‌ను కలిసిన కామారెడ్డి రైతు జేఏసీ బృందం

రైతు జేఏసీ నేతలతో మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: కామారెడ్డి పట్టణానికి ప్రతిపాదించిన మాస్టర్‌ప్లాన్‌ను వెంటనే రద్దు చేస్తున్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు ప్రకటించారు. రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని మాస్టర్‌ప్లాన్ రద్దు చేస్తున్నట్లు గతంలోనే మున్సిపల్ శాఖ ప్రకటించిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. కామారెడ్డి రైతు జేఏసీ నాయకులు శనివారం ప్రగతిభవన్‌లో మంత్రి కేటీఆర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా డీటీసీపీ అధికారులతో మాట్లాడిన కేటీఆర్ ప్రస్తుతమున్న పాత మాస్టర్‌ప్లాన్ ప్రకారమే నడుచుకోవాలని ఆదేశించారు. మాస్టర్‌ప్లాన్ రద్దు చేయాలని ఇప్పటికే కామారెడ్డి మున్సిపల్ పాలకమండలి తీర్మానించిందని, రైతులకు నష్టం జరగకుండా అండగా ఉంటామని చెప్పారు. మాస్టర్‌ప్లాన్ రద్దు కోసం జరిగిన ఆందోళనలలో రైతులపై నమోదైన కేసులను ఎత్తివేసేలా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. కేసుల గురించి కామారెడ్డి జిల్లా ఎస్పీ, రాష్ట్ర డీజీపీతో మాట్లాడారు. మాస్టర్‌ప్లాన్ రద్దు చేస్తున్నట్లు కేటీఆర్ చేసిన ప్రకటనపై కామారెడ్డి రైతు జేఏసీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా...


బీసీలను దగా చేసిన కాంగ్రెస్: ఆర్.కృష్ణయ్య



కాచిగూడ (హైదరాబాద్): కాంగ్రెస్ పార్టీ ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో రెండు అసెంబ్లీ సీట్లను బీసీలకు కేటాయిస్తామని ప్రకటించి ఇవ్వకుండా దగా చేసిందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన శనివారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన బీసీ సంఘాల ప్రతినిధుల సమావేశంలో కృష్ణయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ మొదటి, రెండో జాబితాలో 20 సీట్లు మాత్రమే బీసీలకు కేటాయించడం అన్యాయమన్నారు. అంగబలం, అర్థబలం ఉన్న సమర్థులైన బీసీ నేతలు కాంగ్రెస్ పార్టీలో చాలా నియోజకవర్గాల్లో ఉన్నప్పటికీ పార్టీ అధిష్టానం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ కేవలం 23 సీట్లు కేటాయించి అన్యాయం చేసిందని బీసీలు గగ్గోలు పెడుతుంటే.. కాంగ్రెస్ 20 సీట్లు కేటాయించి అన్యాయం చేయడంలో పోటీ పడిందన్నారు. అధికారంలోకి వస్తే బీసీలకు ముఖ్యమంత్రి పదవి ఇస్తామని ప్రకటించిన బీజేపీని బీసీలు అభినందిస్తున్నారని కృష్ణయ్య పేర్కొన్నారు.

నెలకు రూ. 4 వేల నిరుద్యోగ భృతి

ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన బీఆర్ఎస్ పార్టీ వారిని మోసగించిందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నెలకు రూ.4వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో 22 లక్షల మంది నిరుద్యోగులుగా టీఎస్‌పీఎస్సీలో నమోదు చేసుకున్నారని, తెలంగాణను బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ తెలంగాణగా మార్చిందని విమర్శించారు. ఆయన గాంధీభవన్‌లో శనివారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడుతూ ఎల్బీ స్టేడియంలో ప్రియాంకాగాంధీ చేసిన యూత్ డిక్లరేషన్ మేరకు బిస్వాల్ కమిటీ ఇచ్చిన నివేదికను అమలు చేస్తామని తెలిపారు. ఏడాదిలోగా ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేస్తామని, ఏటా ఉద్యోగ కేలండర్‌ను ప్రకటిస్తామని వంశీ హామీ ఇచ్చారు.

కర్ణాటకకు కాదు ఓయూకు రా..

ఉస్మానియా యూనివర్సిటీ: పథకాల అమలుకు కర్ణాటకకు కాదు.. ఉద్యమాల గడ్డ ఓయూ ఆర్ట్స్ కళాశాల ముందుకు రావాలని మంత్రి కేటీఆర్‌కు కాంగ్రెస్ నేత వంశీచంద్‌రెడ్డి సవాల్ విసిరారు. విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ నాయకుల ఆహ్వానం మేరకు శనివారం ఓయూ క్యాంపస్ హాజరైన ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనపై ధ్వజమెత్తారు. రూ.లక్షల కోట్ల కమీషన్ తీసుకొని నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుకు ఆర్ట్స్ కళాశాల నుంచి బయల్దేరి వెళ్దామని సూచించారు. ఓయూకు రాలేని కేటీఆర్.. కర్ణాటకకు బస్సు పెడతాం రండి.. అనడం హాస్యాస్పదమన్నారు.

డబ్బు సంచులతో వచ్చినోళ్లకే టికెట్లు!

లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఇన్‌చార్జి హనుమంత్ నాయక్ ఆరోపణ



లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఇన్‌చార్జ్ హనుమంత్‌నాయక్ తదితరులు

రాజేంద్రనగర్/ పంజాగుట్ట (హైదరాబాద్): పార్టీ పటిష్టత కోసం పనిచేసే నాయకులకు కాకుండా పారాచూట్ నాయకులకు కాంగ్రెస్ టికెట్లు కట్టబెడుతోందని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఇన్‌చార్జి హనుమంత్ నాయక్ ఆరోపించారు. శనివారం రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని డైరీఫామ్ చౌరస్తాలో ఆయన మాట్లాడుతూ.. 'మా తండాలో మా రాజ్యం'నినాదంతో 1997లో డాక్టర్ బెల్లయ్య నాయక్ లంబాడా హక్కుల పోరాట సమితిని ప్రారంభించారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీకోసం 25 ఏళ్లుగా పని చేస్తున్నా బెల్లయ్య నాయక్‌కు టికెట్టు ఇవ్వలేదని ఆయన మండిపడ్డారు. గెలిచే అభ్యర్థులకే టికెట్లు ఇవ్వకుండా ఓడిపోయే అభ్యర్థులకు టికెట్లు ఇస్తూ కాంగ్రెస్ పార్టీ మరోసారి ఓడిపోయేందుకు సిద్ధమవుతోందని అభిప్రాయపడ్డారు. కాగా, రాష్ట్రంలోని 100 సీట్లలో లంబాడాల హక్కుల పోరాట సమితి నుంచి పోటీ చేస్తామని తెలిపారు.

బెల్లయ్య నాయక్‌కు టికెట్ ఇవ్వాలి..

లంబాడీల అభివృద్ధి కోసం గత 35 ఏళ్లుగా అనేక ఉద్యమాలు చేస్తున్న బెల్లయ్య నాయక్‌కే మహబూబాబాద్ కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయించాలని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోట్యా నాయక్ డిమాండ్ చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లంబాడీలను కించపరిచేలా మాట్లాడిన టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో లంబాడీలు బలంగా ఉన్న 40 చోట్ల పోటీ చేసి కాంగ్రెస్ పార్టీని ఓడిస్తామని ఆయన హెచ్చరించారు.

'చేయి'స్తారా!



గాంధీభవన్ వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

▶ మొదటి పేజీ తరువాయి

అనుచరులు కొందరు రాళ్ల దాడి చేశారు. తమ నేతకు జూబ్లీహిల్స్ టికెట్ ఇవ్వనందుకు నిరసనగా పార్టీ జెండాలను తగులబెట్టారు. ఇటుక పెళ్లలను విసరడంతో రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి రంధ్రం పడింది.

పార్టీతో తెగదెంపులు

టికెట్ దక్కనందుకు నిరసనగా కాంగ్రెస్ అనుబంధ విభాగమైన మైనార్టీ సెల్ చైర్మన్ సోహైల్ తన పదవికి రాజీనామా చేశారు. పార్టీతో 34 ఏళ్ల అనుబంధాన్ని తెంచుకుంటున్నానని ప్రకటించారు. ఈ మేరకు ఖర్గేకు లేఖ పంపినట్లు ఆయన తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ తాళం ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ చేతుల్లో ఉందన్నారు. పాత కాంగ్రెస్‌ను రేవంత్‌రెడ్డి చంపేశారని ఆరోపించారు. డిసెంబర్ 3 తర్వాత గాంధీభవన్‌లో ఒక్కరు కూడా కనిపించరని అన్నారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజక వర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించిన పీసీసీ ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి కూడా కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. శనివారం కార్యకర్తలతో సమావేశమైన ఆయన తనకు పార్టీ అన్యాయం చేసిందని బోరుమన్నారు. ఆయన్ను చూసి కార్యకర్తలు కూడా కంటతడి పెట్టారు. గత ఎన్నికల్లో తాను టికెట్



సుభాష్‌రెడ్డిని ఓదారుస్తున్న పార్టీ శ్రేణులు

త్యాగం చేశానని, ఈసారి ఇస్తామని చెప్పి చివరకు డబ్బులకు అమ్ముకున్నారని ఆరోపించారు. ఎల్లారెడ్డి నుంచి బరిలోకి దిగుతానని, కాంగ్రెస్ అభ్యర్థి మదన్‌మోహన్‌రావ్‌ను ఓడించి తీరుతానని శపథం చేశారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నానని, త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని పార్టీ నేత, ఎన్ఆర్ఐ విజయ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ముధోల్ కాంగ్రెస్ టికెట్‌ను ఎంతకు అమ్ముకున్నారో రేవంత్‌రెడ్డి చెప్పాలన్నారు. అమెరికాలో ఉన్న తనను ఇక్కడికి రప్పించి టికెట్ ఇస్తామని ఆశ చూపి పని చేయించుకున్నారని, ఇప్పుడు వేరే అభ్యర్థికి టికెట్ అమ్ముకుని తనను మోసం చేశారని ఆరోపించారు. కాగా ఆయన అనుచరులు, కార్యకర్తలు కాంగ్రెస్ ఫ్లెక్సీలను చించివేసి తగులబెట్టారు.

తిరుగుబాటు బావుటాలు

టికెట్ దక్కని కాంగ్రెస్ ఆశావహులు కొందరు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకుంటున్నారు. కొందరు పార్టీని ధిక్కరించి ఎన్నికల బరిలో నిలిచేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. వడ్డేపల్లి సుభాష్‌రెడ్డితో పాటు మునుగోడు టికెట్ రాని చల్లమల్ల కృష్ణారెడ్డి, హుస్నాబాద్ టికెట్ ఆశించిన అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, వరంగల్ వెస్ట్‌లో జంగా రాఘవరెడ్డి, ఆసిఫాబాద్‌లో ముందు నుంచి పనిచేస్తున్న తనను కాదని శ్యామ్‌నాయక్‌కు టికెట్ కేటాయించడంపై మండిపడుతున్న ఆదివాసీ మహిళా నాయకురాలు మర్సుకోలు సరస్వతి స్వతంత్ర అభ్యర్థులుగా రంగంలో ఉంటామని స్పష్టం చేశారు. అనుచరులతో సమావేశాలు ఏర్పాటు చేసుకుని ఒకట్రెండు రోజుల్లో భవిష్యత్ కార్యాచరణ ప్రకటించేందుకు సిద్ధమవుతున్నారు. కాగా అధిష్టానం తనను వంచించిందని హుస్నాబాద్ నేత అలిగిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

యుద్ధానికి సిద్ధంగా ఉన్నా..

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో తాను యుద్ధానికి ఆయుధంతో సిద్ధంగా ఉన్ననని, ప్రజలు గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారని డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి తెలిపారు. నాయిని రాజేందర్‌రెడ్డికి ఏ సర్వే ప్రకారం టికెట్ ఇచ్చారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఇక నర్సాపూర్ టికెట్ ఆవుల రాజిరెడ్డికి కేటాయించడంపై టికెట్ ఆశించి భంగపడిన పీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్, ముఖ్యనాయకులు రెడ్డిపల్లి ఆంజనేయులు, సోమన్నగారి రవీందర్‌రెడ్డి రగిలిపోతున్నారు. హత్నూర మండలంలోని ఓ ఫాంహౌస్‌లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తక్షణం అభ్యర్థిని మార్చాలని, లేకుంటే తమ ముగ్గురిలో ఒకరు స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతారని హెచ్చరించారు. పరకాల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి.. అవసరమైతే ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని అనుచరులతో చెప్పినట్లు తెలిసింది.

రాహుల్ సభను అడ్డుకుంటామంటున్నారు..

తనకు టికెట్ ఇవ్వకపోవడానికి నిరసనగా వచ్చే నెల 1న జడ్చర్లలో జరిగే రాహుల్‌గాంధీ బహిరంగ సభను అడ్డుకుంటామని తన అనుచరులు చెబుతున్నారని మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ చెప్పారు. కార్యకర్తలతో చర్చించి భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటానని ఆయన అన్నారు. బెల్లంపల్లి కాంగ్రెస్ టికెట్ స్థానికులకు ఇవ్వకుంటే రెండ్రోజుల్లో సమావేశమై భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు వర్గీయులు ప్రకటించారు. బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వన్నెల అశోక్ అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలని ఆడె గజేందర్ అనుచరులు, కాంగ్రెస్ నాయకులు అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. ఇదేవిధంగా వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి కొండా సురేఖ టికెట్‌ను వెనక్కి తీసుకుని, స్థానికులకు పోటీ చేసే అవకాశం ఇవ్వాలని అసంతృప్తి నేతలు పలువురు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోటీగా బరిలోకి దిగాలనే నిర్ణయం తీసుకున్నట్లు మాజీ డిప్యూటీ మేయర్ ఎంబాడి రవీందర్ తెలిపారు.

వాళ్లు కాంగ్రెస్‌కు కేన్సర్ లాంటివారు

నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు కోమటిరెడ్డి సోదరులు కాంగ్రెస్ పార్టీకి కేన్సర్‌లాంటి వారని పీసీసీ ప్రధానకార్యదర్శి, మునుగోడు టికెట్ ఆశించిన చలమల్ల కృష్ణారెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వారు రెండేసి టికెట్లు తీసుకుని తమలాంటి వారికి టికెట్ రాకుండా అడ్డుపడ్డారని మండిపడ్డారు. సేవ్ మునుగోడు పేరిట బరిలో నిలిచి తన తడాఖా చూపిస్తానని హెచ్చరించారు.

రేవంత్‌పై ఫిర్యాదుకు సిద్ధం

టికెట్లు రాని నేతలు కొందరు పార్టీ నాయకత్వంపై, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై బహిరంగ విమర్శలకు దిగుతున్నారు. పార్టీ టికెట్లను అమ్ముకుంటున్నారని కొందరు ఆరోపించడం గమనార్హం. మరోవైపు రేవంత్‌రెడ్డిపై పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేసేందుకు అసమ్మతి నేతలు సిద్ధమయ్యారు. శనివారం లక్డీకాపూల్‌లోని సెంట్రల్ కోర్టు హోటల్‌లో కొందరు నేతలు రహస్యంగా సమావేశమయ్యారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాల పట్ల రేవంత్ రెడ్డి కుట్రపూరితంగా వ్యవహరించారని ఆవేదనతో ఉన్న నేతలు ఈ భేటీకి హాజరైనట్లు సమాచారం. అద్దంకి దయాకర్, రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారని, తమ భవిష్యత్తు కార్యాచరణపై సమాలోచనలు జరిపారని తెలుస్తోంది. రెబల్ అభ్యర్థులుగా పోటీ చేయాలనే నిర్ణయానికి కూడా వచ్చినట్టు సమాచారం.

అభ్యర్థిత్వాలను సమీక్షించండి: సీనియర్ల లేఖ

టికెట్ల కేటాయింపు తీరుపై సీనియర్లలోనూ అంతర్గతంగా తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. టికెట్ల ఖరారు ప్రాతిపదికకు అర్థం లేకుండా పోయిందని, ఏళ్ల తరబడి పార్టీని పట్టుకుని వేలాడిన వారిని పట్టించుకోకుండా ఇతర పార్టీల నుంచి చేర్చుకున్న వారికి పట్టం కట్టారని వాపోతున్నారు. కొందరు సీనియర్లు పార్టీ అధిష్టానానికి లేఖ రూపంలో తమ ఆవేదన తెలియజేశారు. 'దశాబ్దాలుగా పార్టీతో కలిసి నడుస్తున్న నేతలు, కేడర్‌లో అభ్యర్థులను ఎంపిక చేసిన తీరు తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోంది. రెండు జాబితాల్లో ప్రకటించిన అభ్యర్థులను చూస్తే పారాచూట్లకు మాత్రమే ప్రాధాన్యమిచ్చారని, పార్టీకి విధేయులుగా ఉండి ఎన్నికలను ఎదుర్కొనగలిగిన సత్తా ఉన్న నాయకులను పార్టీ అధిష్టానం విస్మరించిందనే అభిప్రాయం ఏర్పడుతోంది. కేడర్ మనోభావాలను పరిగణనలోకి తీసుకుని తొలి రెండు జాబితాల్లో ప్రకటించిన పేర్లను సమీక్షించాలి. అప్పుడే పార్టీ కేడర్‌లో విశ్వాసం పెరగడంతో పాటు పార్టీపై సానుకూల దృక్పథం ఏర్పడుతుంది..' అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి కేసీ వేణుగోపాల్‌కు పంపిన లేఖలో సీనియర్ నేతలు కోరారు.

కుమురంభీం చౌక్ వద్ద రాస్తారోకో

కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడ్డ నేతలు డాక్టర్ గణేశ్ రాథోడ్, మర్సుకోల సరస్వతి ఆధ్వర్యంలో కార్యకర్తలు శనివారం కుమురంభీం జిల్లా కేంద్రంలోని కుమురంభీం చౌక్ వద్ద రాస్తారోకో చేశారు. పారాచూట్లను తప్పించి కాంగ్రెస్‌ను కాపాడాలని డిమాండ్ చేశారు.

ఏ సర్వే ఆధారంగా టికెట్ కేటాయించారు?

కాంగ్రెస్ పార్టీ టికెట్ రాకపోవడంతో టీపీసీసీ నాయకులు కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్, కొండ ప్రశాంత్‌రెడ్డి శనివారం తమ అనుచరులతో దేవరకద్రలో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై సమాలోచన చేశారు. ఏ సర్వే ఆధారంగా కొత్తగా వచ్చిన వారికి టికెట్లను కేటాయించారని ప్రశ్నించారు. సర్వేల పేరుతో తమ గొంతు కోశారని వాపోయారు.

నిరాశలో యువనేతలు

కాంగ్రెస్ పార్టీ టికెట్లు ఆశించిన పలువురు యువ నేతలు నిరాశ నిస్పృహల్లో మునిగిపోయారు. ముఖ్యంగా ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, గిరిజన విభాగం అధ్యక్షులు బల్మూరి వెంకట్, శివసేనారెడ్డి, బెల్లయ్య నాయక్‌లు ఈసారి తప్పకుండా తమకు పోటీ చేసే అవకాశం వస్తుందని భావించారు. కానీ వారికి అధిష్టానం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేదు. ముఖ్యంగా హుజూరాబాద్ టికెట్‌ను బల్మూరి వెంకట్‌కు కేటాయించకపోవడంపై పార్టీలో చర్చ జరుగుతోంది. ఈటల రాజేందర్ రాజీనామా చేసిన సందర్భంగా జరిగిన ఉప ఎన్నికల్లో చివరి నిమిషంలో ఆయనకు టికెట్ ఇచ్చి బలి పశువును చేశారని, ఆ తర్వాత కూడా పార్టీ కోసం ఎంత కష్టపడినా వెంకట్‌కు పార్టీ గుర్తింపు ఇవ్వలేదని అంటున్నారు.

కేసీఆర్‌కు ప్రజాస్వామ్యం నిర్వచనం తెలుసా?: పొంగులేటి



సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'పాలేరు సభలో మీ పక్కన కూర్చున్న వాళ్లు ఏ పార్టీలో గెలిచి వచ్చారు.. వారికి ఎంత ప్యాకేజీ ఇచ్చారు. అసలు ప్రజాస్వామ్యం నిర్వచనం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తెలుసా?'అని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. శనివారం ఖమ్మంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పేరు ప్రస్తావించకున్నా.. తనను ఉద్దేశించి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలేరు సభలో చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్‌కు ఏటీఎంగా మారిందని ముందు నుంచీ చెబుతున్నట్లుగానే ఇప్పుడు డొల్లతనం బయటపడిందన్నారు. కేసీఆర్ పతనానికి ఇదే చివరి మెట్టు అని అన్నారు. కేసీఆర్.. ఓటమి భయంతోనే దళితులను మభ్య పెడుతున్నారని విమర్శించారు. హుజూరాబాద్‌లో దళితబంధు పెడితే అక్కడి ప్రజలు కేసీఆర్ చెంప చెళ్లుమనిపించిన విషయం అందరికీ తెలిసిందేనని చెప్పారు. నీతి, నిజాయితీతో సంపాదిస్తున్న తాను.. పన్నులు కడుతూ, మిగిలిన డబ్బుతో రాజకీయాలు చేస్తున్నానన్నారు. 'కేసీఆర్ తాత, తండ్రి ఏమైనా ఇండస్ట్రీలు పెట్టారా, వ్యాపారాలు చేశారా.. ఇంత డబ్బు ఎలా సంపాదించారు. దోచుకున్న డబ్బుతో రాష్ట్రంలో, దేశంలో కేసీఆర్ రాజకీయం చేయడం లేదా?'అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రెండో విడత బస్సు యాత్ర తాండూర్‌లో డీకే శివకుమార్ నేతృత్వంలో జరుగుతుందని, ఆదివారం యాత్రలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొంటారని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నేతలు రాయల నాగేశ్వరరావు, జావేద్, స్వర్ణకుమారి, నిరంజన్‌రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను నాశనం చేశారు: నాగం

పారాచూట్ నేతలకే టికెట్లు.. ఏళ్లుగా పనిచేసినవాళ్లకు మోసం



సాక్షి, నాగర్‌కర్నూల్: కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ఏళ్లుగా కష్టపడుతున్నవారిని మోసం చేసి, అవసరం కోసం పార్టీలో చేరిన పారాచూట్ నేతలకే టికెట్లు ఇచ్చిందని మాజీమంత్రి, పార్టీ సీనియర్ నేత నాగం జనార్దన్ రెడ్డి వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పారాచూట్ నేతలకు టికెట్లు ఇవ్వడం ద్వారా రాష్ట్రంలో కాంగ్రెస్‌ను నాశనం చేశారన్నారు. తనకు పార్టీ టికెట్ ఇవ్వకపోవడానికి కారణం కూడా చెప్పలేదని విచారం వ్యక్తం చేశారు. 2018 నుంచి నాగర్‌కర్నూల్‌లో పార్టీ బలోపేతం కోసం అన్ని కార్యక్రమాలు చేపట్టానని, కానీ బీఆర్ఎస్‌లో ఎమ్మెల్సీగా కొనసాగుతున్న దామోదర్‌రెడ్డి కుమారుడికి పార్టీ టికెట్ ఇచ్చిందని చెప్పారు. బోగస్ సర్వేల పేరుతో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తనకు మోసం చేశారని మండిపడ్డారు. ఇతర పార్టీల నేతలెవరైనా తనను సంప్రదిస్తే, కార్యకర్తల నిర్ణయం ప్రకారం నడుచుకుంటానని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌ను వీడనున్న నాగం?: నాగర్‌కర్నూల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశించిన మాజీమంత్రి నాగం జనార్దన్‌రెడ్డికి తీవ్ర నిరాశే ఎదురైంది. ఇటీవల పార్టీలో చేరిన ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి తనయుడు రాజేశ్‌రెడ్డికే పార్టీ అధిష్టానం టికెట్ ఖరారు చేయడంతో పార్టీ పెద్దల తీరుపై ఆయన ఆగ్రహంగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరుతారన్న ప్రచారం సాగుతోంది. ఆదివారం సాయంత్రం నాగం ఇంటికి మంత్రి కేటీఆర్ వెళ్లి పార్టీలోకి ఆహ్వానించనున్నట్టు సమాచారం.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించండి

అధికారులతో సమీక్షలో జిల్లా ఎన్నికల అధికారి



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు హైదరాబాద్ జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ అధికారులకు సూచించారు. తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో ఎన్నికల నిర్వహణకు సంబంధించి శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్ని సమస్యాత్మక కేంద్రాల్ని గుర్తించారో వాటిని పునరాలోచించి మరోసారి గుర్తించాలన్నారు. నవంబర్ 3 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో నియోజకవర్గ స్థాయిలో పోలీస్ బందోబస్తుకు సిబ్బందిని నియమించాలని పోలీస్ కమిషనర్‌ను కోరారు. ఎన్నికల సామగ్రి కేంద్రాల వద్ద కూడా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో సీజ్ చేసిన నగదు మొత్తం జిల్లా ఫిర్యాదుల కమిటీ ద్వారా విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నగర సీపీ సందీప్ శాండిల్య, అదనపు పోలీస్ కమిషనర్ (లా అండ్ ఆర్డర్) విక్రమ్ సింగ్ మాన్, ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, అడిషనల్ కమిషనర్ (ఎన్నికలు) శంకరయ్య తదితరులు పాల్గొన్నారు. సమావేశానంతరం డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్స్ చెక్ పోస్టుల వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ కేంద్రం నుండి పరిశీలించారు. సువిధ సెంటర్, ఈవీడీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంసీసీ, ఎంసీఎంసీ కంట్రోల్ రూమ్‌లను పరిశీలించారు.

తుమ్మల ప్రజలకు చేసిందేమీ లేదు..

ఆయన కేసీఆర్‌కు మంత్రి పదవి ఇప్పించాననడం హాస్యాస్పదం



సాక్షి ప్రతినిధి, ఖమ్మం: గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మంత్రి పదవి ఇప్పించానని తుమ్మల నాగేశ్వరరావు అనడం హాస్యాస్పదమని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ అన్నారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం జిల్లాలో ఉన్న ఇద్దరు నాయకులు పార్టీకి ఏం చేశారో సీఎం కేసీఆర్ స్పష్టంగా చెప్పారని, పదవుల కోసం వారు నీచానికి దిగజారారని తెలిపారు. ఉద్యమ సమయంలో తుమ్మల లేదని, ఏ రోజు కూడా జై తెలంగాణ అనని ఆయనపై ఆధారపడి తెలంగాణ ప్రభుత్వం రాలేదని చెప్పారు. పదవుల కోసమే తప్ప ప్రజలకు తుమ్మల చేసింది ఏమీ లేదని, ఇప్పుడు మళ్లీ పదవి కోసమే ఆరాటపడుతున్నారని విమర్శించారు. మంత్రిగా తుమ్మల ఒక్క ప్రాజెక్టు కూడా ఉమ్మడి ఖమ్మం జిల్లాకు తీసుకురాలేదని గుర్తుచేశారు. కేసీఆర్ చేరదీసి మంత్రి పదవి ఇవ్వకపోతే తుమ్మల రాజకీయ జీవితం ముగిసి దశాబ్దకాలం పూర్తయ్యేదని అన్నారు.

రెండు రోజుల్లో మునుగోడు అభ్యర్థి ఖరారు

బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్



చౌటుప్పల్: మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిని రెండు రోజుల్లో ఖరారు చేస్తామని బీజేపీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ తెలిపారు. అందరికీ ఆమోదయోగ్యమైన అభ్యర్థిని బరిలోకి దింపుతామని చెప్పారు. మునుగోడు అభ్యర్థిని త్వరగా ఖరారు చేయాలని కోరుతూ నియోజకవర్గంలోని బీజేపీ నాయకులు శనివారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయానికి వెళ్లారు. రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్‌బన్సల్, ఈటలను వారు కలిశారు. ఇప్పటి వరకు అభ్యర్థిని ఖరారు చేయకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఈటల ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆలస్యం జరగకుండా అభ్యర్థి ప్రకటన ఉంటుందన్నారు. కార్యకర్తలంతా పార్టీ గెలుపుకోసం కష్టపడి పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షుడు రమణగోని శంకర్, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కుట్రలో పావును కాను

ఢిల్లీ మద్యం కేసుపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



- ఈ కేసులో విపక్షాలు నిరాధార, తప్పుడు ఆరోపణలు చేశాయి... కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం ఖాయం.. బీజేపీ బీసీ సీఎం జపం గిమ్మిక్కే
- కాంగ్రెస్, ఇతర పార్టీల గెలుపంతా సర్వేల్లోనే..
- 'ఆస్క్ కవిత' కార్యక్రమంలో నెటిజన్ల ప్రశ్నలకు సమాధానాలు

సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ మద్యం కేసులో తన పాత్ర ఏమీ లేదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మరోసారి స్పష్టం చేశారు. ఈ కేసులో బీజేపీ, కాంగ్రెస్ తనపై నిరాధార, తప్పుడు ఆరోపణలు చేశాయని పేర్కొన్నారు. 'రాజకీయ కుట్రలో పావును కాను. ధైర్యంగా కొట్లాడే పటిమ నాకు ఉంది'అని తేల్చిచెప్పారు. శనివారం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా నిర్వహించిన 'ఆస్క్ కవిత'కార్యక్రమంలో నెటిజన్లు రాజకీయ, వ్యక్తిగత అంశాలపై అడిగిన పలు ప్రశ్నలకు ఆమె సమాధానాలు ఇచ్చారు. తమకు రాజకీయ ప్రత్యర్థులతో ఎటువంటి డీల్ లేదని, తమది 'టీమ్ తెలంగాణ'అని తేల్చిచెప్పారు.

బీఆర్ఎస్‌కు ఏ పార్టీతోనూ జట్టు లేదు...

తమకు ఏ పార్టీతో జట్టు లేదని, తెలంగాణ ప్రజలే తమ జట్టు అని కవిత స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో 100కుపైగా సీట్లలో గెలుస్తుందని, కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారని జోస్యం చెప్పారు. కాంగ్రెస్, ఇతర పార్టీలు కేవలం సర్వేల్లోనే గెలుస్తాయని, తాము ఎన్నికల్లో గెలుస్తామన్నారు. బీజేపీ బీసీ సీఎం జపం ఎన్నికల గిమ్మిక్కేనని విమర్శించారు. తెలంగాణలో బీజేపీ నాయకత్వ బాధ్యతల నుంచి బీసీని తప్పించి అగ్రవర్ణాలకు అప్పగించారని, వాళ్లు బీసీ సీఎం అంటే ఎవరూ నమ్మరని కవిత చెప్పారు. బీసీల కుల గణన చేయకుండా అడ్డుకుంటున్నది బీజేపీయేనని ఆమె ఆరోపించారు. బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటును కేంద్రం పట్టించుకోవడం లేదని, చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించడాన్ని, మహిళా రిజర్వేషన్లను విస్మరిస్తోందని దుయ్యబట్టారు.

తెలంగాణకు రాహుల్ కుటుంబం ద్రోహం

తెలంగాణతో తమకున్నది రాజకీయ బంధం కాదని.. కుటుంబ బంధమంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై కవిత తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. రాహుల్ ముత్తాత జవహర్‌లాల్ నెహ్రూ తెలంగాణను బలవంతంగా ఆంధ్రతో కలపడం వల్ల 60 ఏళ్లు మోసపోయినట్లు చెప్పారు. అలాగే రాహుల్ నానమ్మ ఇందిరాగాంధీ హయాంలో 1969లో ప్రత్యేక తెలంగాణ సాధన కోసం పోరాడుతున్న యువకులపై కాల్పులు జరపడంతో 369 మంది మరణించారని గుర్తు చేశారు. అలాగే రాహుల్ తండ్రి రాజీవ్ గాంధీ తెలంగాణకు చెందిన ఉమ్మడి రాష్ట్ర సీఎం అంజయ్యను అవమానించి ఆ పదవి నుంచి తప్పించారని చెప్పారు.

సీఎం కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షతో దిగొచ్చి తెలంగాణ ఏర్పాటు చేస్తామంటూ 2009లో రాహుల్ తల్లి సోనియా గాంధీ ఆమె జన్మదినం సందర్భంగా ప్రకటించి మళ్లీ వెనక్కి వెళ్లడం వల్ల వందలాది మంది ఆత్మహత్యలు చేసుకున్నారని మండిపడ్డారు. రాహుల్ కుటుంబానికి తెలంగాణతో ఉన్న అనుబంధం పదే పదే తెలంగాణ ప్రజలకు ద్రోహం చేయడమేనని వ్యాఖ్యానించారు.



ధనము శాశ్వతము కాదు.
కిరీటము తరతరములు ఉండునా?
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.పాడ్యమి రా.12.32 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** అశ్విని ఉ.6.55 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** సా.4.12 నుండి 5.46 వరకు, **దుర్ముహూర్తం:** సా.3.54 నుండి 4.40 వరకు, **అమృతఘడియలు:** రా.1.30 నుండి 3.02 వరకు.

సూర్యోదయం : 6.01
సూర్యాస్తమయం : 5.27
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

పవన్ కల్యాణ్ (జనసేన అధ్యక్షుడు)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

స్ట్రెస్ కాస్త ఎక్కువగా ఉన్నట్లనిపించినప్పుడు.. ఏ ఆదర్శాల కోసమైతే నేను జనసేన పార్టీని స్థాపించానో ఆ ఆదర్శాలను పునరుద్ధరించు కుంటూ ఒక్కణ్ణీ పార్టీ ఆఫీసులో అలా కాసేపో, ఇంకాసేపో, మరికాసేపో కూర్చుండిపోవటం నాకు అలవాటు.

ఆవేళ కూడా అలాగే ఒంటరిగా కూర్చొని ఉన్నాను. నేను, నా ఆదర్శాలు మాత్రమే ఆ సమయంలో పార్టీ ఆఫీసులో ఉన్నాం.

ఆ ఏకాంతపు నిశ్శబ్దంలో... ఎవరో లోపలికి వస్తున్న చప్పుడైంది. ఒకరు కాదు, ఒకరికన్నా ఎక్కువమంది వస్తున్న చప్పుడది. ఎవరు వారు? ప్రజలా? ప్రజలే అయితే నన్ను కలవకుండా వారిని ఎవరు అడ్డుకోగలరు?

నా కోసం, నన్ను వెతుక్కుంటూ జూబ్లీహిల్స్‌లోని జనసేన పార్టీ ఆఫీసుకు వచ్చిన ఆ ప్రజలు ఎవరై ఉంటారు? ఆంధ్రా ప్రజలా? తెలంగాణ ప్రజలా? తెలంగాణలో ఉంటున్న ఆంధ్రా ప్రజలా? ఆంధ్రా తెలంగాణల మధ్య నిరంతరం తిరుగుతూ ఉండే ప్రజలా?

వాళ్లెవరూ కాదు. అచ్చెన్నాయుడు!



అచ్చెన్నాయుడి వెంట యనమల రామ కృష్ణుడు, పయ్యావుల కేశవ్, పితాని సత్యనారాయణ, తంగిరాల సౌమ్య ఉన్నారు.

తొమ్మిదేళ్ల క్రితం పార్టీ పెట్టిన కొత్తలో చంద్రబాబు గారి కాంబినేషన్‌తో తప్ప ఏ పార్టీ నాయకుల్నీ గుర్తుపట్టలేక పోయేవాడిని. పక్కన చంద్రబాబు గారు ఉంటే వాళ్లు టీడీపీ అని, పక్కన చంద్రబాబు గారు లేకుంటే వాళ్లు వైఎస్సార్‌సీపీ అని, పక్కన చంద్రబాబు గారు ఉండీ లేనట్లుంటే వాళ్లు బీజేపీ వాళ్లని నాకొక కొండగుర్తు.

"నమస్తే పవన్ గారూ..." అన్నారు అచ్చెన్నాయుడు.

"నమస్తే... రండి రండి.." అన్నాను.

అంతా వచ్చి కూర్చున్నారు.

మొన్న దసరాకే చరిత్రాత్మకమైన రాజ మండ్రి జాయింట్ యాక్షన్ కమిటీ మీటిం గులో అందరం కలుసుకున్నాం.

"లోకేశ్‌బాబు, మీరూ కలిసి మళ్లీ ఇంకో సారి రాజమండ్రిలోనే జాయింట్‌గా యాక్షన్ కమిటీ మీటింగ్ పెట్టి టీడీపీ పవర్ ఏంటో జగన్‌కు చూపించాలని రాజమండ్రి జైలు నుంచి నాయుడుగారు ఆకాంక్షిస్తున్నారు పవన్‌గారూ..." అన్నారు అచ్చెన్నాయుడు.

ఆ మాట బాగోలేదనిపించింది నాకు! టీడీపీకే గానీ జనసేనకు లేదా పవర్... జగన్‌కి చూపించడానికి?!

"సరే అచ్చెన్న గారూ! నవంబర్ 1న వరుణ్ పెళ్లికి ఇటలీలో ఉంటాను. నవంబర్ 5న హైదరాబాద్‌లో వరుణ్ పెళ్లి రిసెప్షన్‌లో ఉంటాను. నవంబర్ సెకండ్ వీక్‌లో మీటింగ్ పెట్టుకుందాం. ఆలోపు పెద్దాయన బయటికొస్తే జాయింట్ యాక్షన్ మీటింగ్‌కి ఆయన కూడా జాయిన్ అవుతారు..." అన్నాను.

"మీ నోటి చలవ..." అన్నారు అచ్చెన్నాయుడు.

వచ్చిన వాళ్లు వెళ్లిపోయారు.

నాలో స్ట్రెస్ మరింత ఎక్కువైంది. మూడు రోజులుగా ఉన్న ఆ స్ట్రెస్‌కి మూలం ఏమిటా అని ఆలోచించాను. కిషన్‌రెడ్డి! ఎస్... కిషన్‌రెడ్డే నా స్ట్రెస్‌కి కారణం.

మూడు రోజులక్రితం కిషన్‌రెడ్డి నన్ను స్పెషల్ ఫ్లయిట్‌లో అమిత్ షా దగ్గరికి తీసుకెళ్లి మాట్లాడించారు. "మీ సపోర్ట్ కావాలి పవన్ కల్యాణ్ జీ..." అని అమిత్ షా చేత అనిపించారు.

"తప్పకుండా అమిత్‌జీ..." అని, నేను చెప్పదలచుకున్నదీ చెప్పబోయాను.

"కిషన్‌రెడ్డికి చెప్పండి..." అన్నారు అమిత్!

అప్పుడు మొదలైనట్లుంది నాలో స్ట్రెస్. రాజకీయాలు ఎందుకని ఒక పోరాట యోధుడిని ప్రశాంతంగా ఉండనివ్వవు?

తెలంగాణలో ఈసారి మనం కనీసం 30 మందినైనా నిలబెట్టకపోతే పార్టీని నిలబెట్టుకోవడం కష్టం అని కేడర్ అంటోంది.

కిషన్‌రెడ్డా, క్యాడరా?

ఎవరిది తక్కువ స్ట్రెస్? వీళ్లిద్దరిదీ కాకుండా చంద్రబాబు స్ట్రెస్ గానీ, లోకేశ్ స్ట్రెస్ గానీ పని చేస్తోందా నా లోపల్లోపల!!

సాధికారతే ప్రజాస్వామ్యం!

జనతంత్రం

వర్ధెల్లి మురళి

కులం పునాదుల మీద మనం ఒక జాతిని నిర్మించలేమని డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఘంటాపథంగా ప్రకటిం చారు. భారతీయులందరినీ ఏకతాటి మీదకు తీసుకొని రావా లంటే అందుకు తొలి షరతు కుల నిర్మూలనేనని ఆయన స్పష్టం చేశారు. ఒక మానవ సమూహం నాగరిక పౌరసమాజంగా మన్నన పొందాలంటే, దాని పాలనా విధానంలో ప్రజా స్వామ్యం శోభిల్లాలంటే... ఆ సమూహంలోని ప్రజలంతా ఆత్మ గౌరవంతో తల ఎత్తుకొని జీవించే పరిస్థితి ఉండాలి. ఆత్మ గౌరవానికి అతిపెద్ద శత్రువు కులమేనని పెరియార్ రామస్వామి నాయకర్ నిగ్గు తేల్చారు. కుల నిర్మూలన కోసం పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.

కుల నిర్మూలన ఎలా సాధ్యపడుతుంది? అనాగరికమైన ఈ కుల వ్యవస్థను కూలదోయడానికి ఉపకరించే ఆయుధాలేమిటి? దుర్భర బర్బర సంప్రదాయాల నుంచి సంఘాన్ని విముక్తం చేయడమెట్లా? ఆ యా చారిత్రక కాలమాన పరిస్థితులను బట్టి సంఘ సంస్కర్తలు రకరకాలుగా మార్గదర్శనం చేశారు. సహ పంక్తి భోజనాలు చేయాలన్నారు. కులాంతర వివాహాలను ప్రోత్సహించాలన్నారు. పేదకులాల ప్రజలందరూ బాగా చదువుకోవాలని ఉపదేశించారు. వీటన్నిటి సారాంశం ఒక్కటే. పుట్టుక కారణంగా నిమ్నకులం వారుగా ముద్రవేయించుకునే ప్రజలందరూ ధనిక కులాల వారితో ఇంచుమించు సరిసమా నమైన సాంఘిక, ఆర్థిక, రాజకీయ హోదాలను అందుకోవాలి. అప్పుడే వారిలో ఆత్మన్యూనత అదృశ్యమై ఆత్మగౌరవం మొగ్గ తొడుగుతుంది.

భారత రాజ్యాంగం ఇదే అభిప్రాయాన్ని తన లిఖితపూర్వక ఆదేశాల్లో ప్రతిఫలింపజేసింది. ప్రజాస్వామ్య వ్యవస్థల్లో ప్రజ లందరూ సమాన వాటాదారులు కనుక హెచ్చుతగ్గులు లేని సమాజానికి బాటలు వేయడం రాజకీయ పక్షాల కనీస బాధ్యత. ఆ బాధ్యతను నెరవేర్చడంలో ఇప్పటివరకూ మన ఏలికలు విఫలమవుతూ వస్తున్నారనేందుకు నిమ్నవర్గాల దుఃస్థితే సజీవ సాక్ష్యం. ఆర్థిక, రాజకీయ రంగాల్లో కొన్ని మొక్కుబడి ప్రయోజ నాలను కల్పించినప్పటికీ, సామాజిక హోదాను కట్టబెట్టడంలో మన ప్రభుత్వాలు చేసింది పెద్ద గుండుసున్నా మాత్రమే! ఆంధ్ర ప్రదేశ్‌లో అధికారంలో వున్న వైఎస్ జగన్ ప్రభుత్వం తన 53 నెలల పాలనాకాలంలో ఈ ఒరవడిని మార్చింది. ఆర్థిక, రాజ కీయ రంగాల్లో మొక్కుబడి తతంగాలకు స్వస్తి చెప్పి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇంతవరకు ఎవరూ పట్టించు కోని సాంఘిక రంగంలో సైతం ఉద్యమ చైతన్యాన్ని రగిలించే ప్రయత్నాలు చేసింది. ఈ ప్రయత్నాలన్నీ సత్ఫలితాలు ఇవ్వడం ప్రారంభమైంది కనుకనే, ప్రజలు గుర్తించడం మొదలుపెట్టారు కనుకనే పార్టీ అధినేత వైఎస్ జగన్ సామాజిక సాధికార యాత్రలకు పిలుపునిచ్చారు. ఈ రథయాత్రలు మరింత జన చేతనను జ్వలింపజేస్తాయని ఆయన ఆశిస్తున్నారు.

రాజకీయ, ఆర్థిక విషయాలకు సంబంధించినంత వరకూ గత కాలపు ప్రభుత్వాల తూతూ మంత్రపు తతంగాల స్థానంలో విప్లవకర విధానాలను ఆయన ప్రవేశపెట్టారు. ఒక్క మాటలో చెప్పాలంటే పేద వర్గాల ప్రజలను సంక్షేమ పథం నుంచి సాధికారత గమ్యం వైపు ఆయన మళ్లించారు. ప్రజలకు ఆ గమ్యాన్ని గుర్తు చేయడం కోసం ఇప్పుడు జరుగుతున్న యాత్ర లకు 'సామాజిక సాధికార యాత్ర'లుగా ఆయన నామకరణం చేశారు. పేదవర్గాల ప్రజలందరూ ఈ గమ్యానికి చేరుకోవడమే నిజమైన ప్రజాస్వామ్యానికి అర్థం, సార్థకత.

సమస్త వృత్తి వ్యాపారాలకు ప్రాతినిధ్యం వహించే సకల జనులందరూ నిజమైన స్వేచ్ఛతో, సాధికార స్వరంతో నిర్భ యంగా తమ అభిప్రాయాలు వెల్లడించగలిగే దశకు చేరుకున్న ప్పుడే ప్రజాస్వామ్యం నూరుశాతం ఫలించినట్టు లెక్క. రాజ కీయ వేషాలు వేసుకున్న దొంగలకు, దోపిడీదార్లకు, పిండారీ లకు అదుపులేని లైసెన్స్‌లు ఇవ్వడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం. నడిరోడ్ల మీద సభల పేరుతో తొక్కిసలాటలు సృష్టించి జనాన్ని చంపే స్వేచ్ఛ కోసం, నేరం చేసినట్టు ఆధారా లున్నవాడు కూడా అరెస్ట్ కాకుండా ఉండే స్వేచ్ఛ కోసం, సోషల్ మీడియా వేదికగా వ్యక్తిత్వ హననాలకు పాల్పడే స్వేచ్ఛ కోసం ఇప్పుడు జరుగుతున్న ఆరాటాలు, పోరాటాలు ప్రజాస్వా మ్యంగా పరిగణించడం సాధ్యం కాదు.

పిల్లలకు తల్లిదండ్రులు ఇచ్చే నిజమైన ఆస్తి చదువేనని ప్రకటిస్తూ పేద తల్లిదండ్రుల పక్షాన ఆ ఆస్తిని సమకూర్చే బాధ్యతను వైఎస్ జగన్ ప్రభుత్వం తలకెత్తుకున్నది. ఆ చదువు నాణ్యమైనదిగా, ఆధునిక సాంకేతికత జోడించినదిగా, అత్యు న్నతస్థాయి పాఠశాలల ప్రమాణాలను అందుకునేదిగా ఉండేట్టు



ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇంత బృహత్తరమైన కార్యా చరణలో తల్లిదండ్రుల మీద వీసమెత్తు భారం పడకుండా, పైగా వారికి ప్రోత్సాహకం కూడా లభించేలా ఏర్పాట్లు

రాజకీయ, ఆర్థిక విషయాలకు సంబంధించినంత వరకూ గత కాలపు ప్రభుత్వాల తూతూ మంత్రపు తతం గాల స్థానంలో విప్లవకర విధానాలను జగన్ ప్రవేశ పెట్టారు. ఒక్క మాటలో చెప్పాలంటే పేద వర్గాల ప్రజలను సంక్షేమ పథం నుంచి సాధికారత గమ్యం వైపు ఆయన మళ్లించారు. ప్రజలకు ఆ గమ్యాన్ని గుర్తు చేయడం కోసం ఇప్పుడు జరుగుతున్న యాత్రలకు 'సామాజిక సాధికార యాత్ర'లుగా ఆయన నామకరణం చేశారు. పేదవర్గాల ప్రజలందరూ ఈ గమ్యానికి చేరుకోవడమే నిజమైన ప్రజాస్వామ్యానికి అర్థం, సార్థకత.

సమస్త వృత్తి వ్యాపారాలకు ప్రాతినిధ్యం వహించే సకల జనులందరూ నిజమైన స్వేచ్ఛతో, సాధికార స్వరంతో నిర్భయంగా తమ అభిప్రాయాలు వెల్లడించ గలిగే దశకు చేరుకున్నప్పుడే ప్రజాస్వామ్యం నూరు శాతం ఫలించినట్టు లెక్క. రాజకీయ వేషాలు వేసుకున్న దొంగలకు, దోపిడీదార్లకు, పిండారీలకు అదుపులేని లైసెన్స్‌లు ఇవ్వడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం. నడిరోడ్ల మీద సభల పేరుతో తొక్కిసలాటలు సృష్టించి జనాన్ని చంపే స్వేచ్ఛ కోసం, నేరం చేసినట్టు ఆధారాలున్నవాడు కూడా అరెస్ట్ కాకుండా ఉండే స్వేచ్ఛ కోసం, సోషల్ మీడియా వేదికగా వ్యక్తిత్వ హననాలకు పాల్పడే స్వేచ్ఛ కోసం ఇప్పుడు జరుగుతున్న ఆరాటాలు, పోరాటాలు ప్రజాస్వామ్యంగా పరిగణించడం సాధ్యం కాదు.

చేసింది. ప్రతి బాలికా, బాలుడూ కచ్చితంగా బడికి వెళ్లేలా, ఏ ఒక్కరూ మధ్యలో బడి మానివేసే పరిస్థితి రాకుండా అందరూ ఉన్నత విద్యను అభ్యసించే విధంగా ఒక విప్లవోద్యమం మొదలైంది. ఈ 'ఆస్తి'పరులు తమ చదువును మదుపుచేసి మరో పదేళ్ల తర్వాత నుంచి వరుసగా ప్రతి ఏటా సంపద సృష్టిలో కీలక బాధ్యత వహించబోతున్నారు. తాము పుట్టి పెరిగిన వర్గాన్ని విముక్తం చేయబోతున్నారు.

వైద్యం, వ్యవసాయం, చిన్న–సూక్ష్మ పరిశ్రమలు, చిరు వ్యాపారాలు తదితర రంగాలను కూడా పేదల అనుకూల విధానాలు ఆవహిస్తున్నాయి. ఇప్పుడు చేయూత కోసం ఎదురు చూసే స్థితిలో ఉన్న ప్రజలు రానున్న కాలంలో పదిమందిని చేయిపట్టి నడిపించగల స్థితికి చేరుకుంటారు. జగన్ ప్రభుత్వ విధానాల ఫలితంగా మరో ఐదు, పదేళ్లలో ఆర్థిక వ్యవస్థ అద్భు తాలను చూడబోతున్నది. బలహీన వర్గాలకు రాజకీయ పదవుల కల్పనలో కూడా పాత పద్ధతులకు జగన్ సర్కార్ స్వస్తి చెప్పింది. మంత్రి మండలి శాఖల కేటాయింపుల్లో, శాసనమండలి, రాజ్య సభ సభ్యుల ఎంపికలో, కార్పొరేషన్లు, మేయర్లలో, మునిసిపల్, జడ్పీ చైర్మన్లలో, కార్పొరేషన్ చైర్మన్లలో ఇలా అన్నిరకాల రాజ కీయ పదవుల్లో బలహీన వర్గాలకు సింహభాగం కేటాయిం పులు చేసిన జగన్ ప్రభుత్వం కొత్త చరిత్రను లిఖించింది. సామాజిక సాధికార యాత్రలో వైసీపీ నాయకులు ఈ గణాం కాలను ఉటంకిస్తూ చేస్తున్న సవాళ్లకు బదులు చెప్పలేక విపక్షం డిఫెన్స్‌లో పడిపోయింది.

ఆర్థిక – రాజకీయ రంగాల్లో చోటు చేసుకుంటున్న మార్పులు ఒక ఎత్తయితే, సామాజిక మార్పులు మరో ఎత్తు. పేదవర్గాలు తల ఎత్తుకొని జీవించడానికి దోహదపడే మార్పులు కొన్ని ఆర్భాటం లేకుండా చోటు చేసుకుంటున్నాయి. ఒక నిశ్శబ్ద విప్లవం కమ్ముకొస్తున్న దృశ్యం ఇప్పుడు జాతీయ దృష్టిని ఆకర్షిస్తున్నది. ఇందులో మూడు అంశాలను మనం స్పష్టంగా చూడవచ్చు. 1. కొత్తగా వెలుస్తున్న వాడల్లో కులజాడలు కన్పించడంలేదు. 2. హిందూ సమాజం అపురూప గౌరవంగా భావించే ఆలయ మర్యాదలు పెద్ద కులాల పరిధుల్ని దాటి బలహీనవర్గాల్లోకి ప్రవేశించాయి. 3. శ్రామిక మధ్యతరగతి మహిళల మాటకు ఇంటాబయటా క్రమంగా మర్యాద మన్నన పెరుగుతున్నది.

ఆంధ్రప్రదేశ్‌లో లక్షల సంఖ్యలో నిర్మాణమవుతున్న జగనన్న ఇళ్లను పరిశీలించడానికి ఇటీవల బీబీసీ (బ్రిటీష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్) వెబ్‌సైట్ ప్రతినిధి ఒకరు రాష్ట్రంలో పర్యటించారు. సెమీ అర్బన్ ప్రాంతమైన సామర్లకోటలో వేల సంఖ్యలో నిర్మాణం పూర్తయిన, నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను పరిశీలించి అక్కడ నివాసముంటున్న వాళ్లతో మాట్లాడారు. అందులో ఇంజేటి సమర్పణరాజు అనే లబ్ధిదారుడు చెప్పిన మాటలు దేశం దృష్టిని ఆకర్షించాయి. 'మాకు (దళితులకు) గతంలో కాలనీలు వేరుగా ఉండేవి. అవమానంగా ఉండేది. ఇక్కడలా చేయలేదు. మాకు ఇచ్చిన ఇళ్ల పట్టాల నంబర్ల ఆధారంగా డ్రా తీశారు. డ్రాలో వచ్చిన ప్లాట్లను కేటాయించారు. అన్ని కులాల వారూ పక్కపక్కనే వచ్చారు. సంతోషంగా ఉంది.' ఆ ప్రతినిధి పరిశీలించిన అన్ని కాలనీల్లో ఈ మాట వినిపిం చింది. పశ్చిమ గోదావరి జిల్లా పెదతాడేపల్లి వాస్తవ్యురాలు గుండుగోలు అరుణ అనే దళిత మహిళ మాట్లాడుతూ మాకు వచ్చిన ఇంటికి ఎదురుగానే కమ్మవారికి వచ్చింది. మా పక్కనే తూర్పు కాపులకు వచ్చింది. అందరం కలిసే ఉంటున్నామని చెప్పింది. బలహీన వర్గాల వారికి ప్రభుత్వం కేటాయించే ఇంటి స్థలాల్లో కులాల వారీ కాలనీలు పట్టణ ప్రాంతాల్లో క్రమంగా అంతరించాయిగానీ, గ్రామాల్లో చాలాకాలం కొనసాగాయి. ఆ సంప్రదాయాన్ని 17 వేల జగనన్న కాలనీల్లో స్వస్తి పలికి సమష్టి జీవనానికి శ్రీకారం చుట్టారు.

సంపన్నులకు, పెద్ద కుటుంబాల వారికీ, వ్యాపారులకు మాత్రమే ఆలయ కమిటీల్లో చోటు దొరికేది. పూర్వపు ధర్మ కర్తలకు లభించే గౌరవ మర్యాదలు ఈ కమిటీ సభ్యులకు కూడా లభిస్తాయి. ఆలయంలో లభించే గౌరవానికి హిందువులు విశేష ప్రాధాన్యమిస్తారు. 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' అనే సినిమా క్లైమాక్స్ దృశ్యం ఈ అభిప్రాయానికి అద్దం పడుతుంది. విఖ్యాత హిందూ దేవాలయం తిరుమలలో ఆలయ మర్యాదల కోసం సంపన్నులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తహతహలాడిపోవడం మనం చూస్తూనే ఉన్నాము. అటువంటి తిరుమలలో తిరుమలేశుని తొలిదర్శనం చేసుకునే అవకాశాన్ని సన్నిధి గొల్లకు జగన్ మోహన్‌రెడ్డి హక్కుభుక్తం చేశారు. వెనక బడిన కులాల్లో మరింత వెనుకబడిన కులాల వారికి కూడా తిరుమల ఆలయ కమిటీలో సభ్యత్వం కల్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా దేవాదాయశాఖ పరిధిలోకి వచ్చే వేలాది ఆలయా

ఆ మాటకొస్తే శ్రామిక మహిళలందరూ పోరాట పటిమ గలవారే. 'మదర్ ఇండియా'లే! వారి గౌరవ మర్యాదలను ఇనుమడింపజేయగల కొన్ని ప్రత్యేక పథకాలను వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇప్పుడు రాష్ట్రంలోని స్థానిక సంస్థల అధ్యక్ష పీఠాలపై సగానికి పైగా మహిళలే ఆసీనులయ్యారు. ఆలయ కమిటీల్లోనూ సగానికంటే ఎక్కువమంది ఉన్నారు. అన్ని నామినేటెడ్ పోస్టుల్లో సగం దక్కించుకున్నారు. మంత్రి వర్గంలో కీలక శాఖల అధిపతులుగా ఉన్నారు. రాజకీయ ప్రాతినిధ్యాన్ని గణనీయంగా పెంచడం ఒక భాగం మాత్రమే! 'అమ్మ ఒడి', అమ్మ పేరున 'ఆస్తిపత్రం', అమ్మకు 'చేయూత' అనే మూడు విశిష్ట పథకాలు ఎక్కడా లేనివి. మహిళల ఆత్మగౌరవానికి మకుట ధారణ చేసినవి.

పిల్లల చదువులు, భవిష్యత్తుకు సంబంధించిన నిర్ణయాధికారాన్ని 'అమ్మ ఒడి' పథకం ఆమెకు కట్ట బెట్టింది. 30 లక్షల మంది మహిళలకు సంపూర్ణ హక్కులతో ఇంటి పట్టాలను జగన్‌మోహన్ రెడ్డి అంద జేస్తున్నారు. ఇంటాబయటా ఆమె గౌరవం పెరిగింది. చేయూత పథకంతో నడివయసులోనూ మహిళలు వ్యాపారస్తులుగా రాణిస్తున్నారు.

లకు నియమించిన కమిటీల్లో సగం మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలవారే! ఇదొక సామాజిక హోదా, గౌరవం. రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది బలహీనవర్గాల ప్రజలకు ఇప్పుడీ గౌరవం దక్కింది.

మహిళా సాధికారత లేకుండా జన సాధికారత సంపూర్ణం కాదు. అది సంపూర్ణం కాకుండా నిజమైన ప్రజాస్వామ్య వ్యవస్థ అవతరించదు. పేద వర్గాల పురుషులు రాజకీయ, ఆర్థిక, సాంఘిక వివక్షలకు మాత్రమే గురవుతారు. శ్రామిక వర్గ మహిళలు తమ పురుషులతో సమానంగా ఈ వివక్షలను ఎదుర్కొంటూనే లైంగిక అసమానత్వాన్ని కూడా ఎదుర్కొం టున్నారు. ఈ రెట్టింపు వివక్ష ఈనాటిది కాదు. ఈ దేశానికి మాత్రమే పరిమితమైనది కాదు. రెండు శతాబ్దాల క్రితం మాక్సిమ్ గోర్కీ రాసిన రష్యన్ నవల 'అమ్మ' ఇతివృత్తమే ఇది. ప్రపంచంలోని అన్ని ప్రధాన భాషల్లో కోట్లాది మంది చదివి ప్రభావితమైన నవల బహుశా 'అమ్మ' ఒక్కటేనేమో! రెట్టింపు దోపిడీనీ, రెట్టింపు అవమానాల్నీ ఎదుర్కొన్న అమ్మ మాత్రం బేల కాదు. పోరాట పటిమకు పెట్టింది పేరు.

ఆ మాటకొస్తే శ్రామిక మహిళలందరూ పోరాట పటిమ గలవారే. 'మదర్ ఇండియా'లే! వారి గౌరవ మర్యాదలను ఇనుమడింపజేయగల కొన్ని ప్రత్యేక పథకాలను వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. ఇప్పుడు రాష్ట్రంలోని స్థానిక సంస్థల అధ్యక్ష పీఠాలపై సగానికి పైగా మహిళలే ఆసీనులయ్యారు. ఆలయ కమిటీల్లోనూ సగానికంటే ఎక్కువమంది ఉన్నారు. అన్ని నామినేటెడ్ పోస్టుల్లో సగం దక్కించుకున్నారు. మంత్రివర్గంలో కీలక శాఖల అధిపతులుగా ఉన్నారు. రాజకీయ ప్రాతినిధ్యాన్ని గణనీయంగా పెంచడం ఒక భాగం మాత్రమే! 'అమ్మ ఒడి', అమ్మ పేరున 'ఆస్తిపత్రం', అమ్మకు 'చేయూత' అనే మూడు విశిష్ట పథకాలు ఎక్కడా లేనివి. మహిళల ఆత్మగౌరవానికి మకుట ధారణ చేసినవి.

పిల్లల చదువులు, భవిష్యత్తుకు సంబంధించిన నిర్ణయా ధికారాన్ని 'అమ్మ ఒడి' పథకం ఆమెకు కట్టబెట్టింది. 30 లక్షల మంది మహిళలకు సంపూర్ణ హక్కులతో ఇంటి పట్టాలను జగన్‌మోహన్ రెడ్డి అందజేస్తున్నారు. ఇంటాబయటా ఆమె గౌరవం పెరిగింది. చేయూత పథకంతో నడివయసులోనూ మహిళలు వ్యాపారస్తులుగా రాణిస్తున్నారు. మనుమలు, మను మరాళ్లకు చిన్నచిన్న బహుమతులు కూడా కొనివ్వలేని నిస్స హాయ స్థితిని వాళ్లిప్పుడు జయించారు. వ్యాపార విజయాల కోసం ఇప్పుడు పాటుపడుతున్నారు. ఈ 53 నెలల కాలంలో వైఎస్ జగన్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు బహుజనులను, మహిళలను సాధికారత పథంలో నిలబెట్టాయి. ఈ పరిణా మాన్ని పెత్తందారీ శక్తులు జీర్ణించుకోలేకపోతున్నాయి. తక్షణమే జగన్ ప్రభుత్వాన్ని గద్దె దింపాలన్న లక్ష్యంతో అన్ని వైపుల నుంచీ యుద్ధాన్ని ప్రకటించాయి. తప్పుడు ప్రచారాలతో ఒక విష వృష్టిని కురిపిస్తున్నాయి. సాధికార యాత్రలతో విష ప్రచారాలను ఎండగట్టవలసిన బాధ్యత, పెత్తందారీ కుట్రలను తిప్పి కొట్టవలసిన బాధ్యత బహుజనులూ, మహిళలదే! ఆ బాధ్యతను విజయవంతంగా నెరవేర్చగలిగితేనే కులం జాడలు, వెలివాడలు అదృశ్యమవుతాయి.

vardhelli1959@gmail.com

తెలంగాణది కలిసుండే సంస్కృతి

అభిప్రాయం




జూలూరు గౌరీశంకర్

ఈ సంవత్సరం ఆగస్ట్ నెలలో ముఖ్య మంత్రి చంద్రశేఖరరావు అంబేడ్కర్ పేరు పెట్టిన నూతన సెక్రెటేరియేట్‌ను ప్రారంభించారు. సెక్రెటేరియేట్ ఆవ రణలో అద్భుతమైన మందిరం ఉంది, మసీదు ఉంది, చర్చి ఉంది. కాంగ్రెస్ హయాంలో కూల్చివేతలు తప్ప నిర్మా ణాల వార్తలు ఎన్నడూ ప్రజలు విన లేదు. కేసీఆర్ అన్ని మతాలనూ సమాన దృష్టితో చూడడమే కాదు... 2020లో సెక్రెటేరియేట్ నిర్మాణం కోసం కూల్చిన మసీదు, మందిరాల స్థానంలో కొత్తగా, అద్భుత మైన ఆరాధనాలయాలు నిర్మించారు. ఈ మొత్తం సంఘట నలను గమనిస్తే మనకు చాలా విషయాలు తెలుస్తాయి. తెలంగాణది ప్రత్యేకమైన 'గంగా జమునా తెహ జీబ్' సంస్కృతి. ఇది కలిసిమెలిసి ఉండే సంస్కృతి. అన్నా, అక్కా, మామ... అంటూ అన్ని మతాల వారూ ఆప్యాయతలు పంచుకునే సంస్కృతి. ఇక్కడ మతచిచ్చులు పెట్టేవారికి స్థానం లేదు. కులం చిచ్చు పెట్టేవారికి అంతకన్నా చోటు లేదు. ఇది తెలంగాణ అస్తిత్వం, ఇది తెలంగాణ గుర్తింపు. బీఆర్ఎస్ స్వీయ తెలంగాణ రాజకీయ అస్తిత్వ చేతనం కలది. బీఆర్ఎస్ పార్టీ అంటే అది తెలంగాణ పార్టీగా ప్రజల మనస్సుల్లో నిలిచిపోయింది. తెలంగాణ ప్రజల హృదయాల్లో ఈ స్థానం జాతీయ పార్టీలుగా చెప్పుకునే కాంగ్రెస్, బీజేపీలకు లేదు.

గత పదేళ్ళ పరిపాలనను గమనించిన దేశం విస్మ యంతో చూస్తోంది. సమర్థమైన కేసీఆర్ పాలన ఎప్పటి కప్పుడు అప్రమత్తమై మతశక్తులను అదుపు చేసి శాంతి భద్రతలను కాపాడింది.

కాంగ్రెస్ పార్టీ కర్ణాటక ఎన్నికల విజయం తర్వాత తెలం గాణలో కూడా కదం తొక్కుతామన్నట్లు మాట్లాడుతోంది. కానీ తెలంగాణ కర్ణాటక కాదు. ఇక్కడి ప్రజలు సెక్యులర్ విలువ లకు కట్టుబడే వారు. కేసీఆర్ రాష్ట్రాన్ని ప్రగతి పథాన పరుగులు పెట్టిస్తున్నారు. కర్ణాటక ప్రజలకు బీఆర్ఎస్ లాంటి ఉద్యమ పార్టీ ఏదీ లేదు. వారికి కాంగ్రెస్, బీజేపీలు తప్ప మరో ప్రత్యామ్నాయం లేదు. తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్ ఉంది. ఇది తెలంగాణను సాధించిన ఉద్యమపార్టీగా, తెలంగాణను రోల్ మోడల్‌గా మార్చిన పార్టీగా ప్రజల హృదయాల్లో స్థానం కలిగి ఉంది.

కాంగ్రెస్ తనను తాను సెక్యులర్ పార్టీగా చెప్పుకుంటుంది. కాని, గత కాంగ్రెస్ పాలనలో ముఖ్యంగా 1980 నుంచి 1990



మధ్య కాలంలో హైదరాబాదు నగరంలో మతఘర్షణలు జరిగిన వాతావరణాన్ని ప్రజలు మరిచిపోలేదు. 2010లో జరిగిన ఘర్షణల జ్ఞాపకాలు ఇంకా తాజాగానే ఉన్నాయి. కాం గ్రెస్ అసమర్థత, నిష్క్రియాపరత్వాలు, గ్రూపు రాజకీయాలు వంటివి వీటి వెనుక ఉన్నాయి. కాంగ్రెస్‌ను గద్దెపై కూర్చోపెట్టి అలాంటి పరిస్థితులు తిరిగి ఆహ్వానించడానికి ఎవరూ సిద్ధంగా లేరు.

ఓబీసీల రాజకీయాలను చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు ఓబీసీలను ఎందుకు మరిచిపోయింది? కేవలం రాజకీయాల కోసం, ఎన్నికల కోసం మాత్రమే ఓబీసీ కులగణన చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తున్నది. ఎందుకంటే... కేసీఆర్ తెలంగాణ సాధించిన తర్వాత, అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని వర్గాల ప్రజల స్థితిగతులను తెలుసుకునేందుకు లోతుగా అధ్యయనం చేశారు. రాష్ట్రంలో ఎంతమంది ఓబీసీ లున్నారు? ఎంతమంది దళితులున్నారు? ఎంతమంది మైనా రిటీలున్నారు? వారి స్థితిగతులేమిటి? వంటి గణాంకాల ఆధారంగానే అభివృద్ధి చర్యలు తీసుకోవడం కూడా జరుగు తోంది. రాష్ట్రంలో మైనారిటీల స్థితిగతులను తెలుసుకోడానికి కేసీఆర్ వెంటనే బీసీ కమిషన్ ఏర్పాటు చేయడం జరిగింది. ఆ తర్వాత మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్లు పెంచుతూ అసెం బ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆ తీర్మానాన్ని తొక్కిపెట్టకపోతే ఈ పాటికి రాష్ట్రంలో మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్లు లభించి ఉండేవి. ఇవన్నీ ప్రజలు చూస్తూనే ఉన్నారు. ఎవరు పనిచేస్తున్నారో, ఎవరు పదవుల కోసం రాజకీయాలు చేస్తున్నారో ప్రజలకు తెలియనిది కాదు.


మతతత్వంతో ఓట్లు రాబట్టుకోవాలని బీజేపీ చూస్తోంది. అవకాశవాద రాజకీయాలకు మారుపేరుగా కాంగ్రెస్ నిలి చింది. కాని తెలంగాణ ప్రజలకు ఈ రెండు పార్టీలపై ఆధార పడవలసిన అవసరమే లేదు. సమర్థమైన పాలనను అందిం చేందుకు బీఆర్ఎస్ ఉంది.

దేశంలో తెలంగాణలో ఉన్నన్ని సంక్షేమ కార్యక్రమాలు మరెక్కడా లేవు. అవి గురుకులాలే కావచ్చు, రేషన్ షాపుల్లో సన్నబియ్యమే కావచ్చు, కాళేశ్వరం జలాలే కావచ్చు, విద్యా ర్థులకు స్కాలర్ షిప్పులే కావచ్చు, మైనారిటీలతో సహా బీసీలకు లక్షరూపాయల నగదు సహాయమే కావచ్చు, తెలంగా ణలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల జాబితా చూస్తే అది ఓ గ్రంథంగా మారుతుంది. ఇలాంటి ప్రభు త్వాన్ని వదులుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉండరు.

వ్యాసకర్త తెలంగాణ సాహిత్య అకాడమీ ఛైర్మన్

హద్దు మీరరాదు!

మొక్కై వంగనిది మ్రానై వంగునా? అని సామెత. పిల్లలుగా ఉన్నప్పుడే పదుగురిలో ప్రవర్తించాల్సిన మంచిచెడులను అర్థమ య్యేలా చెప్పడంలోని ఆవశ్యకతను ఈ సామెత గుర్తుకు తెస్తుంది. దేనికైనా ఒక హద్దు అనేది ఉంటుంది. అతిగా మట్లాడడం, అతిగా నవ్వడం, అతిగా బాధపడడం, అతిగా దూషించడం, అతిగా పొగ డడం– ఇలా అతిగా చేయబడే ప్రతిదీ అనర్థానికే దారితీస్తుందని పెద్దలు నమ్మి, ప్రతి విషయంలోనూ హద్దును తప్పనిసరిగా పాటించే విధంగా బాల్యంలోనే తగిన శిక్షణ ఇచ్చే నియమాన్ని పాటించారు. 'అతి సర్వత్ర వర్జయేత్' అనే ఈ ప్రసిద్ధ నియమానికి కట్టుబడి ఉండ వలసినది పదుగురిలో ఉన్నప్పుడు పిన్నలు మాత్రమే కాదనీ, పెద్దలు



విధులుగా పాటించే జపతపాదుల విషయంలోనూ ఇది తప్పనిసరి అనీ, అలా పాటించని సందర్భాలలో అది ఊహించని అనర్థానికి దారి తీసే ప్రమాదం ఉంటుందనీ 5 వందల సంవత్సరాల క్రితమే ఎఱ్ఱయ అనే కవి (ఆంధ్రమహాభారతాన్ని తెనిగించిన కవిత్ర యములోని ఎఱ్ఱాప్రెగడ కాదు. ఈయన క్రీ.శ. 15వ శతాబ్దికి చెందిన మరొక కవి) తన 'సకల నీతి కథానిధానము' అనే సంకలన గ్రంథం ద్వితీయాశ్వాసంలో ఈ కంద పద్యం ద్వారా చక్కగా చెప్పాడు.

జపములు జేసెడువారును
తపములు తగజేయువారు తత్త్రిక్రియలన్
విపరీత చిత్తులైన
న్నపగత ఫలసిద్ధులగుదు రందురు నార్యుల్.

ఏ క్రియకైనా హద్దు ఉంటుంది. పెద్దలు, అనుభవజ్ఞులు చెప్పే మాటల నుండి ఇది గ్రహించాలి. పూర్వులు నిర్దేశించిన నియమాల ప్రకారం హద్దును పాటించకుండా, విపరీతపు ఆలోచనలకు, చేష్టలకు పూనుకుంటే అనర్థాలే ఎదురవుతాయి. 'అపగత ఫలసిద్ధులు' అంటే 'దక్కాల్సిన ఫలం దక్కకుండా పోగొట్టుకున్నవారు' అని అర్థం. నియ మాలు పాటిస్తే దక్కవలసిన ఫలం దక్కుతుంది, శుభం చేకూరు తుంది అని పెద్దల మాట!

– భట్టు వెంకటరావు

క్లుప్తంగా...

యాదాద్రి నూతన కేలెండర్ ఆవిష్కరణ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం 2024 నూతన సంవత్సర కేలెండర్‌ను ఈవో గీతారెడ్డి, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు, ఈఎస్‌సీ రవీందర్‌రావు శనివారం ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో ఆవిష్కరించారు. 13 పేజీలతో శ్రీస్వామి వారి వివిధ అలంకరణలతో కేలెండర్‌ను ముద్రించారు. దీనివెల రూ.100గా నిర్ణయించినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

'అమిత్ షా వ్యాఖ్యలు హాస్యాస్పదం'



కౌటాల: బీసీని ముఖ్యమంత్రి చేస్తానన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలు హాస్యాస్పదమని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం గురుడుపేట, బోదంపల్లి, గుడ్లబోరి గ్రామాల్లో శనివారం నిర్వహించిన బహుజన రాజ్యాధికార యాత్రలో ఆయన మాట్లాడారు. బీసీ నేత బండి సంజయ్ పార్టీకి అధ్యక్షుడిగా ఉంటేనే ఓర్వలేని బీజేపీ.. బీసీని ముఖ్యమంత్రి చేస్తాననడం విడ్డూరంగా ఉందన్నారు. దేశంలో బీసీ ప్రధానిగా ఉన్న నరేంద్రమోదీ ఎందుకు బీసీ కులగణన చేపట్టడం లేదని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో 60 సీట్లు బీసీలకు కేటాయిస్తామని ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు.

క్రిస్టియన్ల సమస్యలపై హామీలిచ్చే పార్టీకే ఓటు

- ఆల్ ఇండియా క్రిస్టియన్ వాయిస్ అధ్యక్షుడు దేవదాసు



పంజగుట్ట (హైదరాబాద్): క్రిస్టియన్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎవరైతే స్పష్టమైన హామీ ఇస్తారో ఆ పార్టీకే రాబోయే ఎన్నికల్లో తాము మద్దతు ఇస్తామని ఆల్ ఇండియా క్రిస్టియన్ వాయిస్ అధ్యక్షుడు కె.దేవదాసు స్పష్టం చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ.. అన్ని పార్టీలు క్రిస్టియన్లను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని, ఏ పార్టీ కూడా తమ సమస్యలపై స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రిస్టియన్ జనాభా రాష్ట్రంలో 10 శాతం ఉందని, అన్ని చర్చిల్లో సమావేశాలు ఏర్పాటు చేసి క్రిస్టియన్లకు మద్దతుగా ఉన్న పార్టీకే ఓటు వేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు.

హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలి

- గిరిజన ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర నేతల పిలుపు



ట్యాంక్‌బండ్‌పై ఉన్న కొమురం భీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న గిరిజన నేతలు

కవాడిగూడ (హైదరాబాద్): ఆదివాసీ గిరిజనులు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని గిరిజన ఐక్య వేదిక తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, రిటైర్డ్ కార్మిక శాఖ అడిషనల్ కమిషనర్ హెచ్.కె.నాగు, వర్కింగ్ ప్రెసిడెంట్ వివేక్ వినాయక్ పిలుపునిచ్చారు. కొమురం భీం 83వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం ట్యాంక్‌బండ్‌పై ఉన్న కొమురం భీం విగ్రహానికి వారు పులమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జల్-జమీన్-జంగల్‌పై హక్కుల సాధన కోసం గిరిజనులు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. దళితబంధు తరహాలో ఆదివాసీ బంధు అమలు చేయాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. కొమురం భీంకు భారతరత్న అవార్డును కేంద్రం ప్రకటించాలన్నారు.

ఘనంగా కుమురంభీం వర్ధంతి



భీం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్

ఆసిఫాబాద్/కెరమెరి: కుమురంభీం జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్‌లో జల్, జంగల్, జమీన్ కోసం పోరాడి అసువులు బాసిన గిరిజన వీరుడు కుమురంభీం వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ సురేశ్, అడిషనల్ ఎస్పీ అచ్చేశ్వరరావు, డీఎంహెచ్‌వో తుకారాం, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, భీం మనవడు సోనేరావు, లాల్‌శావ్ తదితరులు భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు నాలుగు గోత్రాల జెండాలకు ప్రత్యేక పూజలు చేశారు.



సిరిసిల్ల శ్రీవేంకటేశ్వరస్వామి రథోత్సవం

వైభవంగా రథోత్సవం

సిరిసిల్ల టౌన్ (రాజన్న సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రెండుగంటల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు లక్షమంది భక్తులు పాల్గొన్నారు. చంద్రగ్రహణం కావడంతో మధ్యాహ్నం 2.30 గంటలకే ఉత్సవాలను ముగించారు.

చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాల మూసివేత

భద్రాచలం: పాక్షిక చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయాన్ని శనివారం సాయంత్రం 5 గంటలకు మూసివేశారు. ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు ఆలయాన్ని తెరుస్తారు. సుప్రభాతం, శుద్ధి సంప్రోక్షణ అనంతరం స్వామివారికి నిత్య, ఆర్జిత సేవలు ప్రారంభమవుతాయని ప్రధానార్చకులు విజయరాఘవన్, ఈఓ రమాదేవి తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి భక్తుల దర్శనాలకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

యాదాద్రి ఆలయం...

యాదగిరిగుట్ట: చంద్రగ్రహణం సందర్భంగా శనివారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని మూసివేశారు. సాయంత్రం 4 గంటలకు ఈఓ గీతారెడ్డి సమక్షంలో ప్రధానార్చకులు, అధికారులు గర్భాలయ ప్రధాన ద్వారాలను మూసివేశారు. యాదాద్రికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని ఆలయం, పూర్వగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాలను సైతం మూసివేశారు. ఆదివారం ఉదయం 5 గంటలకు గర్భాలయ ద్వారాలు తెరుస్తారు. సంప్రోక్షణ, పుష్కరిణి శుద్ధి, గ్రహణ సంబంధ శుద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అయితే నిత్య కైంకర్యాలన్నీ గంట 15 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

రాజన్న గుడి...

వేములవాడ: చంద్రగ్రహణం సందర్భంగా రాజన్న ఆలయాన్ని శనివారం సాయంత్రమే మూసివేశారు. ఆదివారం ఉదయం ఆలయ సంప్రోక్షణ అనంతరం యథావిధిగా దర్శనానికి భక్తులను అనుమతించనున్నట్లు స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ తెలిపారు.

బాసర ఆలయం...

భైంసా: చంద్రగ్రహణం సందర్భంగా బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయం శనివారం మధ్యాహ్నం మూసివేశారు. మధ్యాహ్నం మహానివేదన, హారతి అనంతరం వేద పండితులు, ఆలయ అర్చకులు, అధికారులు ద్వారబంధనం చేశారు. ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు ఆలయ ద్వారాలు తెరిచి సంప్రోక్షణ అనంతరం సుప్రభాత సేవ, అభిషేక పూజలు, ఆర్జిత సేవలు నిర్వహిస్తామని ఈవో తెలిపారు.



ఈఓ గీతారెడ్డి సమక్షంలో యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి గర్భాలయ ద్వారాన్ని మూసివేస్తున్న అర్చకులు, అధికారులు

కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటు ఖాయం: డీకే

- డిసెంబర్ 9న రేవంత్ సీఎంగా ప్రమాణం చేస్తారని అనువదించిన స్థానిక నేత
- కర్ణాటకలో రైతులకు 5 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నామన్న కర్ణాటక డిప్యూటీ సీఎం శివకుమార్

వికారాబాద్, తాండూరు: సోనియా గాంధీ పుట్టిన రోజు.. తెలంగాణ ఏర్పాటును ప్రకటించిన రోజు డిసెంబర్ 9న తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ధీమా వ్యక్తం చేశారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేపట్టిన రెండో విడత బస్సు యాత్రలో భాగంగా శనివారం తాండూరు, పరిగి, చేవెళ్లలో నిర్వహించిన రోడ్‌షోకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తాండూరులో మాట్లాడుతూ.. కర్ణాటకలో ఇచ్చిన అన్ని గ్యారంటీల హామీని గెలిచిన నెలలోపే అమలు చేశామని.. తెలంగాణలోనూ అదేవిధంగా ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని స్పష్టం చేశారు. కర్ణాటకలో పథకాలు అమలు కావట్లేదని విమర్శిస్తున్న సీఎం కేసీఆర్ అక్కడ బంధువులుంటే తెలుసుకోవాలని.. లేదంటే మేమే బస్సు పెట్టి తీసుకెళ్లి మా పథకాల అమలు తీరును చూపుతామని చెప్పారు. గతంలో వైఎస్సార్ హయాంలో ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన మాదిరిగానే స్థలం ఉన్న వారికి రూ.5లక్షలతో ఇళ్లు నిర్మించి ఇస్తామని ఆయన హామీనిచ్చారు. యువతకు రూ.5లక్షలతో విద్యాభరోసా, రూ.15వేలతో రైతు భరోసా, మహిళలకు మహాలక్ష్మి స్కీంలో ప్రతీ నెల రూ.2,500 నగదు, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ అందజేస్తామని వివరించారు. కర్ణాటక రాష్ట్రంలో 1.10కోట్ల మందికి గృహలక్ష్మి పథకం అమలు చేశామని.. మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేస్తున్నామని తెలంగాణలోనూ అలానే అమలు చేసి తీరుతామని డీకే శివకుమార్ తెలిపారు. కర్ణాటకలో రైతులకు అయిదు గంటల పాటు నాణ్యమైన కరెంటును ఉచితంగా ఇస్తున్నామని డీకే చెప్పారు. రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ రుణాన్ని ప్రజలు తీర్చుకోవాలని కోరారు. తాండూరు కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్‌రెడ్డిని 25వేల మెజారిటీ తగ్గకుండా గెలిపించాలని ఆయన కోరారు.

కేసీఆర్ దోచుకున్న లక్ష కోట్లు కక్కిస్తాం

'ఓడిపోతే ఫాం హౌస్‌లో పడుకుంటా అని చిలక పలుకులు పలుకుతున్న సీఎం కేసీఆర్‌ను ఓడిపోయినా వదిలిపెట్టం. పదేళ్లలో దోచుకున్న లక్ష కోట్లు కక్కిస్తాం' అని పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. తండ్రీకొడుకులు హైదరాబాద్ చుట్టూ పది వేల ఎకరాలు కబ్జా చేసింన్రు.. ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని వారిని జైలుకు పంపడం ఖాయమన్నారు. బీఆర్ఎస్ ఓటమి.. కాంగ్రెస్ గెలుపు డిసైండ్ అయిందని అందుకే సీఎం రెస్ట్ తీసుకుంటానని ముందే చెబుతున్నాడని ఎద్దేవా చేశారు. రైతులకు ఎనిమిది గంటలకు మించి కరెంటు వస్తలేదని కేసీఆర్ చెప్పేదంతా బూటకమేనన్నారు. రియల్ ఎస్టేట్, ఓఆర్ఆర్, అంతర్జాతీయ విమానాశ్రయం, మెట్రో తదితరాలన్నీ కాంగ్రెస్ హయాంలో జరిగినవేననీ గుర్తు చేశారు. కాంగ్రెస్ వండిపెడితే మీరు దొంగల్లా దోచుకుంటున్నారని విమర్శించారు. వైఎస్సార్ ఇచ్చిన 4శాతం రిజర్వేషన్‌తో మైనార్టీలకు మేలు జరిగిందని.. బీఆర్ఎస్ మైనార్టీలకు ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కిందని రేవంత్ విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ తాండూర్ అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి, మాజీ మంత్రులు గడ్డం ప్రసాద్ కుమార్, పుష్పలీల, డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



తాండూరు రోడ్డు షోకు హాజరైన జనం. (ఇన్‌సెట్‌లో) ప్రసంగిస్తున్న డీకే శివకుమార్. పక్కన రేవంత్‌రెడ్డి

హజా కోసం ప్రసంగం ఆపిన రేవంత్

రేవంత్‌రెడ్డి మైనార్టీల సంక్షేమంపై మాట్లాడుతున్న సమయంలో హజా(నమాజ్) రావడంతో ఆయన ప్రసంగం ఆపేశారు. హజా పూర్తయ్యాక తిరిగి కొనసాగించారు. ఒక్కసారిగా ప్రసంగం ఆపేయడంతో అందరూ ఏమైందోనని చర్చించుకున్నారు.

అనువాదంలో ఆపసోపాలు

కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఆంగ్లంలో ప్రసంగించగా.. డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి తెలుగులో అనువాదం చేశారు. ఈ క్రమంలో పలు చోట్ల శివకుమార్ మాట్లాడింది కాకుండా మరోలా చెప్పడం.. లేదంటే మాట్లాడిన దానికంటే ఎక్కువ చేసి చెప్పడం చర్చనీయాంశమైంది. డిసెంబర్ 9న, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు ఖాయం అని డీకే చెబితే.. రేవంత్‌రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారని, సమయంతో సహా చెప్పడంతో అందరూ అవాక్కయ్యారు. సీఎం ఎవరనే విషయాన్ని ఈయనే డిసైడ్ చేశారన్న వ్యాఖ్యలు వినిపించాయి.

కాంగ్రెస్‌కు ఓటేసి మోసపోయాం

- నారాయణఖేడ్‌లో కర్ణాటక రైతుల ర్యాలీ
- అడ్డుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు



కర్ణాటక రైతులను అడ్డుకుంటున్న కాంగ్రెస్ కార్యకర్తలు

నారాయణఖేడ్: తమ రాష్ట్రంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఐదు గ్యారంటీ పథకాలు అమలు కావడం లేదంటూ కర్ణాటకకు చెందిన రైతులు శనివారం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో ర్యాలీ నిర్వహించారు. తాము మోసపోయామని, మీరు మోసపోవద్దని అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. అయితే.. వీరి ప్రదర్శనను కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకోవడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. కర్ణాటక ప్రాంతానికి చెందిన 60 మంది వరకు రైతులు మంగల్‌పేట్ నుంచి నారాయణఖేడ్ రాజీవ్‌చౌక్ వైపు ర్యాలీగా బయలు దేరారు. కొద్దిదూరం రాగానే కాంగ్రెస్ కార్యకర్తలు వారిని అడ్డుకుని ప్లకార్డులను లాక్కొని చించివేశారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనగా.. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. అనంతరం కర్ణాటక రైతులు రాజీవ్‌చౌక్ వరకు ప్రదర్శనగా వెళ్లారు.

హామీల అమలు లేదు: కర్ణాటక రైతులు

దేవరాజ్‌గౌడ్, పెనినగౌడ, సోంనాథ్, సంజీవ్‌కుమార్ టోల్లె అనే రైతులు విలేకరులతో మాట్లాడుతూ, కర్ణాటకలో కాంగ్రెస్ ఇచ్చిన ఐదు హామీలు అమలు కావడం లేదని చెప్పారు. మహిళలకు రూ.2వేలు, 10 కిలోల బియ్యం ఇస్తామని చెప్పి కేవలం ఐదు కిలోలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. గతంలో ఎనిమిది గంటల విద్యుత్ సరఫరా ఉండగా, ప్రస్తుతం రెండు, మూడు గంటలు మాత్రమే ఇస్తున్నారని చెప్పారు.

వారు పెయిడ్ ఆర్టిస్టులు: కాంగ్రెస్

కర్ణాటక నుంచి వచ్చినవారు రైతులు కాదని, బీఆర్ఎస్ పెయిడ్ ఆర్టిస్టులని పీసీసీ ఎస్టీసెల్ వైస్ చైర్మన్ భీంరావునాయక్, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు దీపక్ రెడ్డి తదితరులు విమర్శించారు. బీఆర్ఎస్‌కు ఓటమి తప్పదనే భయంతో పెయిడ్ ఆర్టిస్టులను తెచ్చి తప్పుడు ప్రచారానికి తెరలేపారన్నారు. తమ వెంట వస్తే బీఆర్ఎస్ నాయకులను కర్ణాటక తీసుకెళ్లి పథకాల అమలు తీరును చూపిస్తామని అన్నారు.

ఎన్నికలకు దూరం: బాబూ మోహన్



పంజగుట్ట (హైదరాబాద్): అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి, పార్టీకి, ప్రచారానికి దూరంగా ఉంటానని మాజీ మంత్రి, సినీ నటుడు బాబూమోహన్ అన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా, ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా చేసిన తనకు బీజేపీ మొదటి లిస్టులో టికెట్ కేటాయించకపోవడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మొదటి లిస్టులో పేరు రాకపోవడంతో సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తున్నారని ఇకనైనా తన పేరుతో ఎలాంటి పోస్టులు వైరల్ చెయ్యరాదని ఆయన కోరారు. బీజేపీ పెద్దలు ఆహ్వానిస్తేనే తాను పార్టీలోకి వచ్చానని అందోల్ నియోజకవర్గంలో జీరోగా ఉన్న బీజేపీని ఇప్పుడు నువ్వానేనా అనే స్థాయికి తీసుకొచ్చానని చెప్పారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అందోల్‌లో అన్ని సర్వేల్లో తానే ముందజలో ఉన్నానని, కాని మొదటి లిస్టులో పేరు రాకపోవడంతో బాబూ మోహన్‌కు టికెట్ రావడంలేదు, ఆయన కొడుక్కి వస్తుంది, తండ్రీ కొడుకుల మధ్య మాటల యుద్ధం.. అంటూ కొన్ని పత్రికల్లో, టీవీల్లో ప్రచారం చెయ్యడం బాధ కలిగించిందన్నారు. జాబితా వచ్చిన తర్వాత ప్రస్తుత అధ్యక్షుడు, మాజీ అధ్యక్షుడు ఇద్దరికీ ఫోన్ చేసినా స్పందన లేదని, జిల్లా అధ్యక్షుడికి ఫోన్ చేస్తే నిన్నటివరకు మీ పేరు ఉంది నేడు లేకపోవడం ఆశ్చర్యం కలిగించింది అని చెపుతున్నారన్నారు. తనకు టికెట్ ఇచ్చే ఉద్దేశం లేకపోతే అదే విషయం ముందే చెప్పాల్సిందని, ఇలా వెయిటింగ్‌లో పెట్టడం సరికాదని అన్నారు. హై కమాండ్ నిర్ణయం బట్టి పార్టీలో ఉండాలా.. లేదా అన్న విషయం చెపుతానని తెలిపారు. రెండో లిస్టులో తన పేరు ఉన్నా పోటీకి దూరంగా ఉంటానని బాబూ మోహన్ పేర్కొన్నారు. ఆత్మాభిమానం చంపుకోలేక, మానసికంగా బాధపడుతూ ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పారు.

నిద్రలేమి.. అయినా డ్యూటీ!

డ్రైవర్ల కొరతతో డబుల్ డ్యూటీలు వేస్తున్న ఆర్టీసీ

- అనారోగ్యంతో సతమతమవుతున్న వారికీ విధులు
- తీవ్ర ఒత్తిడికి లోనవుతుండటంతో జరుగుతున్న ప్రమాదాలు
- గత రెండ్రోజుల్లో ఇద్దరు వోల్వో బస్సు డ్రైవర్ల దుర్మరణం

■ శుక్రవారం సాయంత్రం 5:18 గంటలు.. 64 కి.మీ. వేగంతో వరంగల్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న వోల్వో రాజధాని బస్సు వెనుక నుంచి ఓ ట్యాంకర్‌ను బలంగా ఢీకొంది. ఈ దుర్ఘటనలో డ్రైవర్ చనిపోగా ముగ్గురు ప్రయాణికులు గాయమపడ్డారు. ఇంకా చీకటి పడనప్పటికీ డ్రైవర్ ట్యాంకర్‌ను గుర్తించలేకపోవడం గమనార్హం.

■ శనివారం తెల్లవారుజాము 2:20 గంటలు.. విజయవాడ జాతీయ రహదారిపై నార్కట్‌పల్లి ప్రాంతం.. గంటకు 80 కి.మీ. వేగంతో రాజధాని వోల్వో బస్సు నడుపుతున్న ఆర్టీసీ డ్రైవర్.. ఆగి ఉన్న లారీని గమనించక వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందగా 8 మంది ప్రయాణికులు గాయపడ్డారు.

సాక్షి, హైదరాబాద్: వరుస డ్యూటీలతో డ్రైవర్ల నిద్రలేమి, తీవ్ర అలసట, పని ఒత్తిడి వల్ల ఇటీవల కాలంలో ఆర్టీసీ బస్సు ప్రమాదాలు పెరుగుతున్నాయి. గత ఆరు నెలల్లో దాదాపు 300 వరకు బస్సు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. తాజాగా గంటల వ్యవధిలో రెండు రాజధాని బస్సులు ప్రమాదానికి గురై రెండు బస్సుల డ్రైవర్లు దుర్మరణం చెందడం దీనికి నిదర్శనంగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో వెంటనే అన్ని డిపోల్లో గేట్ మీటింగ్స్ ఏర్పాటు చేసి డ్రైవర్లలో అవగాహన కల్పించాలని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశించారు.

లెక్క తప్పినా...

ఆర్టీసీ కొన్ని దశాబ్దాల క్రితమే శాస్త్రీయ అధ్యయనంతో ఓ నిబంధన ప్రవేశపెట్టింది. దీని ప్రకారం బస్సు-డ్రైవర్ల దామాషా 1:2.6. అంటే ప్రతి 10 బస్సులకు 26 మంది డ్రైవర్లు ఉండాలి. మూడు షిఫ్టుల్లో బస్సు నడవాలంటే అందరు డ్రైవర్లు ఉండాల్సిందే. డ్రైవర్ల సెలవులను దృష్టిలో పెట్టుకొని ఈ దామాషా రూపొందించారు. కానీ ప్రస్తుతం 10 బస్సులకు 23 మంది మాత్రమే ఉన్నారు. టీఎస్‌ఆర్టీసీలో ప్రస్తుతం 6,375 బస్సులు ఉండగా వాటికి 14,894 మంది డ్రైవర్లు ఉన్నారు. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం నేపథ్యంలో ఇటీవలే దాదాపు 400 మంది డ్రైవర్లకు అసిస్టెంట్ డిపో క్లర్కులుగా పదోన్నతి కల్పించారు. దీంతో వారి సంఖ్య అంతమేర తగ్గింది. అయినప్పటికీ అప్పటికప్పుడు సెలవుల్లో ఉన్న వారితోపాటు అనారోగ్యం నుంచి ఇంకా కోలుకోని వారికి, డ్యూటీ దిగిన వారికి డబుల్ డ్యూటీలు చేయాలని అధికారులు ఆదేశిస్తున్నారు. అలాంటి పరిస్థితిలో డ్యూటీకి వచ్చిన డ్రైవర్లు నడిపే బస్సులే ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నాయి. శుక్రవారం రోడ్డు ప్రమాదానికి గురై చనిపోయిన డ్రైవర్ పగలు ఓ వేడుకలో ఎక్కువ సేపు గడిపి నేరుగా డ్యూటీకి వచ్చినట్లు తెలిసింది. దీంతో అతనికి కావాల్సినంత నిద్ర లేకుండా పోయింది.

తీవ్ర ఒత్తిడిలో డ్రైవర్లు..

కొన్ని గంటలపాటు బస్సును నడపటమే ఒత్తిడితో కూడుకున్న ఉద్యోగం. ఇది చాలదన్నట్లు డబుల్ డ్యూటీలు వేస్తుండటంతో డ్రైవర్లు ఒత్తిడి తట్టుకోలేకపోతున్నారు. ఇటీవల ఓ డ్రైవరు 7-8 గంటలపాటు డ్రైవింగ్ అనంతరం తాను తీసుకుంటున్న చికిత్సలో భాగంగా మాత్ర వేసుకొని నిద్రపోయాడు. కానీ డ్రైవరు కొరతతో అధికారులు అతనికి డబుల్ డ్యూటీ వేశారు. అయితే తాను మాత్ర వేసుకున్నందున నిద్ర వస్తుందంటూ డ్యూటీకి డ్రైవర్ నిరాకరించడంతో అతనిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారని కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి. డబుల్ డ్యూటీ చేయకుంటే చర్యలు తీసుకుంటున్నారన్న భయంతో విధులకు వెళ్లక తప్పని పరిస్థితి వారికి ఎదురవుతోందంటున్నారు. ఇది ప్రమాదాలకు కారణమవుతోందన్నది వారి మాట.



ఆగి ఉన్న లారీని ఢీ కొన్న రాజధాని బస్సు



ట్యాంకర్‌ను ఢీకొట్టిన వోల్వో బస్సు

గుర్తించే పద్ధతి ఏది?

దూరప్రాంతాలకు డ్రైవింగ్‌కు వెళ్లి వచ్చాక ఆ డ్రైవర్ తగినంత నిద్రపోవాల్సి ఉంటుంది. అందుకే అన్ని ప్రాంతాల్లో ఆర్టీసీ రెస్ట్ రూమ్స్ ఏర్పాటు చేశారు. నిద్రలేమి ఉంటే ఆ విషయాన్ని అధికారులకు చెప్పాలి. అతని పరిస్థితిని పరిశీలించాకే బస్సును కేటాయించాల్సి ఉంటుంది. కానీ ఆర్టీసీలో ప్రస్తుతం ఆ పద్ధతి అమలు కావట్లేదు. మద్యం తాగాడా లేదా అన్నది మాత్రమే బ్రీథ్ అనలైజర్‌తో తనిఖీ చేస్తున్నారు తప్ప మిగతా విషయాలను గుర్తించలేకపోతున్నారు.

ఆదాయం కోసం...

ఆర్టీసీ యాజమాన్యం 100 రోజుల ఫెస్టివల్ చాలెంజ్ పేరుతో డిపోలవారీగా ఆదాయాన్ని పెంచుకొనేందుకు ప్రత్యేక కసరత్తు చేస్తోంది. దీంతో ఫిట్‌గా లేడన్న కారణంతో డ్రైవర్లకు డ్యూటీలు వేయకుండా కొన్ని బస్సు ట్రిప్పులను రద్దు చేస్తే ఇది తమ రీజియన్ పరిధిలో ఆదాయంపై ప్రభావం చూపుతుందని ఉన్నతాధికారులు డిపో మేనేజర్లపై ఒత్తిడి పెంచుతున్నారు. దూరప్రాంతాలకు బస్సులు ఎక్కువగా తిప్పే డిపోల్లో ఒకటైన బీహెచ్‌ఈఎల్ డిపోకు చెందిన బస్సులు ఏడాది కాలంలో ఎక్కువ ప్రమాదాలకు గురయ్యాయి. శుక్రవారం అర్ధరాత్రి దాటాక విజయవాడ దారిలో ప్రమాదానికి గురైన బస్సు కూడా ఆ డిపోదే కావటం గమనార్హం.

లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- బస్సు డ్రైవర్ మృతి.. 8 మంది ప్రయాణికులకు గాయాలు

నార్కట్‌పల్లి: లారీని వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో బస్సు డ్రైవర్ మృతిచెందగా మరో 8 మందికి గాయపడ్డ ఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ఏపీ లింగోటం గ్రామ సమీపంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం దామరచేడ్ గ్రామానికి చెందిన ఎర్ర నారాయణ (45) సంగారెడ్డి జిల్లా బీఎచ్‌ఈఎల్ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా శుక్రవారం రాత్రి బీహెచ్‌ఈఎల్ నుంచి బస్సులో ప్రయాణికులతో విజయవాడకు బయల్దేరాడు. నార్కట్‌పల్లి మండలం ఏపీ లింగోటం గ్రామ సమీపంలో విజయవాడ-హైదరాబాద్ హైవే ఫ్లైఓవర్‌పై శనివారం తెల్లవారుజామున ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బస్సు ఢీకొట్టింది. దీంతో బస్సు డ్రైవర్ నారాయణ అక్కడికక్కడే మృతిచెందగా 8 మంది ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడిన వారిని స్థానిక కామినేని ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు.

దొంగ పోలీసుపై వేటు!

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల తనిఖీల పేరుతో దారి దోపిడీ చేసిన కేసులో రాచకొండ ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్) కానిస్టేబుల్ ప్రమేయం ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. 2018 బ్యాచ్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ బళ్లారి శ్రీకాంత్‌పై వేటు పడింది. ఈమేరకు అతన్ని సర్వీస్ నుంచి తొలగిస్తూ రాచకొండ పోలీసు కమిషనర్ డీఎస్ చౌహాన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణ నిమిత్తం పంజగుట్ట పోలీసులు నిందితుడు శ్రీకాంత్‌ను అరెస్టు చేశారు. బేగంబజార్‌లో నివసించే ప్రదీప్ శర్మ మెహదీపట్నంలోని ఓ టెక్స్‌టైల్స్ షాపులో పనిచేస్తుంటాడు. ఈ దుకాణానికి చెందిన రూ.18.5 లక్షల నగదును గురువారం బ్యాగులో పెట్టుకొని పంజగుట్టలోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో డిపాజిట్ చేసేందుకు తీసుకెళుతున్నాడు. ఈ సమయంలో ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి, ప్రదీప్ శర్మ, అతని డ్రైవర్‌తో వెళుతున్న కారును ఆపారు. ఎన్నికల నేపథ్యంలో కారు తనిఖీ చేస్తుండగా.. బ్యాగులో నగదు ఉన్నట్లు గుర్తించారు. ఇంతలోనే నిందితుల ముఠాకు చెందిన మరో ఇద్దరు ఇన్నోవా కారులో వచ్చి ప్రదీప్ శర్మను, నగదు బ్యాగును ఇన్నోవా వాహనంలో కూర్చొబెట్టి కారును ఖైరతాబాద్ వైపు మళ్లించారు. తనిఖీల పేరుతో నగదు లెక్కల గురించి ప్రశ్నించి, ప్రదీప్ దృష్టి మరల్చి బ్యాగులోని రూ.18.50 లక్షలు కొట్టేసి వెళ్లిపోయారు. దీంతో బాధితురాలు శుక్రవారం అర్ధరాత్రి పంజగుట్ట ఠాణాలో ఫిర్యాదు చేశారు. సీసీటీవీ ఫుటేజ్‌ల పరిశీలించిన పోలీసులు.. ఏఆర్ కానిస్టేబుల్ శ్రీకాంత్ ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు.

క్లుప్తంగా...

ముకేశ్ అంబానీకి బెదిరింపులు

రూ.20 కోట్లు ఇవ్వాలని డిమాండ్

ముంబై: కుబేరుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీకి మరోసారి బెదిరింపులు వచ్చాయి. ఇందుకు సంబంధించి అంబానీ సంస్థకు చెందిన ఓ ఈ–మెయిల్ ఐడీకి శుక్రవారం మెయిల్ వచ్చింది. 'మా దగ్గర మంచి షూటర్లు ఉన్నారు. రూ.20 కోట్లు ఇవ్వకపోతే చంపేస్తాం 'అని ఆ మెయిల్ సారాంశం. దీంతో, ముకేశ్ అంబానీ సెక్యూరిటీ ఇన్‌చార్జ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు షాదాబ్ ఖాన్ అనే వ్యక్తి నుంచి ఆ మెయిల్ వచ్చినట్లు ప్రాథమికంగా గుర్తించారు. అతడి కోసం గాలిస్తున్నారు. గత ఏడాది సైతం ముకేశ్ కుటుంబానికి ఇలాంటి బెదిరింపులు వచ్చాయి. 2022 ఓ వ్యక్తి రిలయన్స్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న హర్‌కిసాన్‌దాస్ ఆస్పత్రికి ఫోన్ చేసి 'ఆసుపత్రిని పేల్చేస్తాం. అంబానీ కుటుంబాన్ని చంపేస్తాం'అని బెదిరించాడు. 2021లో ముంబైలోని అంబానీ నివాసం ఆంటిలియా సమీపంలో పేలుడు పదార్థాలతో కూడిన ఓ స్కార్పియో కారును నిలిపి ఉంచడం తీవ్ర కలకలం సృష్టించిన విషయం విదితమే.

'ఇండియా'లో లోక్‌సభ ఎన్నికల నాటికి ఐక్యత అవసరం

ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్

ముంబై: త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న కొన్ని రాష్ట్రాల్లో ఇండియా కూటమి ఉమ్మడి అభ్యర్థులను బరిలో నిలపడంలో సభ పార్టీల మధ్య విభేదాలు తలెత్తాయని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ)చీఫ్ శరద్ పవార్ చెప్పారు. అయితే, 2024లో లోక్‌సభ ఎన్నికల వేళకు ఇవన్నీ సర్దుకుని, ఉమ్మడిగా పోటీ చేసేందుకు అవకాశాలున్నాయని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుత పరిణామాలను బట్టి చూస్తే ప్రతిపక్షపార్టీలకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లు కనిపిస్తోందన్నారు. జాతీయ స్థాయిలో కూడా ఇదే విధమైన మార్పు వస్తుందని చెప్పేందుకు తన వద్ద కచ్చితమైన సమాచారం లేదన్నారు. మెజారిటీ రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు లేవని ఆయన గుర్తు చేశారు. కొన్ని రాష్ట్రాల్లో బలంగా కాంగ్రెస్ ఉండగా, మరికొన్ని చోట్ల ప్రాంతీయ పార్టీలు కీలకంగా ఉన్నాయన్నారు. ఇలాంటి సందర్భాల్లో తలెత్తే విభేదాలను పరిష్కరించుకోవాల్సి ఉందన్నారు.

దిగ్విజయ్-కమల్‌నాథ్‌లది జై- వీరూ బంధం

భోపాల్: మధ్యప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కమల్‌నాథ్, సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్‌ల పాత్రపై మరోసారి చర్చ మొదలైంది. దిగ్విజయ్, కమల్‌నాథ్‌ల మధ్య రాజకీయ సమీకరణాలను.. బ్లాక్ బస్టర్ 'షోలే' చిత్రంలోని ధర్మేంద్ర, అమితాబ్ బచ్చన్‌లు పోషించిన జై, వీరూ పాత్రల మధ్య బంధంతో కాంగ్రెస్ పార్టీ పోల్చింది. రాష్ట్రంలో టిక్కెట్ల కేటాయింపులో ఇద్దరు నేతల మధ్య విభేదాల వార్తలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణదీప్ సూర్జేవాలా శనివారం పైవ్యాఖ్యలు చేశారు. 'షోలే సినిమాలో ధర్మేంద్ర, అమితాబ్‌ల మధ్య విలన్ గబ్బర్ సింగ్ ఎలా గొడవ పెట్టలేకపోయాడో.. రాష్ట్రంలో గబ్బర్ సింగ్ వంటి బీజేపీ కూడా మధ్య విభేదాలను సృష్టించలేకపోయింది' అంటూ వ్యాఖ్యానించారు.

సిసోడియా బెయిల్‌పై 30న సుప్రీం తీర్పు

న్యూఢిల్లీ: ఢిల్లీలో మద్యం విధానంలో అవకతవకలు, మనీల్యాండరింగ్ కేసులో అరెస్టయిన ఆమ్ ఆద్మీ పార్టీ నేత, మాజీ మంత్రి మనీశ్ సిసోడియా బెయిల్ పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానం ఈ నెల 30వ తేదీన తీర్పు వెలువరించనుంది. ఈ కేసును సీబీఐ, ఈడీలు దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. ఫిబ్రవరిలో అరెస్టయిన సిసోడియా తిహార్ జైలులో కస్టడీలో ఉన్నారు. ఆయన బెయిల్ పిటిషన్‌పై అక్టోబర్ 17వ తేదీతో వాదనలు ముగిశాయి. తీర్పు సోమవారం ఉదయం వెలువడుతుందని సుప్రీంకోర్టు వర్గాలు తెలిపాయి.

ఈజిప్టులో పలు వాహనాలు ఢీకొని... 32 మంది మృతి

కైరో: ఈజిప్టులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 32 మంది మృత్యువాతపడ్డారు. కైరో–అలెగ్జాండ్రియా ప్రధాన రహదారిపై బెహీరా ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మొదటగా ప్రయాణికులతో వెళ్తున్న బస్సు రోడ్డు పక్కన నిలిపి ఉంచిన వాహనాన్ని ఢీకొట్టింది. ఆ వెనుకే వస్తున్న కార్లు ఒకదానినొకటి ఢీకొట్టి, మంటలు చెలరేగాయి. మొత్తం 29 వాహనాలు ప్రమాదంలో చిక్కుకోగా బస్సు సహా ఆరు వాహనాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఘటనలో 32 మంది వరకు చనిపోగా మరో 63 మంది గాయపడ్డారు. దట్టంగా కురుస్తున్న మంచు కారణంగానే ప్రమాదం జరిగిందని అధికారులు అంటున్నారు.

గనిలో అగ్ని ప్రమాదం

32 మంది మృతి..14 మంది గల్లంతు

లండన్: కజఖిస్తాన్‌లోని కొస్టెంకో బొగ్గు గనిలో సంభవించిన అగ్ని ప్రమాదంలో 32 మంది కార్మికులు చనిపోగా మరో 14 మంది గల్లంతయ్యారు. లగ్జెంబర్గ్ కేంద్రంగా పనిచేస్తున్న ఆర్సెలర్ మిట్టల్ టెమిర్టా ఈ విషయం తెలిపింది. శనివారం ప్రమాద సమయంలో గనిలో 252 మంది కార్మికులు పనిచేస్తున్నారని వివరించింది. మీథేన్ గ్యాస్ వెలువడటం వల్లే గనిలో మంటలు చెలరేగాయని తెలిపింది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద స్టీల్ ఉత్పత్తిదారు ఆర్సెలర్ మిట్టల్. ఈ సంస్థకు అనుబంధంగా కజఖిస్తాన్‌లో ఆర్సెలర్ మిట్టల్ టెమిర్టా పనిచేస్తుంది. ఘోర ప్రమాదం నేపథ్యంలో కజఖ్ ప్రభుత్వం ..దేశంలో ఆర్సెలర్ మిట్టల్ టెమిర్టా ఆధ్వర్యంలో ఉన్న ఉక్కు కర్మాగారాలు, బొగ్గు, ఇనుప ఖనిజం గనులను జాతీయం చేసింది.

దాడులు తీవ్రతరం

ఇజ్రాయెల్ బాంబుల వర్షం

- అల్లాడిపోతున్న గాజా
- 7,700 దాటిన మృతులు
- కనీస అవసరాలకూ కటకట
- కీలక దశకు యుద్ధం: ఇజ్రాయెల్

జెరూసలేం: హమాస్ మిలిటెంట్ సంస్థ నిర్మూలనే లక్ష్యంగా గాజాపై దాడులను ఇజ్రాయెల్ తీవ్రతరం చేస్తోంది. దానిపై భూతల దాడుల తీవ్రతను శనివారం మరింత పెంచింది. పదాతి దళం, సాయుధ వాహనాలు గాజాకేసి దూసుకెళ్తున్నాయి. వాటికి దన్నుగా విమానాలు, యుద్ధ నౌకల నుంచి భారీ రాకెట్ దాడులు కొనసాగుతున్నాయి. హమాస్ నిర్మించుకున్న భూగర్భ సొరంగాలే లక్ష్యంగా బాంబుల వర్షం కురుస్తోంది. వాటి తీవ్రత యుద్ధం మొదలైన ఈ మూడు వారాల్లో కనీవినీ ఎరగనంత ఎక్కువగా ఉందంటూ గాజావాసులు ఆక్రోశిస్తున్నారు. వాటి దెబ్బకు గాజాలో ఇప్పటిదాకా మిగిలి ఉన్న అరకొర సమాచార వ్యవస్థలన్నీ దాదాపుగా తుడిచిపెట్టుకుపోయాయి. దాంతో గాజాలోని 23 లక్షల మందికి బయటి ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోయినట్టేనని భావిస్తున్నారు.

దాడుల ఫొటోల విడుదల

గాజాలోకి నెమ్మదిగా ప్రవేశిస్తున్న యుద్ధ ట్యాంకుల వరుసలు తదితరాల ఫొటోలను ఇజ్రాయెల్ సైన్యం విడుదల చేసింది. భారీ సంఖ్యలో సైన్యం, ట్యాంకులు సరిహద్దులకు చేరుకుంటున్నాయి. ''మా సైన్యాలు గాజాను కమ్ముకుంటున్నాయి. యుద్ధం కొనసాగుతోంది'' అని సైన్యం అధికార ప్రతినిధి రియర్ అడ్మిరల్ డేనియల్ హగరీ ప్రకటించారు. మరోవైపు, యుద్ధం కీలక దశలోకి ప్రవేశించిందని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యోవ్ గాలంట్ ప్రకటించారు. ''గత రాత్రి గాజాలో భూకంపం పుట్టించాం. నేలమీద, భూగర్భంలో ఉన్న హమాస్ స్థావరాలపై భారీగా దాడులకు దిగాం'' అని వివరించారు. గాజాపై ఇప్పటిదాకా రాత్రిపూట దాడులకే సైన్యం పరిమితమవుతూ వచ్చింది. కానీ ఇక ఆ ప్రాంతమంతటినీ ఆక్రమించడమే ఇప్పుడు ఇజ్రాయెల్ లక్ష్యమని చెబుతున్నారు. అయితే హమాస్ విస్తృత భూగర్భ నెట్‌వర్క్ తదితరాలను నాశనం చేసేందుకు చాలా సమయం పడుతుందన్న సైన్యం వ్యాఖ్యల నేపథ్యంలో పోరుకు ఇప్పట్లో తెర పడే సూచనలు కన్పించడం లేదు...!

ఆస్పత్రే హమాస్ కేంద్రం!

గాజాలోని అతి పెద్ద ఆస్పత్రి అయిన షిఫా నిజానికి హమాస్ మిలిటెంట్ సంస్థ ప్రధాన కార్యాలయమని ఇజ్రాయెల్ ఆరోపించింది. ఆస్పత్రి కిందే దాని ప్రధాన స్థావరం దాగుందని పేర్కొంది. ఇందుకు సంబంధించి తమ దగ్గరున్న సమాచారం ఆధారంగా రూపొందించిన ఓ సిమ్యులేటెడ్ వీడియోను కూడా సైన్యం విడుదల చేసింది. వందలాది మంది హమాస్ మిలిటెంట్లు ఆస్పత్రి కింద తలదాచుకున్నారని పేర్కొంది. ''ఆస్పత్రి కింద లెక్కలేనన్ని భూగర్భ కాంప్లెక్సులున్నాయి. ఉగ్రవాదులు వాటిని యథేచ్ఛగా వాడుకుంటున్నారు'' అని ఆరోపించింది. ఆస్పత్రి కింద ఉన్న నెట్‌వర్క్ మొత్తాన్నీ బట్టబయలు చేసి తుడిచి పెట్టి తీరుతామని ప్రకటించింది. షిఫా ఆస్పత్రి కాంప్లెక్స్‌పై భారీ దాడికి సైన్యం సిద్ధమవుతున్నట్టు వార్తలు వస్తుండటం తెలిసిందే. హమాస్ దురాగతాలు ఐసిస్‌ను మించిపోయాయని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ దుయ్యబట్టారు. ఆస్పత్రులనే ప్రధాన స్థావరాలుగా మార్చుకునే నైచ్యానికి ఒడిగట్టారని మండిపడ్డారు. ఈ ఆరోపణలను హమాస్ ఖండించింది.

గాజాకు స్టార్‌లింక్ కనెక్టివిటీ

గాజాలో పాలస్తీనియన్లకు కనీస సౌకర్యాలు అందించేందుకు ప్రయత్నిస్తున్న అంతర్జాతీయ సంస్థలకు స్టార్‌లింక్ నెట్‌వర్క్ ద్వారా ఇంటర్నెట్ తదితర కనెక్టివిటీ సౌకర్యం కల్పిస్తామని టెస్లా చీఫ్ ఎలాన్ మస్క్ శనివారం ప్రకటించారు. గాజాలో అన్ని సమాచార సదుపాయాలనూ ధ్వంసం చేయడం దారుణమంటూ అమెరికా నేత అలెగ్జాండ్రియా ఒకాసియో కొర్టెజ్ చేసిన వ్యాఖ్యలకు స్పందనగా మస్క్ ఈ మేరకు ప్రకటన చేశారు. స్టార్ లింక్ మస్క్ తాలూకు అంతరిక్ష ప్రయోగాల సంస్థ స్పేస్ ఎక్స్‌కు చెందిన ఉపగ్రహ నెట్‌వర్క్ వ్యవస్థ.



ఇజ్రాయెల్ దాడుల్లో గాజాస్ట్రిప్‌లోని ఓ ప్రాంతంలో కమ్ముకున్న మంటలు, పొగ

7,700 దాటిన మృతులు

- అక్టోబర్ 7న మొదలైన ఇజ్రాయెల్–హమాస్ పోరాటంలో గాజాలో మృతి చెందిన పాలస్తీనియన్ల సంఖ్య ఇప్పటికే 7,700 దాటింది.
- వీరిలో చాలామంది బాలలు, మహిళలేనని పాలస్తీనా ప్రకటించింది.
- శుక్రవారం సాయంత్రం నుంచే కనీసం 550 మందికి పైగా మరణించినట్టు సమాచారం.
- గతంలో ఇజ్రాయెల్–హమాస్ మధ్య జరిగిన నాలుగు పోరాటాల్లోనూ కలిపి దాదాపు 4,000 మంది మరణించినట్టు అంచనా!
- అక్టోబర్ 7న హమాస్ జరిపిన మెరుపు దాడిలో 1,400 మంది దాకా ఇజ్రాయెలీలు మరణించడం తెలిసిందే. వీరిలో 311 మంది సైనికులని ప్రభుత్వం ప్రకటించింది.

సర్వం స్తంభించింది...

ఇజ్రాయెల్ దాడుల ధాటికి గాజాలో సమాచార వ్యవస్థ పూర్తిగా కుప్పకూలింది. దాంతో వైద్య సేవలు పూర్తిగా పడకేసినట్టు ఆరోగ్య శాఖ అధికార ప్రతినిధి అష్రఫ్ అల్‌ఖిద్రా తెలిపారు.

- అంబులెన్స్‌లకు సమాచారమివ్వడం అసాధ్యంగా మారిపోయింది.
- అవసరమైన చోట్లకు ఎమర్జెన్సీ బృందాలను పంపడం నిలిచిపోయింది.
- ఇజ్రాయెల్ సైనిక వాహనాల హోరు, బాంబుల మోతల మధ్యే వైద్య బృందాలతో కూడిన వాహనాలు క్షతగాత్రుల కోసం చెదురుమదురుగా వెదుకులాడుతున్నాయి.
- చాలాచోట్ల గాయపడ్డవారిని పౌరులే తమ వాహనాలపై ఆస్పత్రులకు చేరుస్తున్నారు.
- బాంబు దాడుల ధాటికి నేలమట్టమవుతున్న ఒక వీధిలో నుంచి పాలస్తీనియన్లు హాహాకారాలు చేస్తూ పరుగులు తీస్తుండటం స్థానిక మీడియా విడుదల చేసిన వీడియోలో కనిపిస్తోంది. గాయాలతో కుప్పకూలి అల్లాడుతున్న ఒక వ్యక్తి అంబులెన్స్ అని అరుస్తుండటం అందులో కనిపిస్తోంది.
- తాము కేవలం హమాస్ మిలిటెంట్‌లను మాత్రమే లక్ష్యం చేసుకుని దాడులకు దిగుతున్నామని ఇజ్రాయెల్ స్పష్టం చేసింది. కానీ వారు పౌరులను అడ్డుపెట్టుకుంటున్నారని ఆరోపించారు.

బందీల బంధువుల నిరసన

అక్టోబర్ 7న హమాస్ మిలిటెంట్లు చెరపట్టిన 200 మంది పై చిలుకు ఇజ్రాయెలీల బంధువులు టెల్ అవీవ్ నగరంలో నిరసనకు దిగారు. ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ వచ్చి తమ గోడు వినాలంటూ నినాదాలు చేశారు. బందీలను విడిపించి వెనక్కు తీసుకొచ్చే ఆలోచన ఎవరూ చేయడం లేదంటూ మండిపడ్డారు.

- హమాస్ చెరలో 229 మంది ఉన్నట్టు సైనిక అధికార ప్రతినిధి హగరీ నిర్ధారించారు. అయితే వారిని విడుదల చేస్తే కాల్పులు విరమిస్తామని ప్రతిపాదించినట్టు వస్తున్న వార్తలను తోసిపుచ్చారు.
- ఖతర్, ఈజిప్ట్ మధ్యవర్తిత్వం ఫలితంగా నలుగురు బందీలను హమాస్ ఇటీవల విడుదల చేయడం తెలిసిందే.



దక్షిణ గాజా నుంచి వలస వచ్చిన వారి కోసం రఫాలో గ్యాస్ కొరతతో కట్టెల పొయ్యిలపై సిద్ధమవుతున్న వంటలు



గాజా స్ట్రిప్‌లో తాగు నీటి కోసం పాలస్తీనియన్ల అవస్థలు

నవంబర్ 2న హాజరుకండి

- ఇక గడువు పొడిగించేది లేదు
- ఎంపీ మొయిత్రాకు తెలిపిన ఎథిక్స్ కమిటీ

న్యూఢిల్లీ: డబ్బులు తీసుకుని పార్లమెంట్‌లో ప్రశ్నలు అడిగినట్లు వచ్చిన ఆరోపణలపై మౌఖిక సాక్ష్యమిచ్చేందుకు నవంబర్ 2న తమ ముందుకు రావాలని టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాను ఎథిక్స్ కమిటీ కోరింది. వివిధ కార్యక్రమాల్లో బిజీగా ఉన్నందున అక్టోబర్ 31కి బదులుగా నవంబర్ 5న హాజరయ్యేందుకు అవకాశమివ్వాలని శుక్రవారం ఎంపీ మొయిత్రా ఎథిక్స్ కమిటీకి లేఖ రాసిన విషయం తెలిసిందే. దీనిపై ఎథిక్స్ కమిటీ చైర్ పర్సన్, బీజేపీ ఎంపీ వినోద్ కుమార్ సోంకార్ స్పందించారు. పార్లమెంటు, ఎంపీల గౌరవానికి సంబంధించిన అంశమైనందున నవంబర్ 2వ తేదీన తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీని కోరారు. ఆ తర్వాత గడువు పొడిగించేది లేదని స్పష్టం చేశారు. కాగా, ఎంపీ మొయిత్రాపై లంచం ఆరోపణలు చేసిన బీజేపీ ఎంపీ దుబే, మొయిత్రా ఒకప్పటి స్నేహితుడు, లాయర్ జై అనంత్ దేహద్రాయ్ గురువారం ఎథిక్స్ కమిటీ ఎదుట హాజరయ్యారు.

హీరానందానీకి లాగిన్ ఐడీ ఇచ్చింది నిజమే

లంచం ఆరోపణలపై ఎంపీ మొయిత్రా పీటీఐతో మాట్లాడారు. తనపై వారిద్దరూ తప్పుడు, పరువు నష్టం ఆరోపణలు చేసినందున కమిటీ ఎదుట హాజరై వాదన వినిపిస్తానన్నారు. అదానీ గ్రూప్‌తో పాటు మోదీని టార్గెట్ చేసేందుకు మొయిత్రాకు లంచం ఇచ్చారనే ఆరోపణలను అంగీకరిస్తూ హీరానందానీ ఎథిక్స్ కమిటీకి అఫిడవిట్ సమర్పించిన విషయం ప్రస్తావించగా.. దీని వెనుక అదానీ గ్రూప్ హస్తం ఉందని మొయిత్రా అన్నారు. పార్లమెంటరీ పోర్టల్ ఐడీ వివరాలను వ్యాపారి హీరానందానికి ఇచ్చిన విషయం నిజమేనని ఆమె ఒప్పుకున్నారు. తనకు సౌకర్యంగా ఉండేందుకే ఆయనకిచ్చానే తప్ప, ఈ విషయంలో ఎటువంటి లాభాపేక్ష లేదని పేర్కొన్నారు. లాగిన్ ఐడీ వివరాలను ఇతరులకు వెల్లడించడం దేశ భద్రతకు ప్రమాదకరం అంటూ దుబే ఆరోపణలు చేశారు.

తీర్మానానికి భారత్ దూరం

- ఉగ్రవాదం మాయని మచ్చే
- హింస పరిష్కారం కాదు
- భారత ప్రతినిధి పటేల్

ఐక్యరాజ్యసమితి: గాజాపై ఇజ్రాయెల్ దాడికి వ్యతిరేకంగా ఐక్యరాజ్యసమితిలో ప్రవేశపెట్టిన తీర్మానంపై ఓటింగ్‌కు భారత్ దూరంగా ఉంది. మొత్తం 193 దేశాలున్న ఐరాస జనరల్ అసెంబ్లీలో 45 దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉండగా 120 దేశాలు తీర్మానానికి మద్దతుగా, 14 దేశాలు వ్యతిరేకంగా ఓటేశాయి. మిగతావి ఓటింగ్‌లో పాల్గొనలేదు. అయితే ఉగ్రవాదం మానవాళి పట్ల ఎప్పటికీ మాయని మచ్చేనని భారత్ పునరుద్ఘాటించింది. ''ఉగ్రవాదానికి సరిహద్దుల్లేవు. జాతి, జాతీయత లేవు. అందుకే కారణమేదైనా సరే, మతిలేని ఉగ్రవాద చర్యలకు ఎవరూ మద్దతివ్వరాదు. ఈ విషయంలో ప్రపంచమంతా ఒక్కతాటిపై ఉండాలి''అని పిలుపునిచ్చింది. ఇజ్రాయెల్, హమాస్ తక్షణం పోరుకు స్వస్తి చెప్పాలని తీర్మానం పిలుపునిచ్చింది. గాజాకు అన్ని రకాల సాయం నిర్నిరోధంగా, పూర్తిస్థాయిలో, సురక్షితంగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరింది. బందీలను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేసింది. తీర్మానాన్ని జోర్డాన్ రూపొందించింది. అందులో హమాస్ పేరును ప్రస్తావించకపోవడాన్ని అమెరికా తప్పుబట్టింది.

చర్చలతోనే పరిష్కారం: భారత్

ఐరాసలో మన దేశ ఉప శాశ్వత ప్రతినిధి యోజనా పటేల్ తీర్మానంపై చర్చలో భారత్ తరఫున పాల్గొన్నారు. అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడికి దిగడం ప్రపంచాన్ని షాక్‌కు గురి చేసిన పరిణామమన్నారు. దాన్ని అందరూ ఖండించాల్సి ఉందని చెప్పారు. విభేదాలు, వివాదాలను చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. 'అలాగాకుండా పలు దేశాలు పరస్పరం హింసాకాండకు దిగుతుండటం ఆందోళనకరం. మానవతా విలువలకు పాతరేసే స్థాయిలో హింస, ప్రాణ నష్టం చోటుచేసుకుంటుండటం శోచనీయం. రాజకీయ లక్ష్యాల సాధనకు హింసను మార్గంగా చేసుకోవడం శాశ్వత పరిష్కారాలు ఇవ్వజాలదు'అని స్పష్టం చేశారు. 'ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరాదు. ఈ విషయంలో దేశాలు పరస్పర విభేదాలను కూడా పక్కన పెట్టాలి'అని పిలుపునిచ్చారు. ఐరాస జనరల్ అసెంబ్లీలో జరిగిన చర్చలు ఉగ్రవాదానికి, హింసకు వ్యతిరేకంగా స్పష్టమైన సందేశమిచ్చాయని అభిప్రాయపడ్డారు. తక్షణం బందీలను విడిచిపెట్టాలని హమాస్‌కు సూచించారు. గాజాకు భారత్ కూడా మానవతా సాయం అందించిందని పటేల్ తెలిపారు. స్వతంత్ర పాలస్తీనా దేశం ఏర్పాటే ఘర్షణకు పరిష్కారమన్నది ముందునుంచీ భారత్ వైఖరి అని స్పష్టం చేశారు. 38 టన్నుల మేరకు ఔషధాలు, పరికరాలు, నిత్యావసరాలను పంపినట్టు చెప్పారు. ఇరుపక్షాలు హింసకు స్వస్తి చెప్పి తక్షణం నేరుగా చర్చలు మొదలు పెట్టాలని కోరారు.

హమాస్ పేరు ప్రస్తావించనందుకే...!



ఐరాసలో జోర్డాన్ ప్రవేశపెట్టిన తీర్మానంలో హమాస్ పేరును ప్రస్తావించనందుకే దానిపై ఓటింగ్‌కు భారత్ దూరంగా ఉన్నట్టు సమాచారం. ఇజ్రాయెల్, అమెరికా తదితర దేశాలు తీర్మానానికి వ్యతిరేకంగా ఓటేశాయి. చైనా, ఫ్రాన్స్, రష్యా తదితర దేశాలు అనుకూలంగా ఓటేయగా భారత్‌తో పాటు కెనడా, జర్మనీ, బ్రిటన్, జపాన్, ఉక్రెయిన్ తదితర దేశాలు దూరంగా ఉన్నాయి. తీర్మానానికి కెనడా ప్రతిపాదించిన కీలక సవరణకు భారత్ మద్దతిచ్చింది. ''ఇజ్రాయెల్‌పై హమాస్ దాడిని, వందల మందిని బందీలుగా తీసుకోవడాన్ని ఏకగ్రీవంగా ఖండిస్తున్నాం. వారిని తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం ''అని తీర్మానంలో చేర్చాలని భారత్ కోరింది. భారత్‌తో పాటు మొత్తం 87 దేశాలు సవరణకు అనుకూలంగా, 55 దేశాలు వ్యతిరేకంగా ఓటేశాయి. 23 దేశాలు దూరంగా ఉన్నాయి. మూడింట రెండొంతుల మెజారిటీ రాకపోవడంతో సవరణ ఆమోదం పొందలేదు.

అంత పెద్ద పేరా.. కుదరదు

మాడ్రిడ్: స్పెయిన్‌లోని ఓ రాచకుటుంబానికి చెందిన రాకుమారుడు తన కుమార్తెకు ఏకంగా 157 అక్షరాలతో సుదీర్ఘంగా ఉండే వెరైటీ పేరు పెట్టారు. స్పెయిన్‌లోని ఆల్బా రాజ్య వారసుడు, 17వ హ్యూస్కర్ డ్యూక్ ఫెర్నాండో ఫిట్జ్–జేమ్స్ స్టువర్ట్, సోఫియా దంపతులకు ఇటీవల కూతురు జన్మించింది. ఫెర్నాండో ఆమెకు ప్రత్యేకంగా ఉండే ఏకంగా 25 పదాలు, 157 అక్షరాలతో కూడిన.. పొడవాటి పేరు పెట్టారు. అదేమిటంటే.. సోఫియా ఫెర్నాండా డొలొరెస్ కయెటనా టెరెసా ఏంజెలా డీ లా క్రుజ్ మికేలా డెల్ శాంటిసిమో సక్రామెంటో డెల్ పర్పెటువో సొకొర్రో డీ లా శాంటిసిమా ట్రినిడాడ్ వై డీ టొడొస్ లాస్ సాంటోస్'. ఇంతవరకు బాగానే ఉన్నా, ఈ పేరును అధికారికంగా రిజిస్టర్ చేసేందుకు స్పెయిన్ అధికారులు మాత్రం అంగీకరించడంలేదు. నిబంధనలకు లోబడి చిన్నగా ఉండే పేరును కూతురికి పెట్టుకోవాలని, అప్పుడే రికార్డుల్లో నమోదు చేస్తామని రాకుమారుడికి అధికారులు సూచించారు. దీనిపై రాకుమారుడు స్పందించాల్సి ఉంది.

ఆ ఇరాన్ యువతి మృతి



దుబాయ్: ఇరాన్‌లో కొద్ది వారాల కింద హిజాబ్ ధరించకుండా మెట్రో రైల్లో ప్రయాణిస్తూ అంతుబట్టని రీతిలో తీవ్ర గాయాలపాలైన టీనేజ్ యువతి మరణించింది. కొద్ది రోజుల కోమా అనంతరం ఆమె తుదిశ్వాస విడిచినట్టు ప్రభుత్వ మీడియా శనివారం ఈ మేరకు వెల్లడించింది. అర్మిత గెర్వాండ్ అనే ఆ యువతి అక్టోబర్ 1న టెహ్రాన్‌లో మెట్రోలో ప్రయాణిస్తూ గాయపడింది. ఆమె ట్రైన్‌లోంచి ప్లాట్‌ఫాంపైకి వచ్చి పడుతున్న వీడియో బయటికి వచ్చింది. మెట్రోలో ఏమైందో ఇప్పటిదాకా బయటికి రాలేదు. హిజాబ్ ధరించనందుకే పోలీసులు ఆమెకు ఈ గతి పట్టించి ఉంటారని హక్కుల సంఘాలు మండిపడుతున్నాయి. ఏడాది కింద ఇలాగే హిజాబ్ ధరించనందుకు 22 ఏళ్ల మహ్సా అమినీని మోరల్ పోలీసులు తీవ్రంగా కొట్టడం, ఆమె జైల్లో మరణించడం, దానిపై దేశవ్యాప్తంగా తీవ్రస్థాయిలో నిరసనలు, ఆందోళనలు పెల్లుబుకడం తెలిసిందే. ఈ నేపథ్యంలో గెర్వాండ్ మృతితో మళ్లీ అలాంటి పరిస్థితులు తలెత్తుతాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

పెరుగుతున్న ఉల్లి ఘాటు

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఉల్లి ఘాటెక్కుతోంది. ఉత్తర భారతంలోని ఢిల్లీ సహా ఉత్తర్‌ప్రదేశ్, హరియాణా రాష్ట్రాల్లో నవరాత్రులు ముగిసిన అనంతరం నుంచి ధరలు పెరుగుతున్నాయి. పది రోజుల కిందటి వరకు ఢిల్లీలో కిలో ఉల్లి ధర రూ.30–40 వరకు ఉండగా ఇప్పుడు రూ.60–70కి చేరుకుంది. ఈ ధర నవంబర్ తొలివారం ముగిసేనాటికి ఏకంగా రూ.100 మార్కును చేరే ప్రమాదం ఉందని మార్కెట్ వర్గాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఉల్లి సరఫరాలో కీలకంగా ఉన్న మహారాష్ట్రలోని నాసిక్ మార్కెట్లకు సరఫరా తగ్గిందని, ఈ కారణంగా ధరలు పెరుగుతున్నాయని వారు వాదిస్తున్నారు. ధరల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం బఫర్ స్టాక్ నుంచి 1.70 లక్షల టన్నుల ఉల్లి నిల్వలను మార్కెట్‌లోకి విడుదల చేసింది. మరింత స్టాక్‌ను విడుదల చేసే అవకాశాలున్నాయని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. శనివారం ఢిల్లీలోని 400 సఫల్ రిటైల్ స్టోర్లలో కేజీ ఉల్లి రూ.67కు విక్రయించారు. బుధవారం ఇవే స్టోర్లలో రూ.54–56 పలికిన కిలో ఉల్లి ఇప్పుడు హఠాత్తుగా పైకి ఎగిసింది. నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్(ఎన్‌సీసీఎఫ్), జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ సమాఖ్య(నాఫెడ్) సొంత ఔట్‌లెట్లు, వాహనాల్లో మాత్రం సబ్సిడీ రేటుకే కేజీ ఉల్లిని రూ.25కే విక్రయిస్తుండం విశేషం. కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం శనివారం దేశవ్యాప్తంగా కేజీ ఉల్లి సగటు ధర రూ.45 మాత్రమే.

మళ్లీ అధికారమిస్తే ఉచిత విద్య

ఛత్తీస్‌గఢ్‌లో రాహుల్ గాంధీ హామీ



రాయ్‌పూర్: కాంగ్రెస్‌కు మరోసారి అధికారమిస్తే పాఠశాల, కళాశాల విద్యను ఉచితంగా అందజేస్తామని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటించారు. తునికాకు సేకరించే వారికి ఏడాదికి రూ.4 వేలు అందజేస్తామని కూడా ఆయన హామీ ఇచ్చారు. గిరిజన ప్రాబల్య బస్తర్ ప్రాంతంలోని కాంకేర్ జిల్లా భానుప్రతాప్‌పూర్ నియోజకవర్గంలో శనివారం జరిగిన ఎన్నికల ర్యాలీలో ఆయన ప్రసంగించారు. 'కాంగ్రెస్ పార్టీని మళ్లీ గెలిపిస్తే మీ కోసం మేం పెద్ద నిర్ణయం తీసుకుంటాం. కేజీ నుంచి పీజీ వరకు ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఉచిత విద్యను అందిస్తాం. ఒక్క పైసా కూడా చెల్లించనవసరం లేకుండా చదివిస్తాం' అని రాహుల్ చెప్పారు. తునికాకులు సేకరించే వారికి ఏడాదికి రూ.4 వేలు అందజేస్తామన్నారు. కేంద్రంలో తమ పార్టీ అధికారంలోకి వస్తే కులగణన చేపడుతుందని స్పష్టం చేశారు. ఎప్పుడూ ఓబీసీల (ఇతర వెనుకబడిన కులాలు) గురించి మాట్లాడే ప్రధాని మోదీ, కులగణన అంటే ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం ఇద్దరు, ముగ్గురు పారిశ్రామిక వేత్తల లబ్ధి కోసమే పనిచేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ రైతులు, దళితులు, కార్మికులు, ఆదివాసీల కోసం పనిచేస్తుందని హామీ ఇచ్చారు. ఆదివాసీలను బీజేపీ వనవాసీలుగా పేర్కొనడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది ఆదివాసీల చరిత్ర, భాష, సంస్కృతిపై జరుగుతున్న దాడిగా పేర్కొన్నారు.

ఆ హంతకుడు చనిపోయాడు

అమెరికా కాల్పుల నిందితుని ఆత్మహత్య!

లెవిస్టన్ (అమెరికా): అమెరికాలో రెండు రోజుల క్రితం విచ్చలవిడి కాల్పులతో 18 మందిని పొట్టన పెట్టుకున్న హంతకుడు రాబర్ట్ కార్డ్ (40) మరణించాడు. కాల్పుల ఘటన జరిగిన లిస్బన్‌కు సమీపంలోనే శుక్రవారం రాత్రి అతని మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు మైనే రాష్ట్ర గవర్నర్ జానెట్ మిల్స్, కమిషనర్ ఆఫ్ పబ్లిక్ సేఫ్టీ మైకేల్ సౌషుక్ ప్రకటించారు. 'అక్కడి రీ సైక్లింగ్ సెంటర్ సమీపంలో చెట్ల పొదల్లో శవాన్ని గమనించి స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. అది రాబర్ట్‌దిగా తేలింది. అతని శరీరంపై తూటా గాయాలున్నాయి' అని వివరించారు. రాబర్ట్ కాల్చుకుని చనిపోయినట్టు భావిస్తున్నారు. దాంతో స్థానికులంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆ రీ సైక్లింగ్ సెంటర్లో రాబర్ట్ గతంలో పని చేసినట్టు సమాచారం. రెండు రోజులుగా మూతబడ్డ స్కూళ్లు, దుకాణాల వంటివన్నీ రాబర్ట్ మృతి వార్త నేపథ్యంలో తెరుచుకున్నాయి. టెన్‌పిన్ బౌలింగ్ వేదిక వద్ద, సమీపంలోని బార్ అండ్ రెస్టారెంట్లో రాబర్ట్ విచ్చలవిడిగా కాల్పులకు దిగడం తెలిసిందే. ఈ ఘటనలో గాయపడ్డ 13 మందిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. రాబర్ట్ తన కొడుక్కు రాసిన సూసైడ్ లెటర్‌ను కూడా అతని ఇంట్లో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



బీఆర్ఎస్ ర్యాలీ.. బీజేపీ ప్రచారం

శనివారం ఆదిలాబాద్‌లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ క్రమంలో ర్యాలీ ఆదిలాబాద్ కలెక్టర్ చౌక్ ప్రాంతానికి రాగానే అకస్మాత్తుగా బీజేపీ ప్రచార రథం ఎదురైంది. ఈ దృశ్యం బీఆర్ఎస్ బైక్ ర్యాలీలో.. బీజేపీ ప్రచారం చేస్తున్నట్టు కనిపించింది..

– సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

గాసిప్ టైమ్

పొట్టు పొట్టు కష్టపడ్డా... ఫలితం లేకపాయె..

కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు చిత్ర విచిత్రంగా ఉంటాయి. ఆ పార్టీలో ఎవరు ఎప్పుడు లీడర్ అవుతారో, ఎవరిని ఏ పదవి వరిస్తుందో, ఎక్కడి నుంచి టికెట్ తన్నుకుని వస్తుందో, ఎంత కష్టపడ్డా టికెట్ ఎందుకు రాదో ఎవరికీ అర్థం కాదు. టికెట్ వస్తుందని ఆశిస్తూ ఎంతగా కష్టపడినా తినే ముద్దను ఎవరో వచ్చిలాక్కున్నట్లు టికెట్‌ను కూడా తన్నుకుపోతారు. అలాంటి కోవలోకే వస్తారు ఆ పార్టీకి చెందిన విద్యార్థి సంఘం నేత. విద్యార్థి, యువజన వర్గాలకు ఏ సమస్య వచ్చినా ముందుండి పోరాడే క్రమంలో కాళ్లు, చేతులు కూడా విరగ్గొట్టుకోవాల్సి కూడా వచ్చింది. ఆయన మీద లెక్కలేనన్ని కేసులు పెట్టారు. పార్టీకోసం ఇంత కష్టపడినా చివరకు టికెట్ మాత్రం దక్కలేదు. తనకే ఖాయమని బిందాస్‌గా ఉన్న సమయంలోనే మరో నాయకుడు వచ్చి హుజూరాబాద్ టికెట్ ఎగరేసుకుని పోయారు. ఇదే ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడికి గతంలో జరిగిన ఉపఎన్నికల్లో మాత్రం అనూహ్యంగా టికెట్ లభించింది. అబ్బా...పోరాటానికి గుర్తింపునిచ్చారని నాడు సంతోషపడిన ఆ అధ్యక్షుడు ఈసారి 'హ్యాండి' చ్చేసరికి డీలా పడిపోయాడట.

జంగ్ తెలంగాణ

నేటి మాట..

నా ప్రత్యర్థి పాత వెస్పాలాంటి వాడు. నేను స్పోర్ట్స్ బైక్ లాంటోడిని. ప్రత్యర్థి బండి వంచి కిక్ కొట్టినా స్టార్ట్ కాదు. నేను సెల్ఫ్ స్టార్ట్ లాంటి వాడిని. మీకు వెస్పా కావాలా, కొత్త మోడల్ స్పోర్ట్స్ బైక్ కావాలా అనేది యువత తేల్చుకోవాలి.


– ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావును ఉద్దేశించి బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



'ఐ విల్ ఓట్.. బికాజ్ ఐ లవ్ సూర్యాపేట'

ఓటు ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన

సెల్ఫీ పాయింట్ వద్ద ఫొటో దిగిన కలెక్టర్, అదనపు కలెక్టర్లు



దురాజ్‌పల్లి (సూర్యాపేట): 'ఐ విల్ ఓట్.. బికాజ్ ఐ లవ్ సూర్యాపేట'అని రాసి ఉన్న సెల్ఫీ పాయింట్ వద్ద సూర్యాపేట జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు, అదనపు కలెక్టర్లు ప్రియాంక, వెంకట్‌రెడ్డి ఫొటో దిగారు. జిల్లాలో ఓటింగ్ శాతం పెంచేందుకు, ఓటు ఆవశ్యకతపై అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ వద్ద సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేశారు. శనివారం అక్కడ ఫొటో దిగిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి నియోజకవర్గానికి 12 చొప్పున సెల్ఫీ పాయింట్స్‌ను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రాలు, మండలాల్లో ప్రజలు రద్దీగా ఉండే ప్రాంతాలలో సెల్ఫీ పాయింట్స్ ఏర్పాటు చేసి ఓటు ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు చాలా కీలకమని, అర్హత ఉన్న ప్రతివారూ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

'సోషల్' మానిటరింగ్!

ఎన్నికల ప్రశాంతతను చెడగొట్టే మెసేజ్‌లపై పోలీసుల నిఘా

అన్ని జిల్లాల్లో సోషల్ మీడియా మానిటరింగ్ సెల్స్ ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారం నేపథ్యంలో సోషల్ మీడియా వేదికలను అన్ని పార్టీల వారూ విరివిగా వాడుతున్నారు. ప్రత్యర్థులపై విరుచుకుపడేందుకు వీటిని అస్త్రాలుగా మార్చుకుంటున్నారు. అయితే సోషల్ మీడియాలో వ్యాఖ్యలు, వ్యంగ్యాస్త్రాలు శ్రుతిమించకుండా పోలీసులు నియంత్రణ చర్యలు చేపట్టారు. ఈ మేరకు ప్రతి జిల్లా పరిధిలో సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రశాంతతను చెడగొట్టే, కించపర్చే వ్యాఖ్యలు, వర్గాల మధ్య ఉద్రిక్తలకు దారితీసే ఫొటోలు, వీడియోలు, సందేశాలపై నిఘా పెడుతున్నారు. స్థానికంగా నేతల పర్యటనలు, సభలు, ఇతర కార్యక్రమాలు ఉన్నప్పుడు ప్రత్యర్థులను రెచ్చగొట్టే, కించపర్చే సందేశాలు ఉంటున్నాయా.. అని మానిటరింగ్ సెల్ సిబ్బంది పరిశీలిస్తున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమించిన పోస్టులపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటున్నారు. వర్గాల మధ్య వైషమ్యాలు తెచ్చేలా, ఇతర వర్గాలను కించపర్చేలా ఎవరైనా పోస్టులు పెట్టినా చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు.



మాస్టర్ ప్లాన్.. అమలు చేస్తేనే మేలు

పీపుల్స్ మేనిఫెస్టో వరంగల్

హైదరాబాద్ తర్వాత అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న మహానగరం వరంగల్. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నగర అభివృద్ధి కోసం రచించిన ప్రణాళికలు అంతే వేగంగా అమలు కావడం లేదు. గ్రేటర్ వరంగల్ నగర విస్తీర్ణం 408 చదరపు కిలోమీటర్లు కాగా జనాభా 10.90 లక్షలకు చేరింది. ఉమ్మడి వరంగల్ అనేక మందికి నివాసయోగ్య నగరంగా మారింది. ఇక్కడి ప్రజల ఎజెండాను అమలు చేయాల్సిన అవసరం ఉందని నగర వాసులు కోరుతున్నారు.

– సాక్షి ప్రతినిధి, వరంగల్

అల్లంతదూరాన 'మాస్టర్‌ప్లాన్'...

వరంగల్ మాస్టర్‌ప్లాన్–2042 సర్కారు ఆమోదం కోసం ఎదురుచూస్తోంది. 42 నెలలుగా ముఖ్యమంత్రి పేషీ నుంచి ఫైల్ కదలడం లేదని అధికారులే చెబుతున్నారు. ఫలితంగా రాష్ట్రంలో పెద్ద సిటీగా.. 10.90 లక్షలకు మించిన జనాభా ఉన్న గ్రేటర్ వరంగల్‌లో 50 ఏళ్ల నాటి మాస్టర్ ప్లానే ఇప్పటికీ అమల్లో ఉంది. వెంటనే మాస్టర్‌ప్లాన్ – 2042ను అమల్లోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

పెండింగ్‌లో 'ఇన్నర్ రింగ్‌రోడ్డు'....

1972లో 'కుడా'ఆవిర్భావంలో ఏర్పడిన మాస్టర్ ప్లాన్‌లో భాగంగా నగరానికి ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మించాలని ప్రతిపాదనలు పొందుపర్చారు. భూ సేకరణకు 2013లో రూ.13 కోట్లు ఆర్‌డీఓ పేరిట జమ చేశారు. తదుపరి మరో రూ.50 కోట్ల నిధులు రెవెన్యూ శాఖకు అప్పగించారు. కానీ ఇంత వరకు భూ సేకరణ పూర్తి కాలేదు. పనులు పూర్తి కాలేదు.

కలగా రోప్ వే...

ఏపీలోని విశాఖ నగరంలో కైలాసగిరి పైకి ఎలాగైతే రోప్‌వే (వేలాడే పెట్టె) ఉందో అలాంటిదే వరంగల్ నగరంలో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. భద్రకాళి గుడికి వచ్చిన వారు భద్రకాళి చెరువు అందాలను వీక్షిస్తూ హనుమకొండ పద్మాక్షి గుట్టకు చేరుకుంటారు. అక్కడి నుంచి హంటర్ రోడ్డు జూపార్కు ఎదురుగా ఉన్న రీజినల్ సైన్స్ కేంద్రం గుట్టపై వరకు రోప్‌వే డిజైన్ చేశారు. ఈ ప్రాజెక్టుకు 2007లో టెండర్లు పిలిచారు. వైజాగ్ రోప్‌వే ప్రాజెక్టు చేసిన కోల్‌కతాకు చెందిన ఒక ప్రైవేటు సంస్థ ముందుకొచ్చింది. కానీ ఆ తర్వాత పనులు ముందుకెళ్లలేదు.

మామునూరు ఎయిర్‌పోర్టు... నియో రైలు..

వరంగల్‌లోని మామునూరులో విమానాశ్రయం రావాలన్నది ఎన్నో ఏళ్ల కల. ఒకప్పుడు ఇక్కడ విమానాలు ఎగిరాయి. ఇప్పటికీ రన్‌వే, విమానాశ్రయం ఉన్నాయి. మట్టి నమూనా పరీక్షలను కూడా ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా వాళ్లు ఏడాదిన్నర క్రితం చేపట్టారు. ఇక మిగిలిన స్థలసేకరణ బాధ్యత రాష్ట్రానిది. ఈ ప్రక్రియపై వేగం పెరిగి పూర్తయితే రెండు, మూడేళ్లలో ఈ ప్రాంత ప్రజలకు విమానయానయోగం సులువవుతుంది. అలాగే హైదరాబాద్ నగరంలో ఉన్నట్టు వరంగల్‌లోనూ మెట్రో రైలును తీసుకొచ్చేందుకు సిద్ధమైన ప్రతిపాదనలు, ప్రణాళికలు ఇంకా కాగితాలపైనే ఉన్నాయి.

'ఔటర్ రింగ్‌రోడ్డు'అలాగే...

ఔటర్ రింగు రోడ్డు పనులకు సీఎం కేసీఆర్ 2017 అక్టోబర్‌లో శంకుస్థాపన చేశారు. మొత్తంగా నగరం చుట్టూ 69 కిలోమీటర్ల మేర ఔటర్ రింగు రోడ్డును ప్రతిపాదించారు. ఇంకా 40 కిలోమీటర్ల మేర పూర్తి కావాల్సి ఉంది.

మునురు మొదలయ్యిందంటే 'ముంపు'భయం..

గ్రేటర్ వరంగల్ నగర విస్తీర్ణం 408 చదరపు కిలోమీటర్లు. నగరంలో 66 డివిజన్లు ఉన్నాయి. సుమారు 1,500 పైగా కాలనీలుంటాయి. ఇందులో 40 శాతం కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థ లేదు. భూ కబ్జాలు, ఆక్రమణలతో 40కి పైగా లోతట్టు కాలనీలు ప్రమాదపు అంచులో ఉంటున్నాయి. కాస్త వర్షం కురిస్తేనే కాలనీలు ఏరులై వరంగల్ నగరాన్ని ముంచెత్తుతున్నాయి.

సాక్షి విజిట్

తాండ్ర కృష్ణగోవింద్

రాష్ట్రంలో అంతరించిపోతున్న ఆదిమ జాతుల్లో ఒకటైన కొండరెడ్లకు ఓటు హక్కు కల్పించేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యంత్రాంగం ప్రత్యేకంగా దృష్టి సారించింది. దీంతో ఈ ఏడాది కొత్తగా 71 మంది కొండరెడ్లు ఓటుహక్కు పొందారు. సమాజానికి దూరంగా అడవుల్లో నివసించే కొండరెడ్లను సైతం ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములను చేయడంపై జిల్లా యంత్రాంగం చేసిన కృషిని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వికాస్‌రాజ్ సైతం అభినందించారు. దీంతో ఒక్కసారిగా కొండరెడ్లు ఫోకస్‌లోకి వచ్చారు. ఈ నేపథ్యంలో రాబోయే ఎన్నికలపై కొండరెడ్ల జీవన స్థితిగతులతో పాటు అక్కడి ప్రజల ఆశలు, ఆకాంక్షలు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు 'సాక్షి' ప్రయత్నించింది.

ఆ పల్లెను చూసింది నలుగురు ఎమ్మెల్యేలే!



అరుదైన ఆదిమజాతి కొండరెడ్లపై పాలకులు, రాజకీయ పార్టీల చిన్నచూపు

ఈసారి ఓటు వేయనున్న 692 మంది

వేగంగా తగ్గిపోతున్న కొండరెడ్ల జనాభా

దట్టమైన అడవిలో..: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ – దమ్మపేట మార్గంలోని దట్టమైన అటవీ మార్గంలో ముప్పై కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే ఒక ఫారెస్ట్ చెక్ పోస్టు వస్తుంది. అక్కడి నుంచి రోడ్డు మార్గం లేని కాలిబాటలో 13 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే.. . కొండరెడ్లు నివాసముండే పూసుకుంట అనే గ్రామం వస్తుంది. ఇక్కడ 138 మంది కొండరెడ్లు నివసిస్తున్నారు. ఇందులో 80 మందికి గతంలో ఓటుహక్కు ఉండగా ఈ ఏడాది కొత్తగా 14 మందికి ఓటుహక్కు వచ్చింది.

ఆ గ్రామం చూసిన ఎమ్మెల్యేలు నలుగురే..: గడిచిన డెబ్బై ఏళ్లుగా ఈ గ్రామాన్ని సందర్శించింది కేవలం నలుగురు ఎమ్మెల్యేలే. వారే జలగం ప్రసాదరావు, తుమ్మల నాగేశ్వరరావు, వగ్గేల మిత్రసేన, తాటి వెంకటేశ్వర్లు. కొండ రెడ్ల ఓట్లు తక్కువగా ఉండటం, ఇతరులతో కలవకుండా వేరుగా నివసిస్తుండడంతో బడా నేతలు కానీ రాజకీయ పార్టీలు దృష్టి పెట్టడం లేదు. ఎన్నికల వేళ కేవలం ఓటర్లుగానే పరిగణిస్తున్నారు తప్ప అరుదైన గిరిజన జాతిగా గుర్తించడం లేదు. ఫలితంగా ఈ జాతి అంతరించిపోయే ప్రమాదాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు.

గవర్నర్ రాకతో..: రాష్ట్ర గవర్నర్ తమిళిసై 2022 ఏప్రిల్‌లో ప్రత్యేకంగా పూసుకుంట గ్రామాన్ని సందర్శించారు. మావోయిస్టు ప్రభావిత జిల్లాలో ప్రధాన రహదారి నుంచి 13 కి.మీ దూరంలో పూర్తిగా అటవీ ప్రాంతంలో ఉన్న ప్రజలను ఆమె పలకరించడం అందరి దృష్టినీ ఆకర్షించింది. దీంతో ఈ గ్రామానికి ప్రభుత్వపరంగా వివిధ పక్కా భవనాలు మంజూరయ్యాయి. తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయగా, రవాణా సౌకర్యం కోసం ఎలక్ట్రిక్ ఆటో సమకూర్చారు. అలాగే, ఇక్కడి ప్రజలకు వెదురుతో అలంకరణ వస్తువులు తయారు చేయించడంపై శిక్షణా కేంద్రాన్ని నెలకొల్పారు.



నిరుపయోగంగా మారిన మినరల్ వాటర్ ప్లాంట్

ఆ సౌకర్యాలు మూణ్నాళ్ల ముచ్చటే..: గవర్నర్ రాకతో హడావుడిగా వచ్చిన సౌకర్యాలు ఇప్పుడు మూలనపడ్డాయి. ఆర్వో ప్లాంట్‌లో వాటర్ ట్యాంక్ పగిలిపోగా, బ్యాటరీ ఆటో రిపేరుకు వచ్చింది. శిక్షణా కేంద్రానికి వేసిన తాళం తీయడం లేదు. వీటిపై ఐటీడీఏ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. వెదురు బుట్టల మార్కెటింగ్‌పై దృష్టి సారించకపోవడంతో స్థానికులు వాటి తయారీపై ఆసక్తి చూపడం లేదు. గతంలో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెళ్లదీ ఇదే పరిస్థితి.

కొండ దిగినా..: డెబ్బై ఏళ్లుగా ప్రభుత్వాలు, ఐటీడీఏ చేసిన ప్రయత్నాలతో కొండలు దిగి కింద ఉన్న అడవుల్లో కొందరు గ్రామాలను ఏర్పాటు చేసుకుంటే మరి కొందరు మైదాన ప్రాంతాల సమీపాన ఉండే అడవుల్లో నివాసం ఏర్పాటు చేసుకున్నారు. కానీ ప్రభుత్వ పరంగా వీరి కోసం అమలు చేసే పథకాల అమలులోనూ చిత్తశుద్ధి లోపించడంతో సరైన ఫలితాలు రావట్లేదు. దాంతో వారు ఇంకా పేదరికంలోనే మగ్గుతున్నారు.

ప్రమాదపుటంచున..: అడవుల్లో ఉండటం, జీవన విధానం, సంస్కృతి, ఆహారపు అలవాట్లు, వేషభాషల ఆధారంగా 1975లో దేశవ్యాప్తంగా అరుదైన ఆదిమజాతులను (ప్రిమిటీవ్ ట్రైబల్ గ్రూప్) ప్రభుత్వం గుర్తించింది. అయితే రానురానూ ఈ ఆదిమ జాతుల జనాభా వేగంగా తగ్గిపోతుండటంతో 2006లో అత్యంత ప్రమాదంలో ఉన్న ఆదిమ జాతులుగా పేరు మార్చారు. ఈ కేటగిరీకి చెందిన 12 రకాల ఆదిమ జాతులు ఉమ్మడి ఏపీలో ఉండేవి. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో నాలుగు రకాలైన ఆదిమ తెగలే ఉన్నాయి. 2018–19లో రాష్ట్ర గిరిజన శాఖ వెల్లడించిన లెక్కల ప్రకారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొలం (జనాభా 40 వేలు), తోటి (4 వేలు), నల్లమల్ల అడవుల్లో చెంచులు (16 వేల జనాభా)తో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 2 వేల మంది కొండరెడ్లు ఉన్నట్టు తేలింది. తాజాగా ఓటర్ల జాబితాకు వచ్చేసరికి కొండరెడ్ల జనాభా సగానికి సగం తగ్గిపోయి కేవలం 1,054కే పరిమితమైంది. ఇందులో 692 మందికి ఓటు హక్కు ఉంది. వీరంతా దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లో ఉన్న ఏడు కొండరెడ్డి గూడెల్లో నివాసం ఉంటున్నారు.

రోడ్డు కావాలి..



మా ఊరికి రోడ్డు కావాలని ఎప్పటి నుంచో చెబుతున్నాం. వర్షాకాలం వస్తే ఊరు దాటడం కష్టం. ఏదైనా అత్యవసర పరిస్థితి వస్తే దేవుడే దిక్కు. నీళ్ల ప్లాంటు, అంబులెన్స్, ఆటోలు పని చేయడం లేదు.

– ఉమ్మల దుర్గ, పూసుకుంట

చదువు ఆపేశాను



నాకు ఇటీవలే ఓటు హక్కు వచ్చింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా నేను, తమ్ముడు తొమ్మిదో తరగతితోనే చదువు ఆపేసి పనులకు వెళ్తున్నాం. – ఇస్మాయిల్‌రెడ్డి, వీరారెడ్డిగూడెం



పూసుకుంట గ్రామం

పవన్ కల్యాణ్ రాయబారం సఫలం కాలేదా?!



కొమ్మినేని శ్రీనివాసరావు

తెలుగు రాష్ట్రాల్లో టీడీపీతో పొత్తుకు బీజేపీ ఇంకా సిద్ధపడటం లేదా! టీడీపీని, బీజేపీని జత చేయాలన్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాయబారం అంత సఫలం కాలేదనే అనుకోవాలా? ప్రస్తుతానికైతే అలాంటి అభిప్రాయమే ఏర్పడుతోంది. తెలంగాణలో జనసేనతో పొత్తు పెట్టుకోవాలని బీజేపీ ఆలోచించడమే విడ్డూరమనిపిస్తోంది. ఏపీలో అనైతిక పొత్తుకు తెర దీసిన జనసేనతో కలిసి తెలంగాణలో బీజేపీ ఎలా కలిసి వెళ్తుందన్నది ఆశ్చర్యంగానే ఉంటుంది. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డితో కలిసి పవన్ కల్యాణ్, మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్ ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళ్లి బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలవడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ పరిణామంతో తెలంగాణలో ఏదో జరిగిపోతోందని ఎవరూ అనుకోలేదు కానీ, ఏపీ రాజకీయాల్లో ఎలాంటి మార్పు వస్తుందన్న చర్చ జరిగింది. ఎలాగోలా బీజేపీతో కలవాలని, తద్వారా తమపై వచ్చిన అవినీతి కేసుల నుంచి బయటపడాలని టీడీపీ చేస్తున్న ప్రయత్నాల సంగతి తెలిసిందే. ఆ పార్టీకి అండగా నిలుస్తున్న పవన్ కల్యాణ్ టీడీపీ ప్రభుత్వంలో జరిగిన అవినీతిని, ఆదాయపు పన్ను శాఖ చంద్రబాబుకు ఇచ్చిన నోటీసు వంటి వాటిని పట్టించుకోకుండా సమర్థిస్తున్న తీరు జనసేన వర్గాలకే మింగుపడటం లేదు. తాను ఎన్డీయేలో ఉన్నప్పటికీ, బీజేపీ మిత్రపక్షంగా ఉన్నప్పటికీ దానిని పక్కనబెట్టి పవన్ టీడీపీతో కలిసి పనిచేస్తున్నారు. పెళ్లి ఒకరితో, కాపురం మరొకరితో అన్నట్లు ఏపీ రాజకీయాల్లో పవన్ వ్యవహరిస్తున్నా, బీజేపీ పెద్దగా ఫీల్ కాకుండా ఆయనతో తెలంగాణలో పొత్తు కోసం చర్చలు జరిపింది. ఆ క్రమంలో ఆయన అమిత్ షా వద్దకు తీసుకెళ్లాలని కోరారట. దాంతో కిషన్‌రెడ్డి ఢిల్లీకి వెంటబెట్టుకుని వెళ్లారు. అక్కడ షాతో జరిపిన చర్చల్లో ఏపీ రాజకీయాలు చర్చకు వచ్చాయంట కానీ, జనసేన, టీడీపీ కలిసి ఏపీలో పనిచేస్తున్న విషయం ప్రస్తావనకు రాలేదట. ఇది ఈనాడు పత్రికలో రాసిన కథనంలోని ఒక అంశం. దీనిని ఎవరైనా నమ్ముతారా? తెలంగాణలో బీజేపీ, జనసేన పొత్తు గురించి మాత్రమే చర్చకు వచ్చిందట. అందులో సీట్ల బేరసారాలు సాగాయి. వాటిని రాష్ట్రస్థాయిలో తేల్చుకోండని అమిత్ షా వారిని పంపించేశారు. ఏపీలో చంద్రబాబు అవినీతి కేసులో అరెస్టయి జైల్లో ఉన్న విషయం సహజంగానే ప్రస్తావనకు వచ్చి ఉండాలి. అందులో తమ ప్రమేయమేమీ లేదని, చట్టం తన పని తాను చేసుకుని పోతుందని షా చెప్పి ఉండాలి. ఏపీ రాజకీయాలకు లింక్ పెట్టి తెలంగాణలో పొత్తు కుదుర్చుకోవాలన్న పవన్ వ్యూహం అంత సఫలమైనట్లు లేదు. అందుకే పవన్, మనోహర్ ఇద్దరూ మీడియాతో మాట్లాడకుండా వెళ్లిపోయారనిపిస్తుంది. తదుపరి కిషన్‌రెడ్డి.. టీడీపీతో పొత్తు గురించి మాట్లాడుతూ ఆ పార్టీ ఎన్డీయేలో భాగస్వామి కాదని తేల్చేశారు. నిజంగానే బీజేపీ పొత్తు పెట్టుకోదలిస్తే క్షణాల్లో

టీడీపీ, బీజేపీలను జత చేయాలన్న వ్యూహం బెడిసికొట్టిందా?

తెలుగు రాష్ట్రాల్లో టీడీపీతో పొత్తుకు బీజేపీ సిద్ధపడట్లేదా?

ఆశ్చర్యకరంగా తెలంగాణలో జనసేన, బీజేపీ పొత్తు

టీడీపీని ఎన్డీయేలో చేర్చుకున్నట్లు ప్రకటించేది కదా!

అయితే కొద్దికాలం క్రితం టీడీపీ నేత లోకేశ్ తాము ఎన్డీయేకి, ఇండియా కూటమికి సమదూరంలో ఉన్నామని ప్రకటించారు. దాంతో బీజేపీ ఈ విషయంలో చొరవ చూపడానికి ఇష్టపడట్లేదని చెబుతున్నారు. భవిష్యత్తులో ఏమవుతుందోగానీ, ఇప్పటికైతే టీడీపీతో పొత్తుకు రెండు తెలుగు రాష్ట్రాల్లో బీజేపీ సిద్ధపడట్లేదని స్పష్టమవుతోంది. తెలంగాణలో కూడా టీడీపీని తోడు తీసుకెళ్లాలని అనుకున్న పవన్ వ్యూహం బెడిసినట్లుంది. అదే సమయంలో సొంతంగా పోటీ చేస్తామని మొదట బెదిరించిన టీడీపీ ఆ తర్వాత తోక ముడిచిందన్న వార్తలు వస్తున్నాయి. తెలంగాణలో జనసేనతో పొత్తు అని చెప్పినప్పటికీ అమిత్ షా పాల్గొన్న సూర్యాపేట సభలో పవన్ కళ్యాణ్ లేదా ఆయన పార్టీ నేతలు పాల్గొనకపోవడం కూడా గమనించాల్సిన అంశమే. ఒకపక్క పొత్తు కుదిరిందని చెబుతారు. మరోవైపు ఎడమొహంగా, పెడమొహంగా ఉంటున్నారు.

బీజేపీకి ఏమైనా కలిసొస్తుందా?

ఇక, తెలంగాణలో పవన్ కల్యాణ్ వల్ల బీజేపీకి ఏమైనా కలిసొస్తుందా అన్న చర్చ ఉంది. ఆయా చోట్ల జన సమీకరణకు పవన్ కల్యాణ్ ఉపయోగపడొచ్చు. ఎందుకంటే ఆయన సినీ నటుడిగా ఉన్నారు కనుక. కానీ ఓట్లు, విజయావకాశాలను ఎంతవరకు ప్రభావితం చేయగలర్నది చర్చనీయాంశమే. తెలంగాణలో ఉన్న ఆంధ్ర సెటిలర్లలో కాపు వర్గాన్ని, తెలంగాణలో బలంగా ఉన్న మున్నూరు కాపు వర్గాన్ని, సినిమాల పరంగా ఆయనకు ఉన్న అభిమానులను ఆకర్షించడానికి బీజేపీ పవన్ కల్యాణ్‌తో పొత్తు పెట్టుకోవాలన్న ఆలోచనకు వచ్చి ఉండొచ్చు. మరోవైపు టీడీపీ, జనసేన పొత్తు ఏపీలో ఉన్నందున, కొంతమంది పవన్ అభిమానులు కూడా కాంగ్రెస్ వైపు వెళ్లకుండా ఉండటానికీ ఈ ప్లాన్ వేసి ఉండొచ్చు. టీడీపీ ప్రస్తుతం తెలంగాణలో పరోక్షంగా కాంగ్రెస్‌కు సాయపడుతున్న నేపథ్యంలో బీజేపీ ఆ విషయాలను కూడా పరిగణనలోకి తీసుకుని టీడీపీతో స్నేహానికి ఇష్టపడకపోయి ఉండొచ్చు.

ఆంధ్ర పార్టీతో పొత్తుపై మళ్లీ అదే అస్త్రమా?


గత ఎన్నికల సమయంలో టీడీపీతో పొత్తు పెట్టుకుని కాంగ్రెస్ బాగా నష్టపోయింది. ఆంధ్ర పార్టీతో కాంగ్రెస్ పొత్తేమిటని బీఆర్ఎస్ వ్యతిరేక ప్రచారం చేసింది. ఈసారి పవన్, బీజేపీ కలిస్తే ఆ సమస్య ఎలా ఉంటుదన్నది చూడాలి. సహజంగానే బీఆర్ఎస్ ఈ పరిణామాన్ని అబ్జర్వ్ చేస్తుంది. అవసరమైతే మళ్లీ అదే అస్త్రాన్ని ప్రయోగించవచ్చు. కాకపోతే జనసేనకు టీడీపీకి ఉన్నంత బలం లేనందున అంత సీరియస్‌గా కూడా తీసుకోకపోవచ్చు. ఏది ఏమైనా తెలంగాణలో బీజేపీ ఇచ్చే ఎనిమిదో పదో సీట్లకు జనసేన అంగీకరిస్తుందా? లేదా? అన్నది కూడా చూడాలి. అమిత్ షా వరకు వెళ్లాక ఆ విషయంలో పట్టుబడతారా అన్నది అనుమానమే. బీజేపీని బ్లాక్ మెయిల్ చేయడానికే గతంలో జనసేన 32 చోట్ల పోటీ చేస్తామని ప్రకటించింది. అది కొంత ఫలించి బీజేపీ చర్చలు జరిపి, అమిత్ షా వరకు తీసుకువెళ్లింది. కాగా జనసేనతోపాటు టీడీపీని బీజేపీతో కలపడానికి మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు కూడా కొంత ప్రయత్నం చేశారనే ప్రచారం జరుగుతోంది. స్థూలంగా చూస్తే పవన్ కళ్యాణ్ లక్ష్యం ఏపీ రాజకీయాలు. బీజేపీ ఉద్దేశం పవన్‌ను తెలంగాణలో ఉపయోగించుకోవడం. పవన్ కళ్యాణ్ రాయబారం ఫలించలేదు గానీ, బీజేపీ చెప్పినట్లు పవన్ వినక తప్పని పరిస్థితి ఏర్పడిందా అన్న సందేహం వస్తుంది.

వనమా వెంకటేశ్వరరావు.. 2018లో కొత్తగూడెం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఎన్నికలఅఫిడవిట్‌లో వనమా తప్పుడు సమాచారం ఇచ్చారని, కొన్నిచోట్ల ఇవ్వాల్సిన సమాచారం ఇవ్వకుండా దాచిపెట్టారని జలగం వెంకట్రావు హైకోర్టులో 2019, జనవరిలో ఎన్నికల పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన న్యాయస్థానం.. వనమా ఎన్నిక చెల్లదని తీర్పునిచ్చింది. రూ.5 లక్షల జరిమానా విధించింది. జలగం వెంకట్రావును ఎమ్మెల్యేగా ప్రకటించాలని ఈసీని ఆదేశించింది.

బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి.. 2018లో గద్వాల్ నుంచి శాసనసభ్యుడిగా ఎన్నికయ్యారు. ఎన్నికల సమయంలో కృష్ణమోహన్ రెడ్డి సమర్పించిన అఫిడవిట్ తప్పుల తడకగా ఉందని డీకే అరుణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. కృష్ణమోహన్ రెడ్డి ఎన్నిక చెల్లదని తీర్పునిచ్చింది. రూ.2.5 లక్షల జరిమానా కూడా విధించింది. డీకే అరుణను ఎమ్మెల్యేగా ప్రకటించాలని ఆదేశించింది

ఆ అభ్యర్థులిద్దరూ శాసనసభ్యులుగా విజయం సాధించిన వారే. ప్రజాఓటుతో గెలిచిన వారే. వారికి వచ్చిన ఓట్లను కోర్టు ఎక్కడా తప్పుబట్టలేదు. కానీ, అఫిడవిట్‌లో అన్ని అంశాలూ పేర్కొనలేదని, కొన్ని తప్పులుగా పేర్కొన్నారన్న కారణంగా వారిపై వేటు వేసింది. వారి తర్వాత రెండో స్థానంలో నిలిచిన అభ్యర్థులకు విజయం కట్టబెడుతూ కోర్టు తీర్పునిచ్చింది. ఇలా ఈ రెండు పిటిషన్లే కాదు.. దాదాపు 30 వరకు పిటిషన్లు హైకోర్టులో నమోదయ్యాయి. వనమా, బండ్ల, శ్రీనివాస్‌గౌడ్ కేసుల్లో విచారణ పూర్తయి తీర్పు వచ్చింది. ఇతర పిటిషన్లు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

తప్పులున్నా, అన్ని అంశాలు పేర్కొనకున్నా.. వేటుకు చాన్స్	వనమా, బండ్ల ఎన్నిక చెల్లదన్న ఉన్నత న్యాయస్థానం	పలువురు మంత్రులకూ తప్పని అవస్థలు	కోర్టులలో కొనసాగుతున్న అనర్హత పిటిషన్లు



గెలిచినా.. ఓడిపోతారు!

అభ్యర్థులూ.. అఫిడవిట్ సమర్పణలో తస్మాత్ జాగ్రత్త

గండ్రాతి అరవింద్‌రెడ్డి

ముఖ్యంగా సరిచూసుకోవాల్సిన అంశాలు..

- ఒకసారి కంటే ఎక్కువసార్లు పోటీ చేస్తున్న అభ్యర్థులైతే గతంలో వేసిన అఫిడవిట్‌తో ఈసారి అఫిడవిట్‌ను సరిచూసుకోవాలి.
- అభ్యర్థులు పోటీ చేస్తున్న నియోజకవర్గంలోనే కాకుండా ఇతర ప్రాంతాల్లోనూ కేసులున్నాయో.. లేదో..తెలుసుకోవాలి.
- సొంత ఆస్తులేకాదు.. కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న ఆస్తుల వివరాలను స్పష్టంగా పేర్కొనాలి. ఇది స్థిర, చర ఆస్తులకు కూడా వర్తిస్తుంది.
- కంపెనీలు, షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, బాండ్లు తదితర వివరాలను పొందుపర్చాలి
- ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బ్యాంక్ ఖాతాలు, ఇన్సూరెన్స్ పాలసీలు, రుణాలు, వడ్డీల ద్వారా వచ్చే ఆదాయం వివరాలను స్పష్టంగా పేర్కొనాలి
- మోటారు వాహనాలు, నగలు, బులియన్, ఇతర విలువైన వస్తువులు తూకంతో సహా వెల్లడించాలి

2018 ఎన్నికల తర్వాత 30కిపైగా పిటిషన్లు..

తప్పుడు అఫిడవిట్ల కారణంగా కోర్టు చుట్టూ తిరగాల్సిన పరిస్థితి. ఇలా ఒకటి రెండేళ్లు కాదు.. ఏళ్ల కొద్దీ కోర్టు మెట్లు ఎక్కాల్సి వస్తుంది. ఏ మాత్రం తప్పని తేలినా వేటు పడక తప్పదు. తీర్పు వచ్చే వరకు మనశ్శాంతి ఉండదు. 2018 ఎన్నికలే కాదు.... గతంలోనూ ఇలా కులం, ఆస్తుల విషయంలో కోర్టు చుట్టూ తిరిగిన వారున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల తర్వాత హైకోర్టులో 30కుపైగా పిటిషన్లు దాఖలు కాగా.. అందులో 25కుపైగా పిటిషన్లు ఒకే పార్టీకి చెందిన నేతలపై దాఖలయ్యాయి. పలువురు మంత్రులపై కూడా ఎన్నికల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. శ్రీనివాస్ గౌడ్‌పై తీర్పు రాగా.. కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్ ఎన్నికపై వివాదం నడుస్తోంది. ఇక ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వర్‌రావు, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఎన్నిక చెల్లదంటూ హైకోర్టు ఇప్పటికే తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే తర్వాత వీరు సుప్రీంకోర్టును ఆశ్రయించి.. స్టే తెచ్చుకున్నారు. ఇక చెన్నమనేని రమేశ్, మర్రి జనార్దన్, ముత్తిరెడ్డి, గూడెం మహిపాల్ రెడ్డితో పాటు మరికొందరిపై హైకోర్టులో పిటిషన్లు నడుస్తున్నాయి.

అన్నీ సరిచూసుకుని వివరాలివ్వాలి

రాష్ట్రంలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే నెల 3న వెలువడనుంది. అప్పటి నుంచి ఎన్నికల్లో పోటీ చేసే వివిధ పార్టీల, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు సమర్పించనున్నారు. వారి స్థిర, చర ఆస్తులు, అప్పుల అఫిడవిట్లు అందజేస్తారు. ఈ అఫిడవిట్ల సమర్పించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఈసీ తెలిపింది. కేసులు, తన ఆస్తులు, కుటుంబ సభ్యుల ఆస్తులు, అప్పులు.. ఇలా అన్ని అంశాలను సరి చూసుకుని అఫిడవిట్ అందజేయాలి. లేదంటే తర్వాత కోర్టు మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరిస్తోంది. గత 2018 ఎన్నికల సమయంలో తప్పుడు అఫిడవిట్లు ఇచ్చారంటూ పదుల సంఖ్యలో కేసులు హైకోర్టులో దాఖలయ్యాయి. ఎన్నికలు ముగిసిన వెంటనే దాఖలు చేసిన ఈ కేసులు ఇప్పటికి కొన్ని పూర్తవ్వగా, ఇంకా కొన్ని కొనసాగుతూనే ఉన్నాయి. అన్ని అంశాలను పరిశీలించి అఫిడవిట్ వేయకుంటే శాసనసభ్యుడిగా గెలిచినా.. వేటు పడే అవకాశం ఉంది.

అతడు... 'రెస్టు' అని ఎందుకన్నాడు?

ఇటీవల ఎవరో సాఫ్ట్‌వేర్ నిపుణులు కేసీఆర్‌ను ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో కారుకు అనుకున్న హీరోలా, మరికొన్ని పోజుల్లోనూ అచ్చం 'అతడు' సినిమాలో మహేశ్‌బాబులా రకరకాలుగా చిత్రించారు. చాలా స్మార్ట్‌గా కనిపిస్తున్న ఆ బొమ్మల్ని ఫేస్‌బుక్‌లాంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారాల మీద పోస్టర్లలా పెట్టారు.

ఈ పిక్స్ చూశాక కొంతమంది ఓటరు ఊహావీరుల ముఖాల మీద ఇమేజినేషన్ చక్రాలు సినిమాటిక్‌గా గిరగిరా తిరిగాయి. ఇంకేముంది...? ఆ ఓటర్ల ఇమేజినేషన్‌లో కేసీఆర్ అచ్చం 'అతడు' సినిమా మహేశ్‌బాబులా కనిపించసాగాడు!

''ఆయన వ్యూహాలెలా ఉంటాయి?'' అంటూ సీబీఐ బాస్ ప్రకాశ్‌రాజ్ ప్రశ్నించిన స్టైల్లో ఆసక్తిగా అడిగారు ఓటర్లు.

''చాలా పార్టీలవాళ్లు గెలుపునకు ముందే ఎస్కేపు ప్లాన్ చేస్తారు. కానీ.. కేసీఆర్ కళ్లు వేటకళ్లే పులిలా ఉంటాయ్. ఆయన వ్యూహాలన్నీ గెలిచే టైగర్‌లా ఉంటాయ్. మేనిఫెస్టోతో ప్రగతిభవన్ నుంచో లేదా ఎర్రవల్లి ఫాంహౌజ్ గుహలోంచో పులిలా బయటకొస్తాడు కేసీఆర్''... అనుభవజ్ఞులైన నేతలూ, కాలం మాటున అప్పటికే కనుమరుగైపోయిన కొందరు నాయకులిచ్చిన జవాబిది.

కాంగ్రెస్‌వాళ్లు ఆరు గ్యారంటీలు ఆల్రెడీ ఎప్పుడో ప్రకటించేశారు. వాళ్లిచ్చేదేమిటో అప్పటికే స్పష్టం చేశారు. కానీ మ్యానిఫెస్టోతో పులి బయటకొస్తదీ, బయటకొస్తదీ అనడమేగానీ పులి చాలాసేపు బయటకు రాలేదు. ఎందుకో ఆలస్యమైంది. మోకాళ్లపై కూర్చున్నట్టుగా ఉన్న ఓటర్లలో ఆసక్తి, కాస్త అసహనం కూడా.

''ఎలక్షన్ రావడానికి ఐదేళ్లు వెయిట్ చేశా. మేనిఫెస్టో కోసం ఈ కాస్త ఆలస్యానికే ఓర్చుకోలేకపోయాడామ్మా ఓటరూ?'' అంటూ బయటకొచ్చారు కేసీఆర్.

''ఎప్పుడో ఐదేళ్ల కిందట చూపించాం. తీసుకెళ్లి అరచేతిలో మేనిఫెస్టోతో ఆ ఓటర్లకేదైనా చూపించండి'' అంటూ పులి కాస్తా నాజర్‌లా పెద్దమనిషి తరహాలో మాట్లాడింది.

''మొదట వాళ్లెవరో పువ్వు పార్టీవాళ్లు వచ్చారు. సిలెండరు మీద 200 తగ్గిస్తా అన్నారు. ఇంతలో హస్తం వాళ్లు వచ్చారు.



షుగర్ & పెప్పర్
..:: యాసీన్

రూ.500 కే ఇస్తా అన్నారు. నువ్వేదో బెదిరించావటా? ఇలా ఇలా వేలు చూపించావట. ఏమిటి సంగతి'' నాజరు స్టైల్లో అడిగాడు ఓటరు.

''ఇంతకాలం నువ్వు పడ్డ కష్టాలు చాలు. ఇంకా నష్టపోవడం నాకిష్టం లేదు. సిలెండరుకు ఎంత పెట్టగలవు ఓటరు-తాతయ్యా నువ్వు?'' అడిగాడు కేసీఆర్.

''నాలుగొందలు''

చకచకా మేనిఫెస్టో పుస్తకం తీసి, గబగబా ఏదో రాసి ఓటరు చేతిలో పెట్టాడు.

తీరా చూస్తే అందులో ''మేం గెలిస్తే సిలెండరు రూ.400'' అని రాసుంది.

మిగతా పార్టీలన్నీ అవాక్కయి చూస్తూ ఉండగా, అక్కణ్నుంచి మెల్లగా హొరైజన్‌లోకి కదలినట్లుగానే... ఎన్నికల ప్రచారానికి అచ్చంపేట, వనపర్తి, మునుగోడు దిశగా నడిచాడు కేసీఆర్.

ఎందుకోగానీ అప్పటివరకూ మహేశ్‌బాబు స్టైల్లో పులిలాగా ఉన్న ఆయన అకస్మాత్తుగా మళ్లీ నాజరులా మాట్లాడారు. అదెలాగంటే...

''ఇదిగో... ఈ కారు తాళాలు తీస్కో. ఎన్నికల రేసులో బాగా నడిపించి... గెలిపించగలిగితే రా. ఇప్పుడు నాక్కావాల్సింది ఓటమీ, అవమానాలు కాదు. గెలుపు. లేదంటే నాకు పోయేదేం లేదు. దొరుకుతుంది బోలెడంత 'రెస్టు'!

ఈమాటతో ఎలక్షన్ మూవీ యావత్తూ 'సస్పెన్సు'తో నిండిపోయింది.

ఇంతకూ... ఓటర్లు పులిని గెలిపించారా, వాళ్లకు సిలెండరు నాలుగొందలకే దక్కిందా?

మిగతా కథంతా ఇక ఎన్నికల వెండితెరపై...

డిసెంబరు 3న బ్రహ్మాండమైన ఫలితాల విడుదల.



రాజస్తాన్‌లో 10 మందితో ఆర్‌ఎల్‌పీ మొదటి జాబితా

జైపూర్: రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికలకు గాను రాష్ట్రీయ లోక్ తాంత్రిక్ పార్టీ(ఆర్‌ఎల్‌పీ) శనివారం 10 మంది అభ్యర్థులతో కూడిన మొదటి జాబితా విడుదల చేసింది. ఆ పార్టీ కన్వీనర్, ఎంపీ హనుమాన్ బేనివాల్ ఖీంవసర్ స్థానం నుంచి పోటీ చేయనున్నారు. పార్టీకి సిట్టింగ్ ఎమ్మెల్యేలు పుఖ్‌రాజ్ గర్గ్, ఇందిరా దేవి వరుసగా బోపాల్‌గఢ్, మెర్టాల నుంచి మళ్లీ బరిలోకి దిగనున్నారు. ఎంపీ సోదరుడు, ఖీంవసర్ సిట్టింగ్ ఎమ్మెల్యే నారాయణ్ బేనివాల్‌కు ఈ జాబితాలో చోటు దక్కలేదు. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఆర్‌ఎల్‌పీ ఎన్‌డీఏలో భాగస్వామిగా ఉంది. వివాదాస్పద రైతు చట్టాలకు నిరసనగా ఎన్‌డీఏ నుంచి వైదొలిగింది. తాజాగా, ఆజాద్ సమాజ్ పార్టీ(కాన్షీరాం)తో జత కట్టినట్లు ప్రకటించింది.

బడా వాణిజ్యవేత్తల కోసమే బీజేపీ పనిచేస్తోంది

ప్రియాంకా గాంధీ ఆరోపణ

దమోహ్: బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం, ఆ పార్టీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ నిప్పులు చెరిగారు. బీజేపీ ప్రభుత్వాలు బడా పారిశ్రామికవేత్తల కోసమే తప్ప పేదలు, మధ్య తరగతి ప్రజలు, రైతుల కోసం పనిచేయడం లేదని విమర్శించారు. మధ్యప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్ ప్రాంతం దమోహ్ జిల్లాలో శనివారం జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రియాంక మాట్లాడారు. '20 ఏళ్లుగా నిజాయితీగా సేవలందించిన ప్రభుత్వ ఉద్యోగుల కోసం పాత పింఛను విధానం అమలు చేయడానికి డబ్బుల్లేవని బీజేపీ నేతలు, కేంద్రం అంటున్నాయి. అదానీ వంటి బడా పారిశ్రామిక వేత్తలకిచ్చిన వందల కోట్ల రుణాలను ఎందుకు మాఫీ చేశారు? 'అని ప్రశ్నించారు. 'మీరు ప్రయాణించే విమానం ఖరీదు. రూ.8 వేల కోట్లు. పార్లమెంట్ భవనం నిక్షేపంలా ఉండగా, మళ్లీ రూ.20 వేల కోట్లు ఖర్చు పెట్టారు. సెంట్రల్ విస్టా కోసం రూ.27 వేల కోట్లు వెచ్చించారు'అని ఆమె ప్రధానిని పరోక్షంగా విమర్శించారు.



వాల్మీకి జయంతి సందర్భంగా దామోహ్ జిల్లాలో మహారిషి వాల్మీకికి అంజలి ఘటిస్తున్న ప్రియాంకా గాంధీ

దేశంలో ధరల పెరుగుదల, నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ కేంద్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను స్నేహితులకు అమ్మేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో కులగణన చేపట్టాల్సిందేనన్నారు. దీనివల్ల ఓబీసీలు, ఎస్సీలు, ఎస్టీ వర్గాల ప్రజల సంఖ్య ఎంతో తేలుతుందని, తద్వారా వారికి లబ్ధి కలిగేలా కార్యక్రమాలను రూపొందించవచ్చని అభిప్రాయపడ్డారు.



మధ్యప్రదేశ్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా గిరిజనులతో కలిసి సంప్రదాయ నృత్యం చేస్తున్న ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్. శనివారం బుర్హాన్‌పూర్ జిల్లా దూల్‌కోట్ గ్రామంలో తీసిందీ ఫొటో

గాడిద సవారీతో నామినేషన్‌కు..

భోపాల్: మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్ల పర్వం ఊపందుకుంది. కొందరు అభ్యర్థులను వినూత్న మార్గాల్లో నామినేషన్లు వేస్తున్నారు. బుర్హాన్‌పూర్ నియోజకవర్గానికి ప్రియాంక్ ఠాకూర్ అనే స్వతంత్ర అభ్యర్థి గాడిదపై వచ్చి నామినేషన్ సమర్పించారు. 'అన్ని రాజకీయ పార్టీలు తమ ఆశ్రితులకే టికెట్లు ఇస్తున్నాయి. ప్రజలను గాడిదలుగా, అంటే మూర్ఖులుగా తయారు చేస్తున్నాయి. అందుకే గాడిదపై సవారీ చేస్తూ వచ్చి నామినేషన్ వేయాలనుకున్నాను' అని ఆయన అన్నారు. ఇదే



సీటుకు కాంగ్రెస్ అభ్యర్థి ఠాకూర్ సురేంద్ర సింగ్ ఎడ్ల బండిపై మద్దతుదారులతో కలిసి వచ్చి నామినేషన్ వేశారు. బీజేపీ ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలపై నిరసన తెలిపేందుకే ఇలా చేసినట్లు చెప్పుకున్నారు. సన్వేర్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి రీనా బొరాసి ట్రాక్టర్‌పై వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. రైతుల సమస్యలను తెలిపేందుకే ఇలా చేశానన్నారు. రాష్ట్ర మంత్రి, బీజేపీ అభ్యర్థి విశ్వాస్ సారంగ్ స్కూటర్‌పై వచ్చి నరేలా నియోజకవర్గానికి నామినేషన్ పత్రాలను అందజేశారు. నామినేషన్ల దాఖలుకు ఈ నెల 30 చివరి తేదీ.

మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల పోరు కీలక దశకు చేరుతోంది. ఆ రాష్ట్రాల్లో బీజేపీలో ముగ్గురు కీలక నేతల పరిస్థితి ఆసక్తికరంగా మారింది. శివరాజ్‌సింగ్ చౌహాన్, వసుంధర రాజె సింధియా, రమణ్‌సింగ్ గతంలో అన్నీ తామై ఒంటి చేత్తో ఎన్నికల భారం మోసేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి తారుమారైంది. బీజేపీ అధిష్టానం కొత్తగా తెరపైకి తెచ్చిన సమష్టి నాయకత్వ సూత్రాన్ని మూడు రాష్ట్రాల్లోనూ ప్రయోగాత్మకంగా అమలు చేస్తోంది. దీని అసలు ఉద్దేశం వారు ముగ్గురినీ పక్కన పెట్టడమేనని చెబుతున్నారు. అక్కడ సీఎం అభ్యర్థులుగా ఎవరినీ ప్రకటించకపోవడం అందులో భాగమేనని అంటున్నారు.

పొమ్మనలేక పొగ!

శివరాజ్, వసుంధర, రమణ్‌లకు **తగ్గిన ప్రాధాన్యం**

- ముఖ్యమంత్రి అభ్యర్థులుగా ప్రకటించని బీజేపీ
- పక్కన పెడుతున్నారనేందుకు నిదర్శనమే!







శివరాజ్‌కు బై బై...!

మధ్యప్రదేశ్‌లో శివరాజ్ రెండు దశాబ్దాల పాటు రాష్ట్ర రాజకీయాలను శాసించారు. బీజేపీలో తిరుగులేని నేతగా ఎదిగారు. ముఖ్యంగా సీఎంగా ఉమాభారతి దారుణమైన పనితీరు అనంతరం బాబూలాల్ గౌర్‌కు అవకాశమిచ్చి భంగపడ్డాక చివరికి శివరాజ్‌కు ప్రభుత్వ పగ్గాలను పార్టీ అప్పగించింది. దాన్ని ఆయన రెండు చేతులా అందిపుచ్చుకున్నారు. వరుసగా రెండుసార్లు పార్టీని గెలిపించి 13 సంవత్సరాలపాటు ముఖ్యమంత్రిగా కొనసాగారు. నరేంద్ర మోదీ ప్రాభవానికి ముందు జాతీయ స్థాయిలో బీజేపీలో కీలక నేతగా ఎదిగేలా కనిపించారు. కానీ 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓటమితో ఆయన గ్రాఫ్ ఒక్కసారిగా పడిపోవడం ప్రారంభమైంది. కమల్‌నాథ్ సారథ్యంలోని కాంగ్రెస్ సర్కారు కుప్పకూలి 2020లో నాలుగోసారి శివరాజ్ ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా ఆయన ఇమేజీ, ఆదరణ ఈ మూడు సంవత్సరాల్లో క్రమంగా తగ్గుముఖమే పడుతూ వచ్చాయి. దాంతో మోదీ-అమిత్ షా ద్వయం ఆయనపై బాగా అసంతృప్తిగా ఉన్నట్టు పార్టీ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. అందుకే ఈసారి శివరాజ్ సారథ్యంలో అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లరాదని నిర్ణయించారని తెలుస్తోంది. ఈసారి ఎన్నికలకు కొద్ది నెలల ముందునుంచే శివరాజ్ ప్రాధాన్యం మరింత తగ్గుతూ వచ్చింది. పలువురు కేంద్ర మంత్రులతో పాటు సీనియర్ ఎంపీలను అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దింపడం ఆ దిశగా మరింత బలమైన సంకేతాలే అని చెప్పొచ్చు.

- ఈసారి బీజేపీ నెగ్గినా కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ లేదా జాతీయ ప్రధాన కార్యదర్శి కైలాశ్ విజయ వర్గీయ ముఖ్యమంత్రి అభ్యర్థులవుతారని చెబుతున్నారు.
- లేదంటే మూడు సంవత్సరాల క్రితం కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరడం ద్వారా కమల్‌నాథ్ సర్కారు పుట్టి ముంచిన జ్యోతిరాదిత్య సింధియాకు కుర్చీ దక్కినా ఆశ్చర్య పోవాల్సిన పనిలేదు.

వసుంధరకు వీడ్కోలే..!

రాజస్తాన్‌లో రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన సీనియర్ నాయకురాలు వసుంధర రాజె సింధియాదీ దాదాపు అదే పరిస్థితిలా ఉంది. భైరాన్‌సింగ్ షెకావత్ అనంతరం రాష్ట్రంలో పార్టీని సమర్థంగా నడిపిన నాయకురాలిగా ఆమె మంచి పేరు తెచ్చుకున్నారు. వాస్తవానికి ఈ రోజుకూ రాజస్తాన్ బీజేపీలో కరిష్మా ఉన్న నాయకురాలు వసుంధరా రాజె మాత్రమే. అంతేగాక ప్రజాదరణ విషయంలో ఇప్పటికీ ఆమెకు తిరుగులేదనే చెప్పాలి. ఆమెకు ప్రత్యామ్నాయంగా బీజేపీ నాయకత్వం తెరపైకి తెస్తున్న అర్జున్‌రామ్ మెఘ్వాల్, సతీశ్ పునియా, సీపీ జోషీ, గజేంద్ర సింగ్ షెకావత్, ఓం బిర్లా తదితరులెవరూ సామాన్య ప్రజానీకంలో మంచి ప్రజాదారణ ఉన్న నాయకులు కాదు. పైగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో వారికి పెద్ద ఆదరణ లేదు. అయినా సరే, బీజేపీ ఈసారి వసుంధరకు పెద్దగా ప్రాధాన్యమివ్వకుండానే ఎన్నికల బరిలోకి దిగింది! కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో నెలకొన్న అసంతృప్తి, ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్, ఆయన మంత్రివర్గ సహచరులపై వెల్లువెత్తుతున్న అవినీతి ఆరోపణలకు ప్రధానిగా మోదీ కరిష్మా తోడై సులువుగా గెలుస్తామని నమ్ముతోంది. అనంతరం రాష్ట్రంలో కొత్త నాయకులను తీర్చిదిద్దుకోవడం కష్టమేమీ కాదనే భావనలో ఉంది.

రమణ పర్వానికి తెర!

కాంగ్రెస్ పాలిత ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ పరిస్థితి మరీ ఆశావహంగా ఏమీ లేదు. ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ దూకుడు మీదున్నారు. రకరకాల సంక్షేమ పథకాలతో దూసుకుపోతున్నారు. గత ఎన్నికల హామీల సమర్థ అమలు ఆయనకు మరింతగా కలిసొస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఏకంగా 15 సంవత్సరాలపాటు ముఖ్యమంత్రిగా చేసిన రమణ్‌సింగ్‌ను బీజేపీ అధిష్టానం పక్కన పెట్టినట్టుగా వ్యవహరిస్తుండటం ఆశ్చర్యం కలిగించేదే. ఫలితంగా బీజేపీకి ఒకరకంగా రాష్ట్రస్థాయి కీలక నాయకత్వమంటూ లేకుండా పోయింది. ఏదేమైనా రాష్ట్రంలో పార్టీకి కొత్త రక్తాన్ని ఎక్కించడమే మోదీ-అమిత్ షా ద్వయం ఉద్దేశంగా కనిపిస్తోంది. ఫలితంగా ఇక్కడ కేవలం మోదీ కరిష్మా మీదే భారం వేసి బీజేపీ ఎన్నికల ప్రచారం సాగుతోంది. కానీ హిమాచల్ ప్రదేశ్‌లోనూ, అనంతరం కర్ణాటకలోనూ ఇదే ప్రయోగం చేసి చేతులు కాల్చుకున్న వైనాన్ని తలచుకుని బీజేపీ నేతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

సాక్షి కరీంనగర్

ఆదివారం । 29 । అక్టోబర్ । 2023

ప్రతీపోరు రసవత్తరం..!

నాలుగు నియోజకవర్గాలు.. ఏడు మండలాల సంపూర్ణ ముఖ చిత్రం ధర్మపురి. ఒకప్పుడు మేడారం, చొప్పదండి, జగిత్యాల, బుగ్గారం నియోజకవర్గాల్లో ఉన్న గొల్లపల్లి, పెగడపల్లి, బుగ్గారం, వెల్గటూర్, ధర్మారం, ధర్మపురి మండలాల (తాజాగా ఎండపల్లి)తో 2009లో ధర్మపురి (ఎస్సీ రిజర్వ్) నియోజకవర్గమైంది.

- వివరాలు 10లో ▸



న్యూస్‌రీల్

జైలును సందర్శించిన డీఎల్ఎస్ఏ కార్యదర్శి



మాట్లాడుతున్న న్యాయమూర్తి వెంకటేశ్

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ జైలును జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి కె.వెంకటేశ్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా జైలులోని ఖైదీల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. జైలులోని క్యాంటీన్, ఆసుపత్రి, ములాఖత్, ఫోన్‌సౌకర్యం, లైబ్రరీ, కిచెన్, ఇండస్ట్రీలు పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడుతూ పోక్సో, ఎన్‌డీపీఎస్, మోటర్ వెహికల్ యాక్ట్ , సీనియర్ సిటిజన్ యాక్టు, గృహహింస చట్టాల్లోని పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రైవేట్ లాయర్‌ను పెట్టుకునే స్తోమత లేని వారికి ప్రభుత్వ లాయర్‌ను నియమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జైలు సూపరింటెండెంట్ ఏ.శ్రీనివాస్‌రెడ్డి, జైలర్లు బి.రమేశ్, పి.శ్రీనివాస్, డిప్యూటీ జైలర్లు ఏ.శ్రీనివాసరెడ్డి, ఎల్.రమేశ్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ లాయర్ శ్రీనివాస్, తణుకు మహేశ్ పాల్గొన్నారు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి



డ్రైవర్లతో మాట్లాడుతున్న సి.వినోద్‌కుమార్

విద్యానగర్(కరీంనగర్): డ్రైవర్లు అప్రమత్తంగా ఉండి డ్రైవింగ్ చేయాలని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.వినోద్‌కుమార్ సూచించారు. శనివారం కరీంనగర్ బస్‌స్టేషన్‌లో ఆయన డ్రైవర్లతో మాట్లాడారు. బస్సు నడిపేటప్పుడు ఎదుటి వాహనాలను గమనిస్తూ డిఫెన్సివ్ డ్రైవింగ్ టెక్నిక్స్ వాడాలని సూచించారు. మరో వాహనాన్ని ఓవర్ టేకింగ్ చేస్తున్నప్పుడు గమనించాలని, జాగ్రత్తగా ముందుకు సాగాలని వివరించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్ల జరిగే అనర్థాలను ఈ సందర్భంగా వివరించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ.. బస్సు నడిపితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సమావేశంలో రీజనల్ మేనేజర్ సుచరిత, బస్‌స్టేషన్ సీఆర్‌ఎం రజనీ కృష్ణ, బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలు వాయిదా వేయాలి


కరీంనగర్ సిటీ: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో నవంబర్ 1 నుంచి ప్రారంభమయ్యే డిగ్రీ 5వ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని కోరుతూ శనివారం ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ వరప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ మామిడిపల్లి హేమంత్, జిల్లా కార్యవర్గ సభ్యుడు నునవత్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులకు సిలబస్ పూర్తికాకముందే సెమిస్టర్స్ నిర్వహించడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని పరీక్షలను వెంటనే వాయిదా వేయాలని డిమాండ్ చేశారు.



గారాబం కారాదు.. ప్రాణాంతకం..!

తల్లిదండ్రులు పిల్లలను గారాబం చేయడం సహజం. కానీ... అది కాస్తా ప్రాణాల మీదకు తెచ్చే విధంగా ఉండొద్దు. కరీంనగర్‌లోని కశ్మీర్‌గడ్డ ఎస్‌బీఎస్ ఫంక్షన్‌హాల్ సమీపంలో శనివారం ఓ బాలిక ఇదిగో ఇలా బైక్‌పై నిల్చొని ప్రయాణం చేసింది. అదుపుతప్పితే ప్రాణాలకే ముప్పు. మరీ ఇంత గారాబం అవసరమా? అని అక్కడున్న వారు చర్చించుకున్నారు.

– సాక్షిప్రతినిధి, కరీంనగర్



"గుడ్లగూబ పగలు చూడలేదు..కాకి రాత్రిని చూడలేదు.. ఓటును అమ్ముకునే ప్రజలు ప్రగతిని, ప్రజాస్వామ్యాన్ని చూడలేరు."

– డాక్టర్ అబ్దుల్ కలామ్

మీకు తెలుసా?

ఈవీఎంలకు 41ఏళ్లు

కరీంనగర్ అర్బన్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)లు వినియోగంలోకి వచ్చి 39ఏళ్లు పూర్తయ్యాయి. ఎన్నికల్లో బ్యాలెట్ పత్రాలకు ప్రత్యామ్నాయంగా 1982లో ఈ యంత్రాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. మొదట్లో వీటి వాడకానికి కేంద్ర ఎన్నికల సంఘం ససేమిరా అన్నప్పటికి అనంతర కాలంలో ఓకే చెప్పింది. మొదటిసారి 1982 మే 19న జరిగిన కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా పరోగ్ నియోజకవర్గంలో ఈవీఎంలను వినియోగించారు. అనంతరం దేశవ్యాప్తంగా 1982–83 సంవత్సరాల్లో 10 నియోజకవర్గాల్లో జరిగిన ఉపఎన్నికల్లో వినియోగించారు. వీటిని వినియోగించవద్దని 1984 మే 5న సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. సాంకేతికంగా మార్పులు చేసి 1988 డిసెంబర్‌లో సెక్షన్ 61 ద్వారా కేంద్రం ప్రజాప్రాతినిధ్య చట్టంలో చేర్చింది. ఆ తరువాత సెక్షన్ 61ఏ సవరణలను 1989 మార్చి 17న ప్రజాప్రాతినిథ్యం చట్టం అమలులోకి తెచ్చింది. దీన్ని సుప్రీంకోర్టు సమర్థించడంతో ఈవీఎంల వాడకం మళ్లీ ప్రారంభమైంది. 1990 జనవరిలో ఎన్నికల సంస్కరణల కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అదే ఏడాది ఏప్రిల్‌లో ఈవీఎంల వాడకాన్ని సాంకేతిక నిపుణుల కమిటీ సమర్థించింది. ఈవీఎంల వాడకానికి 1998లో ప్రజా ఆమోదం లభించింది. వివిధ రాష్ట్రాల్లో 1999, 2004లో జరిగిన ఎన్నికల్లో ఈవీఎంలను వినియోగించారు. లోక్‌సభకు 2004, 2014 మధ్య జరిగిన మూడు ఎన్నికల్లో వీటినే వాడారు. వీవీప్యాట్లను వాడాలని వినియోగించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. దశల వారీగా 2013 నుంచి వీవీ ప్యాట్లు వినియోగిస్తున్నారు.



కమలం VS పోలీస్!



- కరీంనగర్‌లో కొనసాగుతున్న ఆరోపణల పర్వం
- ఎంపీ కార్యాలయ ఘటన, ఇటీవల లాఠీచార్జిపై ఈసీకి ఫిర్యాదు
- సీపీని తప్పించాలని ఎన్నికల సంఘానికి మర్రి శశిధర్‌రెడ్డి లేఖ
- ఏసీపీ, సీఐ, ఎస్సైలను బదిలీ చేయాలని మరో ఫిర్యాదు
- గతంలో పార్లమెంటు ప్రివిలేజ్ కమిటీ, బీసీ కమిషన్లకు కూడా..

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

బీజేపీ పేరుచెబితేనే కరీంనగర్ పోలీసులు ఉలిక్కిపడున్నారు. ఎప్పుడు ఏ ఫిర్యాదు ఎవరి నెత్తిన పడుతుందో తెలియని స్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీపీ ఎల్.సుబ్బారాయుడు ఆకస్మిక బదిలీ వెనుక బీజేపీ ఫిర్యాదే కారణమన్న లేఖ బయటకు రావడమే దీనికి కారణం. సాధారణంగా బలమైన ప్రతిపక్ష నేతలున్న ప్రాంతాల్లో పోలీసులు ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు చేస్తారు. ఈక్రమంలో విమర్శలు ఎదుర్కోవడం సహజం. కేసుల నమోదు, అరెస్టులు చేయాల్సి వచ్చినప్పుడు విపక్షాల నుంచి ప్రతిఘటన తప్పదు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలు పోలీసులు అధ కారపార్టీకి అనుకూలమంటూ ఆరోపిస్తుంటాయి. అయితే అదేపనిగా ఫిర్యాదు చేస్తుండడంతో పోలీసులు ఆందోళన చెందుతున్నారు. చట్టాన్ని అమలు చేసేక్రమంలో విధులు నిర్వహిస్తున్నాం తప్పితే.. ఎవరిపై అభిమానాలుండవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీలు.. లీడర్ల మధ్య జరిగే పోరులో 'అడకత్తెరలో పోక చెక్కలా' మారామని పేర్కొంటున్నారు.

సీపీ, ఏసీపీని మార్చాలని లేఖ

ఇటీవల జరిగిన రెండు ఘటనలపై బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. వీటిపై సీనియర్ నాయకుడు మర్రి శశిధర్‌రెడ్డి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. లేఖలో ఏముందంటే.. సెప్టెంబరు 29న ఎంపీ కార్యాలయం వద్ద జరిగిన ఉద్రిక్త ఘటనపై ఇరువర్గాలపై కేసులు నమోదయ్యాయి. నగరంలోని స్పెన్సర్స్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం అనంతరం పోలీసులు లాఠీచార్జి చేశారు. ఈ రెండు ఘటనల్లోనూ పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు. ఇప్పుడు ఈ లేఖనే సుబ్బారాయుడు ఆకస్మిక బదిలీకి కారణమై ఉంటుందని చర్చజరుగుతోంది. సీపీ ర్యాంకు ఆఫీసర్‌నే కాదు.. మిగిలిన వారిపైనా బీజేపీ జూన్ 24న ఫిర్యాదు చేసింది. జిల్లాలో కొందరు ఏసీపీ, సీఐ, ఎస్సై ర్యాంకు ఆఫీసర్లు అధికార పార్టీ అండదండలతో పోస్టింగులు తెచ్చుకున్నారని ఆరోపించింది. వీరంతా కూడా గత ఎన్నికల్లో పనిచేసి ఇప్పుడు తిరిగి అక్కడే పోస్టింగ్‌లో కొనసాగుతున్నారని విమర్శించింది. ఆ విషయాన్ని తిరిగి ఫిర్యాదులో పొందుపర్చినట్లు సమాచారం.

పోలీసులమా? బలిపశువులమా?

తమపై బీజేపీ నేతలు కేంద్రానికి చేస్తున్న ఫిర్యాదుల పరంపరపై కరీంనగర్ పోలీసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ పార్టీల మధ్య ఆధిపత్య పోరులో తాము బలిపశువులమవుతున్నామని వాపోతున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఎవరున్నా.. తాము శాంతిభద్రతల పరిరక్షణకే తొలి ప్రాధాన్యమిస్తామని స్పష్టం చేస్తున్నారు. తాము ఏ పార్టీకి అనుకూలం, వ్యతిరేకం కానే కాదని, తమకు పార్టీ రంగు పులమడం తమ మనోస్థైర్యాన్ని దెబ్బతీయడమేనని సీనియర్ పోలీస్ అధికారులు కుండబద్దలు కొడుతున్నారు. ఇలాంటి ఫిర్యాదులు తమ ఆత్మవిశ్వాసాన్ని తగ్గిస్తాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాసగట్లేదు!

- కోవిడ్ తర్వాత రాష్ట్రంలో బీజేపీ బలమైన ప్రతిపక్షంగా ఆవిర్భవించింది. గతంలో రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో, నేడు జాతీయ కార్యదర్శిగా వ్యవహరిస్తున్న ఎంపీ బండి సంజయ్, పోలీసులకు మధ్య ఘర్షణ వాతావరణం తలెత్తిన సందర్భాలు అనేకం. అవన్నీ కూడా రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన ఘటనలు కావడం గమనార్హం.
- ఆర్టీసీ సమ్మె సమయంలో కరీంనగర్‌లో ఆత్మహత్య చేసుకున్న కార్మికుడి శవయాత్రలో పోలీసులు తనతో దురుసుగా ప్రవర్తించారని తొలిసారిగా బండి సంజయ్ ఆరోపించారు.
- దుబ్బాక ఎన్నికల సమయంలో సిద్దిపేటలో జరిగిన అరెస్టులో సీపీ జోయల్ డేవిస్‌పై ఎంపీ బండి సంజయ్ తీవ్ర ఆరోపణలు చేశారు.
- అనంతరం జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో నేరుగా అప్పటి డీజీపీ మహేందర్‌రెడ్డిపైనా తీవ్ర వ్యాఖ్యలు చేశారు.
- 2022 జనవరిలో జరిగిన బండి సంజయ్ అరెస్టు వ్యవహారంలో సీపీ సత్యనారాయణ, ఆయన బృందంపై ఢిల్లీ ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేశారు.
- అదే ఘటనపై బీసీ కమిషన్ వద్ద కరీంనగర్ సీపీ, మరో ఇద్దరు అడిషనల్ డీసీపీలు విచారణకు హాజరై వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది.
- ఈ ఏడాది టెన్త్ పేపర్ లీకేజీ వ్యవహారంలోనూ వరంగల్ సీపీ రంగనాథ్‌పైనా బండి ఆరోపణలు చేశారు.
- తాజాగా ఎంపీ కార్యాలయ ఘటన, రోడ్డు ప్రమాదం అనంతరం లాఠీచార్జి విషయంలో బీజేపీ అగ్రనేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు.

ప్రణాళికతో ముందుకెళ్లాలి



ఉమ్మడి జిల్లా రివ్యూలో మాట్లాడుతున్న ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్

- చెక్‌పోస్టుల్లో నిష్పక్షపాతంగా తనిఖీలు
- నామినేషన్ ప్రక్రియ సక్రమంగా జరిగేలా చర్యలు
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

సాక్షిప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ ఎన్నికలు పక్కా ప్రణాళికతో పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అధికారులను ఆదేశించారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో శనివారం కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల ఎన్నికలు, పోలీస్, రిటర్నింగ్ అధికారులతో సమీక్షించారు. జిల్లాల్లో చేపట్టిన ఎన్నికల ఏర్పాట్ల గురించి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారులు వివరించారు.

క్షేత్రస్థాయిలో సమీక్షించాలి

జిల్లాలోని నియోజకవర్గాల వారీగా సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలపై సమీక్షించాలని ఆదేశించారు. సీవిజిల్ యాప్ గురించి గ్రామీణులకు అవగాహన కల్పించాలన్నారు. సువిధ మొబైల్ యాప్, యూజర్ చార్జీల గురించి తెలియజేయాలన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో వచ్చే ఫిర్యాదులపై జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

తనిఖీల్లో నిష్పక్షపాతంగా ఉండాలి

చెక్‌పోస్టులలో వాహనాల తనిఖీలు నిష్పక్షపాతంగా ఉండేలా చూడాలని వికాస్‌రాజ్ ఆదేశించారు. సామాన్యులకు ఇబ్బంది కలగకుండా పట్టుబడిన నగదు, వస్తువులపై సమీక్షించుకొని త్వరగా చర్యలు తీసుకోవాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది పనితీరును సీసీకెమెరాలలో పర్యవేక్షించాలన్నారు. లైసెన్స్‌డ్ ఆయుధాలను స్వాధీనం చేసుకోవాలన్నారు.

పోలింగ్‌శాతంపై దృష్టిపెట్టాలి

గతంలో పోలింగ్ శాతం తక్కువ నమోదైన ప్రాంతాలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఓటరు జాబితాలో డూప్లికేట్, డబుల్ ఓటర్లు లేకుండా చూడాలని, ఒకే ఇంటినంబర్‌పై ఎక్కువ మంది ఓటర్లు ఉంటే పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వికలాంగులు, 80 ఏళ్ల పైబడి పోలింగ్ కేంద్రానికి రాలేని వారికి కల్పిస్తున్న సౌకర్యాలపై అవగాహన కల్పించాలన్నారు. నియోజకవర్గ పరిధిలోని గోడౌన్లు, షాదీఖానాలు, ఫంక్షన్‌హాళ్లలో తనిఖీలు చేపట్టాలని, బ్యాంకు లావాదేవీలపై దృష్టి సారించాలని సూచించారు.

వీడియో రికార్డింగ్ చేయాలి

క్యూఆర్‌కోడ్, సరైన పత్రాలు లేకుండా బ్యాంకులు తరలించే నగదును సీజ్ చేయడంతోపాటు వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వికాస్‌రాజ్ సూచించారు. నామినేషన్ల ప్రక్రియ మొదలు కాబోతున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని, పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రిటర్నింగ్ అధికారి ఆఫీస్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, నామినేషన్ ప్రక్రియను వీడియో రికార్డు చేయించాలని సూచించారు. అదనపు డీజీ సంజయ్‌కుమార్ జైన్, డీఐజీ కె.రమేశ్‌నాయుడు, ఉమ్మడి జిల్లా ఎన్నికల అధికారులు ప్రవుల్ దేశాయ్, యాస్మిన్ బాషా, ముజమ్మిల్ ఖాన్, భీమ్యానాయక్, రామగుండం సీపీ రెమోరాజేశ్వరి, ఎస్పీలు అఖిల్‌మహాజన్, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులు

తీగల వంతెనపై రాద్ధాంతం అర్థరహితం

- మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని ఓర్వలేక ప్రతిపక్షాలకు కడుపుమంటతో విషప్రచారం చేస్తున్నాయని బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. శనివారం తీగలవంతెనను మేయర్ వై.సునీల్‌రావుతో కలిసి పరిశీలించారు. మంత్రి కమలాకర్ మాట్లాడుతూ కేబుల్‌బ్రిడ్జి రోడ్డు నిర్మాణంలో తలెత్తిన చిన్న సమస్యను భూతద్దంలో పెట్టి పెద్దదిగా చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. కేబుల్ బ్రిడ్జి నిర్మాణంలో ఎలాంటి లోపాలు లేవని వివరించారు.



కేబుల్ బ్రిడ్జి రోడ్డు పరిశీలిస్తున్న మంత్రి కమలాకర్

అభివృద్ధిలో దేశానికే ఆదర్శం

అభివృద్ధిలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్‌కే పట్టం కట్టేలా కార్యకర్తలు ప్రజలను జాగృతం చేయాలని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శనివారం చొప్పదండి బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం సీతారాంపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా మంత్రి కమలాకర్ మాట్లాడుతూ.. చొప్పదండి ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కేసీఆర్ చేతిలో మాత్రమే తెలంగాణ ఉండాలన్నారు. కిరణ్‌కుమార్, షర్మిల, కేవీ.రాంచంద్రం, పవన్ కల్యాణ్‌కు తెలంగాణతో ఏం సంబంధమని ప్రశ్నించారు. ప్రణాళిక సంఘ ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాబడి అనూహ్యంగా పెరిగిందన్నారు. అనంతరం చొప్పదండి కార్యకర్తలు వినోద్ కుమార్, గంగుల కమలాకర్, సుంకె రవిశంకర్‌ను సత్కరించారు.

ఉద్యమంలో ఆర్టీసీ సిబ్బంది పాత్ర కీలకం

తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ ఉద్యోగులు కీలకంగా వ్యవహరించారని మంత్రి కమలాకర్ అన్నారు. నగరంలోని ఆర్టీసీ వర్క్‌షాప్ సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి హాజరయ్యారు. భవిష్యత్తు తరానికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ పార్టీకే ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మేయర్ సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు పోస్టల్ బ్యాలెట్



సాక్షిప్రతినిధి, కరీంనగర్: పోలింగ్ రోజు శాఖాపరమైన విధుల్లో ఉంటూ ఓటు హక్కు వినియోగించుకోలేని 13 అత్యవసరమైన శాఖల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. జర్నలిస్టులు కూడా ఇది వర్తిస్తుందని పేర్కొంది. అక్రిడిటేషన్ కలిగి ఉన్నవారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు ఫారం 12డి, అక్రిడిటేషన్ జిరాక్స్ ప్రతిని జతచేసి ఈనెల 30 సోమవారంలోగ జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం సమర్పించాల్సి ఉంటుంది.

సువిధతో అనుమతులు పొందండి

కరీంనగర్‌అర్బన్: ఎన్నికల ప్రచారానికి సువిధ యాప్ ద్వారా అనుమతులు పొందాలని కరీంనగర్ నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో కుందారపు మహేశ్వర్ సూచించారు. శనివారం కరీంనగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీల సమావేశాలు, సభలు, ర్యాలీలకు 48గంటల ముందే అనుమతి తీసుకోవాలని తెలిపారు. ప్రచారాలకు ఉపయోగించే వాహనాలకూ అనుమతి తీసుకోవాలని అన్నారు. నవంబర్ 3 నుంచి నామి నేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతున్నందున పాటించాల్సిన నిబంధనలు వివరించారు. వివిధ పార్టీల నాయకులు, కరీంనగర్ అర్బన్ తహసీల్దార్ వుయ్యాల రమేశ్, కొత్తపల్లి తహసీల్దార్ ఎస్.రాజేశ్, కరీంనగర్ రూరల్ తహసీల్దార్ పి.నవీన్ పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల నేతలతో మాట్లాడుతున్న ఆర్డీవో మహేశ్వర్

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు 'అల్ఫోర్స్‌' విద్యార్థిని



శ్రీజను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్‌): కొత్తపల్లిలోని అల్ఫోర్స్‌ ఇ టెక్నో స్కూల్‌ విద్యార్థిని జె.శ్రీజ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్‌ అండర్‌–17 యోగా పోటీలకు ఎంపికైనట్లు ఆ విద్యా సంస్థల చైర్మన్‌ డాక్టర్‌ వి.నరేందర్‌ రెడ్డి తెలిపారు. ఇటీవల కరీంనగర్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్‌ జిల్లాస్థాయి యోగా పోటీల్లో శ్రీజ అద్భుతంగా రాణించి రాష్ట్రస్థాయికి ఎంపికైనందుకు శనివారం ఆయన అభినందించారు. రాష్ట్రస్థాయిలో సైతం అద్భుతంగా రాణించి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని అకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపాల్‌, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేషనల్‌ ఇన్‌స్పైర్‌ స్కాలర్‌షిప్‌కు ఎంపిక



చొప్పదండి: పట్టణానికి చెందిన గోస్కుల శ్రీనిజ అనే ఇంటర్‌ విద్యార్థిని నేషనల్‌ ఇన్‌స్పైర్‌ స్కాలర్‌షిప్‌కు ఎంపికైంది. విద్యార్థికి అయిదేళ్ల పాటు, ఏడాదికి రూ.80 వేల చొప్పున ఉపకార వేతనం అందనుంది. ఈ మేరకు శ్రీచైతన్య కళాశాల ప్రిన్సిపాల్‌ గుండేటి వెంటకరమణ, కరస్పాండెంట్‌ రత్నాకర్‌రెడ్డి శ్రీనిజను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హరిప్రసాద్‌, జగన్‌, అంజనేయులు, మౌనిక పాల్గొన్నారు.

ఇద్దరికి తీవ్రగాయాలు

ధర్మారం(ధర్మపురి): మండలంలోని నందిమేడారంలో శనివారం సాయంత్రం మోటార్‌సైకిల్‌పై వస్తున్న భార్యాభర్తలపై కుక్కలు దాడికి యత్నించగా అదుపుతప్పి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డారు. మల్లాపూర్‌ గ్రామానికి చెందిన దీకొండ రాజయ్య, మధునమ్మ ఖిలావనపర్తిలోని బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి మల్లాపూర్‌కు మోటార్‌ సైకిల్‌పై వస్తుండగా నందిమేడారంలో కుక్కలు వెంటపడ్డాయి. దీంతో భయాందోళనకు గురైన రాజయ్య మోటార్‌సైకిల్‌ను అతివేగంగా నడిపించి కిందపడిపోయారు. ఇద్దరికి తీవ్రగాయాలు కాగా స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు.

ప్రతీపోరు రసవత్తరం!

- ఏడు మండలాల ముఖచిత్రం
- 2009లో నియోజకవర్గ కేంద్రంగా..
- పేరు మారింది.. రాజకీయ తీరూ మారింది
- గతంలో నాలుగు నియోజకవర్గాల సమూహం
- నియోజకవర్గం ఏర్పాటు నుంచి 'కొప్పుల'కే పట్టం

పోలింగ్‌ కేంద్రాలు	269
మొత్తం ఓట్లు	2,24,591
పురుషులు	1,90,963
స్త్రీలు	1,14,622
ఇతరులు	6





గొల్లపల్లి: మార్పులు.. చేర్పులు.. కూర్పులు.. నాలుగు నియోజకవర్గాలు.. ఏడు మండలాల సంపూర్ణ ముఖచిత్రం ధర్మపురి. ఒకప్పుడు మేడారం, చొప్పదండి, జగిత్యాల, బుగ్గారం నియోజకవర్గాల్లో ఉన్న గొల్లపల్లి, పెగడపల్లి, బుగ్గారం, వెల్గటూర్‌, ధర్మారం, ధర్మపురి మండలాల (తాజాగా ఎండపల్లి)తో 2009లో ధర్మపురి (ఎస్సీ రిజర్వ్‌) నియోజకవర్గమైంది. అప్పటినుంచి ఇక్కడ అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి.



మాతంగి నర్సయ్య (ఫైల్‌)



న్యాలకొండ రాంకిషన్‌ రావు (ఫైల్‌)



శికారి విశ్వనాథం (ఫైల్‌)



జువ్వాడి రత్నాకర్‌ రావు (ఫైల్‌)



కొప్పుల ఈశ్వర్‌



అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌

నృసింహుడు కొలువైన ప్రాంతం..

శ్రీలక్ష్మీ నృసింహస్వామి వెలిసిన పుణ్యక్షేత్రమైన ధర్మపురి పేరిట ఏర్పాటైన ఈ నియోజకవర్గం.. పూర్తిగా వ్యవసాయ ఆధారితం. ఏడు మండలాల్లో కలిపి 129 గ్రామాలు.. మొత్తం 2,24,591 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,90,963 మంది, మహిళలు 1,14,622, ఇతరులు ఆరుగురు ఉన్నారు. 63 శాతం బీసీలు, 23శాతం ఎస్సీలు, ఇతరులు 15 శాతం వరకు ఉన్నారు. పునర్విభజనకు ముందు గొల్లపల్లి మండలంలోని 8 గ్రామాలు జగిత్యాల నియోజకవర్గంలో, 17 గ్రామాలు చొప్పదండిలో, ధర్మపురి మండలం సిరికొండ గ్రామం చొప్పదండిలో.. మిగిలిన గ్రామాలు బుగ్గారం నియోజకవర్గంలో ఉండేవి. అలాగే పెగడపల్లిలోని నాలుగు గ్రామాలు జగిత్యాలలో, ఐదు గ్రామాలు, మేడారం, 17 గ్రామాలు చొప్పదండి పరిధిలో ఉండేవి. వెల్గటూర్‌లోని 19 గ్రామాలు మేడారంలో, ఐదు గ్రామాలు చొప్పదండిలో, రెండు గ్రామాలు బుగ్గారంలో ఉండేవి. ధర్మారం మండలం పూర్తిగా మేడారం నియోజకవర్గంలోనే ఉండేది.

తీర్పు విలక్షణం

- ధర్మపురి నియోజకవర్గానికి ముందు చొప్పదండి నియోజకవర్గం నుంచి 1957లో సీహెచ్‌.రాజేశ్వర్‌ రావు(పీడీఎఫ్‌) విజయం సాధించారు. 1962లో కాంగ్రెస్‌ నుంచి బండారి రాములు, 1978లో న్యాలకొండ శ్రీపతిరావు (ఐఎన్‌సీ(ఐ)), 1983లో గుర్రం మాధవ రెడ్డి (స్వతంత్ర) గెలిచారు. 1985, 1986, 1994 వరకు న్యాలకొండ రాంకిషన్‌రావు (టీడీపీ) వరుసగా గెలిచి హ్యాట్రిక్‌ సాధించి మంత్రిగా కొనసాగారు. 1999లో కాంగ్రెస్‌ నుంచి కోడూరి సత్యనారాయణగౌడ్‌ విజయం సాధించారు. 2004లో టీడీపీ నుంచి సాన మారుతి విజయం సాధించారు. అనంతరం ఎస్సీ రిజర్వ్‌ అయినా 2009లో సుద్దాల దేవయ్య (టీడీపీ) నుంచి గెలిచారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావడంతో ఉద్యమంలో పాలుపంచుకున్న 2014లో బొడిగె శోభ (టీఆర్‌ఎస్‌) నుంచి విజయం సాధించారు.
- ధర్మపురి నియోజకవర్గానికి ముందు బుగ్గారం (జనరల్‌) నియోజకవర్గంలోనూ కొన్ని మండలాలు ఉండేవి. అప్పటి ఓటరు తీర్పు సపరేట్‌ అన్నట్లు సాగింది. 1957 నుంచి 2004 వరకు అభ్యర్థి ఏ పార్టీకి చెందినా.. చివరకు స్వతంత్రంగా పోటీ చేసినా నియోజకవర్గ అభివృద్ధిని ఆశించినవారినే గెలిపించారు. 1957లో జరిగిన ఎన్నికల్లో బద్దం ఎల్లారెడ్డి (స్వతంత్ర), 1962లో ఏనుగు నారాయణ రెడ్డి (స్వతంత్ర), 1972లో జోగిని దామోదర్‌రావు (స్వతంత్ర)కు పట్టంగట్టారు. 1978లో అంబల్ల రాజారాం(కాంగ్రెస్‌), 1983లో కడకుంట్ల గంగారాం (కాంగ్రెస్‌), 1985లో ఉప ఎన్నిక సమయంలో శికారి విశ్వనాథం(టీడీపీ)కి పట్టం కట్టారు. తిరిగి 1989లో జువ్వాడి రత్నాకర్‌రావు (స్వతంత్ర)ను గెలిపించారు. మళ్లీ 1994లో శికారి విశ్వనాథం(టీడీపీ)కి పట్టంగట్టారు. అనంతరం 1999, 2004లో జరిగిన ఎన్నికల్లో జువ్వాడి (కాంగ్రెస్‌)ను గెలిపించారు.

2009 నుంచి బీఆర్‌ఎస్‌కు కంచుకోట

2009లో ధర్మపురిగా ఆవిర్భవించినప్పటి నుంచి ఈ నియోజకవర్గప్రజలు ఒకే అభ్యర్థికి పట్టంగడుతూ వస్తున్నారు. 2009 నుంచి ఇప్పటివరకు 2009, (2010లో ఉప ఎన్నిక) 2014, 2018లో ఎన్నికలు జరగగా.. ఉద్యమ నాయకుడు కొప్పుల ఈశ్వర్‌ను గెలిపిస్తూ వస్తున్నారు. 2018లో గెలిచిన అనంతరం మంత్రిగా కొనసాగుతున్నారు. ప్రతిసారీ ప్రధాన పోటీదారుగా కాంగ్రెస్‌ నుంచి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ (రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్‌ చైర్మన్‌, కరీంనగర్‌ జెడ్పీ చైర్మన్‌గా పనిచేసిన) ఉన్నారు. ఈ సారి జరిగే ఎన్నికల్లోనూ ఇద్దరిమధ్యే పోటీ ఉండనుంది. తను చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే ఐదోసారి కూడా గెలిపిస్తాయని మంత్రి, బీఆర్‌ఎస్‌ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ ధీమా వ్యక్తం చేస్తుండగా.. ఈ సారి అటు సానుభూతి, ఇటు ప్రభుత్వ వ్యతిరేకత తనను గెలిపిస్తుందని కాంగ్రెస్‌ అభ్యర్థి లక్ష్మణ్‌కుమార్‌ అంటున్నారు.

బంగారు ఆభరణాలు పట్టివేత



తనిఖీ చేస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

తిమ్మాపూర్‌: మండలంలోని రేణికుంట శివారులో బంగారు ఆభరణాలు పట్టుకున్నట్లు ఎల్‌ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల నిబంధనల మేరకు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఎంహెచ్‌ 46 బీపీ 3201 నంబరు కారులో కరీంనగర్‌ బోయవాడకు చెందిన తనుకు సందీప్‌ డ్రైవర్‌ సాకేత్‌తో కలిసి కరీంనగర్‌ వైపు వస్తున్నారు. టోల్‌ప్లాజా చెక్‌పోస్ట్‌ వద్ద కారు తనిఖీ చేయగా అందులో 150 గ్రాముల బంగారం లభించింది.ఎలాంటి ధ్రువపత్రాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకుని, సంబంధిత అధికారులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. కాగా.. టోల్‌ప్లాజా సమీపంలోని ఇంటిగ్రేటెడ్‌ చెక్‌ పోస్టువద్ద సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో ముమ్మర తనిఖీలు చేపట్టారు.

మద్యం పట్టివేత

జమ్మికుంట: అక్రమ మద్యం సీజ్‌ చేసినట్లు జమ్మికుంట ఎక్సైజ్‌ సీఐ అక్బర్‌ హుస్సేన్‌ తెలిపారు. మండలంలోని కోరపల్లి గ్రామానికి ఓ మహిళ అక్రమ మద్యం అమ్మకాలు సాగిస్తోందనే సమాచారంతో దాడులు నిర్వహించి రూ.6,732 విలువైన మద్యం సీజ్‌ చేసినట్లు సీఐ వివరించారు. అదే విధంగా వావిలాల గ్రామంలో కరీంనగర్‌ టాస్క్‌ఫోర్స్‌, ఎక్సైజ్‌ పోలీస్‌ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి ముగ్గురు వ్యక్తుల నుంచి 65 మద్యం బాటిళ్లు, 24బీర్లను స్వాధీనం చేసుకున్నారు.

23 మంది బైండోవర్‌

జమ్మికుంట: జమ్మికుంట పట్టణంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన 23మందిని తహసీల్దార్‌ రజని ఎదుట శనివారం బైండోవర్‌ చేసినట్లు పట్టణ సీఐ బర్పటి రమేశ్‌ తెలిపారు. బెల్టుషాపు నిర్వాహకులు, గతంలో కేసులు నమోదైన 23మందిపై ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందస్తుగా బైండోవర్‌ చేసినట్లు వివరించారు.

ట్రాక్టర్‌ ఢీకొని బాలుడు మృతి

ఓదెల(పెద్దపల్లి): పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధి మడక గ్రామంలో శనివారం రాత్రి ట్రాక్టర్‌ ఢీకొని అదే గ్రామానికి చెందిన నోముల అన్వేశ్‌రెడ్డి(14) మృతిచెందాడు. స్థానికుల వివరాలు.. అన్వేశ్‌రెడ్డి మరో బాలుడు బైక్‌మీద పొత్కపల్లి గ్రామం నుంచి మడక వస్తుండగా, సుల్తానాబాద్‌ నుంచి పొత్కపల్లి వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ ఢీకొంది. ఈప్రమాదంలో అన్వేశ్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్సకోసం కరీంనగర్‌ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమారుడు రోడ్డుప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు నోముల రాజేందర్‌రెడ్డి, స్వరూప బోరున విలపించారు. బాయమ్మపల్లెకు చెందిన ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై శ్రీధర్‌ తెలిపారు.

స్కిల్‌ట్యాంక్‌ ఎగ్జిబిషన్‌కు పారమిత విద్యార్థిని



శుభశ్రీని అభినందిస్తున్న డా.ప్రసాదరావు

కొత్తపల్లి(కరీంనగర్‌): పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్‌ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న శుభశ్రీ సాహు శాస్త్రీయ ఆవిష్కరణలో కృషికి ఓఎల్‌ఎల్‌ఎస్‌ సీఎస్‌ఎన్‌ టీబీ 18 స్కిల్‌ జోనల్‌ రౌండ్‌లో పాల్గొనేందుకు ఎంపికైనట్లు ఆ విద్యా సంస్థల చైర్మన్‌ ఇ.ప్రసాదరావు తెలిపారు. స్కిల్‌ ట్యాంక్‌ సీజన్‌–1 జోనల్‌ రౌండ్‌కు దక్షిణ జోన్‌ నుంచి 500 మందికి పైగా పాల్గొనే విద్యార్థుల్లో శుభశ్రీ ఉండటం గర్వకారణమని అన్నారు. జోనల్‌ రౌండ్‌ ఐడియా పిచ్‌ ప్రజెంటేషన్‌ వచ్చే నెల 5, 6 తేదీల్లో కర్ణాటకలోని జైన్‌ ఇంటర్నేషనల్‌ రెసిడెన్షియల్‌ స్కూల్‌లో జరగనుందన్నారు. శుభశ్రీ తన గైడ్‌ టీచర్‌ లలిత్‌ మోహన్‌ సాహు ఆధ్వర్యంలో పర్యావరణ అనుకూలమైన, మల్టీఫంక్షనల్‌, తక్కువ ధర, పోర్టబుల్‌ వ్యవసాయ యంత్రాన్ని అభివృద్ధి చేయడం ద్వారా రైతుల సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేసిందని తెలిపారు. ఈ యంత్రం నూర్పిడి, ధాన్యాన్ని వేరు చేయడం, గడ్డిని కత్తిరించడం, విన్నోవింగ్‌, బ్యాగ్‌ కుట్టడం వంటి నాలుగు వేర్వేరు కార్యకలాపాలతో పని చేస్తుందన్నారు. విద్యార్థిని ప్రసాదరావు, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌ రావు, రాకేష్‌, వీయూఎం ప్రసాద్‌, వినోద్‌ రావు, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు రితేష్‌ మెహతా, ప్రోగ్రాంహెడ్‌ గోపీకృష్ణ , గైడ్‌ టీచర్‌ లలిత్‌ మోహన్‌ సాహు అభినందించారు.

నాగరాజు ప్రజాదరణ కలిగిన నాయకుడు

- మానకొండూర్‌ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌
- బీఆర్‌ఎస్‌లో చేరాలని ఆహ్వానం



నాగరాజును కలిసిన రసమయి, తదితరులు

మానకొండూర్‌: బీజేపీ మానకొండూర్‌ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి గడ్డం నాగరాజు ప్రజాదరణ కలిగిన నాయకుడని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ అన్నారు. నాగరాజు శుక్రవారం బీజేపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. శనివారం నాగరాజును మానకొండూర్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌, బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణారావు కలిశారు. బీఆర్‌ఎస్‌లో చేరాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా రసమయి మాట్లాడుతూ.. పార్టీకి పనిచేసిన చాలా మందిని అన్యాయానికి గురి చేయడం బీజేపీ వైఖరని అన్నారు. ఆ పార్టీలో నాగరాజుకు తీవ్ర అన్యాయం జరిగిందని వివరించారు. కష్టపడేవారికి గౌరవం ఇచ్చే పార్టీ బీఆర్‌ఎస్‌ అన్నారు. నాగరాజు బీఆర్‌ఎస్‌లో చేరాలని, ఎన్నికల సందర్భంగా మద్దతు ఇవ్వాలని కోరారు. బీఆర్‌ఎస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్న ఆయనకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. జెడ్పీటీసీలు తాళ్లపల్లి శేఖర్‌గౌడ్‌, సిద్ధం వేణు, సర్పంచ్‌లు రొడ్డ పృథ్వీరాజ్‌, దేవ సతీశ్‌రెడ్డి, నెల్లి మురళి, పిట్టల మధు, నెల్లి శంకర్‌, శాతరాజు యాదగిరి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మెడికోల ర్యాలీ



కరీంనగర్‌రూరల్‌: చల్మెడ ఆనందరావు కేన్సర్‌ ఆస్పత్రి, ఇండియన్‌ కేన్సర్‌ సొసైటీ, స్పర్శ్‌ హస్పైస్‌ కేర్‌ సంయుక్తంగా శనివారం రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కోర్టు చౌరస్తాలో వైద్య విద్యార్థుల ర్యాలీని కళాశాల డైరెక్టర్‌ వి. సూర్యనారాయణరెడ్డి, కేన్సర్‌ ఆస్పత్రి హెచ్‌వోడీ డాక్టర్‌ ఎజిలారాసీ జెండా ఊపి ప్రారంభించారు.భారత్‌లో 2020 అంచనా ప్రకారం 13.5శాతం రొమ్ము కేన్సర్‌ వ్యాధిగ్రస్తులున్నట్లు తెలిపారు. అక్టోబరు నెలను రొమ్ము కేన్సర్‌ నెలగా పేర్కొంటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ర్యాలీ ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌ మీదుగా కలెక్టరేట్‌ వరకు సాగింది. డీఎంహెచ్‌వో లలితాదేవి, ప్రిన్సిపాల్‌ అసీంఅలీ, వైస్‌ ప్రిన్సిపాల్‌ అనిత, వైద్యులు ప్రశాంత్‌కుమార్‌, రణధీర్‌రెడ్డి, ప్రదీప్‌ పాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణకు చట్టం తేవాలి



మాట్లాడుతున్న కొయ్యడ సృజన్‌కుమార్‌

- జీకేఎంయూ రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌కుమార్‌

సప్తగిరికాలనీ(కరీంనగర్‌): పేద వర్గాల అభ్యున్నతికి ప్రైవేటు విద్యా, వైద్య సంస్థల్లో ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం తేవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్‌ కుమార్‌ డిమాండ్‌ చేశారు. శనివారం స్థానిక బద్దం ఎల్లారెడ్డి భవనంలో జరిగిన దళిత్‌ సమ్మిట్‌ జిల్లాస్థాయి రౌండ్‌టేబుల్‌ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి75ఏళ్లు గడిచినా అట్టడుగు వర్గాలైన దళితులు, గిరిజనులు, మైనార్టీ, వెనుకబడిన తరగతుల అభ్యున్నతి కోసం భారత రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం రాజ్యాంగ హక్కులపై దాడి చేస్తోందని, రిజర్వేషన్లు, సామాజిక న్యాయానికి తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. నాయకులు తాళ్లపల్లి లక్ష్మణ్‌, జనగామ నర్సింగ్‌, మార్వాడీ సుదర్శన్‌, బోయిని అశోక్‌, తిప్పారపు సురేశ్‌, బోయిని తిరుపతి, వడ్ల రాజు, రాయికంటి శ్రీనివాస్‌, అందే స్వామి, విలాసాగరం అంజయ్య, దరిపెల్లి అంకుస్‌, కొంపల్లిసాగర్‌, పులిపాక సాయి కుమార్‌, కాంపల్లి అరవింద్‌, పైడిపల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.

లోన్‌ ఇప్పిస్తానని మోసం చేసిన మహిళపై కేసు

కొత్తపల్లి(కరీంనగర్‌): కొత్తపల్లి మండలం నాగులమల్యాల గ్రామానికి చెందిన పలువురికి లోన్‌ ఇప్పిస్తానని మోసం చేసిన కరీంనగర్‌కు చెందిన షహీమ్‌ ఫాతిమాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్‌ తెలిపారు. ఎస్సై వివరాల మేరకు రూ.4 వేలు కడితే రూ.లక్ష, 8 వేలు కడితే రూ.20 లక్షల లోన్‌ భద్రాద్రి బ్యాంక్‌, ఇతర ప్రైవేట్‌ బ్యాంకుల నుంచి ఇప్పిస్తానని ఫాతిమా పలువురికి ఆశచూపింది. నాగులమల్యాల గ్రామానికి చెందిన ఉల్లెందుల మల్లేశం నుంచి లోన్‌ ఇప్పిస్తానని ఫోన్‌పే ద్వారా రూ.4 వేలు తీసుకుంది. ఇతని తరహాలోనే గ్రామానికి చెందిన పలువురి నుంచి డబ్బులు తీసుకొని లోన్‌ ఇప్పించకుండా తప్పించుకు తిరుగుతోంది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫాతిమాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

- ఆస్పత్రిలో బంధువుల ఆందోళన

కరీంనగర్‌టౌన్‌: కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి మృతిచెందాడు.ఆ సమాచారాన్ని గోప్యంగా ఉంచారంటూ బంధువులు ఆందోళన చేపట్టారు. జగిత్యాల జిల్లా రాయికల్‌కు చెందిన పీట్ల రాజారాం కిడ్నీ సమస్యతో గురువారం నగరంలోని ఓ ఆస్పత్రిలో చేరాడు. పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందగా, బంధువులు అడిగే వరకు గోప్యంగా ఉంచడంలో ఆంతర్యమేమిటని ఆందోళన చేపట్టారు. కేవలం బిల్లులు కట్టించుకోవడానికే ఆసుపత్రి వర్గాలు మృతి విషయాన్ని దాచిపెట్టారని ఆరోపించారు. ఇదే విషయమై ఆసుపత్రి యాజమాన్యాన్ని వివరణ కోరగా, పరిస్థితి విషమించి శనివారం ఉదయం చనిపోయాడని తెలిపారు. ఇందులో గోప్యత ఏమీ లేదని స్పష్టం చేశారు.

ప్రాణం తీసిన చేపల వేట

- బద్దిపల్లిలో విద్యుత్‌ షాక్‌తో ఒకరి మృతి



కంభం సంపత్‌ (ఫైల్‌)

కొత్తపల్లి(కరీంనగర్‌): చేపలవేట ఒకరి ప్రాణం తీసింది. ఈ ఘటన కొత్తపల్లి మండలం బద్దిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై చంద్రశేఖర్‌ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కంభం సంపత్‌(40) వ్యవసాయం చేస్తుంటాడు. శుక్రవారం తన స్నేహితుడు కంకణాల మల్లేశంతో కలిసి గ్రామ సమీప మామిండ్లపల్లి వంతెన కింద నీటిలో చేపలు పట్టేందుకు వెళ్లారు. విద్యుత్‌ షాక్‌కు నీటిలోని చేపలన్నీ చనిపోతాయని భావించిన వారు సమీపంలోని వ్యవసాయ బావి విద్యుత్‌ మోటర్‌ స్టార్టర్‌ నుంచి వైరు కనెక్షన్‌ తీసుకున్నారు. విద్యుత్‌ కనెక్షన్‌ను మల్లేశం ఇవ్వగా..ఆ వైర్‌ను నీటిలో వేసేందుకు వంతెన వద్ద సంపత్‌ సిద్ధంగా ఉన్నాడు. మల్లేశం స్టార్టర్‌ ఆన్‌ చేయగానే కంభం సంపత్‌ విద్యుత్‌ షాక్‌కు గురై మృతి చెందాడు. తన కొడుకు మృతికి కారణమైన మల్లేశంపై చర్యలు తీసుకోవాలని మృతుడి తల్లి సత్తవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

ఉద్యోగిని కొట్టిన వ్యక్తిపై కేసు

జగిత్యాలక్రైం:జిల్లాకేంద్రంలోని 17వ వార్డులో ఇంటిని పరిశీలించేందుకు వెళ్లిన టౌన్‌ప్లానింగ్‌ చైన్‌మెన్‌ బిరుదుల అశోక్‌ను దుర్భషలాడుతూ..దాడి చేసిన రాజసుమన్‌రావుపై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీస్‌స్టేషన్‌ హెడ్‌కానిస్టేబుల్‌ మోహన్‌ తెలిపారు.

దాడి ఘటనలో పలువురిపై..

అంగడిబజార్‌లో కర్రీపాయింట్‌ నిర్వహిస్తున్న శేర్‌ విజయ్‌పై దాడి ఘటనలో కేసు నమోదు చేసినట్లు పట్టణ ఏఎస్సై చంద్రయ్య తెలిపారు. రాంబజార్‌కు చెందిన విజయ్‌ కర్రీ పాయింట్‌ నిర్వహిస్తున్నాడు. ఈనెల 25న రాత్రి వంశీ, శ్రీకాంత్‌, కుసుంబ నిఖిల్‌, దీక్షిత్‌రావు, మరికొంత మంది మద్యం తాగి విజయ్‌తో గొడవపడ్డారు. ఇనుపరాడ్‌తో దాడిచేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వంశీ, శ్రీకాంత్‌, కుసుంబ నిఖిల్‌, దీక్షిత్‌రావుతో పాటు, మరికొంత మందిపై కేసు నమోదు చేశారు.

మల్లాపూర్‌ ఎస్సై, కానిస్టేబుల్‌పై ఎస్పీకి ఫిర్యాదు

జగిత్యాలక్రైం: అకారణంగా దాడికి పాల్పడిన మల్లాపూర్‌ ఎస్సై నవీన్‌కుమార్‌, కానిస్టేబుల్‌ భూక్య సురేశ్‌పై చర్యలు తీసుకోవాలని బంజరితండాకు చెందిన జాటోత్‌ కిషన్‌ శనివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో అడిషనల్‌ ఎస్పీ ప్రభాకర్‌రావుకు ఫిర్యాదు చేశారు. బానోతుతండాకు చెందిన జాటోతు కిషన్‌ను ఈనెల 26న రాత్రి 10.30 గంటల సమయంలో పోలీసులు మల్లాపూర్‌ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విచక్షణారహితంగా కొట్టడంతో తలకు గాయమైందని, రాత్రి ఆర్‌ఎంపీతో కుట్లు వేయించారని, అనంతరం పోలీసులే తీసుకెళ్లి ఇంటి వద్ద వదిలిపెట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తనను విచక్షణారహితంగా కొట్టిన ఎస్సై, కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

ఘనంగా వాల్మీకి జయంతి



వాల్మీకి విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్: కరీంనగర్ నియోజకవర్గంలో వాల్మీకి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శనివారం నగరంలోని వాల్మీకినగర్‌లో గల ఆలయంలో వాల్మీకి విగ్రహానికి మంత్రి గంగుల కమలాకర్ పూలమాల వేశారు. ఈ సందర్భంగా మంత్రి కాలనీకి చేరుకోగానే మహిళలు మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. వాల్మీకి మహారాజ్‌కీ జై అంటూ నినాదాలు చేశారు. పలువురు బోయ వాల్మీకీ నాయకులు మంత్రి గంగులను సత్కరించారు. కార్యక్రమంలో మేయర్ సునీల్‌రావు, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, బీఆర్‌ఎస్ నాయకులు, బోయవాల్మీకి నాయకులు, కులస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

కరీంనగర్‌టౌన్: నగరంలోని ఎస్సారార్ డిగ్రీ కళాశాలలో శనివారం మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కళాశాలలో పనిచేసే టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు 120 మందికి బీపీ, జీఆర్‌బీఎస్, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలతో పాటు కార్డియాలజిస్ట్ డాక్టర్ కిరణ్‌కుమార్, జనరల్ ఫిజీషియన్ నాగరాజులు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ, స్టాఫ్ సెక్రెటరీ ఆడెపు శ్రీనివాస్, మెడికవర్ ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ గుర్రం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

30న ఆటో డ్రైవర్ల ఆత్మీయ సమ్మేళనం

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ ఆటో కార్మిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 30న ఆటో డ్రైవర్ల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు మద్దెల రాజేందర్ తెలిపారు. శనివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్‌లోని పద్మనగర్‌లో ఆటో సంక్షేమ సంఘానికి ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమ్మేళనంలో కరీంనగర్‌లోని అన్ని ఆటో అడ్డాల అధ్యక్ష, కార్యదర్శులు, ఆటోడ్రైవర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఉచిత కంటి పరీక్ష శిబిరం



కంటి పరీక్ష చేస్తున్న ఆసుపత్రి సిబ్బంది

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ కూరగాయల మార్కెట్ సమీపంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శరత్ మాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్న అనంతరం కంటి పరీక్ష చేయించుకున్నారు. పరీక్ష తర్వాత ఏవైనా కంటి సమస్యలు ఉన్న వారికి ఆస్పత్రికి రిఫర్ చేశారు. దాదాపు 200 మందికి ఉచితంగా కంటి పరీక్ష స్క్రీనింగ్ నిర్వహించారు. శిబిరంలో ఆసుపత్రి మేనేజర్ విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ పనులకు మోక్షమెప్పుడో..!

- ప్రమాదకరంగా డ్రైనేజీలు, ఫుట్‌పాత్‌లు
- ఇబ్బంది పడుతున్న నగరవాసులు

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో అసంపూర్తిగా ఉన్న స్మార్ట్‌సిటీ పనులకు మోక్షం కలగడం లేదు. ఏడాది గడుస్తున్నా పనుల పూర్తిపై కాంట్రాక్టర్ దృష్టి పెట్టిన దాఖలాలు లేవు. గడువు ఇంకా ఉందనే సాకుతో అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. ఫలితంగా సగంసగం పనులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

అసంపూర్తిగా పనులతో ఇబ్బందులు

స్మార్ట్‌సిటీలో చోటు లభించిన తర్వాత నగరంలో వందలాది కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రోడ్లు, డ్రైనేజీలు, ఫుట్‌పాత్‌లు, రెయిలింగ్ తదితర పనులు చేపట్టారు. అయితే చాలా ప్రాంతాల్లో పనులు పూర్తిగా చేపట్టకపోవడం సమస్యగా మారింది. ముఖ్యంగా డ్రైనేజీలు, ఫుట్‌పాత్‌ల ఫినిషింగ్ వర్క్స్ పూర్తి చేయకుండా వదిలివేయటంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. వీధుల వారీగా నిర్మించిన డ్రైనేజీల మధ్య కనెక్షన్ ఇవ్వకుండా అలానే వదిలేశారు. కొన్నిచోట్ల రోడ్లకు అడ్డుగా నిర్మించిన డ్రైనేజీలపై శ్లాబ్ పూర్తి చేయకపోవడంతో హోల్స్ ప్రమాదకరంగా మారాయి. ఇక ఫుట్‌పాత్‌ల నిర్మాణం ఒక ప్రహసనమనే చెప్పవచ్చు. ఎక్కడా గ్యాప్ లేకుండా ఫుట్‌పాత్‌లు దర్శనమివ్వడం లేదు. ఫుట్ పాత్‌లపై టైల్స్ పూర్తిస్థాయిలో వేయకపోవడంతో చాలా చోట్ల, ప్రధానంగా రోడ్లు, డ్రైనేజీలను కలిపే లింక్‌ల వద్ద ఇబ్బందిగా మారింది. ఫుట్‌పాత్‌ల కోసం వేసిన టైల్స్ పనుల్లో కూడా నాణ్యత కొరవడడంతో టైల్స్ చెల్లా చెదురయ్యాయి. మరికొన్ని చోట్ల కుంగిపోయాయి. కనీసం నడవడానికి కూడా పనికిరాకుండా పోతున్నాయి. స్మార్ట్‌సిటీ పనులు పూర్తిచేయడానికి గడువు పొడిగించడంతో వచ్చే జూన్ వరకు కాంట్రాక్టర్‌కు అవకాశం ఉంది. కానీ పనులు చేపట్టిన చోట 95శాతానికి పైగా పనులు పూర్తికావడం, అక్కడి నుంచి మెటీరియల్ తొలగించడం, కార్మికులు కనిపించకపోవడంతో పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. మెటీరియల్, కార్మికులు ఉన్నప్పుడే తాము వెంటపడినా సూపర్‌వైజర్ పట్టించుకోలేదని, ఎవరూ అందుబాటులో లేని ప్రస్తుత పరిస్థితుల్లో పనులు కావడం అనుమానమేనని స్థానికులు పెదవి విరుస్తున్నారు. ఇదిలా ఉంటే ఇటీవల ముఖ్యమంత్రి హామీ నిధులు రూ.134 కోట్లతో నగరంలో చేపట్టే పనులకు సంబంధించిన కాంట్రాక్ట్ కూడా స్మార్ట్‌సిటీ కాంట్రాక్టర్‌కే అప్పగించారు. ఈ అంతర్గత రోడ్ల నిర్మాణ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే పనుల్లో అసంపూర్తిగా ఉన్నవి గుర్తించి పూర్తి చేయించాలని నగరవాసులు కోరుతున్నారు.



రోడ్డు మధ్యలో డ్రైనేజీపై అసంపూర్తి శ్లాబుతో ప్రమాదకరంగా మారిన గొయ్యి



హౌసింగ్‌బోర్డుకాలనీలో డ్రైనేజీలు కలిపే చోట ఇదీ పరిస్థితి

ఆలయాలు మూసివేత



మార్కెట్‌రోడ్డులోని వేంకటేశ్వరాలయాన్ని మూసేస్తున్న సిబ్బంది



పాతబజార్ గౌరీశంకరాలయాన్ని మూసివేస్తున్న సిబ్బంది

కరీంనగర్ కల్చరల్: ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమి, శనివారం సంభవించిన చంద్రగ్రహణంతో కరీంనగర్‌లోని ఆలయాలను మధ్యాహ్నం ఒంటిగంటకు మూసివేశారు. ఆలయాల ఎదుట ప్రకటనలు అంటించారు. గ్రహణ వేధ కారణంగా సాయంత్రం 4 గంటల లోపే శ్రద్ధా కార్యక్రమాలు, భోజనాలు ముగించుకున్నారు. గ్రహణ స్పర్శ కాలం రాత్రి 1.6 గంటలకు కాగా మధ్య 24కాలం 1.44 గంటలకు, మోక్ష కాలం రాత్రి 2.25 గంటలకు కావడంతో నిద్రలోనే గ్రహణం గడిచిపోతుంది. ఆదివారం ఉదయం ఆలయాల శుద్ధి అనంతరం పూజలు, దర్శనాలు కొనసాగనున్నాయి.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో కరీంనగర్ జీవన ప్రమాణాలు పెరిగాయని, బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. నగరంలోని తిరుమల్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి హాజరయ్యారు. మాజీ కార్పొరేటర్ నలువాల రవీందర్ పుష్పగుచ్ఛం అందించి మంత్రికి స్వాగతం పలికారు. మహిళలు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మానేరు రివర్ ఫ్రంట్‌ను అద్భుతకట్టడంగా తీర్చిదిద్దనున్నామన్నారు. వర్షా కాలంలోనూ నీటి సమస్యలతో సతమతమయ్యే వాళ్లమని, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీటి సమస్య సమసిపోయిందన్నారు. విలువైన ఓటును బీఆర్‌ఎస్ పార్టీకి వేసి అభివృద్ధిని కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లయి చైర్మన్ రవీందర్‌సింగ్, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, బీఆర్‌ఎస్ నాయకులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

మగ్గం నేస్తా..చెరక చుడతా..నీ ఓటు 'కారు'కే..



మల్కాపూర్‌లో మగ్గం నేస్తున్న మంత్రి సతీమణి గంగుల రజిత

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం మల్కాపూర్, లక్ష్మీపూర్ గ్రామాల్లో బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ సతీమణి గంగుల రజిత శనివారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ తిరుగుతూ బొట్టు పెడుతూ కరీంనగర్ ఎమ్మెల్యేగా కమలాకర్‌ను గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు. మల్కాపూర్ చేనేత సంఘాన్ని సందర్శించి కార్మికులతో కలిసి మగ్గం నేస్తూ.. చెరక చుడుతూ..'కారు' గుర్తుకే ఓటేయాలంటూ విజ్ఞప్తి చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు కరీంనగర్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే రోల్‌మోడల్‌గా నిలిపిన మంత్రి కమలాకర్‌ను మరోసారి గెలిపించాలని కోరారు. ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్, జెడ్పీటీసీ పిట్టల కరుణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కాసారపు శ్రీనివాస్‌గౌడ్, వ్యాపారవేత్త గంగుల సుధాకర్‌తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కేసీఆర్‌కు బుద్ధిచెప్పాలి

కరీంనగర్‌కార్పొరేషన్: నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న సీఎం కేసీఆర్‌కు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని యువజన కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షుడు అబ్దుల్‌రెహ్మాన్ అన్నారు. శనివారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో నిరుద్యోగులకు భృతి అందిస్తామని చెప్పి, వరుసగా పోటీపరీక్షలు వాయిదా వేస్తూ నిరుద్యోగుల జీవితాలతో కేసీఆర్ ప్రభుత్వం ఆటలాడుకొంటోందని విమర్శించారు. కేజీ టూ పీజీ విద్యను ఉచితంగా అందిస్తామని చెప్పిన కేసీఆర్ ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం మరుగుదొడ్లు కూడా పూర్తిస్థాయిలో నిర్మించలేకపోయిందన్నారు. ప్రభుత్వ విద్యా, నిరుద్యోగ వ్యతిరేక విధానాల వల్ల ఎంతో మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌కు గుణపాఠం చెప్పాలని నిరుద్యోగులను కోరారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌ఏ మోసిన్, వైసీసీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మహ్మద్ అమీర్, అబ్దుల్ జమీల్ పాల్గొన్నారు.

నేడు బీజేపీ కరీంనగర్ అసెంబ్లీ విస్తృత స్థాయి సమావేశం

కరీంనగర్‌టౌన్: రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేసేందుకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ, బీజేపీ అసెంబ్లీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ ప్రణాళిక చేపట్టారు. ఇందులో భాగంగా ఆదివారం సీతారాంపూర్‌లోని ఈఎస్ గార్డెన్‌లో అసెంబ్లీ నియోజకవర్గ పోలింగ్ బూత్ అధ్యక్షులతో విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో గెలుపు కోసం అనుసరించాల్సి వ్యూహాలతో పాటు ఓటర్లను ఆకట్టుకునేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేయనున్నారు. తద్వారా పూర్తిస్థాయిలో ఎన్నికల కదన రంగంలోకి దింపాలని నిర్ణయించారు. ఇప్పటికే నియోజకవర్గంలో పోలింగ్ బూత్ ల వారీగా కమిటీలను పూర్తిస్థాయిలో నియమించిన సంజయ్ ఆయా కమిటీలకు బాధ్యతలు అప్పగించే ప్రక్రియను పూర్తి చేశారు. ఆయా బాధ్యులంతా తమకు అప్పగించిన పోలింగ్ బూత్‌లోని ఇళ్లకు వెళ్లడమే కాకుండా పోలింగ్ తేదీ నాటికి ఒక్కో కమిటీ కనీసం 10 సార్లు తమకు అప్పగించిన ఓటర్ల ఇళ్లకు వెళ్లి ఓట్లు అభ్యర్థించేలా ప్రణాళికను సిద్ధం చేశారు. అక్కడి నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ ఆధారంగా ఎప్పటికప్పుడు తగిన నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు. మరోవైపు బండి సంజయ్ నవంబర్ 2 నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించి కరీంనగర్ నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ వెళ్లాలని భావిస్తున్నారు.

'సీట్ల కేటాయింపులో బీసీలకు మొండి చేయి'

సప్తగిరికాలనీ(కరీంనగర్): రాష్ట్రజనాభాలో 60శాతం ఉన్న బీసీలను బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు చిన్నచూపు చూస్తున్నాయని బీసీ సంఘాల జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాశ్ అన్నారు. బీసీల జనాభా ప్రకారం వారికి సీట్లు కేటాయించలేదని తెలిపారు. బీసీలకు ప్రస్తుతం ప్రకటించిన సీట్లలో అత్యధిక టికెట్లు కేటాయించి, బీసీనే ముఖ్యమంత్రి చేస్తామన్న బీజేపీ ప్రకటనను బీసీ సంఘాల పక్షాన స్వాగతిస్తున్నామని అన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు బీసీలకు 20శాతం టికెట్లు మాత్రమే కేటాయించడం దారుణమని, ఇది బీసీలను అవమానించడమేనని పేర్కొన్నారు.

బీజేపీలో చేరిక

విద్యానగర్(కరీంనగర్): బీఆర్‌ఎస్‌కు చెందిన మైనార్టీ నాయకుడు మొహమ్మద్ బషీరుద్దీన్ ఆధ్వర్యంలో 100 మంది మైనార్టీలు శనివారం బీజేపీలో చేరారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి రాపర్తి ప్రసాద్, మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ముజీబ్, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సమీపర్వీజ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జూడో దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న ప్రిన్సిపాల్ జి.సరితారెడ్డి

కరీంనగర్‌స్పోర్ట్స్: జిగారో కనో జయంతిని పురస్కరించుకొని శనివారం కరీంనగర్ మానేరు విద్యాసంస్థల్లో జూడో అకాడమీ ఆధ్వర్యంలో ప్రపంచ జూడో దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కేక్‌ను మానేరు విద్యాసంస్థల ప్రిన్సిపాల్ జి.సరితారెడ్డి కట్ చేసి జూడో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆత్మస్థైర్యానికి, ఆత్మరక్షణకు జూడో క్రీడ దోహదపడుతుందని అన్నారు. రాష్ట్రంలో జూడో క్రీడకు పెట్టింది పేరు మానేరు విద్యాసంస్థలని, ఏటా రాష్ట్రస్థాయి జూడో పోటీలను అట్టహాసంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. జూడోలో రాణించిన వారు అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శబరిమల మహాపాదయాత్ర



మాట్లాడుతున్న గడప నాగరాజు

కరీంనగర్‌కల్చరల్: ఏటా నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ నుంచి శబరిమల మహాపాదయాత్ర సోమవారం ఉదయం 11 గంటలకు జెడ్పీ క్వార్టర్స్ ఆవరణలోని అయ్యప్ప ఆలయం నుంచి ప్రారంభిస్తున్నట్లు మహాపాదయాత్ర గురుస్వామి గడప నాగరాజు తెలిపారు. శనివారం ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. కరీంనగర్ నుంచి కాలినడకన హైదరాబాద్(తెలంగాణ), కర్నూల్, అనంతపూర్(ఏపీ), చిక్బల్లాపూర్, దేవనపల్లి (కర్ణాటక), ఉర్సూర్, సేలం (తమిళనాడు), కుమిలి, వెండి పెరియా, పులిమేడ (కేరళ) ద్వారా వెళ్లనున్నట్లు తెలిపారు. సుమారు 130 మంది అయ్యప్ప భక్తులు రోజూ 22 కిలోమీటర్ల చొప్పున 45 రోజుల పాటు పయనిస్తూ 1,400 కిలోమీటర్ల పాదయాత్ర పూర్తి చేస్తారని అన్నారు. డిసెంబరు 14న శబరిమల సన్నిధానంలో అయ్యప్పను దర్శించుకుంటామని తెలిపారు.. ఈ సమావేశంలో కంటి రాజ్‌కుమార్, నమిలకొండ రమేష్, గంగుల సురేష్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధం ఆపాలి



మాట్లాడుతున్న గీట్ల ముకుందరెడ్డి

విద్యానగర్(కరీంనగర్): పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని ఆపేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి అన్నారు. ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ శనివారం కరీంనగర్‌లో రైస్‌మిల్లు ఆపరేటర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. హమస్ దాడిని సాకుగా చేసుకొని గాజాలోని సామాన్య పాలస్తీనియన్లను ఇజ్రాయిల్ చంపేస్తుందన్నారు. పాలస్తీనాకు సంఘీభావంగా సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన తెలియజేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ ఉపాధ్యక్షుడు సీహెచ్.భద్రయ్య, ప్రధాన కార్యదర్శి గట్టు సతీశ్, నాయకులు ఎస్.రమేశ్, ఎలిమి రమేశ్, గంజాల గోపి, పిట్టల సంపత్, ఎలవేని, కొమురయ్య, ఎడ్ల మల్లారెడ్డి, ప్రతాపరెడ్డి, గట్టు స్వామి తదితరులు పాల్గొన్నారు.

'ఆస్పత్రిని తక్షణమే మూసేయాలి'

కరీంనగర్‌టౌన్: కొత్తపల్లి మండలం బావుపేటకు చెందిన ఎల్లమ్మ మృతికి కారణమైన వశిష్ఠ ప్రైవేట్ ఆస్పత్రిని తక్షణమే మూసి వేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోనగిరి మహేందర్, బ్రాహ్మణపల్లి యుగంధర్‌లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వైద్యులు సరైన వైద్యం అందించకుండా నిర్లక్ష్యం చేయడంతోనే ఆమె మృతి చెందిందని తెలిపారు. త్రిసభ్య కమిటీ వేశామని డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రకటించారని కమిటీ సభ్యులు ఎవరి ప్రలోభాలకు తలొగ్గకుండా పారదర్శకంగా విచారణ జరపాలని కోరారు. ఆమె మృతికి కారణాలను బహిర్గతం చేయాలని, అప్పటి వరకు ఆస్పత్రిని మూసివేయాలన్నారు. లేనిపక్షంలో ఏఐవైఎఫ్ జిల్లా సమితి పక్షాన ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

పొన్నం ప్రభాకర్‌కు సన్మానం



ప్రభాకర్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపికైన మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌ను శనివారం కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ మండల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హుస్నాబాద్‌లోని ఎన్నికల కార్యాలయంలో ప్రభాకర్‌ను కలిసి శాలువాతో సన్మానించారు. ఎమ్మెల్యేగా గెలువాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కరీంనగర్, కొత్తపల్లి మండలాల అధ్యక్షులు కె.రాంరెడ్డి, పంజాల స్వామిగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు నాగప్రసాద్, గన్ను రాజిరెడ్డి, బుర్ర హరీశ్‌గౌడ్, గూడ అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిత్ర కథ: కాలుష్య కోరల్లో 'కొత్తపల్లి చెరువు'



కొత్తపల్లి పట్టణంలోని ఊరచెరువు కాలుష్య కోరల్లో చిక్కుకుంది. కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న ఈ చెరువు అందాలు ఆహ్లాదాన్ని పంచాల్సి ఉండగా.. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో సిల్టుతో నిండుకుంది. వినాయకచవితి, బతుకమ్మ, దసరాల సందర్భంగా విఘ్నేశ్వర ప్రతిమలు, బతుకమ్మలు, శ్రీదుర్గాదేవి ప్రతిమలను ఏటా నిమజ్జనం చేస్తుంటారు. అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్న అధికారులు తదనంతరం ఆ సిల్టు తొలగించకుండా చేతులెత్తేస్తున్నారు. ఫలితంగా ప్రతిమలకు సంబంధించిన కర్రలు, బొంగులు తదితర వస్తువులు చెరువులోనే తేలియాడుతున్నాయి. వీటికితోడు బతుకమ్మ వేడుకల సందర్భంగా వేసిన పూలు కుళ్లిపోయి దుర్వాసన వస్తున్నాయి. ప్రజారోగ్యంపై పట్టింపులేకుండా వ్యవహరిస్తుండటం స్థానికులకు ఇబ్బందిగా మారింది. అదేవిధంగా మండలంలోని చింతకుంట ఎస్సారెస్పీ కెనాల్‌లో సైతం ఇదే తరహా చోటుచేసుకుంది. పంచాయతీ సిబ్బంది, పాలకమండలి పట్టించుకోకపోవడంతో కెనాల్‌లో నిలిచిన నీటితో ఆ పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వస్తోంది. ఇక కొత్తపల్లి చెరువు, చింతకుంట కెనాల్‌పై అధికారులు దృష్టి సారించి సిల్టును తొలగించాలని కోరుతున్నారు. – కొత్తపల్లి

పిల్లల్లో నాడీ సంబంధ మానసిక రుగ్మతలు



శ్రీనివాస్‌రెడ్డికి ఫిజియోథెరపి కిట్ అందిస్తున్న సతీశ్

విద్యానగర్(కరీంనగర్): పిల్లల్లో నాడీ సంబంధిత మానసిక రుగ్మతలు రోజురోజుకూ పెరుగుతున్నాయని రిహాబిలిటేషన్ సైకాలజిస్ట్ అట్ల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం కరీంనగర్‌లోని బ్లూమ్స్ పినాకిల్ ఆటిజం కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. పిల్లల సమగ్ర అభివృద్ధికి పినాకిల్ సేవలు గొప్పవన్నారు. బ్లూమ్ పినాకిల్ ఆక్యుపేషనల్ థెరపీ, ప్రత్యేక విద్య, ఫిజియోథెరపి బాగుందని తెలిపా రు. ఈ కార్యక్రమంలో బిహేవియరల్ థెరపిస్ట్ మునిగంటి సతీశ్, ఆక్యుపేషనల్ థెరపిస్ట్ సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణ ప్రజాగర్జన' విజయవంతం చేయాలి



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న గజ్జెల కాంతం

విద్యానగర్(కరీంనగర్): నగరంలోని అంబేడ్కర్ స్టేడియంలో నవంబర్ 4న నిర్వహించే తెలంగాణ ప్రజాగర్జనను విజయవంతం చేయాలని ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గజ్జెల కాంతం అన్నారు. శనివారం కరీంనగర్‌లోని కరీముల్లా షా దర్గాలో ప్రజాగర్జన విజయవంతం కావాలని ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కులాలు, మతాలకు అతీతంగా అధిక సంఖ్యలో ప్రజలు ప్రజాగర్జనలో పాల్గొనాలని కోరారు.

క్లుప్తంగా...

అంబటిపై దాడి ఘటనలో కేసులు నమోదు

- నిందితులైన ఏడుగురు టీడీపీ నేతల గుర్తింపు
- ఘటనను ఖండించిన మున్నూరు కాపు సంక్షేమ సంఘం

ఖమ్మం మయూరిసెంటర్/ఖమ్మం క్రైం: ఖమ్మంలో శుక్రవారం ఏపీ మంత్రి అంబటి రాంబాబు కాన్వాయ్‌ను అడ్డుకుని కర్రలతో బీభత్సం సృష్టించిన టీడీపీ నాయకులు కేతినేని హరీశ్, కాంపాటి విజయ్‌కుమార్, రామాంజనేయ, జయ, నర్వనేని శంకర్, నాగండ్ల లక్ష్మణ్‌రావు, మందడపు కోటిపై ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఘటనపై మంత్రి గన్‌మేన్ జంగం కిరణ్ ఫిర్యాదు మేరకు శనివారం నిందితులపై కేసులు నమోదు చేసినట్లు సీఐ స్వామి తెలిపారు. కాగా, శుభకార్యానికి వచ్చిన అతిథులను అగౌరవపరచడం, దాడులకు ప్రయత్నించడం సంప్రదాయం కాదని, ఏపీ మంత్రి అంబటిని దుర్భాషలాడుతూ దాడికి యత్నించడం గర్హనీయమని మున్నూరుకాపు సంక్షేమ సంఘం పేర్కొంది. ఈ మేరకు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పారా నాగేశ్వరరావు, రాష్ట్ర బాధ్యులు ఆకుల గాంధీ, శెట్టి రంగారావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఏపీలో తేలికపాటి వర్షాలు



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో కొన్నాళ్లుగా వాతావరణం పొడిగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతల్లో మార్పు వల్ల ఉక్కపోత ఉంటోంది. తాజాగా గాలుల దిశ మారిన కారణంగా తూర్పు, ఆగ్నేయ గాలులు రాష్ట్రంపై ప్రభావం చూపుతున్నాయి. దీంతో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. అదే సమయంలో తేలికపాటి జల్లులు లేదా వర్షాలకు ఆస్కారం ఉందని భారత వాతావరణశాఖ శనివారం ఓ నివేదికలో తెలిపింది. రానున్న మూడు రోజుల్లో కోస్తాంధ్ర, రాయలసీమల్లో ఒకట్రెండు చోట్ల జల్లులు గాని, తేలికపాటి వర్షం గాని కురవవచ్చని పేర్కొంది. అదే సమయంలో ఉరుములు, మెరుపులకు ఆస్కారం ఉందని అంచనా వేసింది.





వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో జరిగిన సామాజిక సాధికార యాత్రకు హాజరైన జనసందోహం • విశాఖ జిల్లా తగరపువలస సభలో పాల్గొన్న అశేష జనవాహిని

సామాజిక విప్లవ సారథి జగన్‌కు జేజేలు

- మూడో రోజూ ప్రభంజనంలా వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర
- భీమిలి, బాపట్ల, ప్రొద్దుటూరు నియోజకవర్గాల్లో యాత్రకు విశేష స్పందన
- రేపు పాడేరు, దెందులూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో బస్సు యాత్ర

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం/ సాక్షి, బాపట్ల/సాక్షి, కడప: సామాజిక విప్లవ సారథి వైఎస్ జగన్ పరిపాలనకు ప్రజలు అడుగడుగునా జేజేలు పలుకుతున్నారు. వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్రను హర్షాతిరేకాలతో స్వాగతిస్తున్నారు. 'జగనన్నే మా భవిష్యత్తు.. జగనే రావాలి.. జగనే కావాలి' అంటూ అన్ని వర్గాలూ ఒక్క గళమై నినదిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు మూడో రోజు శనివారం ప్రజలు నీరాజనం పలికారు. గత 53 నెలలుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదలకు చేస్తున్న మంచిని వివరించడానికి సీఎం జగన్ నాయకత్వంలో వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్ర శనివారం విశాఖ జిల్లా భీమిలి, బాపట్ల జిల్లా బాపట్ల, వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులో జరిగింది. ఈ బస్సు యాత్ర సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, ఏలూరు జిల్లా దెందులూరు, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గాల్లో జరగనుంది.

జగనే కావాలి అంటూ హోరెత్తిన భీమిలి

భీమిలిలో స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రను ఎండాడలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు బొత్స సత్యనారాయణ, మేరుగు నాగార్జున, సీదిరి అప్పలరాజు, కారుమూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఆనందపురం మండలం బోయిపాలెం కూడలి నుంచి 2 వేలకు పైగా బైక్‌లు, వందకు పైగా కార్లతో ర్యాలీగా యాత్ర ప్రారంభమై జాతీయ రహదారి మీదుగా తగరపువలస చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్ వద్ద గల బహిరంగ సభ స్థలి వద్దకు చేరింది. పర్యటన ఆసాంతం 'జగనే కావాలి – జగనే రావాలి'అంటూ ప్రజలు చేసిన నివాదాలతో హోరెత్తింది.

బాపట్లలో అపూర్వ స్పందన

బాపట్ల నియోజకవర్గంలో బస్సు యాత్రకు అపూర్వ స్పందన లభించింది. యాత్రకు ప్రజలు పూల తివాచీలతో ఘనస్వాగతం పలికారు. విద్య, వైద్యం తదితర విభాగాల్లో జరిగిన అభివృద్ధిని ఎంపీ విజయసాయిరెడ్డి ప్రజలకు వివరించారు. యాత్ర రెడ్డిపాలెం, కర్లపాలెం మీదుగా సాయంత్రం 5.30 గంటలకు బాపట్ల చేరుకుంది. నియోజకవర్గంలోని యువకులు అధిక సంఖ్యలో ద్విచక్రవాహనాలతో భారీ ర్యాలీ చేశారు. అంబేడ్కర్ సెంటర్‌లో సభ జరిగింది. వైఎస్ జగన్ సీఎం అయిన తర్వాత బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చేస్తున్న మేలును మంత్రులు వివరించిన సమయంలో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

జనసంద్రంగా మారిన పసిడిపురి

పసిడిపురి ప్రొద్దుటూరులో సామాజిక సాధికార యాత్ర జనజాతరలా సాగింది. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి నియోజకవర్గ నేతలతో కలిసి బస్సు ముందు నడుస్తుండగా మహిళలు వైఎస్సార్‌సీపీ జెండాలతో స్వాగతం పలికారు. యువత భారీ బైక్ ర్యాలీ చేశారు. శివాలయం సెంటర్‌లో అసంఖ్యాక జనం మధ్య బహిరంగ సభ జరిగింది. దసరా ఉత్సవాలకు పసిడిపురి పెట్టింది పేరు. భారీ స్థాయిలో ప్రజానీకం వీటిని వీక్షిస్తుంటారు. శనివారం సామాజిక సాధికార యాత్ర కూడా ఇదే ఉత్సవాలను తలపించింది.

సిటీ ఆఫ్ డెస్టినీ.. విశాఖ

- అత్యంత ప్రభావవంతమైన విద్యా సంస్థలు, పరిశ్రమలకు నగరం నిలయం
- ఆంధ్రా వైద్య కళాశాల శతాబ్ది ఉత్సవాల్లో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్



ఆంధ్రా మెడికల్ కాలేజీ వద్ద విద్యార్థులతో ముచ్చటిస్తున్న ఉప రాష్ట్రపతి జగదీప్

సాక్షి, విశాఖపట్నం: అత్యంత ప్రభావవంతమైన విద్యాసంస్థలు, పరిశ్రమలతోపాటు ఆకర్షణీయమైన బీచ్‌లు ఉన్న విశాఖ నగరం నిజంగా 'సిటీ ఆఫ్ డెస్టినీ'అని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ కొనియాడారు. ముఖ్యంగా హైటెక్ వైద్య పరికరాల తయారీ, ఎగుమతుల్లో విశాఖపట్నంలోని ఏపీ మెడ్‌టెక్ జోన్ ప్రపంచంలోనే కీలక పాత్ర పోషిస్తోందన్నారు. మరింత పురోభివృద్ధి సాధించేందుకు అవసరమైన నిపుణులు రాష్ట్రంలో ఉన్నారని ప్రశంసించారు. ఆంధ్రా వైద్య కళాశాల (ఏఎంసీ) శతాబ్ది ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యేందుకు ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకర్ శనివారం విశాఖ చేరుకున్నారు. ముందుగా ఐఎన్ఎస్ డేగాలో తూర్పు నౌకాదళం, రాష్ట్ర ప్రభుత్వం అందించిన గార్డ్ ఆఫ్ ఆనర్, గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం అక్కడి నుంచి నేరుగా ఆంధ్రా వైద్య కళాశాలకు చేరుకున్న ఉపరాష్ట్రపతి ఏఎంసీ శతాబ్ది ఉత్సవాల పైలాన్‌ని గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రులు విడదల రజని, గుడివాడ అమర్‌నాథ్, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, సత్యవతితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏఎంసీలో రూ.20 కోట్లతో నిర్మించనున్న క్లినికల్ అండ్ బయోమెడికల్ రీసెర్చ్ సెంటర్‌కు జగదీప్ ధన్‌ఖడ్ శంకుస్థాపన చేసి.. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఆ తర్వాత బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ఉత్సవాల సదస్సులో పాల్గొన్నారు. ఏఎంసీ సెంటినరీ కాఫీ బుక్, పోస్టల్ కవర్, స్టాంప్‌ని ఆవిష్కరించారు.

శ్రీవారి సేవలో హైకోర్టు సీజే



ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ శనివారం శ్రీవారిని, తిరుచానూరు పద్మావతి అమ్మవారిని కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. వారికి అధికారులు ప్రసాదాలు, వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు.

టీటీడీ డైరీలు, కేలండర్ల విక్రయం

తిరుమల: టీటీడీ ముద్రించిన 2024వ సంవత్సరం డైరీలు, కేలండర్లను తిరుమల, తిరుపతిల్లోని అన్ని టీటీడీ పుస్తక విక్రయశాలల్లో విక్రయిస్తున్నారు. ttdevasthanams.ap.gov. in లో కేలండర్లు, డైరీలు, టేబుల్ టాప్ కేలండర్లను కొనుగోలు చేయవచ్చు. 12 పేజీల కేలండర్ రూ.130, డైరీ (డీలక్స్) రూ.150, డైరీ (చిన్నది) రూ.120, టేబుల్ టాప్ కేలండర్ రూ.75, ఆరు పేజీల కేలండర్ రూ.450, శ్రీవారిపెద్ద కేలండర్ రూ.20, శ్రీవారు, శ్రీ పద్మావతి అమ్మవారి కేలండర్ రూ.15, శ్రీ పద్మావతి పెద్ద కేలండర్ రూ.20, తెలుగు పంచాంగం కేలండర్ రూ.30గా ధరను టీటీడీ నిర్ణయించింది. చెన్నైలోని శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయాలు, హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, విశాఖల్లోని శ్రీవారి ఆలయాలు, ముంబై, న్యూఢిల్లీ, వేలూరు, కాంచీపురంలోని సమాచార కేంద్రాలు, నెల్లూరు, రాజమహేంద్రవరం, కాకినాడ, కర్నూలుల్లోని టీటీడీ కల్యాణమండపాల్లో కేలండర్లు, డైరీలు విక్రయాల కోసం అందుబాటులో టీటీడీ ఉంచింది.

విజయవాడలోనూ పాస్‌పోర్ట్ ప్రింటింగ్

- జనవరి నుంచి నూతన ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం
- విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి శివహర్ష



సాక్షి, అమరావతి: 2024 జనవరి నుంచి విజయవాడలో కొత్త ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్టు ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి శివహర్ష వెల్లడించారు. విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయ(ఆర్‌పీవో) అధికారులతో శనివారం ఆయన సమన్వయ సమావేశం నిర్వహించి.. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఇప్పటి వరకు విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం సేవా కేంద్రంగా ఉందని.. గవర్నర్‌పేటలోని ఏజీ ఆఫీస్ కాంప్లెక్స్‌లో వచ్చే జనవరి నుంచి ప్రారంభించే కొత్త ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం విస్తృత సేవలు అందించనుందని తెలిపారు. ప్రస్తుతం విశాఖపట్నం ప్రాంతీయ కార్యాలయంలోనే పాస్‌పోర్ట్ ప్రింటింగ్ సౌలభ్యం ఉందని, ఇకపై విజయవాడ నూతన కార్యాలయంలోనూ ఈ సేవలు అందుబాటులోకొస్తాయన్నారు. పాస్‌పోర్ట్ ప్రింటింగ్, డిస్పాచ్‌తోపాటు అడ్మినిస్ట్రేషన్(పరిపాలన), పాలసీ సంబంధిత సేవలనూ విజయవాడ కార్యాలయం అందిస్తుందని తెలిపారు. ఏపీలోని 15 జిల్లాలకు చెందిన పాస్‌పోర్ట్ దరఖాస్తుదారులకు విజయవాడ, తిరుపతి పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలు(పీఎస్‌కే), 13 పోస్ట్ ఆఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల(పీఓపీఎస్‌కే) ద్వారా సేవలందిస్తున్నామని, మిగతా జిల్లాలకు విశాఖ ప్రాంతీయ కార్యాలయం సేవలందిస్తుందని చెప్పారు. గతంలో పాస్‌పోర్ట్ స్లాట్ బుకింగ్‌కు నెల పట్టేదని, ప్రస్తుతం ఐదు నుంచి 12 రోజులే పడుతోందన్నారు. విజయవాడ కార్యాలయ పరిధిలో రోజుకు 2 వేల పాస్‌పోర్ట్ దరఖాస్తులను క్లియర్ చేస్తున్నట్టు తెలిపారు. పాస్టపోర్ట్ సేవల వినియోగానికి అధికారిక వెబ్‌సైట్‌ను వినియోగించుకోవాలని, నకిలీ వెబ్‌సైట్‌లు, ఏజెంట్లను నమ్మొద్దని కోరారు.

శ్రీదేవి టికెట్ రద్దు చేయాలని ధర్నా



హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏమాజీ, నాయకులు, కార్యకర్తలు

బెల్లంపల్లి: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి బీజేపీ అభ్యర్థి అమురాజుల శ్రీదేవి టికెట్‌ను అధిష్టానం బేషరతుగా రద్దు చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కార్యకర్తలు సామూహికంగా హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయానికి తరలివెళ్లి ధర్నా చేశారు. కొయ్యల ఏమాజీకి టికెట్ ఇవ్వాలని నినదించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ ప్రజల్లో పలుకుబడి లేని, ఇటీవల పార్టీలో చేరిన శ్రీదేవికి టికెట్ కేటాయించడం సరికాదని అన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి పార్టీలో పని చేస్తూ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఏమాజీని విస్మరించడం వల్ల పార్టీకి నష్టం కలుగుతుందని పేర్కొన్నారు. శ్రీదేవికి ఏ ప్రాతిపదికన టికెట్ ఇచ్చారో స్పష్టం చేయాలని అన్నారు. కొందరు నాయకులు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ పార్టీ టికెట్ ఇచ్చారని ఆరోపించారు. అనంతరం బీజేపీ అగ్ర నాయకుడు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను కలిసి గోడు వెల్లబోసుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బి.కేశవరెడ్డి, జిల్లా కార్యదర్శి కే.గోవర్ధన్, నాయకులు ప్రకాష్, అజ్మీరా శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, సోమన్న, ప్రభాకర్, శ్రావణ్‌కుమార్, దశరథం, లక్ష్మణ్, స్వామి, శివలింగయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు 'నల్ల' రాజీనామా



ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్: నిర్మల్ మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడారు. శనివారం రాత్రి ఆయన పార్టీకి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. నేడో రేపో బీజేపీలో చేరేందుకు సమాయత్తమైనట్లు అనుచరులు పేర్కొన్నారు.

ఉప ఎన్నికలో గెలిచి..

1996లో నిర్మల్ టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న వేణుగోపాలచారి అప్పటి లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసి గెలిచారు. దీంతో నిర్మల్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక వచ్చింది. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి పోటీ చేశారు. సమీప స్వతంత్ర అభ్యర్థి అర్గుల కమలాధర్‌గుప్తాపై 11,927 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 1999లో జరిగిన సాధారణ ఎన్నికల్లో పోటీచేసి, కాంగ్రెస్ అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చేతిలో ఓడారు. అనంతరం బీఆర్ఎస్‌లో చేరారు. తాజాగా మహేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరాలని నిర్ణయించినట్లు తెలిసింది.

బోడ జనార్దన్ మంతనాలు

మందమర్రిరూరల్: మంచిర్యాల జిల్లా చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బోడ జనార్దన్ శుక్రవారం మందమర్రిలోని తన ఇంట్లో మండలాల నాయకులతో రహస్య మంతనాలు సాగించారు. నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు, కాంగ్రెస్ టికెట్ కేటాయింపు, పొత్తులో భాగంగా చెన్నూర్ టికెట్ సీపీఐకి కేటాయిస్తే ఏం చేయాలి..? కాంగ్రెస్ పార్టీలోకి వివేక్ వస్తే ఎలా ఉంటుంది అనే అంశాలపై చర్చించుకున్నట్లు సమాచారం. ఈ విషయమై బోడ జనార్దన్‌ను ఫోన్‌లో సంప్రదించగా.. మండలాల కాంగ్రెస్ నాయకులతో సమావేశం వాస్తవమేనని అన్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని, పొత్తులో సీపీఐకి కేటాయిస్తే గెలుపు కోసం తప్పకుండా కృషి చేస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

బోథ్ కాంగ్రెస్ అభ్యర్థిని మార్చాలి

- అశోక్‌కు టికెట్ ఇవ్వడంపై గజేందర్ అనుచరుల ఆగ్రహం



సమావేశమైన గజేందర్ అనుచరులు

బోథ్: బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి వన్నెల అశోక్ అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలని ఆడె గజేందర్ అనుచరులు, కాంగ్రెస్ నాయకులు అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. బోథ్ కాంగ్రెస్ టికెట్ ఆశించిన ఆడె గజేందర్‌కు దక్కకపోవడంతో ఆయన అనుచరులు నియోజకవర్గ కేంద్రంలో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్ రావు అనుచరుడైన వన్నెల అశోక్‌కు కేటాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికేతరుడైన అశోక్‌కు టికెట్ కేటాయించి బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్‌ను గెలిపించాలని ప్రేమ్‌సాగర్‌రావు చూస్తున్నారని ఆరోపించారు. అభ్యర్థిని మార్చకుంటే టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న స్థానిక నాయకుల్లో ఒకరిని ఉమ్మడి అభ్యర్థిగా నామినేషన్ వేయిస్తామన్నారు. ఇందులో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాసిపేట బీఆర్ఎస్‌లో అసమ్మతి



కాసిపేటలో నాయకులతో చర్చిస్తున్న ఎంపీ

కాసిపేట: మంచిర్యాల జిల్లా కాసిపేట మండల బీఆర్ఎస్ పార్టీలో అసమ్మతి రాజుకుంది. మండల ప్రథమ శ్రేణి నాయకులు పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధం కావడం చర్చనీయాంశంగా మారింది. బెల్లంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తీరుపై అసంతృప్తితో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు విక్రంరావు నేతృత్వంలో ఐదుగురు ఎంపీటీసీలు, ఎనిమిది మంది సర్పంచులు పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో శనివారం చిన్నయ్య వచ్చి నచ్చజెప్పినా వినకపోవడంతో మధ్యాహ్నం పెద్దపల్లి ఎంపీ వెంకటేష్‌నేత, ఓసీసీ గుర్తింపు సంఘం అధ్యక్షుడు రాంమోహన్‌రావు వారితో చర్చలు జరిపారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో మంత్రి కేటీఆర్, కవితలతో మాట్లాడిస్తామని చెప్పినా చిన్నయ్యకు మద్దతుగా పని చేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. వెంకటేష్‌నేతకు గానీ మరెవరికైనా బీఆర్ఎస్ టికెట్ ఇచ్చినా పని చేస్తామని తేల్చిచెప్పారు. రాత్రి వరకు చర్చలు జరిపినా ప్రయోజనం లేకుండాపోయింది. ఓ నాయకుడు పార్టీపై, మీపై అయిష్టంగా ఉన్నాడని నచ్చజెప్పాలని ఎమ్మెల్యేను కోరడానికి వెళ్లగా.. అవసరమైతే మీరు కూడా పోండి అనడంతో ఈ వివాదం ఏర్పడినట్లు తెలుస్తోంది. వెంకటేష్‌నేతకు టికెట్ ఇవ్వాలని, లేనిపక్షంలో వినోద్‌ను గెలిపించి బీఆర్ఎస్‌లోకి తీసుకొస్తామని ప్రజాప్రతినిధులు, నాయకులు పేర్కొన్నారు.

పద్మశాలీలను విస్మరించిన రాజకీయ పార్టీలు



మాట్లాడుతున్న వాసాల రమేశ్

కరీంనగర్‌కల్చరల్: రాజకీయంగా ఏ పార్టీలు పద్మశాలీలకు గుర్తింపు ఇవ్వడం లేదని తెలంగాణ పద్మశాలీ సంఘం రాష్ట్ర రాజకీయ వ్యవహార కమిటీ చైర్మన్, జిల్లా పద్మశాలీ సంఘం గౌరవ అధ్యక్షుడు వాసాల రమేశ్ అన్నారు. కరీంనగర్‌లోని పద్మశాలీ సంక్షేమ ట్రస్ట్‌లో పట్టణ సంఘం అధ్యక్షుడు గడ్డం శ్రీరాములు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పద్మశాలీలను రాజకీయంగా చైతన్యవంతం చేసేందుకు కోరుట్ల, హైదరాబాద్‌లో పద్మశాలీల సమ్మేళన మహాసభలు వేలాది మందితో నిర్వహించడం జరిగిందన్నారు. అయినప్పటికీ రాజకీయ పార్టీలు ఇప్పటివరకు గుర్తింపు ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్, జిల్లాలో మంత్రి గంగుల కమలాకర్ పద్మశాలీల అభివృద్ధి కోసం కృషి చేశారని గుర్తు చేశారు. సంఖ్యా బలం ఎక్కువగా ఉన్నప్పటికీ రాజ కీయ ప్రాధాన్యత దక్కలేదన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని ప్రాంతాల నుంచి పద్మశాలీలు బరిలో ఉండాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా పద్మశాలీల రాజకీయ శిక్షణ తరగతులు ఏర్పాటు చే యడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గడ్డం శ్రీరాములు, జిల్లా పద్మశాలీ సంఘం అధ్యక్షుడు మెతుకు సత్యం, పోపా జిల్లా అధ్యక్షుడు పోలు సత్యనారాయణ, నగర అధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు వంగర ఆంజనేయులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వెన్నెల వెలుగుల్లో ఎన్నీల ముచ్చట్లు

కరీంనగర్: తెలంగాణ రచయితల వేదిక కరీంనగర్ ఆధ్వర్యంలో 126వ ఎన్నీల ముచ్చట్లు కరీంనగర్‌లోని సుభాష్‌నగర్‌లో శనివారం రాత్రి జరిగాయి. పాటల రచయిత గొట్టె వాసు ఆతిథ్యం ఇచ్చారు. గొట్టె వాసు రచించిన భక్తి గీతాల పుస్తకాన్ని ప్రముఖ కవి బూర్ల వెంకటేశ్వర్లు ఆవిష్కరించగా.. మరో ప్రముఖ కవి కందుకూరి అంజయ్య సమీక్షించారు. సామాజిక స్పృహ కలిగిన కవిత్వం హాజరైన కవులు వినిపించారు. ఈ కార్యక్రమంలో తెరవే అధ్యక్ష, కార్యదర్శులు సీవీ కుమార్, దామరకుంట శంకరయ్య కవులు కందుకూరి అంజయ్య, నసీరుద్దీన్, విలాసాగరం రవీందర్, యుగేందర్, మోర అనిల్, రావుల పవణ్, ఇటిక్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేయాలి



మాట్లాడుతున్న అన్నమనేని గోపాల్‌రావు

- నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు
- టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు

కొత్తపల్లి(కరీంనగర్): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు అన్నారు. కరీంనగర్ విద్యుత్‌భవన్‌లోని సమావేశమందిరంలో శనివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా విద్యుత్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పలు అంశాలపై సూచనలు చేశారు. విద్యుత్ లైన్ల నిర్వహణ, బ్రేక్‌డౌన్‌ల నివారణ, సాంకేతిక సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు కాలకుండా చూడాలన్నారు. వరి పంట కోత దశకు వచ్చిన సందర్భంగా వ్యవసాయ విద్యుత్ లోడ్ తగ్గినందున విద్యుత్ సమస్య తలెత్తే అవకాశం లేదని తెలిపారు. నూతన సర్వీసుల కోసం దరఖాస్తు చేసుకున్న గృహ, పరిశ్రమల వినియోగదారులకు వీలైంత త్వరగా వారం రోజుల్లోగా సర్వీసులు మంజూరు చేయాలని ఆదేశించారు. విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. విద్యుత్‌భవన్‌లో నూతనంగా నిర్మించిన హాల్‌పై ప్రశంసించిన సీఎండీ ఇటీవల విద్యుత్ మీటర్ల దందాపై ‘సాక్షి’లో ప్రచురితమైన కథనంపై ప్రస్తావించారు. విద్యుత్ శాఖ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. టీఎస్ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్లు బి.వెంకటేశ్వర్‌రావు, పంజాల గణపతి, మోహన్‌రెడ్డి, ప్రభాకర్, పి.సంధ్యారాణి, వి.తిరుపతిరెడ్డి, సీజీఎం రాజీవ్‌చౌహాన్, కరీంనగర్‌, పెద్దపల్లి, జగిత్యాల సర్కిల్ ఎస్ఈలు వి.గంగాధర్, బి.సుదర్శన్, సత్యనారాయణ, డీఈలు విజేందర్‌రెడ్డి, రాజం, తిరుపతి, లక్ష్మారెడ్డి, కాళిదాసు, గోపీకృష్ణ, చంద్రమౌళి, గంగారాం, రాజిరెడ్డి, తిరుపతి, కె.అనిల్‌కుమార్, శివరాములు, దాసరి తిరుపతి, బి.రవి, ఏడీఈలు, ఏఈలు, ఏవోలు, ఏఏవోలు పాల్గొన్నారు.

అమెరికాలో బతుకమ్మ వేడుకలు



కరీంనగర్ సిటీ: అమెరికా డెన్వర్ నగరంలో గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ, దసరా పండుగను వైభవంగా నిర్వహించారు. పార్కర్ ఫీల్డ్‌హౌస్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సాంప్రదాయ దుస్తులతో, ఆకర్షణీయమైన పూలతో చేసిన బతుకమ్మలతో మహిళలు, పిల్లలు హాజరై ఆడిపాడి సందడి చేశారు.



అమ్మా నాన్న ఒక ఆరిల్

సినిమాలకు దూరమైనా సరే, నటులపై ఆసక్తి మాత్రం దూరం కాదు. 'ఫలానా నటుడు ఇప్పుడు ఏం చేస్తున్నాడో తెలుసా? 'ఫలానా కథానాయిక ఇప్పుడు ఏ దేశంలో ఉంటుందో తెలుసా?'... ఇలాంటి విషయాలు అభిమానులకు ఎప్పుడూ ఆసక్తికరమే.

'గజిని' 'అమ్మా నాన్న ఒక తమిళ అమ్మాయి' 'ఘర్షణ'... మొదలైన సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఆశిన్ పెళ్లి తరువాత నటనకు దూరమైంది.

కొన్ని నెలల క్రితం... ఆసిన్ భర్త నుంచి విడాకులు తీసుకుందని, మళ్లీ సినిమాలలో నటించనుందని రూమర్స్ సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. 'అలాంటిది ఏమీ లేదండీ బాబూ. నేను మళ్లీ సినిమాల్లో నటించడం లేదు' అని ఆసిన్ స్వయంగా ప్రకటించింది.

తాజాగా... ప్యారిస్‌లో జరిగిన కుమార్తె ఆరిన్ పుట్టినరోజు వేడుకలకు సంబంధించిన ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది ఆసిన్. వీటిలో ఆమె భర్త రాహుల్ శర్మ కూడా ఉన్నాడు. ఇక రూమర్స్‌కు ఫుల్ స్టాప్ పడినట్లే కదా!



తల్లి ప్రేమకు సరిహద్దులు లేవు

అమెరికన్ మహిళ మేఘన్ గత సంవత్సరం అక్టోబర్‌లో మన దేశానికి చెందిన బీదింటి చిన్నారిని దత్తత తీసుకొని 'అమీ' అని పేరు పెట్టింది. అమీకు డౌన్‌సిండ్రోమ్ ఉంది. దత్తత తీసుకొని సంవత్సరం పూర్తయిన సందర్భంగా హృదయాన్ని కదిలించే వీడియోను మేఘన్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. మేఘన్‌కు ఇద్దరు అబ్బాయిలు. వీరితో కలిసి అమీ సంతోషంగా ఆడుకుంటున్న దృశ్యాలు ఈ వీడియోలో కనిపిస్తాయి.

గత ఫిబ్రవరిలో ఇంటిని దీపావళి పండగ అలంకరణలతో ముస్తాబు చేసి అమీ బర్త్‌డేను ఘనంగా జరిపారు.

'చిలిపి, తెలివైన, అందమైన చిన్నారికి తల్లి అయినందుకు గర్వపడుతున్నాం. మా ఫ్యామిలీ పజిల్ నుంచి తప్పిపోయి మళ్లీ దొరికిన మిస్సింగ్ పీస్ అమీ' అంటూ రాసింది మేఘన్.

'మీ సంతోషం సంగతి ఎలా ఉన్నా మీరు ఒక అమ్మాయికి అందమైన, అద్భుతమైన భవిష్యత్తును ఇచ్చారు. దయార్ద్ర హృదయం ఉన్న మిమ్మల్ని దేవుడు చల్లగా చూడాలి' అంటూ నెటిజనులు స్పందించారు.

వైరల్



జయకు పాస్‌పోర్ట్ వచ్చి..ం..దహో!

హమ్మయ్య! జయకు పాస్‌పోర్ట్ అండ్ వీసా వచ్చింది. జయ ఇక హాయిగా నెదర్లాండ్స్‌కు వెళ్లవచ్చు. కొత్త జీవితాన్ని మొదలు పెట్టవచ్చు. ఇంతకీ సదరు జయ మనిషి కాదు. వీధి శునకం. ల్యాబ్రడార్, జర్మన్ షెపర్డ్, పమేరియన్‌లను ముద్దు చేసే వాళ్లలో చాలామంది వీధికుక్కలను మాత్రం 'అసుంట' అంటారు. మెరల్ మాత్రం అలా అనుకోలేదు.

నెదర్ ల్యాండ్స్‌కు చెందిన మెరల్ మన దేశానికి వచ్చింది. వారణాసిలో ఆమెకు ఒక వీధికుక్క కనిపించింది. ఈ శునకంపై వేరే శునకాలు దాడి చేయడానికి ప్రయత్నించినప్పుడు వాటి బారినుంచి మెరల్ దానిని కాపాడింది. ఆ కృతజ్ఞతతో మెరల్ ఎటు వెళితే అటు వచ్చేది కుక్క. ఆ కుక్కను చూస్తే మెరల్‌కు జాలిగా అనిపించింది. దాని చురుకుదనం, అందం మెరల్‌కు నచ్చి, ఆ కుక్కను దత్తత తీసుకొని నెదర్లాండ్స్‌కు తీసుకు పోవాలని డిసైడైపోయింది. దత్తత, పాస్‌పోర్ట్, వీసా ప్రక్రియ కోసం కొంతకాలం అదనంగా మన దేశంలో ఉంది. 'పెద్ద ప్రక్రియ పూర్తయి పోయింది. ఎట్టకేలకు జయను నాతో పాటు తీసుకువెళుతున్నందుకు సంతోషంగా ఉంది' అంటూ కామెంట్ పెట్టింది మెరల్.



బై'స్కిల్'లుడు

సైకిల్‌ను మధ్యలోకి మడిచి కారు డిక్కీలో పెట్టుకోవచ్చా? 'బేషుగ్గా' అంటున్నాడు ఆనంద్ మహీంద్రా. ఎక్కడ 'స్కిల్' కనిపించినా ఆ విశేషాన్ని సోషల్ మీడియాలో షేర్ చేసే పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా తాజాగా సైకిల్ తొక్కుతున్న ఫొటోలను ట్విట్టర్‌లో పోస్ట్ చేశాడు. ఇది మామూలు సైకిల్ కాదు. ప్రపంచంలోనే తొలి ఫోల్డబుల్ డైమండ్ ఫ్రేమ్ ఇ–బైసికిల్. ఐఐటీ బాంబే స్టూడెంట్స్ ఈ బైసికిల్‌ను తయారు చేశారు.

'మరోసారి మనం గర్వించేలా ఐఐటీ బాంబే స్టూడెంట్స్ సృష్టించిన వాహనం ఇది' అని కాప్షన్ పెట్టాడు మహీంద్రా. 'ఇంప్రెసివ్ ఇనోవేషన్... రివల్యూషన్ ఆన్ వీల్స్' అంటూ యూజర్‌లు స్పందించారు.

జై భజరంగ భళీ!

ఆకాశంలోకి చూస్తే గాల్లో ఎగురుతున్న హనుమంతుడు కనిపిస్తే ఎంత వింత!

ఛత్తీస్‌గఢ్‌లోని అంబికాపూర్‌లో ఇలాంటి దృశ్యమే కనిపించి ప్రజలను ఆశ్చర్యానందాలకు గురి చేసింది. ఆ నగరంలోని ఒక ఉత్సవ కమిటీ వాళ్లు గాల్లో ఎగురుతున్నట్లు ఉండే హనుమాన్ రూపాన్ని డ్రోన్‌కు బిగించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో వైరల్ అయింది.

కొన్ని సంవత్సరాల క్రితం పంజాబ్‌లోని లుధియానాలో ఇలాంటి దృశ్యమే కనువిందు చేసింది. దానినుంచి స్ఫూర్తి పొంది ఈ వీడియో చేశారేమో తెలియదుగానీ ప్రజలు మాత్రం ఆకాశానికేసి చూస్తూ 'జై భజరంగభళీ' అంటూ నినదించారు.





అరరే... ఎంత పనైపాయే!

ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ ప్రియాంక మిశ్రా ఊరకనే ఉండి ఉంటే వైరల్ అయ్యేది కాదు. సదరు కానిస్టేబుల్ ఇన్‌స్టాగ్రామ్ రీల్ చేసి వైరల్ అయింది. ఈ రీల్‌లో ప్రియాంక మిశ్ర 'కర్తవ్యం' సినిమాలో విజయశాంతిని గుర్తు తెచ్చేలా ఓ లెవెల్లో నటించింది. సహజత్వం కోసం సర్వీస్ గన్‌ను ఉపయోగించి మరీ నటించింది. ఈ వీడియో వైరల్ కావడం మాట ఎలా ఉన్నా పోలీస్ డిపార్ట్‌మెంట్ మాత్రం 'చాల్లేండి సంబడం' అంటూ ఆమెను సస్పెండ్ చేసింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా మళ్లీ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పని చేయడానికి ప్రియాంక దరఖాస్తు చేసుకుంది. ఆమె దరఖాస్తు ఆమోదం పొందింది. ఆగ్రాలో పోస్టింగ్ కూడా ఇచ్చారు. అయితే 48 గంటల్లోనే ఆమె నియామకాన్ని పోలీస్ కమిషనర్ ప్రీతిందర్‌సింగ్ రద్దు చేశారు.

ప్రియాంక మిశ్రాపై సోషల్ మీడియాలో సానుభూతి చూపుతున్నవారితో పాటు, సానుభూతి చూపుతూనే 'స్వయంకృతాపరాధం' అని విమర్శించిన వాళ్లు కూడా ఉన్నారు.




షేన్ వాట్సన్ ఇళయరాజా పాట

ఒక ఇంటర్వ్యూలో 'డూ యూ హ్యావ్ ఎనీ స్పెషల్ టాలెంట్స్?' అనే ప్రశ్నకు సమాధానంగా గిటారు చేతిలోకి తీసుకున్నాడు ఆస్ట్రేలియన్ క్రికెటర్ షేన్ వాట్సన్. ఆంగ్ల పాట ట్యూన్ ఏదో ప్లే చేస్తాడు అని మనం అనుకునేలోపే ఇళయరాజా పాట 'ఎన్ ఇనియ పొన్నిలావే' కొంచెం ప్లే చేసి ఆశ్చర్యానికి గురి చేశాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

హెల్త్

అక్టోబరు రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసం



మహిళల్లో వచ్చే క్యాన్సర్లలో రొమ్ముక్యాన్సర్ కేసులు ఎక్కువగా కనిపిస్తుంటాయి. గ్లోబల్ క్యాన్సర్ అబ్జర్వేటరీ (గ్లోబోకాన్) గణాంకాల ప్రకారం మన దేశంలో ప్రతి నాలుగు నిమిషాలకొక కొత్త కేసు నమోదవుతోందని ఒక అంచనా. ఏటా 1,78,000 కొత్త కేసులొస్తున్నాయంటూ ఆ సంస్థ వెల్లడించింది. ప్రతి లక్షమంది మహిళల్లో 30 మంది కొత్తగా రొమ్ముక్యాన్సర్ బారిన పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే నగరాల్లో దీని విస్తృతి ఎక్కువ. మహిళల్లో ఇంతగా కనిపించే రొమ్ముక్యాన్సర్‌ను తొలిదశల్లోనే కనుగొంటే, దాని నుంచి పూర్తిగా విముక్తి పొందవచ్చు. ఈ నెల (అక్టోబరు) 'రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసం' సందర్భంగా మహిళలను వెన్నాడే ఈ ఆరోగ్య సమస్య నివారణ, విముక్తిమార్గాల వంటి అంశాలతో ఓ కథనం.

రొమ్ముక్యాన్సర్ ముందుగా తెలిస్తే... ముప్పు తప్పించవచ్చు

అన్ని క్యాన్సర్‌లలాగే రొమ్ముక్యాన్సర్ వ్యాప్తినీ డాక్టర్లు నాలుగు దశలుగా పేర్కొంటారు. ఇందులోని తొలిదశ లేదా రెండోదశల్లో దీన్ని గుర్తిస్తే వ్యాధిని సులభంగానే తగ్గించవచ్చు. మూడు, నాలుగు దశల్లో కూడా విముక్తి పొందేందుకు చాలావరకు అవకాశమున్నా... చికిత్స ఒకింత కష్టమవుతుంది. రొమ్ముక్యాన్సర్ నుంచి పూర్తిగా నయమయ్యేవారి సంఖ్య ఇటీవల చాలా ఎక్కువ.

కొన్ని కారణాలు

రొమ్ముక్యాన్సర్‌కు ప్రధానంగా రెండు రకాల కారణాలుంటాయి. మొదటిది నివారించలేనివీ, రెండు... నివారించగలిగే కారణాలు.

- వయసు పెరుగుతున్నకొద్దీ రొమ్ముక్యాన్సర్ ముప్పూ పెరుగుతూ ఉంటుంది. ఇది నివారించలేని కారణం. ఇక కొందరు మహిళల్లో హార్మోన్లు ఎక్కువగా స్రవించడం. ఇవి మినహా మిగతావన్నీ దాదాపుగా నివారించదగిన కారణాలే. ఉదాహరణకు...
- ఉండాల్సినదానికి మించి బరువు పెరగడం (ఊబకాయం).
- ఆధునిక జీవనశైలిలో భాగంగా ఆహారాల్లో కొవ్వులు, కొలెస్ట్రాల్ ఎక్కువగా తీసుకోవడం.
- పెళ్లి, తొలిచూలు బిడ్డ పుట్టడంలో ఆలస్యం జరగడం.

ముప్పు ఎవరెవరిలో...

- రెండు రొమ్ముల్లోనూ క్యాన్సర్ వచ్చిన కుటుంబాల వారిలో ఆ కుటుంబాల్లో ఒకవేళ పురుషుల్లోనూ అదే క్యాన్సర్ వస్తే బాగా దగ్గరి బంధువుల్లో (అమ్మ, అమ్మమ్మలు, అక్కచెల్లెళ్లు, మేనత్తల్లో) రొమ్ము క్యాన్సర్ ఉండటం. వారిలోనూ 40 ఏళ్లకి తక్కువ వయసులోనే దీని బారిన పడటం. ఆ కుటుంబ సభ్యుల్లోనే ఇతర క్యాన్సర్‌లు ఎక్కువగా కనిపించడం (ముఖ్యంగా అండాశయాల క్యాన్సర్స్ రావడం)
- జీన్ మ్యుటేషన్స్ కనిపించడం, పదేళ్ల వయసుకు ముందే రజస్వల కావడం అలాగే 50 ఏళ్లు పై బడినా నెలసరి ఆగకపోవడం.

ముందస్తు నివారణ ఇలా...

మామూలుగా క్యాన్సర్ నివారణ దాదాపు అసాధ్యమే అయినా... తొలి రెండు దశల్లో గుర్తించడం ఇంచుమించు నివారణతో సమానం. కొందరిలో రొమ్ము క్యాన్సర్ ముప్పు ఎక్కువ. ఇలాంటివారు కొన్ని పరీక్షలు ద్వారా తమ ముప్పును ముందే గుర్తించవచ్చు. ఇలా గుర్తించగలిగితే, వ్యాధి నుంచి ఇంచుమించు పూర్తిగా తప్పించుకున్నట్లే.

- ఊబకాయాన్ని తగ్గించుకోవడం (ఇందుకోసం ఆరోగ్యకరమైన జీవనశైలి, ఆహార, వ్యాయామాలతో ఎత్తుకు తగినట్లు బరువును నియంత్రించుకోవాలి).
- కుటుంబ ఆరోగ్య చరిత్రలో రొమ్ము క్యాన్సర్ వచ్చినవారు ఉన్నప్పుడు... బీఆర్‌సీఏ1, బీఆర్‌సీఏ2 అనే జన్యు పరీక్షలు చేయించుకోవాలి. ఈ జన్యుపరీక్షల్లో పాజిటివ్ ఫలితాలు వస్తే రొమ్ము క్యాన్సర్ వచ్చేందుకు అవకాశాలు చాలా ఎక్కువ. ఆ రిపోర్టుల ఆధారంగా డాక్టర్‌ల కౌన్సెలింగ్‌తో... రొమ్ములు గానీ, ఫెలోపియన్ ట్యూబులు, అండాశయాలు తొలగించడం వల్ల రొమ్ముక్యాన్సర్ రాకుండానే నివారించవచ్చు.
- నివారించదగిన కారణాలను గుర్తించి, జీవన శైలిని మెరుగుపరచుకోవడం ద్వారా నివారించుకోవచ్చు.

తొలిదశలోనే రొమ్ముక్యాన్సర్ గుర్తింపు ఇలా...

- సెల్ఫ్ బ్రెస్ట్ ఎగ్జామినేషన్ (ఎస్‌బీఈ) అనే సొంతంగా చేసుకునే పరీక్షల ద్వారా రొమ్ముల్లోని తేడాలను బట్టి...చాలావరకు ఎవరికివారే రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించడం సాధ్యమే. అందుకు చేయాల్సినవి...
- మహిళలు తమ రొమ్ముల్ని తాకుతూ పరీక్షించుకున్నప్పుడు అంతకు ముందు లేని గడ్డల వంటివి చేతికి / స్పర్శకు తెలుస్తున్నప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయకూడదు. నెలసరి అయిన ఏడవరోజున, స్నానం చేస్తున్నప్పుడు సబ్బుచేతితో చూసుకోవాలి.
- చర్మంపై నుంచి తాకినప్పుడు రొమ్ములోపల గడ్డ తగులుతూ ఉన్నా లేదా రొమ్ము ఆకృతిలో మార్పు కనిపించినా, చంకల్లో ఏదైనా గడ్డ కనిపించినా డాక్టర్‌కు తెలపాలి.
- ఇలాంటి గడ్డల్లో నొప్పి లేకపోయినా, రొమ్ములో సొట్టలు ఉన్నా, రొమ్ము పరిమాణంలో మార్పులు గమనించినా డాక్టర్ల దృష్టికి తీసుకెళ్లాలి.

ఇక నిపుల్ విషయానికి వస్తే... అది ముడుచుకున్నట్లుగా లోపలివైపునకు తిరిగి ఉన్నా, నిపుల్ నుంచి రక్తస్రావం కనిపిస్తున్నా, పుండ్ల వంటివి కనిపించినా డాక్టర్‌ను సంప్రదించాలి.

అవసరమయ్యే వైద్యపరీక్షలు...

తొలుత డాక్టర్లు భౌతికంగా పరీక్షలు చేయడం, తర్వాత మామోగ్రఫీ / ఎమ్మారై / అల్ట్రాసౌండ్, కోర్ బయాప్సీ (సూది పరీక్ష), అవసరమైనతే జెనెటిక్ స్క్రీనింగ్‌తో నిర్ధారణ చేస్తారు.


అన్ని సందర్భాల్లోనూ ఈస్ట్రోజెన్ రిసెప్టార్, ప్రొజెస్టిరాన్ రిసెప్టార్, హర్–2 పరీక్షలూ; కొన్ని సందర్భాల్లో ప్రోజెన్ సెక్షన్ ఎగ్జామినేషన్
- ఛాతీ ఎక్స్‌రే
- కడుపు స్కానింగ్‌తో పాటు అవసరమైతే ఎముకల స్కానింగ్ (మూడో దశలో) లేదా పెట్‌స్కాన్ చేస్తారు.



చికిత్స

మహిళల్లో రొమ్ము క్యాన్సర్ తగ్గదనేది కేవలం అపోహ మాత్రమే. తొలి లేదా రెండో దశలో ఉన్న రొమ్ము క్యాన్సర్‌ను దాదాపుగా పూర్తిగా తగ్గించవచ్చు. ఇక కొన్ని సందర్భాల్లో శస్త్ర చికిత్స, రేడియేషన్, హార్మోనల్ థెరపీ, కీమోథెరపీ, టార్గెటెడ్ థెరపీ వంటి చికిత్సలు అవసరం పడవచ్చు. క్యాన్సర్ తొలిదశలో ఉంటే రొమ్మును రక్షిస్తూ, క్యాన్సర్ ఇతర అవయవాలకు వ్యాపించకుండా ఆపవచ్చు. అప్పుడు మొదట సర్జరీ చేసి, వ్యాప్తి నివారణ కోసం ఆ తర్వాత హార్మోన్ థెరపీ, కీమోథెరపీ, రేడియోథెరపీలను చేస్తారు. రొమ్ము క్యాన్సర్‌ను మొదటిదశలోనే కనుగొంటే ఆంకోప్లాస్టీ అనే శస్త్ర చికిత్సతో రొమ్మును పూర్తిగా రక్షించడమూ సాధ్యమే.





డా॥ సింహాద్రి చంద్రశేఖర్ రావు,
సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్.


థొరాసిక్ అయోర్టిక్ అన్యురిజమ్!

మన దేహంలోని ప్రతి కణానికి అందాల్సిన మంచి రక్తాన్ని గుండె నుంచి వెలువడే 'అయోర్టా' అనే ధమని అందిస్తుంది. గుండె నుంచి బయటకు వచ్చే మంచి రక్తం ఈ అయోర్టా ద్వారా ఛాతీ, మెడ, కడుపు, అక్కడ్నుంచి అనేక రక్తనాళాలుగా చీలిపోయి రెండు కాళ్లకూ అందిస్తుంది. దీని పరిమాణం సాధారణంగా 2.5 సెం.మీ. ఉంటుంది. కొన్నిసార్లు ఈ ప్రధాననాళం నుంచి చీలిన రక్తనాళాల గోడలు కొన్ని చోట్ల పలచబడవచ్చు. ఇలా పలచబడ్డ చోట్ల బెలూన్‌లా ఉబ్బే ప్రమాదం ఉంది. ఇలా రక్తనాళాలు ఉబ్బినట్లు కావడాన్ని వైద్య పరిభాషలో 'అన్యురిజమ్స్' అంటారు. ఛాతీ భాగంలో రక్తనాళం ఉబ్బడాన్ని థొరాసిక్ అన్యురిజమ్ అంటారు. వీటి వల్ల అకస్మాత్తుగా ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడవచ్చు. ఇలా జరగడానికి కారణాలూ, అందాల్సిన చికిత్స వంటి అనేక అంశాలపై అవగాహన కోసం ఈ కథనం.

అయోర్టా రక్తనాళం... దాని నుంచి వెలువడే శాఖలు... మెదడు, కడుపు మొదలుకొని, కాళ్ల వరకూ ఎక్కడైనా బెలూన్‌లా ఉబ్బవచ్చు. అవి ఉబ్బిన చోటును బట్టి దానికి పేరు పెడతారు. ఉదాహరణకు ఇలా పలచబడి ఉబ్బడం (పరిమాణం పెరగడం) అన్నది కడుపులో జరిగితే దాన్ని 'అబ్డామినల్ అన్యురిజమ్' అని, ఛాతీలోనైతే 'థొరాసిక్ అన్యురిజమ్'గా పేర్కొంటారు.

నిజానికి తొలిదశల్లో అన్యురిజమ్స్‌తో ఎలాంటి అనర్థాలూ, లక్షణాలు... అంటే నొప్పి, ఇతరత్రా ఇబ్బందులు కనిపించవు. పలచబడిన చోట మరింత బలహీనపడుతూ, ఉబ్బు మరింతగా పెరుగుతూ పోతుంటుంది. అన్యురిజమ్ బాగా పరిమాణం పెరిగి, పక్కనున్న అవయవాలపై ఒత్తిడి కలిగించవచ్చు. లేదా బాగా పలుచబడిపోయిన రక్తనాళం అకస్మాత్తుగా చిట్లవచ్చు. దీన్ని అయోర్టిక్ డిసెక్షన్ అంటారు.

కారణాలు : అన్యురిజమ్స్‌కు కొన్ని కారణాలివి...
- హైబీపీ
- పొగతాగే అలవాటు
- రక్తనాళాల గోడలు మందంగా మారడం; రక్తనాళాల్లో కొవ్వు, కొలెస్ట్రాల్ పేరుకుపోవడం.
- వృద్ధాప్యం (వయసు పెరుగుతున్న కొద్దీ రక్తనాళాల గోడల్లో మార్పులు వస్తూ అవి బిరుసుగా, మందంగా మారుతుంటాయి)
- గతంలో సిఫిలిస్ వంటి వ్యాధులు వచ్చి, వాటికి చికిత్స అందకపోవడం
- జన్యుపరమైన కారణాలతో పుట్టుకతోనే వచ్చే మార్ఫన్ లేదా ఎహ్లర్–డాన్లోస్ సిండ్రోమ్ వంటి వ్యాధులు.



లక్షణాలు

అన్యురిజమ్ ఉన్న ప్రదేశాన్ని బట్టి లక్షణాలు ఏర్పడతాయి. చిన్నగా ఉన్నప్పుడు ఎలాంటి లక్షణాలూ కనిపించనప్పటికీ, అవి పెరిగి పక్కనున్న భాగాలపై ఒత్తిడి కలిగిస్తే కనిపించే కొన్ని లక్షణాలు.
- గొంతు బొంగురుపోవడం, మాట కష్టంగా రావడం
- మింగడంలో ఇబ్బంది
- గొంతులో వాపు
- ఛాతీపై భాగంలో లేదా వీపు భాగంలో నొప్పి
- వికారం, వాంతులు
- గుండె వేగంగా కొట్టుకోవడం

నిర్ధారణ

ఛాతీ ఎక్స్–రే, ఈసీజీ, గుండె, అయోర్టా కనిపించేలా అల్ట్రాసౌండ్, సీటీ స్కాన్, ఎమ్మారై వంటి పరీక్షలతో నిర్ధారణ చేస్తారు. సీటీ, ఎమ్మారైలతో అన్యురిజమ్ వచ్చిన ఖచ్చితమైన ప్రదేశం, సరైన పరిమాణం, ఎంతభాగం ఉబ్బిందనేది తెలుస్తాయి.

చికిత్సలు

- అన్యురిజమ్ కనుగొనగానే తక్షణం శస్త్ర చికిత్స అవసరం ఉండదు. అయితే అది చిట్లిపోకుండా జాగ్రత్త తీసుకోవడం కోసం రక్తపోటు నియంత్రణ మందులు వాడతారు. అప్పట్నుంచీ దాని పెరుగుదలను తరచూ సీటీ స్కాన్‌తో గమనిస్తూ ఉండేందుకు క్రమం తప్పకుండా ఫాలో అప్‌లో ఉండాలి.
- ఏడాదిలో అది 0.5 సెం.మీ. నుంచి 1 సెం.మీ. పెరిగితే, అప్పుడు దానికి రిపేరు చేయాలి. (సైజు ఎంతన్నది కాకుండా దాని పెరుగుదల రేటును బట్టి ఈ రిపేరు జరగాలి).
- అన్యురిజమ్ 6 సెం.మీ. సైజుకు పెరిగితే చిట్లేందుకు అవకాశాలు ఎక్కువ. అందుకే సాధారణంగా అన్యురిజమ్ సైజు 5.5 సెం.మీ.కి పెరిగినప్పుడు డాక్టర్లు శస్త్రచికిత్స ద్వారా దాన్ని రిపేరు చేసేందుకు పూనుకుంటారు. ఉబ్బిన భాగాన్ని తొలగించి కృత్రిమమైన ట్యూబ్ అమర్చుతారు. ఇది క్లిష్టమైన శస్త్రచికిత్స. కానీ ముందస్తుగా కనుగొని చికిత్స చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. ఆధునిక సాంకేతికత సహాయంతో కొన్ని సందర్భాల్లో ఆపరేషన్ లేకుండానే చికిత్స చేయవచ్చు.
- బాధితులు పొగతాగడం మానేయాలి. ఇక వారు బరువులెత్తడం, ఫర్నిచర్ కదపడం, ఛాతీపై బరువు పడే పని చేయడం వంటి అంశాలు అన్యురిజమ్‌పై ప్రభావం చూపవచ్చు. ఈ సమయాల్లో అన్యురిజమ్ హఠాత్తుగా చిట్లితే, కార్డియోథొరాసిక్ సర్జన్లు ఆకస్మికంగా శస్త్రచికిత్స నిర్ణయాన్ని తీసుకోవాల్సి వస్తుంది.

కొన్ని సందర్భాల్లో శస్త్రచికిత్సను ఆలస్యం చేసేందుకు స్టెంటింగ్, ఆర్టిఫిషియల్ గ్రాఫ్టింగ్ వంటి ప్రత్యామ్నాయ చికిత్సలనూ డాక్టర్లు ఆలోచిస్తారు. అనేక అంశాల ఆధారంగా డాక్టర్లు ఏ చికిత్స సరైనదో ఎంచుకుంటారు.

ఆధునిక శస్త్రచికిత్సతో థొరాసిక్ అన్యురిజమ్‌లాంటి క్లిష్టమైన సమస్యకు ఇప్పుడు మంచి ఫలితాలు దొరికే అవకాశం ఉంది. ●



డా॥ ఏ.ఆర్. కృష్ణప్రసాద్,
సీనియర్ కన్సల్టెంట్
కార్డియోథొరాసిస్ సర్జన్.

మెడి టిప్



ఓవర్ యాక్టివ్ బ్లాడర్ నివారణకు...

'ఓవర్ యాక్టివ్ బ్లాడర్' సమస్య ఉన్నవారు మూత్రవిసర్జనకు చాలా వేగంగానూ, అత్యవసరంగా వెళ్లాల్సిరావడం, మామూలు ఫ్రీక్వెన్సీతో పోలిస్తే చాలా ఎక్కువ సార్లు బాత్‌రూమ్‌కు వెళ్లడం, మూత్రవిసర్జన ఫీలింగ్‌తో బాత్‌రూమ్‌కు వెళ్లడం కోసం రాత్రిళ్లు మాటిమాటికీ నిద్రలేవడం (నాక్ట్యూరియా), మూత్రం ఆపుకోలేకపోవడం (ఇన్‌కాంటినెన్స్) వంటి సమస్యలను ఎదుర్కొంటుంటారు. వైద్యసహాయం లేకుండానే ఈ సమస్యల నివారణకు అధిగమించడానికి మార్గాలివి...

- జీవనశైలి మార్పుల్లో భాగంగా... దేహానికి అవసరమైనన్ని నీళ్లు మాత్రమే తాగాలి. కొంత పరిశీలన, అభ్యాసం ద్వారా తమకు రోజుకు ఎంత పరిమాణంలో నీళ్లు అవసరమో తెలుసుకోవచ్చు. నీళ్లు తక్కువైనప్పుడు డీహైడ్రేషన్ వల్ల కండరాలు బిగుసుకుపోవడం (మజిల్ క్రాంప్స్) వంటివి కనిపిస్తాయి. ఈ పరిస్థితి రానంత మేర నీళ్లు తాగుతూ తమకు ఎన్ని నీళ్లు అవసరమో గుర్తించవచ్చు.
- నిద్రపోవడానికి రెండు గంటల ముందుగా నీళ్లు తాగాలి.
- పొగతాగే అలవాటు, కెఫిన్ మోతాదు ఎక్కువగా ఉండే కాఫీలూ, కోలాడ్రింక్స్, ఆల్కహాల్ వంటి అలవాట్లు 'ఓవర్ యాక్టివ్ బ్లాడర్'ను ప్రేరేపిస్తాయి. పైగా ఇవన్నీ సాధారణ ఆరోగ్యానికి కూడా హానికరం కాబట్టి ఆ అలవాట్లకు దూరంగా ఉండాలి.
- కొన్ని మందులు వాడగానే మూత్రం ముదురు పసుపురంగులోనూ, తీవ్రమైన వాసనతోనూ రావచ్చు. ఇలాంటి మందుల్ని డాక్టర్ సలహా లేకుండా, తమంతట తామే (ఓవర్ ద కౌంటర్) కొని, వాడకూడదు.

ఇలాంటి కొన్ని చర్యలతో ఓవర్ యాక్టివ్ బ్లాడర్ నివారణ/నియంత్రణకు వీలవుతుంది. అయితే ఈ జాగ్రత్తల తర్వాత కూడా సమస్య తగ్గకపోతే తప్పక డాక్టర్‌ను సంప్రదించాలి. ●

‘సిక్సర్’ వేటలో భారత్!


అశ్విన్‌తో కలిసి పిచ్‌ను పరిశీలిస్తున్న రోహిత్

- నేడు ఇంగ్లండ్‌తో వరల్డ్ కప్ మ్యాచ్
- తీవ్ర ఒత్తిడిలో డిఫెండింగ్ చాంపియన్
- మ.గం. 2.00 నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం


బట్లర్

లక్నో: భారత్‌కు చెలగాటం...ఇంగ్లండ్‌కు ప్రాణసంకటం...ప్రపంచ కప్ పోరులో నేడు సరిగ్గా ఇదే పరిస్థితి కనిపించనుంది. ఆడిన ఐదు మ్యాచ్‌లలోనూ గెలిచి సిక్సర్‌పై (ఆరో విజయం)పై దృష్టి పెట్టిన టీమిండియా ఒక వైపు... నాలుగు మ్యాచ్‌లు ఓడి మరొకటి ఓడితే లీగ్ దశలోనే నిష్క్రమించే అవకాశం ఉన్న డిఫెండింగ్ చాంపియన్ మరో వైపు...ఆదివారం మరో ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమైంది. ఏక్నా స్టేడియంలో జరిగే ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్‌తో భారత్ తలపడనుంది. ఫామ్, బలాబలాలు చూస్తే ఇంగ్లండ్‌కంటే అన్ని విధాలా భారత్‌దే పైచేయి కాగా, పరువు కాపాడుకునే ప్రయత్నంలో ఉన్న బట్లర్ బృందం ఎలాంటి పోటీనిస్తుందనేది ఆసక్తికరం.

అశ్విన్‌కు చాన్స్!

జోరు మీదున్న భారత జట్టులో ఎవరి గురించి ఆందోళన లేదు. రోహిత్ అద్భుతమైన ఆరంభం అందిస్తుండగా, గిల్, కోహ్లి దానిని కొనసాగిస్తున్నారు. అయ్యర్, రాహుల్‌ల ఆటతో టీమ్ పటిష్టంగా కనిపిస్తోంది. ఈ మ్యాచ్‌కూ పాండ్యా దూరమైనా సూర్యకుమార్ తనకు లభించిన మరో అవకాశాన్ని ఉపయోగించుకోవాల్సి ఉంది. ఇప్పటి వరకు అజేయంగా ఉన్న టీమ్ అదే జోరును కొనసాగించాలని భావిస్తోంది. బౌలింగ్‌లో పదునైన దళం భారత్‌కు ఉంది. బుమ్రాను ఎదుర్కోవడం ప్రత్యర్థులకు అంత సులువు కాకపోగా, తానేంటో షమీ గత మ్యాచ్‌లోనే చూపించాడు. జడేజాతో పాటు సొంతగడ్డపై ఆడనున్న కుల్దీప్ ప్రభావం చూపించగలరు. లక్నో మొదటినుంచీ స్పిన్‌కు కాస్త అనుకూలమైన పిచ్ కాబట్టి సిరాజ్ స్థానంలో అశ్విన్‌ను ఆడించే అవకాశాన్ని మేనేజ్‌మెంట్ పరిశీలిస్తోంది.

గెలిపించేదెవరు?

గత చాంపియన్ ఇంగ్లండ్ పరిస్థితి మాత్రం ఘోరంగా ఉంది. ఐదు మ్యాచ్‌లు ఆడినా జట్టులో ఒక్క ప్లేయర్ కూడా ఆశించిన రీతిలో స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేదు. ముఖ్యంగా బట్లర్, రూట్, బెయిర్‌స్టో వరుసగా విఫలమయ్యారు. అందుబాటులో ఉన్న 15 మందిని మార్చి మార్చి ఇంగ్లండ్ ఇప్పటికే ప్రయత్నించింది కానీ ఫలితం దక్కలేదు. ఇప్పుడు మరో ప్రత్యామ్నాయం లేక మరోసారి బౌలింగ్ ఆల్‌రౌండర్లనే ఆ జట్టు నమ్ముకుంటోంది. స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కోలేకపోతే మాత్రం జట్టు కుప్పకూలడం ఖాయం. బౌలింగ్‌లో కూడా ఆ జట్టు బాగా బలహీనంగా ఉంది. వోక్స్, విల్లీ, అట్కిన్సన్ లాంటి వాళ్లు భారత్‌పై ప్రభావం చూపించడం సందేహమే.

పిచ్, వాతావరణం

ఐపీఎల్‌నుంచీ ఇది స్పిన్నర్ల పిచ్. సీమర్లు ఆరంభంలో మాత్రం కాస్త ప్రభావం చూపగలరు. స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కొంటే పరుగులు రాబట్టవచ్చు. మ్యాచ్‌కు వర్షసూచన లేదు.

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్, కోహ్లి, అయ్యర్, రాహుల్, సూర్యకుమార్, జడేజా, కుల్దీప్, షమీ, బుమ్రా, సిరాజ్/అశ్విన్.

ఇంగ్లండ్: బట్లర్ (కెప్టెన్), బెయిర్‌స్టో, మలాన్, రూట్, స్టోక్స్, బ్రూక్, లివింగ్‌స్టోన్, వోక్స్, విల్లీ, అట్కిన్సన్, రషీద్.

ధర్మశాలలో ధమాకా



నీషమ్‌ను రనౌట్ చేసిన ఆనందంలో ఆసీస్ ఆటగాళ్లు

ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో న్యూజిలాండ్ విజయలక్ష్యం 389... ఇంత భారీ స్కోరు చూడగానే సాధారణంగా ఛేదన చేసే జట్టు మానసికంగా ముందే ఓటమికి సిద్ధమవుతుంది. కానీ న్యూజిలాండ్ తలవంచకుండా చివరి వరకు పోరాడింది... ఒక వైపు వికెట్లు పడుతున్నా, మరో వైపు జోరు తగ్గించలేదు. చివరకు ఆఖరి ఓవర్లో 19 పరుగులు చేయాల్సిన స్థితి వరకు మ్యాచ్‌ను తీసుకొచ్చింది. ఇక్కడా అవకాశం ఉన్నా... ఆస్ట్రేలియా అద్భుత ఫీల్డింగ్‌తో కివీస్‌ను నిలువరించడంలో సఫలమైంది. బౌండరీని దాటగలిగే రెండు బంతులను మెరుపు వేగంతో దూసుకెళ్లి ఆపడంతో పాటు రెండో పరుగు కోసం చేసిన ప్రయత్నాన్ని రనౌట్‌తో పడగొట్టింది! దాంతో ఆఖరికి 5 పరుగుల తేడాతో గెలిచి ఆస్ట్రేలియా ఊపిరి పీల్చుకుంది. రచిన్, నీషమ్‌ల పోరాటం చివరకు వృథా అయింది. అంతకు ముందు తన తొలి ప్రపంచకప్ మ్యాచ్‌లో హెడ్ మెరుపు సెంచరీ, వార్నర్ దూకుడు వెరసి ఆసీస్‌కు భారీ స్కోరును అందించాయి. వరల్డ్ కప్‌లో వరుసగా రెండో రోజు అభిమానులకు ఉత్కంఠభరితమైన మ్యాచ్ చూసే అవకాశం దక్కగా... ఈ మ్యాచ్‌లో ఇరు జట్లు కలిపి చేసిన 771 పరుగులు ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక మొత్తం కావడం విశేషం.

- పరుగుల వరదలో ఆసీస్‌దే పైచేయి
- 5 పరుగులతో ఓడిన న్యూజిలాండ్
- హెడ్ సెంచరీ... రచిన్ శతకం వృథా


రచిన్

ధర్మశాల: మ్యాచ్ మ్యాచ్‌కూ మరింత పదునెక్కుతున్న ఆస్ట్రేలియా ప్రపంచకప్‌లో మరో కీలక విజయాన్ని అందుకుంది. ఐదు సార్లు విజేత అయిన ఆసీస్‌కు ఈ టోర్నీలో ఇది వరుసగా నాలుగో విజయం కాగా, వరుసగా మూడో మ్యాచ్‌లోనూ ఆ జట్టు 350 పరుగుల స్కోరు దాటగలిగింది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఆసీస్ 5 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ 49.2 ఓవర్లలో 388 పరుగులకు ఆలౌటైంది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ ట్రవిస్ హెడ్ (67 బంతుల్లో 109; 10 ఫోర్లు, 7 సిక్స్‌లు) వన్డేల్లో నాలుగో శతకం సాధించగా, డేవిడ్ వార్నర్ (65 బంతుల్లో 81; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) వరుసగా మూడో సెంచరీ అవకాశాన్ని చేజార్చుకున్నాడు. వీరిద్దరు తొలి వికెట్‌కు 115 బంతుల్లోనే 175 పరుగులు జోడించడం విశేషం. అనంతరం న్యూజిలాండ్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 383 పరుగులు సాధించింది. రచిన్ రవీంద్ర (89 బంతుల్లో 116; 9 ఫోర్లు, 5 సిక్స్‌లు) టోర్నీ రెండో సెంచరీ సాధించగా... జేమ్స్ నీషమ్ (39 బంతుల్లో 58; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), డరైల్ మిచెల్ (51 బంతుల్లో 54; 6 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు.

వరల్డ్ కప్ కోసం ఆసీస్ ప్రకటించిన 15 మంది సభ్యుల జట్టులో ట్రవిస్ హెడ్ ఉన్నాడు. అయితే అనూహ్యంగా అతని చేతికి గాయమైంది. అయినా సరే అతని స్థానంలో మరొకరిని తీసుకోకుండా 14 మందితోనే ఆసీస్ జట్టును కొనసాగించింది. తొలి ఐదు మ్యాచ్‌లకు దూరమైన అతను తనపై ఉంచి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వచ్చీ రాగానే తన విలువేంటో చూపించాడు. హెడ్, వార్నర్ కలిసి కివీస్ బౌలర్లపై విరుచుకుపడటంతో తొలి 10 ఓవర్లలోనే ఆసీస్ ఏకంగా 118 పరుగులు చేసింది. ఈ క్రమంలో వార్నర్ 28 బంతుల్లో, హెడ్ 25 బంతుల్లో అర్ధ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. 19 ఓవర్ల తర్వాత ఆసీస్ స్కోరు 175/0 కాగా, ఈ స్కోరు వద్ద జోడీని విడదీయడంలో కివీస్ సఫలమైంది. అనంతరం 59 బంతుల్లోనే హెడ్ శతకాన్ని అందుకున్నాడు. ఈ దశలో ఆసీస్ మిడిలార్డర్ తడబాటుకు లోనై తక్కువ వ్యవధిలో వరుసగా వికెట్లు కోల్పోయింది. అయితే చివర్లో మ్యాక్స్‌వెల్ (24 బంతుల్లో 41; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఇన్‌గ్లిస్ (28 బంతుల్లో 38; 4 ఫోర్లు, 1 సిక్స్), ప్యాట్ కమిన్స్ (14 బంతుల్లో 37; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) కలిసి పరిస్థితిని చక్కదిద్దారు. ఛేదనను కివీస్ దూకుడుగానే ఆరంభించింది. ఓపెనర్లు యంగ్ (28), కాన్వే (28) సరైన ఆరంభాన్ని ఇవ్వగా, రచిన్ ఆ జోరును కొనసాగించాడు. రచిన్, మిచెల్ కలిసి 96 పరుగుల భాగస్వామ్యంతో జట్టును గెలుపు దిశగా నడిపించారు. 77 బంతుల్లోనే రచిన్ సెంచరీ పూర్తయింది. 59 బంతుల్లో 96 పరుగులు చేయాల్సిన దశలో రచిన్ వెనుదిరగ్గా... ఆ తర్వాత నీషమ్ బాధ్యత తను తీసుకున్నాడు. కానీ దురదృష్టవశాత్తూ అతని రనౌట్ జట్టు ఓటమిని ఖాయం చేసింది.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
దక్షిణాఫ్రికా	6	5	1	10	2.032
భారత్	5	5	0	10	1.353
న్యూజిలాండ్	6	4	2	8	1.232
ఆస్ట్రేలియా	6	4	2	8	0.970
శ్రీలంక	5	2	3	4	-0.025
పాకిస్తాన్	6	2	4	4	-0.387
అఫ్గానిస్తాన్	5	2	3	4	-0.969
నెదర్లాండ్స్	6	2	4	4	-1.277
బంగ్లాదేశ్	6	1	5	2	-1.338
ఇంగ్లండ్	5	1	4	2	-1.634

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: వార్నర్ (సి) అండ్ (బి) ఫిలిప్స్ 81; హెడ్ (బి) ఫిలిప్స్ 109; మార్ష్ (బి) సాన్‌ట్నర్ 36; స్మిత్ (సి) బౌల్ట్ (బి) ఫిలిప్స్ 18; లబుషేన్ (సి) రవీంద్ర (బి) సాన్‌ట్నర్ 18; మ్యాక్స్‌వెల్ (సి) బౌల్ట్ (బి) నీషమ్ 41; ఇన్‌గ్లిస్ (సి) ఫిలిప్స్ (బి) బౌల్ట్ 38; కమిన్స్ (ఎల్బీ) (బి) బౌల్ట్ 37; స్టార్క్ (సి) నీషమ్ (బి) హెన్రీ 1; జంపా (బి) బౌల్ట్ 0; హాజల్‌వుడ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం** (49.2 ఓవర్లలో ఆలౌట్) 388. **వికెట్ల పతనం:** 1-175, 2-200, 3-228, 4-264, 5-274, 6-325, 7-387, 8-388, 9-388, 10-388. **బౌలింగ్:** హెన్రీ 6.2-0-67-1, బౌల్ట్ 10-0-77-3, ఫెర్గూసన్ 3-0-38-0, సాన్‌ట్నర్ 10-0-80-2, ఫిలిప్స్ 10-0-37-3, రచిన్ 8-0-56-0, నీషమ్ 2-0-32-1. **న్యూజిలాండ్ ఇన్నింగ్స్:** కాన్వే (సి) స్టార్క్ (బి) హాజల్‌వుడ్ 28; యంగ్ (సి) స్టార్క్ (బి) హాజల్‌వుడ్ 32; రచిన్ (సి) లబుషేన్ (బి) కమిన్స్ 116; మిచెల్ (సి) స్టార్క్ (బి) జంపా 54; లాథమ్ (సి) హాజల్‌వుడ్ (బి) జంపా 21; ఫిలిప్స్ (సి)లబుషేన్ (బి) మ్యాక్స్‌వెల్ 12; నీషమ్ (రనౌట్) 58; సాన్‌ట్నర్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) జంపా 17; హెన్రీ (సి) హాజల్‌వుడ్ (బి) కమిన్స్ 9; బౌల్ట్ (నాటౌట్) 10; ఫెర్గూసన్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 26; **మొత్తం** (50 ఓవర్లలో 9 వికెట్లకు) 383. **వికెట్ల పతనం:** 1-61, 2-72, 3-168, 4-222, 5-265, 6-293, 7-320, 8-346, 9-383. **బౌలింగ్:** స్టార్క్ 9-0-89-0, హాజల్‌వుడ్ 9-0-70-2, కమిన్స్ 10-0-66-2, మ్యాక్స్‌వెల్ 10-0-62-1, జంపా 10-0-74-3, మార్ష్ 2-0-18-0.

111 పతకాలు... ఐదో స్థానం

- ఆసియా పారా క్రీడల్లో భారత్ ఘనత
- ముగిసిన క్రీడలు



హాంగ్జౌ: పారా ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు సత్తా చాటారు. మునుపెన్నడు లేని విధంగా ఈ క్రీడల్లో తొలిసారి పతకాల సెంచరీని సాధించారు. చైనా ఆతిథ్యమిచ్చిన ఈ ఆసియా మెగా ఈవెంట్‌లో ఏకంగా 111 పతకాలతో భారత్ టాప్-5లో నిలిచింది. ఇందులో 29 స్వర్ణాలు, 31 రజతాలు, 51 కాంస్య పతకాలున్నాయి. ఇటీవలే ఆసియా క్రీడల్లో భారత్ 107 పతకాలతో నాలుగో స్థానం సాధించగా...ఇప్పుడు భారత బృందానికి ఐదో స్థానం లభించింది.

నీరజ్ స్వర్ణంతో...

ఆఖరి రోజు శనివారం పోటీల్లో నీరజ్ యాదవ్ జావెలిన్ త్రో (ఎఫ్55)లో 33.69 మీటర్లతో రికార్డు దూరం విసిరి బంగారం నిలబెట్టుకున్నాడు. 39 ఏళ్ల నీరజ్ గత 2018 పారా ఈవెంట్‌లోనూ పసిడి పట్టాడు. ఈ క్రీడల్లో సహచరుడు టెక్ చంద్ (30.36 మీ.) కాంస్యంతో తృప్తిపడ్డాడు. తర్వాత దిలిప్ మహాదు పురుషుల 400 మీటర్ల పరుగులో విజేతగా నిలిచాడు. మహిళల 1500 మీటర్ల రేసులో పూజ కాంస్యం నెగ్గింది. వ్యక్తిగత ర్యాపిడ్-6 బి1 ఈవెంట్‌లో సతీశ్ ఇనాని, ప్రధాన్ కుమార్, అశ్విన్‌భాయ్ కంచన్ వరుసగా స్వర్ణ, రజత, కాంస్య పతకాలతో క్లీన్‌స్వీప్ చేశారు. బి2/బి3 ఈవెంట్‌లో కిషన్ కాంస్యం, ఇదే టీమ్ ఈవెంట్‌లో కిషన్, ఆర్యన్, సోమేంద్రలతో కూడిన బృందం కాంస్య పతకం గెలుచుకుంది. మహిళల టీమ్ ఈవెంట్‌లో వృతి జైన్, హిమాన్షి, సంస్కృతి కాంస్యం నెగ్గారు.

టాప్-5 పట్టికలో...

ఆతిథ్య చైనా పారా అథ్లెట్లు 521 పతకాలతో పట్టికలో అగ్ర స్థానంలో నిలిచారు. రెండో మూడు స్థానాల్లో ఇరాన్ (131), జపాన్ (150) వరుసగా నిలిచాయి. దక్షిణ కొరియా (103) మనకన్నా తక్కువ పతకాలు సాధించినప్పటికీ ఒకే ఒక్క స్వర్ణం తేడాతో నాలుగో స్థానంలో నిలిచింది. కొరియా 30 బంగారు పతకాలు నెగ్గితే... భారత్ 29 గెలిచింది.

భారత్‌కు మరో విజయం


వందన

రాంచీ: భారత అమ్మాయిల హాకీ జట్టు ఎదురులేని ప్రదర్శనతో దూసుకెళుతోంది. ఆసియా మహిళల హాకీ చాంపియన్స్ ట్రోఫీ టోర్నమెంట్‌లో భారత్ 5-0తో మలేసియాపై ఘనవిజయం సాధించింది. వందన కటారియా (7, 21వ నిమిషాల్లో) చక్కని ఆటతీరుతో రెండు గోల్స్ చేసింది. సంగీత కుమారి (28వ ని.), లాల్‌రెమ్‌సియామి (28వ ని.) క్షణాల వ్యవధిలోనే చెరో గోల్ సాధించిపెట్టారు. మూడో క్వార్టర్‌లో జ్యోతి (38వ ని.) కూడా గోల్ చేయడంతో భారత్ ఏకపక్ష విజయం సాధించింది. తొలి లీగ్‌లో భారత్ 7-1తో థాయ్‌లాండ్‌పై నెగ్గింది.

భారత్‌కు సులువైన ‘ఇంగ్లీష్ పరీక్ష’

(గౌతం గంభీర్)

జాతీయ మీడియా, సోషల్ మీడియాలో భారత్, పాకిస్తాన్ కామెంటేటర్లు పరస్పర దూషణలతో చెలరేగుతుంటే మరో వైపు అందమైన, మానవ సంబంధాల కథనం ఒకటి నేను చదివాను. దిగ్గజ క్రికెటర్ బిషన్‌సింగ్ బేడి సర్ చనిపోయినప్పుడు ఆయన మిత్రుడు, పాక్ మాజీ కెప్టెన్ ఇంతికాబ్ ఆలమ్ ఇది రాశారు. మామూలుగా నేను అంత తొందరగా భావోద్వేగానికి గురి కాను. కానీ ఇది నన్ను కదిలించింది. ఈ రోజు భారత్, ఇంగ్లండ్ మధ్య మ్యాచ్‌లు ఆడబోయే క్రికెటర్ల పేర్లు చూస్తే అంతా స్టార్లే కనిపిస్తారు. కానీ వాస్తవం అందుకు భిన్నంగా ఉంది. ఇంత పెద్ద లైనప్ ఉండి కూడా ఇంగ్లండ్ దాదాపు చివరి స్థానంలో కొనసాగుతోంది. భారత జట్టును చూస్తే నా చిన్నప్పటి రోజులు గుర్తుకు వచ్చాయి. చివరి బెంచీలో ఉండే మేం ఆఖరి నిమిషంలో చదివేందుకు కిందా మీదా పడుతుంటే అదే సమయంలో మెరికల్లాంటి ఇతర విద్యార్థులు పరీక్షకు ముందు చాలా ప్రశాంతంగా, ఆడుతూ పాడుతూ కనిపించేవారు. భారత్ కోణంలో ఈ ‘ఇంగ్లీష్ పరీక్ష’ చాలా సులువైంది అయితే ఇంగ్లండ్ మాత్రం కష్టాల్లో ఉంది. పిచ్‌కు స్పిన్‌కు అనుకూలిస్తే మాత్రం ఇవి రెట్టింపవుతాయి. టాస్ గెలిస్తే బ్యాటింగ్ ఎంచుకోవడం ఉత్తమం.

బంగ్లాకు నెదర్లాండ్స్ షాక్

- 87 పరుగుల తేడాతో డచ్ విజయం
- రాణించిన ఎడ్వర్డ్స్, మీకెరెన్



కోల్‌కతా: ప్రపంచకప్‌లో ఇదివరకే పటిష్టమైన దక్షిణాఫ్రికాను కంగుతినిపించిన నెదర్లాండ్స్ తాజాగా మరో షాకిచ్చింది. ఈ సారి బంగ్లాదేశ్‌ను 87 పరుగుల తేడాతో చిత్తు చేసింది. ముందుగా నెదర్లాండ్స్ నిర్ణీత 50 ఓవర్లలో 229 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్ (89 బంతుల్లో 68; 6 ఫోర్లు) రాణించాడు. వెస్లీ బారెసి (41 బంతుల్లో 41; 8 ఫోర్లు), సైబ్రాండ్ (61 బంతుల్లో 35; 3 ఫోర్లు) మెరుగ్గా ఆడాడు. అనంతరం సులువైన లక్ష్యమే ఎదురైనా... బంగ్లాదేశ్ 42.2 ఓవర్లలో 142 పరుగులకే కుప్పకూలింది. మెహిదీ హసన్ మిరాజ్ (40 బంతుల్లో 35; 5 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా మిగతావారంతా విఫలమయ్యారు. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ పాల్ వాన్ మీకెరెన్ (4/23) బంగ్లాను కుప్పకూల్చాడు.

స్కోరు వివరాలు

నెదర్లాండ్స్ ఇన్నింగ్స్: విక్రమ్‌జీత్ (సి) షకీబ్ (బి) తస్కీన్ 3; ఓ డౌడ్ (సి) తన్‌జీద్ (బి) షరీఫుల్ 0; వెస్లీ (సి) షకీబ్ (బి) ముస్తఫిజుర్ 41; అకెర్మన్ (సి) ముస్తఫిజుర్ (బి) షకీబ్ 15; ఎడ్వర్డ్స్ (సి) మిరాజ్ (బి) ముస్తఫిజుర్ 68; లీడ్ (సి) ముష్ఫికర్ (బి) తస్కీన్ 17; సైబ్రాండ్ (ఎల్బీ) మెహదీ హసన్ 35; వాన్ బీక్ నాటౌట్ 23; షారిజ్ రనౌట్ 6; ఆర్యన్ (సి) మిరాజ్ (బి) షరీఫుల్ 9; మీకెరెన్ (ఎల్బీ) (బి) మెహదీ హసన్ 0; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం** (50 ఓవర్లలో ఆలౌట్) 229. **వికెట్ల పతనం:** 1-3, 2-4, 3-63, 4-63, 5-107, 6-185, 7-185, 8-194, 9-212, 10-229. **బౌలింగ్:** షరీఫుల్ 10-0-51-2, తస్కీన్ 9-1-43-2, షకీబ్ 10-1-37-1, మిరాజ్ 4-0-17-0, ముస్తఫిజుర్ 10-1-36-2, మెహదీ హసన్ 7-0-40-2.

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: లిటన్ (సి) ఎడ్వర్డ్స్ (బి) ఆర్యన్ 3; తన్‌జీద్ (సి) ఎడ్వర్డ్స్ (బి) వాన్ బీక్ 15; మిరాజ్ (సి) ఎడ్వర్డ్స్ (బి) లీడ్ 35; నజ్ముల్ (సి) వాన్ బీక్ (బి) మీకెరెన్ 9; షకీబ్ (సి) ఎడ్వర్డ్స్ (బి) మీకెరెన్ 5; ముష్ఫికర్ (బి) మీకెరెన్ 1; మహ్మదుల్లా (సి) ఆర్యన్ (బి) లీడ్ 20; మెహదీ హసన్ రనౌట్ 17; తస్కీన్ (సి) లీడ్ (బి) మీకెరెన్ 11; ముస్తఫిజుర్ (బి) అకెర్మన్ 20; షరీఫుల్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం** (42.2 ఓవర్లలో ఆలౌట్) 142. **వికెట్ల పతనం:** 1-19, 2-19, 3-45, 4-63, 5-69, 6-70, 7-108, 8-113, 9-142, 10-142. **బౌలింగ్:** ఆర్యన్ దత్ 10-3-26-1, వాన్ బీక్ 9-1-30-1, అకెర్మన్ 7-1-25-1, మీకెరెన్ 7.2-0-23-4, లీడ్ 7-0-25-2, షారిజ్ అహ్మద్ 2-0-13-0.


సినిమా

కిక్కెక్కుతోందే జన్మ...


సందీప్ కిషన్, వర్ష

సందీప్ కిషన్ హీరోగా, కావ్యా థాపర్, వర్ష బొల్లమ్మ హీరోయిన్లుగా వీఐ ఆనంద్ దర్శకత్వంలో రూపొందుతున్న ఫ్యాంటసీ అడ్వెంచరస్ ఫిల్మ్ ‘ఊరు పేరు భైరవకోన’. అనిల్ సుంకర సమర్పణలో రాజేశ్ దండా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలోని ‘నా వల్ల కాదే బొమ్మ.. నీ కళ్లు చూస్తే అమ్మా.. కిక్కెక్కుతోందే జన్మ..’ అంటూ సాగే పాట లిరికల్ వీడియోను శనివారం విడుదల చేశారు. ఈ చిత్రం మ్యూజిక్ డైరెక్టర్ శేఖర్ చంద్ర, తిరుపతి జావన లిరిక్స్ అందించిన ఈ పాటను రామ్ మిరియాల పాడారు. ఈ సినిమాకు సహనిర్మాత: బాలాజీ గుత్తా.

ఓ చాంపియన్ కథ


విజయ రామరాజు

భారతదేశానికి 1980లలో ప్రాతినిధ్యం వహించిన కబడ్డీ ఆటగాడు అర్జున్ చక్రవర్తి జీవితం ఆధారంగా రూపొందిన ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రం ‘అర్జున్ చక్రవర్తి: జర్నీ ఆఫ్ యాన్ అన్‌సంగ్ ఛాంపియన్’. విజయ రామరాజు టైటిల్ రోల్‌లో, సిజా రోజ్ కీ రోల్‌లో విక్రాంత్ రుద్ర దర్శకత్వంలో శ్రీని గుబ్బల ఈ చిత్రాన్ని నిర్మించారు.

డిటెక్టివ్ తీక్షణ


ప్రియాంక

‘రణరణమున రథము నిలిపి, రుధిర నదిని ఎదురు మలిపి..’’ అంటూ సాగుతుంది ‘డిటెక్టివ్ తీక్షణ’ చిత్రంలోని ‘రేజ్ ఆఫ్ తీక్షణ’ పాట. చిత్ర సంగీత దర్శకుడు పెద్దపల్లి రోహిత్ రాసిన ఈ పాటను హైమత్ మొహమ్మద్, సాయి చరణ్ భాస్కరుని, అరుణ్ కౌండిన్య పాడారు. ప్రియాంకా ఉపేంద్ర టైటిల్ రోల్‌లో ఈ చిత్రానికి త్రివిక్రమ్ రఘు దర్శకత్వం వహించారు. గుత్తా ముని ప్రసన్న, ముని వెంకట చరణ్, పురుషోత్తం .బి కోయురు నిర్మించిన ఈ చిత్రం కన్నడ, తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, బెంగాలీ, ఒరియా భాషల్లో రిలీజ్ కానుంది.

వాస్తు కోసం బాగా ప్రాక్టీస్ చేశా!

– చైతన్యా రావు



చైతన్యా రావు, బ్రహ్మానందం, రాగ్ మయూర్, తరుణ్ భాస్కర్, విష్ణు, జీవన్, రవీంద్ర విజయ్, రఘురామ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘కీడా కోలా’. తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో రానా సమర్పణలో కె. వివేక్ సుధాంశు, సాయికృష్ణ గద్వాల్, శ్రీనివాస్ కౌశిక్, శ్రీపాద్ నిర్మించిన ఈ చిత్రం నవంబరు 3న రిలీజ్ కానుంది. ఈ చిత్రంలో ఓ కీలక్ రోల్ చేసిన చైతన్యా రావు మాట్లాడుతూ– ‘‘ఈ చిత్రంలో టూరెట్ సిండ్రోమ్ (నత్తిగా మాట్లాడటం, మాట్లాడుతున్నప్పుడు మధ్యలో ఆగడం)తో ఇబ్బందిపడే వాస్తు పాత్ర చేశాను. మనకు ఓ సమస్య ఉన్నప్పటికీ, అందరిలానే మాములు జీవితం గడపొచ్చనేది నా పాత్రలో ఉన్న సందేశం. యూ ట్యూబ్ వీడియోలు, హాలీవుడ్ సినిమాలు చూసి వాస్తు పాత్రకు ప్రాక్టీస్ చేసుకుని ఆడిషన్‌కు వెళ్లాను’’ అని అన్నారు.

మర్డర్ మిస్టరీ


రాజేశ్, మేఘా

‘సత్యం’ రాజేశ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘టెనెంట్’. వై. యుగంధర్ దర్శకత్వంలో మొగుళ్ల చంద్రశేఖర్ రెడ్డి నిర్మిస్తున్న చిత్రం ఇది. ‘‘ఫ్యామిలీ ఎమోషనల్ మర్డర్ మిస్టరీ నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది. ఆడవాళ్లు చూడాల్సిన సినిమా ఇది’’ అని చిత్ర యూనిట్ పేర్కొంది. మేఘా చౌదరి, చందన పయ్యావుల, భరత్ కాంత్, తేజ్ దిలీప్, ‘ఆడుకాలం’ నరేన్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సాహిత్య సాగర్, సహ–నిర్మాత: ఎన్. రవీందర్ రెడ్డి.

భవిష్యత్‌లో డైరెక్టర్ అవుతాను

– కామాక్షి



‘సత్యం’ రాజేశ్, డా. కామాక్షీ భాస్కర్ల హీరో హీరోయిన్లుగా ‘గెటప్’ శ్రీను, రాకేందు మౌళి, బాలాదిత్య కీలక పాత్రల్లో నటించిన చిత్రం ‘మా ఊరి పొలిమేర 2’. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వంలో గౌరు గణ బాబు సమర్పణలో గౌరికృష్ణ నిర్మించిన ఈ సినిమాను నందిపాటి వంశీకృష్ణ నవంబరు 3న రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా కామాక్షి మాట్లాడుతూ– ‘‘మా నాన్నగారు కెమెరామేన్. రంభ, కల్పనా రాయ్‌లు మాకు దూరపు బంధువులు. నేను క్లాసికల్ డ్యాన్స్ నేర్చుకున్నాను. మెడిసిన్ చేసినా నటిగానూ చేయాలనుకుంటున్నాను. ‘మిస్ ఇండియా’ సినిమాతో నా జర్నీ మొదలైంది. ‘మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్, రౌడీ బాయ్స్, ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం, మా ఊరి పొలిమేర 1, విరూపాక్ష’ వంటి సినిమాలు, ‘ఆహా’ ఓటీటీలో మూడు వెబ్ సిరీస్‌లు చేశాను. ఇక ‘మా ఊరి పొలిమేర 1’లో సహనం ఉన్న లక్ష్మీ పాత్ర చేశాను. రెండో భాగంలో నా పాత్ర ఎగ్రెసివ్‌గా ఉంటుంది. భవిష్యత్‌లో డైరెక్టర్ అవుతాను’’ అన్నారు.

వినోదం.. సందేశం


ఉపేంద్ర, సావిత్రి

కంచర్ల ఉపేంద్ర, సావిత్రీ కృష్ణ జంటగా ఎస్కే ఆర్యన్ సుభాన్ దర్శకత్వంలో కంచర్ల అచ్యుత రావు నిర్మించిన చిత్రం ‘ఉపేంద్ర గాడి అడ్డా’. ఈ చిత్రాన్ని నవంబరులో విడుదల చేయాలనుకుంటున్నారు. ఈ చిత్రం విలేకర్ల సమావేశంలో సంగీత దర్శకురాలు ఎమ్ఎమ్ శ్రీలేఖ టీజర్‌ను రిలీజ్ చేశారు. ‘‘సోషల్ మీడియాలో మంచిని పెంపొందిస్తే సమాజానికి మేలు జరుగుతుందనే సందేశాన్ని ఈ సినిమాలో చూపిస్తాం. అలాగే 75 శాతం వినోదం కూడా ఉంటుంది’’ అన్నారు ఆర్యన్ సుభాన్. అచ్యుత రావుతో పాటు చిత్ర సహనిర్మాతలు కంచర్ల సుబ్బలక్ష్మి, కంచర్ల సునీత పాల్గొన్నారు.

నో లిమిట్స్


ధన్‌రాజ్

ధన్‌రాజ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం ‘బుజ్జీ.. ఇలా రా 2’. ‘బుజ్జీ ఇలా రా’ (2022)కి ఇది సీక్వెల్. ‘నో లిమిట్స్’ ఉపశీర్షిక. తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్ అంజి దర్శకుడు. ‘‘తండ్రీ కూతుళ్ల ఎమోషన్ నేపథ్యంలో సాగే థ్రిల్లర్ ఫిల్మ్ ఇది’’ అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: సర్వేశ్ మురారి.

సాక్షి
15
ఆదివారం 29-10-2023

పెళ్ళిచూపులు

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

బలమున్న చోటే పోటీ చేయాలి

టీటీడీపీ అధ్యక్షుడు కాసానికి చంద్రబాబు సూచన

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి బలమున్న స్థానాల్లోనే పోటీ చేయాలని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌కు స్పష్టం చేసినట్లు తెలిసింది. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం కేసులో అరెస్ట్ అయి రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న చంద్రబాబును శనివారం ములాఖత్‌లో లోకేశ్, భువనేశ్వరితోపాటు కాసాని కూడా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఎన్నికల్లో టీడీపీ పోటీ చేయడంపై ఇప్పటివరకు స్పష్టత లేదనే విషయాన్ని చంద్రబాబు దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్రంలోని అన్నిచోట్లా టీటీడీపీ పోటీ చేయాలని భావిస్తున్నట్లు కాసాని చెప్పగా, అన్ని స్థానాల్లో పోటీ అవసరంలేదని చంద్రబాబు స్పష్టం చేసినట్లు తెలిసింది. లోకేశ్‌తో ఆదివారం సమావేశమై పార్టీకి ఎక్కడెక్కడ బలం ఉందో, పోటీ చేసే అభ్యర్థులు ఎవరో చర్చించుకొని ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలో నిర్ణయం తీసుకోవాలని చంద్రబాబు చెప్పినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆదివారం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో తెలంగాణ పార్టీ నేతలతో లోకేశ్ సమావేశం కాబోతున్నారు.

బీజేపీకి దరువు ఎల్లన్న రాజీనామా

మానకొండూర్: కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గం నుంచి టికెట్ ఆశించి భంగపడ్డ ప్రజా గాయకుడు దరువు ఎల్లన్న బీజేపీకి శనివారం రాజీనామా చేశారు. ఎల్లన్నతో పాటు బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాలకు చెందిన పలువురు కార్యకర్తలు పార్టీకి రాజీనామా చేశారు. ఈ క్రమంలో జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, ఇల్లంతకుంట జెడ్పీటీసీ సిద్ధం వేణు.. ఎల్లన్నను కలిసి బీఆర్ఎస్‌లో చేరాలని ఆహ్వానించారు. త్వరలోనే బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు దరువు ఎల్లన్న తెలిపారు. మానకొండూర్ నుంచి బీజేపీ టికెట్ ఆరెపల్లి మోహన్‌కు దక్కడంతో ఇద్దరు కమలం నేతలు గడ్డం నాగరాజు, దరువు ఎల్లన్న పార్టీని వీడటం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది.

'గృహలక్ష్మి'పై లబ్ధిదారుల్లో డైలమా!

- పథకం మంజూరైనా ఇళ్ల నిర్మాణానికి ముందుకురాని ప్రజలు
- బేస్‌మెంట్ వరకు పనులు పూర్తి చేసుకుంటేనే రూ.లక్ష విడుదల
- ఎన్నికల నేపథ్యంలో నిధులు విడుదల కావన్న భావనలో ప్రజలు
- కాంగ్రెస్ 'గ్యారంటీ హామీ'తోనూ లబ్ధిదారుల్లో పునరాలోచన

సాక్షి, హైదరాబాద్: గృహలక్ష్మి ఇళ్లు మంజూరైనప్పటికీ నిర్మించుకునేందుకు జనం ముందుకు రావటం లేదు. బేస్‌మెంట్ స్థాయి వరకు నిర్మాణం జరుపుకోగానే, తొలి విడత రూ.లక్ష లబ్ధిదారులకు అందజేయాల్సి ఉంది. ప్రస్తుతం 2.15 లక్షల మందికి మంజూరు పత్రాలు జారీ చేసి లబ్ధిదారుల జాబితాలో చేర్చారు. వీరు ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించుకోవాల్సి ఉంది. కానీ, ఎక్కడా వాటి జాడే లేకుండా పోయింది. లబ్ధిదారుగా మంజూరు పత్రం రాగానే తొలి విడత రూ.లక్ష విడుదల చేస్తే బాగుంటుందని బీఆర్ఎస్ పార్టీ నేతలు తొలుత ఒత్తిడి చేశారు. కొన్ని ప్రాంతాల్లో ఒకరిద్దరు మంత్రులు కూడా ఆ మేరకు ప్రకటన కూడా చేశారు. కానీ, బేస్‌మెంట్ స్థాయి వరకు పనులు జరిపితేనే తొలి విడత ఇవ్వటం మంచిదని ఉన్నతాధికారులు స్పష్టం చేయటంతో ఆమేరకే నిర్ణయించినట్టు తెలిసింది. ఆ ప్రకారం బేస్‌మెంట్ స్థాయి వరకు పనులు చేపడితే, 2.15 లక్షల మందికి నిధులు విడుదల కావాల్సి ఉంది. కానీ, పనులు ప్రారంభించుకున్న దాఖలాలు మాత్రం కనిపించకపోవటం ఇప్పుడు ఆసక్తిగా మారింది.

మొదటినుంచీ ఆలస్యమే...

డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకం వేగంగా ముందుకు సాగకపోవటం, ప్రజల్లో విమర్శలు వెల్లువెత్తటంతో నష్టనివారణ చర్యగా ప్రభుత్వం గృహలక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టింది. సొంత జాగా ఉన్న వారికి రూ.3 లక్షలు చొప్పున విడతల వారీగా అందించి,



ఇళ్ల నిర్మాణ బాధ్యతను వారికే అప్పగించింది. రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుని, బడ్జెట్‌లో నిధులు ప్రతిపాదించింది. కానీ, దరఖాస్తుల ప్రక్రియలో తీవ్ర జాప్యం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా 15 లక్షల దరఖాస్తులు రాగా, దాదాపు 11 లక్షల దరఖాస్తులను అర్హమైనవిగా అధికారులు తేల్చారు. వీటిల్లోంచి 4 లక్షల మంది లబ్ధిదారులతో జాబితా రూపొందించే పనిలో మరింత ఆలస్యం జరిగింది. 2.15 లక్షల మందికి మంజూరు పత్రాలు జారీచేసే సమయానికి ఎన్నికల షెడ్యూల్ విడుదలై కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో అక్కడితో ఆ ప్రక్రియ ఆపేశారు. కానీ, అర్హులు కూడా పనులు ప్రారంభించుకునేందుకు ఆసక్తి చూపకపోవటం ఇప్పుడు ఆసక్తిగా మారింది.

కాంగ్రెస్ పార్టీ హామీతో...

ఇటీవల కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన 'ఆరు గ్యారంటీ'ల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం ఉంది. అధికారంలోకి వస్తే ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ పథకం కింద రూ.5 లక్షలు అందిస్తామని ఆ పార్టీ హామీ ఇచ్చింది. గృహలక్ష్మి పథకం కంటే ఆ నిధులు ఎక్కువ. ఇప్పుడు ఇళ్ల నిర్మాణం ప్రారంభించుకున్నాక, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు మంజూరు కావన్న భావన ఎక్కువ మందిలో ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అందుకే, గృహలక్ష్మి లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం ప్రారంభించటం లేదని చెబుతున్నారు. ఎన్నికలు పూర్తిగా దగ్గరపడ్డ నేపథ్యంలో, ఇప్పుడు పనులు ప్రారంభించుకున్నా నిధులు విడుదల కావన్న భావన కూడా వారిలో ఉందన్నది మరికొందరి వాదన. ముందు లక్ష తమ ఖాతాలో జమ అయితేనే పనులు ప్రారంభించుకోవాలని లబ్ధిదారులు భావిస్తున్నారన్నది మరో మాట. ఇలా కారణాలు ఏవైనా, లబ్ధిదారులుగా నమోదైన వారు పనులు ప్రారంభించుకోకపోవటం చర్చనీయాంశంగా మారింది.

మేడిగడ్డ పూర్తి వివరాలివ్వండి!

నీటి పారుదల శాఖకు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ లేఖ

- ఆదివారం నాటికి ఇవ్వకుంటే రాష్ట్రం వద్ద సమాచారం లేదని పరిగణిస్తామని స్పష్టీకరణ
- లేఖ తీరుపై రాష్ట్ర నీటి పారుదల శాఖ అభ్యంతరం
- వివరాలన్నీ అందజేస్తామన్న అధికారులు

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీకి సంబంధించి తాము కోరిన అన్ని వివరాలను ఆదివారం నాటికి అందజేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖకు 'నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ)' స్పష్టం చేసింది. బ్యారేజీకి సంబంధించి తాము 20 రకాల సమాచారాన్ని కోరగా.. కేవలం 3 రకాల డేటాను పూర్తిగా, మరోరకం సమాచారాన్ని పాక్షికంగా అందజేయడం ఏమిటని ప్రశ్నించింది. ఆదివారం నాటికి మొత్తం డేటా ఇవ్వకుంటే.. నీటి పారుదల శాఖ వద్ద ఇచ్చేందుకు ఎలాంటి సమాచారం లేదని పరిగణించి, తమ విచారణ విషయంలో ముందుకు వెళ్తామని స్పష్టం చేసింది. ఈ మేరకు ఎన్‌డీఎస్‌ఏ శుక్రవారం రాష్ట్ర నీటిపారుదల శాఖకు లేఖ రాసింది.

ఏయే సమాచారం అందాలి?

మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ఘటనపై ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్ అనిల్‌జైన్ నేతృత్వంలోని కమిటీ ఈ నెల 24న బ్యారేజీని పరిశీలించి, మరునాడు హైదరాబాద్‌లోని జలసౌధలో నీటి పారుదల శాఖ ఈఎన్‌సీలతో సమావేశమై చర్చించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా బ్యారేజీకి సంబంధించిన 20 రకాల సమాచారాన్ని అందజేయాలని కమిటీ కోరగా.. అప్పటికప్పుడు అందుబాటులో ఉన్న కొంత సమాచారాన్ని నీటిపారుదల శాఖ అందించింది. మిగతా సమాచారం వెంటనే ఇవ్వాలని ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ తాజాగా లేఖ రాసింది. ఏయే సమాచారం కావాలనేది మరోసారి పొందుపర్చింది. అయితే నిపుణుల కమిటీ డెడ్‌లైన్ విధించడంపై నీటిపారుదల శాఖ ఉన్నత స్థాయి వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. సలహాల కోసం ఏర్పాటు చేసిన కమిటీ ఇలాంటి భాష వినియోగించడం సరికాదని పేర్కొంటున్నాయి. కమిటీ సమాచారం కోరి రెండు రోజులే అయిందని, అన్ని వివరాలు క్రోడీకరించేందుకు వారమైనా పడుతుందని స్పష్టం చేస్తున్నాయి.

మేడిగడ్డను పరిశీలించిన అధికారులు

కాళేశ్వరం: మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీ కుంగుబాటుకు కారణాలను విశ్లేషించేందుకు శనివారం రాష్ట్ర డ్యామ్ సేఫ్టీ అథారిటీ రివ్యూ ప్యానల్ ఏబీ పాండ్య నేతృత్వంలో అధికారుల బృందం అక్కడ పర్యటించింది. బ్యారేజీ 7వ బ్లాక్‌లోని 15, 16, 17, 18, 19, 20, 21 పియర్లను క్షుణ్ణంగా పరిశీలించింది. తర్వాత వివిధ అంశాలపై ఇరిగేషన్ అధికారులు, ఎల్అండ్‌టీ సంస్థ ప్రతినిధులతో చర్చించింది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం బ్యారేజీని పరిశీలించిన సమయంలో వేసిన ప్రశ్నలు, అడిగిన వివరాలపైనా రాష్ట్ర అధికారులు చర్చించినట్టు తెలిసింది.

కాఫర్ డ్యాం పనులు షురూ!

మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతుల కోసం నీటిని మళ్లించేందుకు కాఫర్ డ్యాం నిర్మాణ పనులను కూడా ప్రారంభించినట్టు తెలిసింది. శనివారం పలు యంత్రాలు, కూలీలను అక్కడికి తరలించినట్టు సమాచారం. సోమవారం నుంచి పనుల్లో వేగం పెరగనుందని సమాచారం. ఎగువ నుంచి 23,350 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా గేట్లు ఎత్తి అంతా దిగువకు వదిలేస్తున్నారు.

ఎఫ్‌సీఐ ద్వారా గోధుమల విక్రయ పరిమాణం పెంపు

ఒక్కో బిడ్డర్‌కు 200 టన్నులు.. ప్రతీవారం 4,500 టన్నులు విక్రయించాలని నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా బహిరంగ మార్కెట్‌లో గోధుమలను అందుబాటులోకి తీసుకురావాలని భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ) నిర్ణయించింది. బహిరంగ మార్కెట్ సేల్ స్కీం ద్వారా పిండిమిల్లులు/గోధుమ ఉత్పత్తుల ప్రాసెసర్లతోపాటు గోధుమ ఉత్పత్తుల వినియోగదారులకు సెంట్రల్ పూల్ స్టాక్ నుంచి ముందుగా నిర్ణయించిన ధరలకు వారానికోసారి ఈ వేలం ద్వారా ఎఫ్‌సీఐ విక్రయిస్తోంది. కాగా, డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా లేకపోవడంతో కొంతకాలంగా గోధుమల ధర కూడా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో నవంబర్ నుంచి రాష్ట్రంలో వేలం ద్వారా విక్రయించే గోధుమల పరిమాణాన్ని పెంచాలని నిర్ణయించింది. ప్రస్తుతం రాష్ట్రంలో గోధుమల విక్రయాన్ని ఒక్కోబిడ్‌ను వంద టన్నుల లాట్‌కే వేలంలో విక్రయిస్తుండగా, ఆ పరిమాణాన్ని వచ్చేనెల నుంచి 200 టన్నులకు పెంచనున్నారు. వారానికి ఓసారి విక్రయించే గోధుమల పరిమాణం ఇప్పటివరకు 3 వేల టన్నులే ఉండగా, దాన్ని 4,500 టన్నులకు పెంచుతున్నట్లు ఎఫ్‌సీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అమ్మకాల్లో గోధుమ కనీసధర క్వింటాల్‌కు రూ.2,125 (యూఆర్ఎస్), రూ.2,150 (ఎఫ్ఏక్యూ)గా నిర్ణయించినట్లు తెలిపారు. ఇ-వేలంలో ఒకపాన్ నంబర్‌పై దేశం మొత్తంలో కేవలం ఒకసారి పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

'జర్నలిస్టు కుటుంబాలను ఆదుకోండి'

సాక్షి, న్యూఢిల్లీ: కరోనా సమయంలో ఇబ్బందులకు గురైన జర్నలిస్టుల కుటుంబాలను ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆదుకోవాలని టీయూడబ్ల్యూజే, ఐజేయూ కోరింది. ఈ మేరకు శనివారం ఢిల్లీలో జరిగిన పబ్లిక్ హియరింగ్‌లో టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు అవ్వారి భాస్కర్ ఆధ్వర్యంలో టీయూడబ్ల్యూజే ఢిల్లీ శాఖ అధ్యక్షుడు వెంకటేష్ నాగిల్ల, ఐజేయూ ఈసీ మెంబర్ తిరుపతినాయక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సోమన్నగారి రాజశేఖర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యుడు అశోక్ రెడ్డి ప్రెస్ కౌన్సిల్‌కు వినతిపత్రం అందచేశారు. కరోనా బారినపడ్డ జర్నలిస్టులు ఇప్పటికీ అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, ఇటీవల కాలంలో 20మందికిపైగా గుండెపోటుతో మృతిచెందారని ప్రెస్‌కౌన్సిల్ దృష్టికి తెచ్చారు.

మోదీని విశ్వరూప మహాసభకు తీసుకురావాలి


కిషన్‌రెడ్డికి ఎమ్మార్పీఎస్ వినతి

సాక్షి, హైదరాబాద్: వచ్చే నెల 18న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మాదిగల విశ్వరూప మహాసభకు ప్రధాని మోదీని ముఖ్య అతిథిగా వచ్చేలా ఒప్పించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డికి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్ మాదిగ ఆధ్వర్యంలో శనివారం పలువురు నేతలు కిషన్‌రెడ్డిని కలిశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కోసం నిర్వహిస్తున్న ఈ సభలో మోదీ పాల్గొనేలా చొరవ తీసుకోవాలని వారు కోరారు. కిషన్‌రెడ్డిని కలసిన ప్రతినిధి బృందంలో మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎమ్మెస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్‌గౌడ్, మాదిగ లాయర్స్ ఫెడరేషన్ (ఎంఎల్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వీరేశ్ కుమార్ మాదిగ, ఇతర నేతలు నరేంద్ర బాబు మాదిగ, వేల్పుల సూరన్న, నర్సయ్య మాదిగ, రాగల్ల ఉపేందర్ మాదిగ, నరసింహ మాదిగ, పంగ ప్రణయ్ మాదిగ, డప్పు మల్లిఖార్జున్ మాదిగ ఉన్నారు.

క్లుప్తంగా...

జీఎస్టీ విధింపు సబబే

కాలేజీలకు అనుబంధ గుర్తింపు ఇవ్వడం కూడా సేవల కిందకే వస్తుంది: హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: కాలేజీలు, విద్యా సంస్థల నుంచి యూనివర్సిటీ లేదా బోర్డు వసూలు చేసే అనుబంధ గుర్తింపు, తనిఖీ ఫీజులపై జీఎస్టీ విధింపు సబబే అని హైకోర్టు తీర్పు వెల్లడించింది. దీనిని విద్యాసేవల కింద వచ్చే మినహాయింపు కోరడం చెల్లదని స్పష్టం చేసింది. జీఎస్టీ అధికారుల ఆదేశాల మేరకు 2017 నుంచి అనుబంధ గుర్తింపు, తనిఖీ ఫీజులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాలు మొత్తం 18 శాతం జీఎస్టీ చెల్లించాలని కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయం ఇచ్చిన నోటీసులను సవాల్ చేస్తూ పలు నర్సింగ్ కాలేజీలు హైకోర్టులో పిటిషన్ చేశాయి. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ శ్యాంకోషీ, జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది. కాలేజీలు దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లను కొట్టివేసింది.

మెరిట్ ఆధారంగా పోల్ టెస్ట్‌కు పిలవండి

- జూనియర్ లైన్‌మన్ పోస్టుల భర్తీపై హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: 2018లో జూనియర్ లైన్‌మన్ పరీక్ష రాసిన అభ్యర్థులతో మిగిలిన పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. నోటిఫికేషన్‌లో పేర్కొన్న మెరిట్ ఆధారం కాల్ లెటర్లు పంపి వారికి పోల్ టెస్టు నిర్వహించాలని స్పష్టం చేసింది. మూడు నెలల్లో నియామక ప్రక్రియ పూర్తి చేయాలని చెప్పింది. 2018, ఫిబ్రవరి 16న జారీ చేసిన నోటిఫికేషన్‌లో తాము పరీక్ష అర్హత సాధించినా, పోల్ టెస్ట్‌కు కాల్ లెటర్ పంపలేదంటూ కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జువ్వాడి శ్రీదేవి తాజాగా తీర్పు వెలువరించారు.

మాజీ సైనికులకు 'అర్హత మార్కు' చెప్పండి

టీఎస్‌పీఎస్సీకి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పలు పోస్టులకు సంబంధించి నియామక పరీక్షల్లో మాజీ సైనికులకు కనీస అర్హత మార్కులపై సత్వరం నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ)ని హైకోర్టు ఆదేశించింది. డైరెక్టర్ ఆఫ్ సైనిక్ వెల్ఫేర్ సిఫారసులకు పరిగణనలోకి తీసుకుని మాజీ సైనికుల కనీస అర్హత మార్కులపై ఒక నిర్ణయానికి రావాలని.. ఆ మేరకు వారికి రిజర్వయ్యే పోస్టులను ఖరారు చేయాలని స్పష్టం చేసింది. టీఎస్‌పీఎస్సీ నియామక పరీక్షల్లో మాజీ సైనికులకు అర్హత మార్కులు నిర్ణయించకపోవడాన్ని సవాల్ చేస్తూ బి.భాస్కర్ సహా మరో 9 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ పి.మాధవీదేవి ధర్మాసనం విచారణ చేపట్టింది. 30 రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాలని ఆదేశిస్తూ, విచారణను వాయిదా వేసింది.

రాష్ట్రంలో ఆలయాల నిర్వహణ సక్రమం: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఆలయాల నిర్వహణ సరిగా లేదని, ఇతర మతస్తులకు బాధ్యతలు అప్పగిస్తున్నారంటూ దాఖలైన పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. హిందూ ఆలయాలన్నీ హిందువులతో నియామకం అయిన కమిటీలతో పాలన సాగిస్తున్నాయని.. అన్యమతస్తులకు ఎక్కడా అవకాశం ఇవ్వలేదని పూర్తి వివరాలతో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసింది. ప్రభుత్వ కౌంటర్‌ను పరిశీలించిన ధర్మాసనం.. ఆలయాల నిర్వహణ సక్రమంగానే ఉందని, పిటిషనర్ ఆరోపిస్తున్నట్లు ఎలాంటి తప్పు జరగలేదని భావిస్తూ పిల్‌ను కొట్టివేసింది.

ఆధార్ లింక్.. బడికి బంక్!



వీరంతా ఆధార్ వివరాల అప్‌డేషన్ కోసం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఆధార్ నమోదు కేంద్రానికి ఉదయం 7 గంటలకే క్యూలో నిలబడ్డారు. ఒక్కో సెంటర్‌లో రోజుకు పరిమిత సంఖ్యలోనే వివరాల అప్‌డేషన్ ప్రక్రియ జరుగుతుండడంతో తెల్లవారుజాము నుంచే టోకెన్లు తీసుకునేందుకు ప్రయత్నిస్తూ ఇలా లైన్లలో నిరీక్షిస్తున్నారు.



మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ సమీపంలోని ఆధార్ నమోదు కేంద్రంలో శనివారం కనిపించిన దృశ్యం ఇది. కేవలం ఆధార్‌లో వివరాల నమోదు కోసం బడికి సెలవుపెట్టి మరీ వచ్చినట్లు వారంతా పేర్కొన్నారు. తల్లిదండ్రుల ఆధార్ నంబర్ లింకుతో గతంలో ఐదేళ్లలోపు పిల్లల ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ జరగ్గా ఇప్పుడు ఆయా విద్యార్థులు వారి వేలిముద్రలతో ఆధార్‌లో అప్‌డేట్ చేసుకుంటున్నారు.

- ఈ–కేవైసీ అప్‌డేట్ కోసం ఆధార్ కేంద్రాలకు పిల్లలతో సహా తల్లిదండ్రుల పరుగులు
- ఒక్కో సెంటర్‌లో రోజుకు 100 మంది వివరాల నమోదుకే వీలుండటంతో పెరిగిన రద్దీ
- రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 350 సెంటర్లే పనిచేస్తుండటంతో తెల్లవారుజాము నుంచే బారులు
- విద్యార్థుల కోసం స్కూళ్లలోనే ఉచిత కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా కానరాని వైనం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రస్తుతం వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను ఆధార్ అప్‌డేట్ కష్టాలు చుట్టుముడుతున్నాయి. పదేళ్లకోసారి కార్డుదారుడి వేలిముద్రలను మరోసారి సేకరించడంతోపాటు ఫోన్ నంబర్, పేరు, చిరునామా సవరణల కోసం ఈ–కేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) వివరాల నమోదును ఆధార్ సంస్థ తప్పనిసరి చేయడం, ఈ–కేవైసీ కాని కుటుంబాల్లోని వారి పేర్లను రేషన్‌కార్డుల నుంచి తొలగిస్తామని ప్రభుత్వం స్పష్టం చేయడంతో ఆధార్ నమోదు కేంద్రాలకు తాకిడి విపరీతంగా పెరిగింది. ఒక్కో కేంద్రం వద్ద నిత్యం పరిమిత సంఖ్యలోనే అనుమతిస్తుండడంతో చాలా మంది తెల్లవారుజాము నుంచే కేంద్రాలకు క్యూ కడుతున్నారు. అయితే వారిలో అత్యధికులు పాఠశాల విద్యార్థులే ఉంటున్నారు. వరుసగా రెండు, మూడు రోజులపాటు స్కూళ్లు ఎగ్గొట్టి ఆధార్ కేంద్రాల చుట్టూ తిరిగితేగానీ ఈ–కేవైసీ నమోదు సాధ్యంకావట్లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణ పౌరులతోనే తీవ్ర ఒత్తిడికి గురవుతున్న ఆధార్ నమెదు కేంద్రాల్లో పిల్లల తాకిడి విపరీతం కావడంతో అటు పిల్లలు, ఇటు పెద్దలు ఆధార్ ఈ–కేవైసీ కోసం తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది.

చేతులెత్తేసిన విద్యాశాఖ...
బడి పిల్లలకు ఉచితంగా ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, సవరణ ప్రక్రియ కోసం పాఠశాల విద్యాశాఖ ప్రత్యేకంగా ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ కిట్లను అందుబాటులోకి తెచ్చింది. ప్రత్యేకంగా ఆపరేటర్లను ఎంపిక చేసి వారికి శిక్షణ ఇచ్చి పాఠశాలలోనే ఆధార్ నమోదు కౌంటర్లు తెరిచి విద్యార్థులందరికీ ఉచితంగా ఈకేవైసీ ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించింది. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 876 కిట్లను ఆపరేటర్లకు అప్పగించి నమోదు ప్రక్రియను మొదలుపెట్టింది. కానీ ఈ కార్యక్రమానికి శాఖపరంగా పర్యవేక్షణలోపం, దానికితోడు అధికారుల ఉదాసీనవైఖరి తోడవడంతో పాఠశాల స్థాయిలో నమోదు ప్రక్రియ అటకెక్కింది. అందుకు బదులుగా ఆయా కిట్లను ఆపరేటర్లు తమకు నచ్చినచోట కౌంటర్ ఏర్పాటు చేసుకొని నమోదు ప్రక్రియను సాగిస్తూ అడ్డగోలుగా వసూళ్లకు పాల్పడుతున్నారు. కేవలం పాఠశాల పిల్లల వివరాలను నమోదు చేయాల్సి ఉండగా పెద్దల వివరాలను కూడా నమోదు చేస్తున్నారు. అయితే చాలాచోట్ల ఈ కిట్ల ద్వారా ఎంట్రీ చేస్తున్న వివరాలు తప్పులతడకగా ఉంటుండటంతో కార్డుదారులు లబోదిబోమంటున్నారు.

కేంద్రాలను పెంచరు...
కొత్త కిట్లు ఇవ్వరు...
ఆధార్ నమోదు నిరంతర ప్రక్రియ. ప్రస్తుతం రాష్ట్రంలో 650 శాశ్వత ఆధార్ నమోదు కేంద్రాలున్నాయి. ఒక్కో కేంద్రంలో రోజుకు గరిష్టంగా 100 మంది వివరాల నమోదు మాత్రమే సాధ్యమవుతోంది. ఆపరేటర్ల తిరస్కరణ, నమోదు కేంద్రాల నిర్వహణ భారంతో ప్రస్తుతం 350 శాశ్వత ఆధార్ నమోదు కేంద్రాలు మాత్రమే పనిచేస్తున్నాయి. ఫలితంగా తాకిడీ రోజురోజుకూ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో కేంద్రాల సంఖ్య పెంచాలని లేదా కొత్తగా రెండో కిట్టు ఇవ్వాలని ఆధార్ సంస్థకు నిర్వాహకులు వినతులు సమర్పిస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఆశించిన స్పందన రావట్లేదు.

నిత్యం గలాటాలు...

పరిమితికి మించి జనాలు రావడం... సాంకేతిక కారణాలతో నమోదు ప్రక్రియ జాప్యం జరుగుతుండటం లాంటి కారణాలతో ప్రతిరోజూ కార్డుదారులు మమ్మల్ని నిలదీస్తున్నారు.
–శ్రీనివాస్, ఆధార్ కేంద్రం నిర్వాహకుడు బోడుప్పల్

వినతులు బుట్టదాఖలు..

మా కేంద్రానికి రెండో కిట్టు కేటాయించాలని గత కొంతకాలంగా అర్జీలు పెట్టుకున్నప్పటికీ ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు.
–కె.పవిత్ర, ఆధార్ కేంద్రం నిర్వాహకురాలు ఇబ్రహీంపట్నం

రాష్ట్ర వృద్ధుల్లో 31.6 శాతం మందికి ఆరోగ్య బీమా

- జాతీయ స్థాయిలో 11వ స్థానంలో తెలంగాణ
- రాష్ట్రంలో 2036 నాటికి 17.1 శాతానికి పెరగనున్న వృద్ధుల జనాభా
- ఇండియా ఏజింగ్ రిపోర్ట్–2023 వెల్లడి



సాక్షి, హైదరాబాద్: వృద్ధుల ఆరోగ్య బీమా పథకాల కవరేజీ తెలంగాణలో 31.6 శాతంగా ఉంది. ఈ విషయంలో మన రాష్ట్రం దేశంలో 11వ స్థానంలో ఉంది. జాతీయ సగటు 18.2 శాతం కంటే తెలంగాణ మెరుగ్గా ఉండటం గమనార్హం. మిజోరంలో దేశంలోనే అత్యధికంగా 66.5 శాతం మంది వృద్ధులకు ఆరోగ్య బీమా కవరేజీ ఉండగా అతితక్కువగా జమ్మూకశ్మీర్‌లో 0.2 శాతం మందికే ఉంది. ఈ మేరకు ఇండియా ఏజింగ్ రిపోర్ట్–2023 నివేదిక వెల్లడించింది. దీన్ని ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాపులేషన్ సైన్సెస్ రూపొందించగా కేంద్ర సామాజిక, సాధికారత శాఖ తాజాగా విడుదల చేసింది. మిజోరం, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మేఘాలయా, అస్సాం, గోవా, రాజస్తాన్ ఆరోగ్య బీమా పథకాలకు ఎక్కువ కవరేజీని కలిగి ఉన్న రాష్ట్రాలు. ఈ నివేదిక ప్రకారం తెలంగాణలో 68.4 శాతం వృద్ధులకు ఆరోగ్య బీమా సౌకర్యాలు అందడంలేదు. దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అన్ని రకాల ఆరోగ్య బీమాలు, ప్రైవేటు ఆరోగ్య బీమాలను కలిపి సర్వే చేశారు. దేశంలో 55 శాతం వృద్ధుల్లో ఆరోగ్య బీమాలపై అవగాహన లేదు. తెలంగాణలో రెండు అంతకంటే ఎక్కువ దీర్ఘకాలిక జబ్బులున్నవారు 30.7 శాతం మంది ఉన్నారు.

నివేదికలోని ముఖ్యాంశాలు...

- దేశ జనాభాలో 60 ఏళ్లు పైబడిన వారు 10 శాతం ఉండగా 2036 నాటికి వారి సంఖ్య 14.9 శాతానికి పెరుగుతుందని అంచనా.
- తెలంగాణలో 2021లో 11 శాతం వృద్ధులు ఉండగా 2036 నాటికి వారి సంఖ్య 17.1 శాతానికి పెరుగుతుంది.
- 60 ఏళ్లకు పైబడినవారిలో జీవన ఆయుర్దాయం 2015–19 మధ్య రాష్ట్ర మహిళల్లో 18.3 శాతం, పురుషుల్లో 17.3 శాతం.
- 75 ఏళ్ల తర్వాత తెలంగాణలో సగటున అదనంగా 8.7 ఏళ్లు జీవిస్తున్నారు.
- తెలంగాణలో 60 ఏళ్లు పైబడినవారిలో పనిచేయలేని స్థితిలో ఉన్నవారు 14.6 శాతం మంది. ఇండియాలో 23.8 శాతం ఉన్నారు.
- 60 ఏళ్లు పైబడినవారిలో పేదరికంలో ఉన్నవారు తెలంగాణలో 15.8 శాతం, ఇండియా 21.7 శాతం ఉన్నారు.
- 60 ఏళ్లు పైబడినవారిలో ఎలాంటి ఆదాయం లేనివారు తెలంగాణలో 11 శాతం ఉన్నారు. ఇండియా 18.7 శాతం ఉన్నారు.

అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లోనే వృద్ధులు ఎక్కువ

అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో వృద్ధులు ఎక్కువగా ఉన్నారు. అలాగే ఎక్కువ కాలం బతుకుతున్నారు. వైద్య సదుపాయాలు మెరుగ్గా ఉండటం, అక్షరాస్యత ఎక్కువగా ఉండటం వల్ల ఇది సాధ్యమైంది.
– డాక్టర్ కిరణ్ మాదల, ఐఎంఏ సైంటిఫిక్ కన్వీనర్, తెలంగాణ

ఓయూ స్నాతకోత్సవంలో సెల్‌ఫోన్లు నిషేధం

నేడు...రేపు ఎంట్రీ పాసుల జారీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఈ నెల 31న జరిగే 83వ స్నాతకోత్సవంలో సెల్‌ఫోన్లను నిషేధించారు. పీహెచ్‌డీ పట్టాలను అందుకునే వారు ఫొటోలు తీసుకోకుండా ఆడిటోరియంలోకి సెల్‌ఫోన్లను నిషేధించారు. పీహెచ్‌డీ పట్టాలు అందుకునేవారి సంఖ్య అధికంగా ఉన్నందున సెల్‌ఫోన్ ఫొటోల వల్ల కార్యక్రమానికి అంతరాయం ఏర్పడుతుందనే ఆలోచనతో నిషేధించినట్లు ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు తెలిపారు. సెల్‌ఫోన్లు భద్రపరిచేందుకు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా శనివారం ఎంట్రీపాస్ జారీ పక్రియ ప్రారంభించగా తొలిరోజు సుమారు 500 మంది అభ్యర్థులు పాసులు తీసుకున్నట్లు సమాచారం. ఆది, సోమవారాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఓయూ క్యాంపస్ ఎగ్జామినేషన్ బ్రాంచి నుంచి ఎంట్రీ పాసులను పొందవచ్చు. కాగా, స్నాతకోత్సవం ఎంట్రీ పాస్ కోసం అభ్యర్థులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఆన్‌లైన్ దరఖాస్తుల విధానాన్ని ప్రవేశపెట్టి పాసుల కోసం అభ్యర్థి తప్పనిసరిగా రావాలనే నిబంధన విధించారు. 31వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు ఎంట్రీ పాస్‌లు జారీ చేయాలని అభ్యర్థులు ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్‌ను కోరారు.

రూ.377 కోట్లకు చేరిన స్వాధీనాలు



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు శనివారం నాడు రూ.13.86 కోట్లు విలువ చేసే నగదు, మద్యం, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఇప్పటివరకు రాష్ట్రంలో స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువుల మొత్తం విలువ రూ.377.68 కోట్లకు చేరింది. శనివారం రూ.5.32 కోట్ల నగదు పట్టుకోగా, ఇప్పటివరకు స్వాధీనం చేసుకున్న మొత్తం నగదు రూ.136.09 కోట్లకు పెరిగింది. పూర్తి వివరాలను సీఈఓ వికాస్‌రాజ్ వెల్లడించారు.

శనివారం వరకు పట్టుకున్న నగదు, వస్తువుల వివరాలు

	శనివారం	ఇప్పటివరకు మొత్తం
నగదు	రూ.5.32 కోట్లు	రూ.136.09 కోట్లు
మద్యం	రూ.6.11 కోట్లు	రూ.28.84కోట్లు (90,999 లీటర్లు)
డ్రగ్స్	రూ.58.27లక్షలు (83 కిలోల గంజాయి, 75 కిలోల ఎన్డీపీఎస్)	రూ.18.18 కోట్లు(4231 కిలోల గంజాయి+ఇతరాలు)
విలువైన లోహాలు	రూ.19.13 లక్షలు (0.15కిలోల బంగారం, 14కిలోల వెండి)	రూ.162.07 కోట్లు (238 కిలోల బంగారం, 1075కిలోల వెండి)
ఇతర వస్తువులు	రూ.1.65 కోట్లు(4000 మొబైల్స్, 549 గృహోపకరణాలు)	రూ.32.49 కోట్లు (1,56,262 కిలోల బియ్యం, 9,072 కుక్కర్లు, 53,285 చీరలు)
మొత్తం జప్తుల విలువ	రూ.13.86 కోట్లు	రూ.377.68 కోట్లు

(ఇతర వస్తువుల్లో ల్యాప్‌టాప్, వాహనాలు, కుక్కర్లు, చీరలు ఉన్నాయి. బంగారం, ఇతరాలలో బంగారంతో పాటు వెండి, వజ్రాలు, ప్లాటినం వంటి విలువైన లోహాలున్నాయి)



మెదడుపై డెంగీ దాడి!

- డెంగీ మెదడువాపు వ్యాధితో హైదరాబాద్‌లో పీజీ వైద్య విద్యార్థి మృతి
- ఈ నెల 24న వ్యాధిబారిన పడ్డ డాక్టర్ గోపి
- మెరుగైన చికిత్స కోసం మల్లారెడ్డి నారాయణ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రికి తరలింపు
- పరిస్థితి విషమించడంతో మృతి
- వైద్య విద్యార్థుల్లో వ్యక్తమవుతున్న ఆందోళన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌లో ప్రజలు ఓవైపు సీజనల్ జ్వరాలతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతుండగా మరోవైపు డెంగీ వ్యాధిలో తీవ్రమైన, అరుదైన రకానికి చెందిన డెంగీ ఎన్‌సెఫలైటిస్ వ్యాధి (రోగి మెదడును దెబ్బ తీయడం ఈ వ్యాధికారక వైరస్ లక్షణం) బారిన పడి ఏకంగా ఒక పీజీ వైద్య విద్యార్థి మృతి చెందడం కలకలం రేపుతోంది. నగరంలోని మల్లారెడ్డి హెల్త్ సిటీలో 3వ సంవత్సరం పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సు చదువుతున్న డాక్టర్ గోపికి ఈ నెల 24న డెంగీ ఎన్‌సెఫలైటిస్ బారినపడ్డట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో అతన్ని జీడిమెట్లలోని మల్లారెడ్డి నారాయణ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లోని ఐసీయూకు తరలించి చికిత్స అందించారు. అయినప్పటికీ శనివారం పరిస్థితి విషమించడంతో డాక్టర్ గోపి మృతి చెందారు.

వెయ్యి మందిలో ఒక్కరిలోనే...
డెంగీ ఎన్‌సెఫలైటిస్ బారినపడ్డ రోగులు కోలుకొనే అవకాశాలు అత్యంత తక్కువని వైద్యులు అంటున్నారు. సాధారణ డెంగీ సోకిన ప్రతి 1,000 మంది రోగుల్లో కేవలం ఒక్కరిలోనే డెంగీ వైరస్ మెదడు దాకా విస్తరించే అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. 'డెంగీ వైరస్‌తో బ్రెయిన్‌లోని ప్రధాన భాగాలు వాచిపోతాయి. దీంతో రోగులు బ్రతికే అవకాశాలు దాదాపుగా శూన్యం 'అని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (తెలంగాణ) సైంటిఫిక్ కమిటీ కన్వీనర్ డాక్టర్ కిరణ్ మాదల చెప్పారు.

వైద్యుల్లో ఆందోళన..: నగరంలో సీజనల్‌గా ప్రభావం చూపే డెంగీ వ్యాధి ఈ ఏడాది ఆలస్యంగా ప్రతాపం చూపడం ప్రారంభించింది. ప్రస్తుతం నగరవ్యాప్తంగా దీంతోపాటు పలు రకాల ఫ్లూ జ్వరాలు, శ్వాసకోశ వ్యాధులు నగరవాసుల్ని ఆసుపత్రుల బాట పట్టిస్తున్నాయి. దాదాపుగా ప్రతి ఆసుపత్రిలోనూ వైరల్ ఫీవర్ సంబంధిత కేసులు పెద్ద సంఖ్యలో నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏకంగా ఒక వైద్య విద్యార్థి సైతం డెంగీ ఎన్‌సెఫలైటిస్‌తో మృతి చెందడం నగరంలోని వైద్యుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఇది తొలి కేసు కాదని, ఇప్పటికే కనీసం అరడజను మంది వైద్యులు డెంగీ బారిన పడ్డారని వైద్య విద్యార్థులు అంటున్నారు. 'మన ఆసుపత్రుల్లో ప్రత్యేక డెంగీ వార్డులు లేవు. అలాగే దోమ తెరలు సైతం ఉండవు. ఈ విషయంలో అనుసరించాల్సిన ప్రొటోకాల్‌ను ఆసుపత్రుల్లో పాటించడం లేదు'అని ఓ వైద్య విద్యార్థి ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని ఆసుపత్రుల్లో అపరిశుభ్ర పరిస్థితులు దోమల విజృంభణ, డెంగీ వ్యాప్తికి అనుకూలంగా ఉన్నాయనే ఆందోళన వ్యక్తం అవుతోంది. అటువంటి పరిస్థితుల్లో పనిచేసే వైద్య విద్యార్థులే డెంగీ బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రుల్లో సైతం దోమల వ్యాప్తిని అరికట్టేందుకు తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.